ఈనాడు

సొంతింటి కల నిజం చేసుకుంటున్న
3,00,192 పేద కుటుంబాలకు
శుభాకాంక్షలు!

విజయవాడ 12-11-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 92


THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఆ భూమ్‌లో చిక్కుకోవద్దు!

మీకు భూమి ఉందా? దాన్ని ఆన్‌లైన్‌లో తనిఖీ చేసుకొంటున్నారా.. మరి... సమాచారం కోసం ఏవైనా వెబ్‌సైట్లలో లాగిన్ అవుతున్నారా.. అనధికార యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకొంటున్నారా.. తస్మాత్ జాగ్రత్త!



■ 'మీ భూమి వివరాలు కావాలా? అయితే ఇక్కడ క్లిక్ చేయండి.. చెక్ చేసుకోండి' అంటూ పదుల కొద్దీ వెబ్‌సైట్లు.. యాప్‌లు ఊదరగొడుతున్నాయి. వాటిని చూడగానే తమ భూమి వివరాలు తెలుసుకోవాలనే ఆసక్తి చాలామందిలో సహజంగానే మొదలవుతుంది. ఓసారి చూసుకుందామని వాటిని క్లిక్ చేశారా? అంతే సంగతులు.. ఏ మాయ లోకానికి తీసుకెళ్లి ముంచేస్తాయో తెలియదు.



■ కొన్ని యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుంటే భూముల వివరాలూ కనిపిస్తుంటాయి. అవి నిజమనుకుని నమ్మి భూములు కొంటే నిండా మునిగిపోతారు. వాస్తవానికి ఆంధ్రప్రదేశ్‌లో 'మీభూమి', తెలంగాణలో 'భూభారతి' వెబ్‌సైట్లు మినహా, మరే ఇతర యాప్‌లూ అధికారికంగా ఈ సేవలు అందించట్లేదు.

■ ఆంధ్రప్రదేశ్‌లో 'మీ భూమి' పేరుతో ప్రభుత్వ వెబ్‌సైట్ ఉంది. అయితే ఆన్‌లైన్‌లో ముందు మీభూమి అని చేర్చి పలు వెబ్‌సైట్లను రూపొందించారు. తెలంగాణలో కూడా ఇదే తీరుతో నకిలీలు తయారయ్యాయి. ఉదాహరణకు కొన్ని నకిలీ వెబ్‌సైట్లు:
https://meebhoomi.co.in
https://meebhoomi.com

■ వీటికి ఏవేవో లింక్‌లు ఇచ్చి వాటిపై క్లిక్ చేస్తే వివరాలు తెలుస్తాయంటారు. కొన్నింటిని క్లిక్ చేస్తే సంబంధం లేని వెబ్‌సైట్లలోకి తీసుకెళ్తున్నాయి. అందులో ప్రకటనలు, ఇతర వివరాలుంటాయి. భూముల వివరాలే కనిపించవు. అవి కావాలంటే క్లిక్ చేయమంటూ లింక్‌లు ఇస్తాయి. అక్కడా ప్రకటనలు, ఇతర సమాచారమే. కొన్నింటిలో ప్రభుత్వ వెబ్‌సైట్లలోకి లింక్‌లు ఇస్తున్నాయి.

ఒక్కటీ అధీకృతం కాదు...

● భూములకు సంబంధించిన వివరాలు తెలుసుకోవచ్చంటూ పలు యాప్‌లు కూడా ప్లేస్టోర్‌లో కనిపిస్తుంటాయి. ఏపీల్యాండ్ సర్వే నంబర్లు, టీఎస్‌ల్యాండ్ సర్వేనంబర్లు, ల్యాండ్ ఇన్ఫో, ఆల్ ఇండియా ల్యాండ్, ల్యాండ్ టూల్స్, పట్టా, భూల్యాండ్ స్నాప్, ఏపీనివాసం తదితర పేర్లతో ఉన్నాయి.

● వీటిని డౌన్‌లోడ్ చేసుకుంటే ముందుగా ఫోన్ నంబరు ఎంటర్ చేసి ఓటీపీతో రిజిస్టర్ అవ్వాలి. అంటే మీ వివరాలు వారి చేతిలో పెట్టినట్లే. దీంతో సైబర్ మోసాల బారిన పడే అవకాశముంది. అంతే కాదు యాప్‌లో లాగిన్ అయిన తర్వాత సెకన్లు, నిమిషాల కొద్దీ ప్రకటనలను చూడాలి. తర్వాత మీ జిల్లా, మండలం, గ్రామం వివరాలతో చూసుకుంటే రైతుల పేర్లు, సర్వే నంబర్లు కనిపిస్తాయి. కానీ అవి రెండు, మూడేళ్ల కిందటి లెక్కలే.

భూముల వివరాలు వారికెలా?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని మీ భూమి వెబ్‌సైట్‌లో గతంలో కాలపరిమితి లేకుండా ఎంతసేపైనా భూముల వివరాలు చూసుకునే వీలుండేది. అడంగల్, 1బి, గ్రామ పటం సహా అన్ని వివరాలు గంపగుత్తగా తీసుకునే అవకాశమూ ఉండేది. దీన్ని ఉపయోగించుకుని కొన్ని ప్రైవేటు సంస్థలు భారీ ఎత్తున సమాచారాన్ని డౌన్‌లోడ్ చేసుకున్నాయి. యాప్‌లు పెట్టి వాటిలోకి చేర్చాయి. అందుకే జిల్లా, సర్వే నంబరు కొట్టగానే రైతుల పేర్లు కన్పిస్తాయి. తెలంగాణ సహా ఇతర రాష్ట్రాల్లోనూ ఇలాగే సమాచారాన్ని సేకరించి యాప్‌లలో పెట్టాయి.

నకిలీలకు ముకుతాడు!

ప్రైవేటు వ్యక్తులు భూముల సమాచారాన్ని తీసుకుని ఇతర అవసరాలకు వాడుతుండటంతో.. ఏపీ రెవెన్యూశాఖ చర్యలు చేపట్టింది. మీభూమి వెబ్‌సైట్‌లో భూముల సమాచారం చూడాలంటే.. ముందుగా మొబైల్ నంబరు, ఓటీపీతో లాగిన్ అవ్వాలి. అనంతరం 20 నిమిషాలపాటు భూముల వివరాలు చూసుకోవచ్చు. తర్వాత సెషన్ పూర్తవుతుంది. ఇంకా సమాచారం తెలుసుకోవాలంటే మళ్లీ లాగిన్ అవ్వాల్సిందే. అప్పుడూ ఒక నిర్దిష్ట సర్వే నంబరు, సబ్‌డివిజన్, ల్యాండ్ పార్శిల్ మ్యాప్ (ఎల్‌పీఎం) సమాచారం మాత్రమే లభిస్తుంది. ● ఇతర వెబ్‌సైట్ల నుంచి మీభూమి వెబ్‌సైట్‌కు ఇచ్చే లింకుల్ని తొలగించాలని గూగుల్‌కు ప్రభుత్వం లేఖ రాసింది.

అసలైన వెబ్‌సైట్లు ఇవే..

● ఆంధ్రప్రదేశ్‌లో మీభూమి వెబ్‌సైట్ అందుబాటులో ఉంది. సీసీఎల్ఏ వెబ్‌సైట్ నుంచి లింక్ ఉంటుంది. మ్యుటేషన్ లావాదేవీలు, సవరణలు, ఆధార్ సీడింగ్, భూవినియోగ సవరణలు తదితర వివరాలూ ఉంటాయి. https://meebhoomi.ap.gov.in

● తెలంగాణ భూభారతి వెబ్‌సైట్ ఏప్రిల్‌లో అందుబాటులోకి వచ్చింది. అందులో భూముల వివరాలతోపాటు రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన వివరాలూ ఉంటాయి. వివరాలు కావాలంటే లాగిన్ అవ్వాలి.
https://bhubharati.telangana.gov.in

- ఈనాడు, అమరావతి

తీరొక్క రీతి తేనీరు



పలు రకాల ప్రయోజనకరమైన టీలను తీసుకుంటుంటే వైవిధ్యంతో పాటు ఆరోగ్యం సమకూరుతుంది. అవేంటో..వాటి ఉపయోగాలేంటో చూద్దాం.. **1.** అల్లం టీ-తలనొప్పి, మైగ్రేన్ నివారణ, **2.** పుదీనా టీ-గొంతు నొప్పి తగ్గుదల, **3.** దాల్చిన చెక్క టీ- శీతాకాల ఔషధం, **4.** నిమ్మ టీ- కడుపు నొప్పి నివారణ, **5.** చియా గింజల టీ- జ్వరం నెమ్మదింపు, **6.** పసుపు టీ- సైనస్ నుంచి ఉపశమనం, **7.** చామంతి టీ- సుఖనిద్రకు సోపానం.

బార్బరా ఓనీల్, ఆరోగ్యసలహాదారు

పసివాడిగా విన్నకథలు.. నేడు కనుల ముందు



ఇంగ్లాండ్ నుంచి శిమ్లాకు వచ్చిన మైకేల్ (72)కు ఈ పర్యటన భావోద్వేగంతో కూడిన అనుభూతిని ఇచ్చింది. హిమాచల్ ప్రదేశ్ రాజధాని శిమ్లాకు ఈ బ్రిటిష్ పౌరుడు ఓ ముఖ్యమైన పనిపై వచ్చారు. 1922లో శిమ్లాలో పుట్టిన తన తల్లి రోజ్ మేరీ జనన ధ్రువీకరణ పత్రం కోసం మైకేల్ భారత్‌కు వచ్చారు. తన బాల్యంలో శిమ్లా అందాలు, స్థానికుల ఆతిథ్యం గురించి అమ్మ కథలు కథలుగా చెప్పేదని ఆయన గుర్తు చేసుకున్నారు. "శిమ్లాలో వీచే చల్లని గాలులు, పర్వతాల నడుమ ఉన్న ఇళ్లు, రిడ్జ్ కొండల సందడి గురించి అమ్మ ఎప్పుడూ చెప్పేది. ఎప్పటికైనా నా కళ్లతో అవన్నీ చూడాలను అనుకున్నా" అని మైకేల్ శిమ్లా మున్సిపల్ అధికారులకు వివరించారు. సోమవారం జాయింట్ కమిషనర్ భువన్ శర్మ సంబంధిత ధ్రువపత్రాన్ని మైకేల్‌కు అందజేశారు. మరోసారి తన కుటుంబంతో కలిసి శిమ్లాకు వస్తానని మైకేల్ చెప్పారు. 1870 నుంచి 1947 మధ్య శిమ్లాలో నివసించిన బ్రిటిషర్ల జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు స్థానిక కార్పొరేషను కార్యాలయంలో ఇప్పటికీ భద్రంగా ఉన్నాయి. వీటి కోసం ఇంగ్లాండు నుంచి చాలామంది ఇక్కడికి వచ్చి పోతుంటారు. - ఈటీవీ భారత్

బ్రెయిన్ సహకరించనంటే.. టెక్నాలజీని అంటుకట్టుకున్నాడు



ఆ కుర్రాడికి చిన్నప్పట్నుంచీ ఇంటర్‌నెట్‌పై బోలెడంత ఆసక్తి. కొరుకుడు పడని సాంకేతిక విషయాల గుట్టు తెలుసుకునే వరకూ శోధించేవాడు. పెద్దయ్యాక సాంకేతిక నిపుణుడు కావాలనుకున్నాడు. అయితే ఏడో తరగతిలో ఉండగా బ్రెయిన్ ట్యూమర్ బారినపడ్డాడు. తలకు మూడు శస్త్రచికిత్సలు జరిగాయి. కొన్నాళ్లు మానసిక సమస్యలు ఎదుర్కొన్నాడు. వీటన్నింటినీ అధిగమించి, అంతా ఆశ్చర్యపోయేలా ఇప్పుడు ప్రతిభ చాటుతున్నాడు. ఆ విద్యార్థి కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం చింతలపల్లికి చెందిన మనోహర్.

ట్యూమర్‌కు చికిత్సలో భాగంగా కీమోథెరపీ, రేడియేషన్‌తో ఇబ్బంది పడుతున్న కుమారుడికి సాంత్వనగా ఉంటుందని ల్యాప్‌టాప్ కొనిచ్చారు మనోహర్ తండ్రి అయిలయ్య. అప్పటికే కంప్యూటర్‌పై ప్రాథమిక అవగాహన ఉన్న మనోహర్ గూగుల్‌ని శోధించి కొత్త విషయాలు నేర్చుకోవడం ప్రారంభించాడు. వెబ్‌సైట్ల తయారీ, యాప్‌ల రూపకల్పన, చాట్‌బాట్, సోషల్‌మీడియా ప్లాట్‌ఫాం, ఏఐ ఫొటోషూట్‌లపై పట్టు సాధించాడు. ప్రస్తుతం మొలంగూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతూనే తోటి విద్యార్థులకు చాట్‌బాట్ ద్వారా పాఠ్యాంశాలు రూపొందించి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతున్నాడు. పాఠాల్లోని అంశాలను కుదించి.. వాటిని Click Book.co ద్వారా తోటి విద్యార్థులకు అందిస్తున్నాడు. పాఠశాలలోని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డు (ఐఎఫ్‌పీ బోర్డు)పై ఈ లింక్‌లను తెరిచి విద్యార్థులు తమ సందేహాలు తీర్చుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ.. అడ్డంకులను అధిగమించి.. ప్రతిభ చాటుతున్న మనోహర్‌ని సన్మానించేందుకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు బుధవారం హైదరాబాద్‌కు ఆహ్వానించారు.

- న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యావిభాగం, శంకరపట్నం

చేపల పొడితో ఛాయ్.. రొయ్యలతో చిప్స్

యువ రుచులు



యువత, చిన్నారుల ఆసక్తులను దృష్టిలో పెట్టుకొని.. వారికి తక్కువ ధరలో పోషకాహారం లభించాలనే ఆశయంతో (మాంసాహారుల కోసం).. మత్స్య ఉత్పత్తులతో విభిన్న వంటకాలను అందుబాటులోకి తెచ్చింది కేంద్రం. రొయ్యలు, చేపలతో చిప్స్, బిస్కెట్లు, నూడుల్స్, కుర్‌కురే, కట్‌లెట్, సూప్‌లు, పన్నీర్, వడియాలు, అప్పడాలు తదితరాలు ప్రస్తుతం హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరుగుతున్న ప్రపంచ ఆక్వా కల్చర్ సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ జాబితాలో ఉన్న 'చేపల పొడితో టీ' విశేషంగా ఆకట్టుకుంటోంది. కేంద్ర మత్స్య శాఖ సూచనలతో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ ఈ ఉత్పత్తులను తయారుచేసి మార్కెట్లోకి విడుదల చేసింది. చేపలను శుద్ధి చేసి.. ఎండబెట్టి, పొడిచేసి ఆయా ఉత్పత్తులను రూపొందిస్తున్నారు. దేశంలో చేపల వినియోగాన్ని పెంచేందుకు.. మార్కెట్ సర్వే ఆధారంగా అన్ని రకాల పదార్థాల తయారీ జరుగుతోందని జాతీయ మత్స్య అభివృద్ధి మండలి (ఎన్ఎఫ్‌డీబీ) సీఈవో బిజయ్‌కుమార్ బెహెరా తెలిపారు. ఈ వెరైటీలతో విదేశాలకు ఎగుమతులూ భారీగా పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. - ఈనాడు, హైదరాబాద్



తాళం ఇచ్చినా.. మూత తీయలేరు!



చూడటానికి ఇదేదో సాధారణ ఇనుప పెట్టెలా కనిపిస్తున్నా.. దీని వెనుక పెద్దచరిత్రే ఉంది. దేశానికి స్వాతంత్ర్యం రాక ముందే 1884లో మద్రాసులో ఇది తయారైంది. ఈ పెట్టె వయసు 141 ఏళ్లు కాగా బరువు 3 వేల కేజీలకు పైనే ఉంటుంది. అందులో మూత బరువే 500 కేజీలు. నలుగురు కలిసి పైకి లేపితేగానీ దీన్ని తెరవలేరు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి ఉప ఖజానా శాఖ కార్యాలయంలో ఇది ఇప్పటికీ భద్రంగా ఉంది. బ్రిటిష్ కాలం నుంచి ఈ కార్యాలయం ఒకే భవనంలో కొనసాగుతోంది. నగదు, విలువైన పత్రాలను భద్రపరిచేందుకు వీలుగా అప్పట్లో ఈ ఇనుప పెట్టెను తయారు చేయించారు. స్వాతంత్ర్యం వచ్చాక కూడా కొన్నాళ్లు వినియోగించారు. అనంతరం దీన్ని కదపలేక, మూత తీయలేక వాడటం మానేశారు.

- న్యూస్‌టుడే, చింతపల్లి

నాడు సేతువుకు.. నేడు స్వగృహానికి



ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు కట్టుకోవడం ఓ కల. అన్ని ప్రణాళికలు వేసుకున్నాక.. చక్కటి ముహూర్తం చూసి శంకుస్థాపనతో గృహనిర్మాణం ప్రారంభిస్తారు. చాలా మంది రామభక్తులు.. తాము ఇంటి నిర్మాణం ప్రారంభించేటప్పుడు మొదటి ఇటుకపై రామనామం రాసి వినియోగిస్తారు. ఈ నేపథ్యంలోనే భద్రాద్రి రామాలయం భక్తులకు ఇటుకలను కానుకగా ఇచ్చే ఏర్పాట్లు చేస్తోంది. ఎర్రమట్టి, ఇసుక, సిమెంట్ మిశ్రమంతో దాదాపు కిలోన్నర బరువు గల ఇటుకలను ఆలయ యాజమాన్యం అందుబాటులోకి తేనుంది. వీటిపై 'జైశ్రీరామ్' అనే నామం ఉంటుంది. ఇందుకు సంబంధించి కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ చొరవ తీసుకుని.. ఇటుకల తయారీకి బెంగళూరు నుంచి ప్రత్యేక యంత్రాన్ని రప్పించి మంగళవారం ఆలయానికి అందించారు. శ్రీరామచంద్రుని దర్శనానికి వచ్చిన వారే సొంతంగా ఇక్కడ రెండు అంతకు మించి ఇటుకలను తయారు చేయవచ్చు. ప్రతి ఇటుకకు కొంత రుసుము నిర్ణయించనున్నారు.

- న్యూస్‌టుడే, భద్రాచలం

కొలెస్ట్రాల్... ఇలా తింటే పరార్!



● డయాబెటిస్ ఉన్నవారిలో కొలెస్ట్రాల్ తగ్గించుకోవడానికి చెప్పే తొలి సూచన.. శాచురేటెడ్ కొవ్వులు తగ్గించుకోవాలని. మన వంటలో వాడే ఏ నూనెను వేడిచేసినా, మరిగించినా కూడా శాచురేట్ అయిపోతుందని 'జాతీయ పోషకాహార పరిశోధన సంస్థ' ఎన్నో సంవత్సరాల ముందే తెలిపింది. అందుకే వేపుళ్లను బాగా తగ్గించాలి.

● ఫ్యాక్టరీల్లో ప్రాసెస్ చేసిన మాంసాలు, శుద్ధి చేసిన పిండిపదార్థాలతో తయారు చేసి ప్యాక్ చేసిన తీపి వస్తువులు, మార్కెట్లలో ప్రాచుర్యంలో ఉన్న ఫాస్ట్ ఫుడ్స్, ప్యాక్ చేసిన రెడీ స్నాక్స్‌లోనూ ఉండే ట్రాన్స్ ఫ్యాట్స్ అనే కొవ్వు పదార్థాల వాడకం వల్ల ముప్పు పొంచి ఉంటుంది.

● ఆహారంలో జంతు ఉత్పత్తుల వాడకం తగ్గించాలి గానీ.. మొత్తం మానెయ్యక్కర్లేదు. మేక, గొర్రె మాంసాల కంటే కోడి, చేపలను తీసుకోవడం మంచిది.

● సముద్రపు చేపల్లో ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి గుండెకు, రక్తనాళాలకు మేలు చేస్తాయి. అయితే వాటిని బాగా వేపితే నష్టం జరుగుతుంది.

● చేపల వాడకం వేరు... వాటి నూనెల వాడకం వేర్వేరు. చేప నూనెలు గుండె ఆరోగ్యానికి మంచివని ప్రచారం జరుగుతోంది. ఇవి కొంతవరకు నిజమే. కొన్ని రకాల చేప నూనెల వాడటం వల్ల రక్తంలోని ఒక రకం కొవ్వు ట్రైగ్లిజరైడ్‌లు తగ్గి హృదయ సంబంధ సమస్యలు తగ్గుతాయి.

● మార్కెట్లలో అమ్మే కొన్ని చేప నూనె సప్లిమెంట్లు కొన్నిసార్లు గుండె లయకు నష్టం కలిగిస్తాయని బ్రిటిష్ మెడికల్ జర్నల్ పేర్కొంది. 'చేప నూనె చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించదు' అని దిల్లీ మేదాంత హాస్పిటల్ వైద్య పరిశోధకులు వెల్లడించారు.

● భారత్‌లో 25 ఏళ్లు పైబడిన వారిలో 11.4 శాతం మందిలో డయాబెటిస్ ఉంది. వీరిలో 81.2 శాతం మందిలో లిపిడ్ అసాధారణంగా ఉంది.

● డయాబెటిస్ ఉన్న వారిలో 90 శాతం మందిలో అధిక ట్రైగ్లిజరైడ్స్, తక్కువ మంచి కొవ్వులు (హెచ్‌డీఎల్) ఉన్నాయి.

'లాన్సెట్'లో ప్రచురితమైన 'ఐసీఎంఆర్-ఇండియాబ్' అధ్యయనమిది.

మధుమేహుల్లో చెడు కొలెస్ట్రాల్(ఎల్‌డీఎల్), ట్రైగ్లిజరైడ్స్ పెరుగుతాయి. ఈ రెండూ కలిసి పలు వ్యాధులకు దారితీస్తాయి. హృదయ సంబంధ సమస్యల ముప్పును 2-4 రెట్లు పెంచుతాయి. ఆహారాన్ని వండే, తినే పద్ధతుల్లో మార్పుతో ఈ పరిస్థితి రాకుండా చూసుకోవచ్చని చెబుతున్నారు వైద్యులు.

పండ్లు, గింజలతో మేలు...



● ఆరోగ్యకరమైన ఆహారాల్లో పండ్లు, కూరగాయలు, గింజలు ముందు వరుసలో ఉంటాయి. ఇవి శాచురేటెడ్ కొవ్వులను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని భారత ప్రజారోగ్య సమాఖ్య (పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా) పేర్కొంది.

● ప్రొటీన్ అధికంగా ఉండే సోయా ఉత్పత్తులు శాచురేటెడ్ కొవ్వులకు మంచి ప్రత్యామ్నాయాలు. కొలెస్ట్రాల్ తగ్గించుకోవడానికి సోయా బాగా ఉపయోగపడుతుంది.

● ప్రొటీన్ ఆహారం తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ నియంత్రణతో పాటు.. మధుమేహాన్ని కూడా అదుపులో ఉంచుకోవచ్చని ఐసీఎంఆర్ అధ్యయనంలో తేలింది.

● పీచు పదార్థం(ఫైబర్) ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల అది కొలెస్ట్రాల్‌ను బంధించి శరీరం నుంచి తొలగిస్తుంది. డయాబెటిస్ ఉన్నవారు రోజుకు 40 గ్రాముల కరిగే ఫైబర్‌ను ఆహారంలో తీసుకోవాలని 'రీసెర్చ్ సొసైటీ ఫర్ ది స్టడీ ఆఫ్ డయాబెటిస్ ఇన్ ఇండియా, ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఇండియా' సంయుక్తంగా వెలువరించిన డయాబెటిస్ మార్గసూత్రాల్లో సూచించారు.

● తాజా కూరగాయలు, పండ్లు వాడటంతో పాటు.. జొన్న, రాగి, అవిసె గింజల వంటి ఆరోగ్యకరమైన తృణధాన్యాలు తీసుకుంటే.. కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచుకోవడం సాధ్యమవుతుంది. ఆహార నియమాలకు తోడుగా యోగా, నడక, జాగింగ్, ఈత, సైక్లింగ్ వంటివి కూడా కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచడంలో మేలు చేస్తాయి

- డాక్టర్ పీవీ రావు, సీనియర్ ఎండోక్రైనాలజిస్ట్




● డయాబెటిస్ ఉన్న వాళ్లు మారినేట్ చేసిన మాంసాన్ని తినడం మేలు చేస్తుంది. ఈ ప్రక్రియలో మాంసంలో ఉన్న కొవ్వును వదులు చేసేలా నిమ్మ, నారింజ రసాలు, మజ్జిగలాంటి వాటిలో రాత్రంతా నానబెడతారు.

● ఇలా చేస్తే నూనె అవసరం పెద్దగా లేకుండానే మాంసాన్ని వండుకోవచ్చు. మన వంట పద్ధతుల్లో ఇలాంటి మార్పులు చేసుకోలేకపోతే చెడు ఫలితాలు వస్తాయి.

ఒక్క మాట... మధుమేహులు కొలెస్ట్రాల్‌ను అదుపులో పెట్టుకోవాలంటే వేసుకోవాల్సిన ప్రశ్నలు.. ఏం తినాలి? ఏం తినకూడదు? ఆహారాన్ని పోషకాల కొలతలు, నిష్పత్తులతో తీసుకోవడం అందరికీ కుదరదు. ఆచరణకు సాధ్యంకాని పద్ధతులను కొద్దిరోజులు పాటించి లక్ష్యాన్ని చేరుకోలేక మధ్యలో వదిలేయడం కంటే.. ఆచరించడానికి వీలయ్యే విధానాలను శాశ్వతంగా పాటించాలంటున్నారు నిపుణులు.

- ఈనాడు, హైదరాబాద్



మహాత్ముడి మన్‌కీబాత్

అదే నేటి పబ్లిక్ సర్వీస్ బ్రాడ్‌కాస్టింగ్ డే

నవంబరు 12, 1947... జాతిపిత మహాత్మా గాంధీ మొదటిసారి దిల్లీలోని ఆల్ ఇండియా రేడియో స్టూడియోని దర్శించిన రోజు. ఆ ఒక్కసారే అక్కడ కాలుపెట్టారు కాబట్టి అదే మొదటిసారి, చివరిసారి అని కూడా అంటారు. దేశ విభజన అనంతరం పాకిస్థాన్ నుంచి వలస వచ్చిన దాదాపు 2 లక్షల మంది కాందిశీకులు హరియాణాలోని కురుక్షేత్రలో తాత్కాలికంగా నివాసం ఉండగా.. వారిని ఉద్దేశించి మహాత్ముడు ఆ రోజు పబ్లిక్ లైవ్‌కాస్ట్‌లో మాట్లాడారు. ఆ రోజుని పబ్లిక్ సర్వీస్ బ్రాడ్‌కాస్టింగ్ డేగా 2000వ సంవత్సరంలో ప్రకటించారు.

లాటరీలో బంగారం

బెంగళూరుకు చెందిన 39 ఏళ్ల మంజునాథ్ హరోహళ్లి దుబాయ్ బిగ్ టికెట్ లాటరీలో జాక్‌పాట్ కొట్టేశారు. రెండు దశాబ్దాలుగా అక్కడ ఓ స్టోర్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆయన చాన్నాళ్లుగా లాటరీ టికెట్లు కొంటున్నారు. ఇటీవల తన కుమార్తె పేరిట లాటరీలో ఓ టికెట్ కొనుగోలు చేశారు. తాను కొన్న ఆ టికెట్‌కు 250 గ్రాముల 24క్యారెట్ల బంగారం బహుమతిగా లభించింది. ఆ బంగారం విలువ రూ.30 లక్షల వరకు ఉంటుంది. - ఈనాడు, బెంగళూరు

నల్లమల 'బయో ఛాప్టర్'



మచ్చల పిల్లి

నల్లమలలోని జీవ వైవిధ్యం గురించి తెలుసుకోవాలనుకుంటున్నారా? అయితే శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలోని జీవ వైవిధ్య(బయోడైవర్సిటీ) కేంద్రాన్ని సందర్శిస్తే సరిపోతుంది. అంతరించిపోతున్న జంతుజాలాన్ని భావితరాలకు పరిచయం చేయడానికి వీలుగా 2001లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 303 రకాల క్షీరదాలు, 80 రకాల పాములు, 102 రకాల సీతాకోకచిలుకలు, 55 రకాల చేపలు, 18 రకాల కప్పలు, 77 రకాల కీటకాల నమూనాలు(స్పెసిమన్లు) భద్రపరిచారు. ప్రపంచంలోనే ప్రత్యేకమైన రాకాసి సాలె పురుగులు నల్లమలలో ఉన్నాయి. 2005లో అప్పటి ఏసీఏఎఫ్ తులసీరావు వీటిని గుర్తించారు. ఇందులో పోయిషిలోథీరియా నల్లమలైసిస్(టెరంటులా), టుమారస్ శ్రీశైలం, ఫీనిక్స్ ఆంధ్రనిక్స్, మెటా క్రోమాంటిస్, నైక్రోఫిమిలోరేటా వంటివి ఉన్నాయి. - న్యూస్‌టుడే, ఆత్మకూరు



రాకాసి సాలెపురుగు



అరుదైన బొద్దింక



హనీ బ్యాడ్జర్

---

2 గ్రామాలు.. 200 పరిశ్రమలు

గాంధీజీ కలలుగన్న గ్రామాల ఆర్థిక స్వావలంబన నిజమైందా అనిపిస్తుంది పల్నాడు జిల్లాలో ఉన్న ఈ రెండు గ్రామాల్లో పర్యటిస్తే. పదీ.. ఇరవై కాదు ఏకంగా 200 కుటీర పరిశ్రమలకు ఈ ఊళ్లు నిలయాలు. నరసరావుపేట మండలం యలమంద, చినతురకపాలెం గ్రామాల గురించే ఇదంతా. ఈ ఊళ్లలో ఎటుచూసినా గోతాలు, పరదా సంచులు కుట్టే కుటీర పరిశ్రమలే కనిపిస్తాయి. రెండు గ్రామాల్లో కలిపి 200కు పైగా పరిశ్రమలు ఉండగా చుట్టుపక్కల గ్రామాలు, బిహార్ కార్మికులను కలుపుకొని 2,000 మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. 70 ఏళ్ల నుంచి ఈ పరిశ్రమ ఇక్కడ వృద్ధి చెందిందని, వీటి సాయంతోనే తమ పిల్లల్ని వైద్యులు, ఇంజినీర్లను చేశామని వ్యాపారులు తెలిపారు.

- ఈనాడు డిజిటల్, నరసరావుపేట





ఆత్మీయ స్నేహాలను పండిస్తున్నారు



కాలం చేసిన కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం చాలామంది మొక్కలు నాటి సంరక్షిస్తుంటారు. ఈ రైతు తనతో కలిసి చదువుకుని దివంగతులైన స్నేహితుల పేర్లతోనూ ఇంటి ఆవరణలో పండ్ల మొక్కలు నాటి పెంచుతున్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లికి చెందిన కొంగల రాంచంద్రారెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తనతో చదువుకున్న మిత్రుడు, మావోయిస్టు ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి ఎలియాస్ శ్యాం, జిట్టా బాల్‌రెడ్డిల పేర్లతో మొక్కలు నాటి పెంచుతున్నారు. దివంగతులైన తల్లిదండ్రులు, సోదరుడు, కుమారుడి పేర్లతోనూ పండ్ల మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి ఎదిగి ఫలాలు ఇస్తుండటంతో వాటిని వారి పేరు మీద గ్రామస్థులకు పంపిణీ చేస్తున్నట్లు రాంచంద్రారెడ్డి చెప్పారు. - న్యూస్‌టుడే, భీమదేవరపల్లి



ఈనాడు

విజయవాడ 12-11-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 92
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఉగ్ర పంజాయే

దిల్లీ పేలుడు వెనుక స్లీపర్‌సెల్స్ హస్తం

ఫరీదాబాద్ పేలుడు పదార్థాలతో సంబంధం

- కారులో పేలినవి డిటోనేటర్లు.. నడిపింది పుల్వామా వైద్యుడు ఉమర్
- దొరికిపోక తప్పదని పేల్చేసుకున్నట్లు అనుమానం
- హడావుడిగా బాంబును తరలిస్తుండగా పేలుడు జరిగినట్లూ సంకేతాలు
- 12కి పెరిగిన మృతుల సంఖ్య



డాక్టర్ ఉమర్



ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో పేలుడుకు ఉపయోగించిన కారు ఇదే..

దిల్లీ

దేశ రాజధానిలో బాంబుపేలుడు వెనుక ఉగ్ర మూలాలు ఉన్నట్లు బయటపడింది. హరియాణాలోని ఫరీదాబాద్‌లో భారీఎత్తున దొరికిన పేలుడు పదార్థాలకు, దీనికి సంబంధం ఉందని అనుమానాలు బలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తు బాధ్యతల్ని దిల్లీ పోలీసుల నుంచి 'జాతీయ దర్యాప్తు సంస్థ' (ఎన్ఐఏ) తీసుకుంది. 13 ఏళ్ల విరామం తర్వాత సోమవారం సాయంత్రం ఎర్రకోట మెట్రోస్టేషన్‌కు సమీపంలో చోటుచేసుకున్న కారు పేలుడులో తొమ్మిదిమంది మృతిచెందిన విషయం తెలిసిందే. విషమ పరిస్థితుల్లో ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న వారిలో మరో ముగ్గురు మంగళవారం చనిపోవడంతో మృతుల సంఖ్య 12కి చేరింది. మృతుల్లో ఇప్పటివరకు ఇద్దరిని గుర్తించారు. వారిలో ఒకరు ఉత్తర్‌ప్రదేశ్‌కు, మరొకరు దిల్లీకి చెందినవారు. మిగిలినవారి వయసు 28-58 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. గాయపడిన 20 మందిలో 12 మంది దిల్లీవాసులు. కారును నడిపిన డాక్టర్ ఉమర్ నబీ జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాకు చెందినవాడిగా తేలింది. ఫరీదాబాద్ పేలుడు పదార్థాలతో సంబంధం ఉండటంతో ఇక దొరికిపోక తప్పదనే భయంతోనే ఆ వైద్యుడు ఆత్మాహుతికి పాల్పడ్డాడా, లేదా అనుకోకుండా పేలాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముందస్తు ప్రణాళికతో చేసింది కాదని పోలీసులు చెబుతున్నారు. పూర్తిస్థాయి బాంబును వాడితే విధ్వంసం ఇంకా తీవ్రంగా ఉండేదని, బాంబును హడావుడిగా సిద్ధం చేసి తరలిస్తుండగా అది పేలినట్లు ఉందని విశ్లేషిస్తున్నారు. కారులో ఉన్నది అమ్మోనియం నైట్రేట్, మరో రకం ఇంధనం, (మిగతా 2లో)



దిల్లీలో మార్చురీ వద్ద విలపిస్తున్న మృతుడు జుమ్మాన్ సోదరి నజ్మా



పేలుడు చోటుచేసుకున్న ప్రాంతంలో ఆధారాలు సేకరిస్తున్న ఫోరెన్సిక్ అధికారులు

జైషే మహిళా విభాగంలో డాక్టర్ షాహీన్



ఫరీదాబాద్ ఉగ్రకుట్రలో భాగస్వామి 11లో

ఇంటికో పారిశ్రామికవేత్త సాధ్యమే

- నాడు హైదరాబాద్‌లో ఐటీ అంటే అవహేళన చేశారు
- ఇప్పుడు అక్కడ సాధ్యమైనట్లే రేపు ఏపీలోనూ సాకారం
- ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలంలో సీఎం చంద్రబాబు

రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 50 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవం



ప్రకాశం జిల్లా జి.లింగన్నపాలెంలో ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఎమ్మెల్యేలు అశోక్‌రెడ్డి, జనార్దన్, ఉగ్రనరసింహారెడ్డి, నారాయణరెడ్డి, ఎంపీ మాగుంట, కార్పొరేషన్ల ఛైర్మన్లు రామరాజు, నూకసాని బాలాజీ, లంకా దినకర్, అధికారులు

ఈనాడు- ఒంగోలు

"ముప్పై ఏళ్ల కిందట నేను ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) వినియోగం గురించి చెబితే హేళనగా మాట్లాడారు. టెక్నాలజీతో హైదరాబాద్ ఎదుగుదల ఎలా సాధ్యమైందో.. భవిష్యత్తులో ఏపీలో ఇంటికో పారిశ్రామికవేత్త అనే మా ఆలోచన కూడా అలాగే సాకారమవుతుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు అవకాశాలను అందిపుచ్చుకుని ఎదగాలనే ఉద్దేశంతో 175 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంగళవారం ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం జి.లింగన్నపాలెంలో ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు పారిశ్రామిక పార్కులు, ఎంఎస్ఎంఈ సంస్థలు, మెగా పారిశ్రామిక పార్కులకు సీఎం వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ప్రజావేదికలో మాట్లాడారు. 'ఏడో తరగతి చదువుతున్న పిల్లల నుంచి ప్రతి ఒక్కరినీ ప్రభుత్వంలో భాగస్వాములను చేయాలనుకుంటున్నాం. వారు ఎదిగే సమయానికి స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది మా లక్ష్యం. నాడు ప్రతి కుటుంబం నుంచి ఐటీ చదివేవారు ఉండాలనే లక్ష్యంతో ఇంజినీరింగ్ కళాశాలలు అందుబాటులోకి తీసుకొచ్చాం. దీంతో అమెరికా, లండన్, ఆస్ట్రేలియాల్లో అత్యధిక వేతనాలు తీసుకునేవారిలో తెలుగువారే ముందున్నారని గర్వంగా చెబుతున్నా. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటమ్ వ్యాలీతో అమెరికా, జపాన్ సరసన మనం నిలుస్తాం' అని అన్నారు.

నాడు ఛీఛీ.. నేడు భలే భలే

వైకాపా పాలకుల విధ్వంసంతో రాష్ట్రంలో పరిశ్రమలు మూతపడి, పారిశ్రామికవేత్తలు పారిపోయే పరిస్థితి ఉండేదని సీఎం చంద్రబాబు విమర్శించారు. సంక్షోభంలో ఉన్న వ్యవస్థలను గాడిన పెడుతున్నామన్నారు. గత ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తలు ఏపీ అంటే ఛీఛీ అనేవారని.. నేడు భలేభలే అంటూ రాష్ట్రానికి వస్తున్నారని వ్యాఖ్యానించారు. 'ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఒప్పందాలు చేసుకోబోతున్నాం. దీని ద్వారా 8 లక్షల ఉద్యోగాలు వస్తాయి. రాష్ట్రంలో ఇప్పటికే 55 ఎంఎస్ఎంఈ (మిగతా 2లో)

మైనారిటీల సాధికారతకు నిరంతరం పనిచేస్తా

శాశ్వతంగా మీ వాడిగా ఉంటా

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ బాధ్యత నాది

రూ.200 కోట్లతో ఉర్దూఘర్, షాదీఖానాలు, చర్చిలు


మైనారిటీ సంక్షేమ దినోత్సవంలో సీఎం చంద్రబాబు 13లో

'మొంథా' తక్షణ సాయంగా రూ.2,622 కోట్లు ఇప్పించండి

కేంద్ర బృందానికి సీఎం వినతి 8లో

ఒకేసారి 3 లక్షల గృహ ప్రవేశాలు

అన్నమయ్య జిల్లా నుంచి వర్చువల్‌గా నేడు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు 13లో



వాటర్‌షెడ్ జన్‌భాగీదారీ కప్-2025 పోటీలో విజేతగా నిలిచిన ప్రకాశం జిల్లా మారెళ్ల ప్రాజెక్టు నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్. చిత్రంలో ఎమ్మెల్యే నసీర్, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు

అక్షర క్రమంలోనే కాదు.. అభివృద్ధిలోనూ ఏపీ ముందుండాలి

- మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ త్రయంతో ప్రగతి
- ఏపీలో రోడ్ల అభివృద్ధికి రూ.358.82 కోట్లు
- కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్
- మట్టికి జీవం పోద్దాం, మంచినీటిని పరిరక్షిద్దామంటూ పిలుపు
- గుంటూరులో ఘనంగా వాటర్‌షెడ్ మహోత్సవం

ఈనాడు, అమరావతి: "మనకు మంచినీరే జీవితం. మట్టి లేనిదే రైతులకు ఆధారం లేదు. ఈ రెండింటినీ కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరం కృషి చేద్దాం.. మట్టికి జీవం పోసి, మంచినీటిని పరిరక్షించుకోవాలనే ఆలోచనతో చేపట్టిన వాటర్‌షెడ్ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళదాం. గుంటూరు జిల్లా వెంగళాయపాలెం చెరువు అభివృద్ధి దేశానికి ఆదర్శం. ఇదే స్ఫూర్తితో దేశంలోని అనేక చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుడతాం. చెరువుల పునరుద్ధరణతో పాటు చెక్‌డ్యామ్‌ల అభివృద్ధి ద్వారా రైతులకు మేలు చేస్తాం" అని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. గుంటూరులో రెండురోజుల వాటర్‌షెడ్ మహోత్సవ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. నల్లపాడు (మిగతా 2లో)

హైకమాండ్ ఒత్తిడితోనే కల్తీ నెయ్యి కొనుగోలు

సిట్ అధికారుల ప్రశ్నలకు ధర్మారెడ్డి జవాబు

- ఎవరా హైకమాండ్ అంటే మౌనమే సమాధానం
- తితిదే మాజీ ఈవోపై సిట్ ప్రశ్నల వర్షం
- 8.15 గంటల పాటు విచారించిన అధికారులు
- నేడూ కొనసాగనున్న విచారణ



సిట్ విచారణకు వస్తున్న ధర్మారెడ్డి

ఈనాడు-తిరుపతి, న్యూస్‌టుడే-తిరుపతి (నేరవిభాగం): తిరుమల లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దూకుడు పెంచింది. వైకాపా హయాంలో తితిదే ఈవోగా పనిచేసిన ఏవీ ధర్మారెడ్డిని మంగళవారం విచారించింది. ఉదయం 10 నుంచి రాత్రి 7.15 గంటల వరకు భోజన విరామం గంటసేపు మినహా 8.15 గంటల పాటు డీఐజీ మురళీ రాంబా, అధికారుల బృందం ప్రశ్నల వర్షం కురిపించింది. ధర్మారెడ్డి కొన్నింటికి ముక్తసరిగా సమాధానాలు ఇవ్వగా, మరికొన్నింటికి మౌనం వహించారు. బుధవారం కూడా విచారణ కొనసాగనుంది. ఇప్పటికే కల్తీనెయ్యి కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైన భోలేబాబా ఓరోగానిక్ డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైనలనూ సిట్ అధికారులు విచారించారు.

ఎందుకు బాధ్యతగా వ్యవహరించలేదు?

లడ్డూకు కల్తీ నెయ్యి వస్తుంటే ఎందుకు అడ్డుకోలేదని సిట్ ప్రశ్నించగా హైకమాండ్ ఒత్తిడితోనే అనుమతించాల్సి వచ్చిందని ధర్మారెడ్డి జవాబు ఇచ్చినట్లు సమాచారం. ఎవరా హైకమాండ్ అని అడిగితే సమాధానం ఇవ్వలేదని తెలుస్తోంది. గతంలో తితిదే ప్రత్యేకాధికారిగా ఉన్నారు కదా? మరిప్పుడు ఎందుకు బాధ్యతగా వ్యవహరించలేదని ప్రశ్నించగా.. 2019లో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించానని బదులిచ్చారు. 2022 ఆగస్టులో తిరుపతి జిల్లా పునబాకలోని శ్రీవైష్ణవి, ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రీమియర్ అగ్రిఫుడ్స్, భోలేబాబా (మిగతా 10లో)

వైవీ సుబ్బారెడ్డి పీఏ ఖాతాలో రూ.4.69 కోట్లు

- అందులో రూ.4.65 కోట్లు వేర్వేరు ఖాతాల్లోకి మళ్లింపు
- 2019-24 మధ్య చిన్న అప్పన్న ఆదాయం రూ.65 లక్షలే
- కానీ ఆయన ఖాతాలో రూ.కోట్లలో డబ్బు జమ
- కల్తీ నెయ్యిపై చర్యలు తీసుకోని నాటి తితిదే ఛైర్మన్ సుబ్బారెడ్డి
- పీఏ ఖాతాలో జమైంది లంచాల సొమ్మేనని భావిస్తున్న సిట్
- దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి



ఈనాడు, అమరావతి: 'వైకాపా హయాంలో తితిదే ఛైర్మన్‌గా పనిచేసిన వైవీ సుబ్బారెడ్డి పీఏ, కల్తీ నెయ్యి సరఫరా కేసులో నిందితుడు కె.చిన్న అప్పన్నకు 2019-24 మధ్య వేతనం ద్వారా సమకూరిన ఆదాయం రూ.65 లక్షలు. కానీ దిల్లీలోని ఏపీ భవన్ యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌లో అతని పేరిట ఉన్న ఖాతాలో ఆ ఐదేళ్లలో ఏకంగా రూ.4.69 కోట్లు జమైంది. అందులో రూ.4.64 కోట్లు వివిధ ఖాతాలకు మళ్లించేసుకున్నారు. ప్రస్తుతం చిన్న అప్పన్న ఖాతాలో క్లోజింగ్ బ్యాలెన్స్ రూ.4.98 లక్షలే మిగిలింది' అని సిట్ గుర్తించింది. అతని ఖాతాల్లో రూ.4.69 కోట్లు (మిగతా 10లో)



దగ్ధమవుతున్న ట్రావెల్స్ బస్సు

జాతీయ రహదారిపై ట్రావెల్స్ బస్సు దగ్ధం

ఇంజిన్‌లో మంటలు గమనించాక బస్సును నిలిపేసిన డ్రైవర్

ప్రయాణికులు వెంటనే దిగడంతో తప్పిన పెను ప్రమాదం..

హైదరాబాద్ నుంచి కందుకూరు వెళుతుండగా ఘటన 3లో

అతివేగం ఆయువు తీసింది

జాతీయ రహదారి నుంచి సర్వీసు రోడ్డుపైకి కారు పల్టీలు

నలుగురు యువకుల మృత్యువాత

కృష్ణా జిల్లాలో ఘోరం 3లో



ప్రమాదానికి గురైన కారు



కంటెయినర్ బీభత్సం

బైకులను ఢీకొట్టి... వ్యాపారులపైకి దూసుకెళ్లి..

తండ్రీకుమారుడు సహా ముగ్గురి మృతి 3లో

చెట్టును ఢీకొని నిలిచిపోయిన కంటెయినర్ వాహనం

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. ఆరుగురు మావోయిస్టుల మృతి 8లో

ఇదీ సంగతి!



బిహార్ మళ్లీ ఎన్డీయేదే!

- ఆర్జేడీ నేతృత్వంలోని మహాగఠ్ బంధన్‌కు 108లోపే సీట్లు
- అన్ని సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ మాట ఇదే
- రెండో విడతలో రికార్డు స్థాయిలో 68.79 శాతం పోలింగ్
- 14న ఓట్ల లెక్కింపు

బిహార్ అసెంబ్లీలో మొత్తం స్థానాలు: 243

అధికారంలోకి రావడానికి కావల్సినవి: 122



ఓటు వేసేందుకు నవాదాలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

పట్నా/దిల్లీ: బిహార్‌లో హోరాహోరీగా సాగిన అసెంబ్లీ ఎన్నికల పోరు మంగళవారం ముగిసింది. అధికార ఎన్డీయే, విపక్ష మహాగఠ్‌బంధన్ మధ్య తీవ్ర పోటీ కొనసాగింది. ఓటర్లు భారీగా తరలిరావడంతో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఈ నెల 14న ఫలితాలు వెల్లడి కానుండగా విజయం ఎవరిని వరిస్తుందనే విషయమై ఉత్కంఠ నెలకొంది. అయితే, మంగళవారం సాయంత్రం పోలింగ్ ముగిసిన అనంతరం వివిధ సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ అన్నీ కూడా మళ్లీ ఎన్డీయేనే అధికారాన్ని చేజిక్కించుకోబోతోందన్న అంచనాలను వెల్లడించాయి. విపక్ష మహాగఠ్‌బంధన్ మాత్రం ఎగ్జిట్ పోల్స్‌ను తోసిపుచ్చింది. గెలుపు తమదేనన్న ధీమా వ్యక్తం చేసింది.

వివిధ సంస్థల ఎగ్జిట్ పోల్స్ అంచనాల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉన్నప్పటికీ మొత్తం మీద ఎన్డీయేనే మళ్లీ అధికారంలోకి రాబోతోందని ముక్తకంఠంతో తేల్చాయి. (మిగతా 2లో)

21లోగా కోర్టుకు హాజరవుతా

సీబీఐ కోర్టులో తాజాగా మెమో దాఖలు చేసిన జగన్

హాజరు మినహాయింపుపై గత మెమో ఉపసంహరణ



ఈనాడు, హైదరాబాద్: యూరప్ పర్యటనకు వెళ్లి వచ్చాక కోర్టు ముందు హాజరు కావాలన్న ఉత్తర్వుల నేపథ్యంలో.. ఈనెల 21లోగా హాజరవుతానని అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడు, ఏపీ మాజీ సీఎం జగన్ మంగళవారం హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టుకు నివేదించారు. వాస్తవానికి ఈనెల 14న హాజరుకావాల్సి ఉండగా మెమో దాఖలు చేస్తూ మినహాయింపు కోరినా మంగళవారం దాన్ని ఉపసంహరించుకున్నారు. (మిగతా 2లో)



ఇలా చేస్తే.. వైఫల్యం అసంభవం

విధులు ప్రారంభమయ్యే సోమవారం నాడు మీ రోజువారీ ప్రణాళికను సంపూర్ణంగా అమలు పరచగలిగారంటే.. ఆ వారం మొత్తాన్ని మీరు జయించినట్లే. అదేవిధంగా వారంలో మూడు రోజులు వ్యాయామం చేయాలని వారపు ప్రణాళికలో నిర్దేశించుకుంటే సోమవారం నుంచే దానిని అమలుపరచండి. ఇక అప్పుడు వారంలో రెండుసార్లు వ్యాయామం..ఆరు రోజులు మీ వద్ద ఉంటాయి. ఈ స్థితిలో కసరత్తు ప్రణాళిక అమలులో మీరు విఫలమయ్యే అవకాశం ఉండదు.

- రూబెన్ హెవిట్, ఫిట్‌నెస్ కోచ్

5 వేల మందికి ఉపాధినిచ్చేలా కర్నూలులో బెవరేజెస్ కర్మాగారం

ఈనాడు, కర్నూలు: రిలయన్స్ కన్జ్యూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ సంస్థ ప్రపంచంలో రెండో అతిపెద్ద బెవరేజెస్ తయారీ కేంద్రాన్ని కర్నూలులో ఏర్పాటు చేస్తోంది. 170 ఎకరాల్లో రూ.2,880 కోట్ల వ్యయంతో ఏడు వేల బాటిళ్ల డ్రింకులను తయారు చేసే సామర్థ్యంతో దీన్ని నిర్మిస్తున్నారని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. దీనిద్వారా 5 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఆహారోత్పత్తులు తయారుచేసే మరో పరిశ్రమకు కూడా సీఎం చంద్రబాబు మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ■ అచ్యుతాపురం సెజ్‌లో యోకోహామా టైర్ల తయారీ పరిశ్రమ వద్ద సీఎం వర్చువల్‌గా 3 పరిశ్రమలను ప్రారంభించి, మరో ఆరు పరిశ్రమలకు శంకుస్థాపనలు చేశారు. ■ పైడిభీమవరం పారిశ్రామికవాడలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ సముదాయ భవనాన్ని సీఎం ప్రారంభించారు. కాకినాడ జిల్లాలో రూ.176 కోట్ల విలువైన 3 ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.



ఎంఎస్ఎంఈ పార్కులను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, పారిశ్రామికవేత్త అనుదీప్, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, పారిశ్రామికవేత్తలు పెనుబోతు అజిత్, పుచ్చకాయల రాజేంద్రప్రసాద్, ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు



సభకు హాజరైన ప్రజలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు

ఇంటికో పారిశ్రామికవేత్త సాధ్యమే

(మొదటి పేజీ తరువాయి)

పార్కులు ఉన్నాయి. తాజాగా 50 ప్రారంభించాం. జనవరి నాటికి 70 పార్కులు ప్రారంభిస్తాం. వీటి ద్వారా 5 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. రాష్ట్రంలో 99 పరిశ్రమల ద్వారా రూ.2.67 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 25 సంస్థలు ప్రారంభించడం ద్వారా రూ.25 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 74 చోట్ల శంకుస్థాపనలతో రూ.2.39 లక్షల పెట్టుబడులు ద్వారాలు తెరిచాం. వీటి ద్వారా 2 లక్షల మందికి ఉపాధి దక్కుతుంది. రిలయన్స్, గ్రీన్‌కో, ఆర్సెలార్ మిత్తల్.. వంటి ఎన్నో ప్రముఖ కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయి. వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి అవకాశాలు పెంచడమే మా లక్ష్యం.

ప్రోత్సాహకాలకు అండగా ఉంటాం

ఎవరైనా పరిశ్రమ ప్రారంభించి నష్టపోతే కేంద్ర ప్రభుత్వం 80 శాతం నిధులు ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం మరో 15 శాతం ఇవ్వడానికి సముఖంగా ఉంది. ఆలోచనతో వచ్చి పరిశ్రమ ప్రారంభించాలనుకుంటున్న వారికి భూమితోపాటు సౌకర్యాలు కల్పిస్తాం. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా సలహాలు ఇస్తాం. తిరుపతి ఐటీలో నిపుణులతో శిక్షణ ఇప్పిస్తాం. అన్ని జిల్లాల్లో కలెక్టర్ల నేతృత్వంలో సొసైటీ ఉంటుంది. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే ప్రత్యేకాధికారి తోడ్పాటుతో యూనిట్లు స్థాపించవచ్చు. చిత్తూరు జిల్లా పారిశ్రామికవేత్త మైథిలి మాదిరిగా రాష్ట్రంలో లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేస్తాం. సెమీ కండక్టర్ యూనిట్, విమానాలు, హెలికాప్టర్లు తయారు చేసే యూనిట్లు రాష్ట్రంలో ఏర్పాటవుతాయి. కియాతో అనంతపురం జిల్లా పరిస్థితి ఎంత మెరుగుపడిందో చూశాం. రాష్ట్రాన్ని విశాఖపట్నం, గోదావరి, అమరావతి, తిరుపతి, రాయలసీమ ప్రాంతాలుగా వర్గీకరించి ఎక్కడికక్కడ అభివృద్ధి చేయనున్నాం. తూర్పు తీరాన్ని లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం. విశాఖను ఆర్థిక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నాం

వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు

- ■ 17 జిల్లాల్లో 868 ఎకరాల విస్తీర్ణంలో రూ.873 కోట్లతో ఏర్పాటు చేసిన 49 ఎంఎస్ఎంఈ పార్కులు
- ■ పారిశ్రామిక పార్కుల్లో భూమి పొందిన 1,597 ఎంఎస్ఎంఈ సంస్థలు
- ■ రూ.25,256 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటైన 38 మెగా పారిశ్రామిక యూనిట్లకు చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

పవన్ సూపర్.. లోకేశ్ దూసుకెళుతున్నారు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏ పాలసీ తీసుకొచ్చినా, రాష్ట్రంలో అమలుకు ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బాగా చేస్తున్నారని, తనను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని కొనియాడారు. మంత్రి లోకేశ్ పెట్టుబడుల కోసం తిరుగుతున్నారని, పట్టువదలని విక్రమార్కుడిలా పనిచేస్తున్నారని సీఎం కితాబిచ్చారు.

కరవు జిల్లాకు గోదావరి నీళ్లు

వచ్చే ఏడాది వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేసి కరవు ప్రాంతమైన పశ్చిమ ప్రకాశానికి కృష్ణా జలాలను తీసుకొస్తామని, దీంతో పాటు నల్లమల సాగర్‌కు గోదావరి జలాలను కూడా తీసుకొస్తామని సీఎం ప్రకటించారు. కార్యక్రమాల్లో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, దామచర్ల జనార్దన్, కందుల నారాయణరెడ్డి, ఏపీఐఐసీ ఛైర్మన్ రామరాజు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, తదితరులు పాల్గొన్నారు.

అక్షర క్రమంలోనే కాదు.. అభివృద్ధిలోనూ ఏపీ ముందుండాలి

(మొదటి పేజీ తరువాయి)

లయోలా పాఠశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో, గుంటూరులోని ఓ హోటల్‌లో వాటర్‌షెడ్ మహోత్సవ్‌పై రెండురోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ప్రసంగించారు. అనంతపురం జిల్లా ఇప్పేరు, అన్నమయ్య జిల్లాలోని గుండ్లపల్లి, కుప్పం నియోజకవర్గంలోని కడపల్లిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో భూమిపూజ, ప్రారంభోత్సవాలు చేశారు. 150 ఏళ్ల వెంగళాయపాలెం చెరువును పరిశీలించి అభివృద్ధి చేసిన యంత్రాంగాన్ని అభినందించారు. మెగా చెక్కుల పంపిణీ, సోషల్ మీడియా పోటీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు.



సమావేశానికి హాజరైన మహిళలు

ఏపీ ప్రజలకూ నేను మామనే

మధ్యప్రదేశ్‌లో ప్రజలు తనను మామ అని ఆప్యాయంగా పిలుస్తుంటారని, ఇప్పటి నుంచి ఏపీలో ఉన్నవారికీ తాను మామనే అని శివరాజ్‌సింగ్ చౌహాన్ చెప్పారు. పెమ్మసాని చంద్రశేఖర్ హిందీలో మాట్లాడడం తనను ఆలోచింపజేసిందని.. ఈసారి ఏపీకి తాను తెలుగు నేర్చుకుని వస్తానన్నారు. మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ సరైన కాంబినేషన్ అన్న శివరాజ్‌సింగ్.. చంద్రబాబు హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్ర దిశగా అడుగేస్తుండడం అభినందనీయమన్నారు. అక్షర క్రమంలోనే కాదు.. అభివృద్ధి క్రమంలోనూ ఆంధ్రప్రదేశ్ ముందుండాలని ఆకాంక్షించారు. చిన్నసన్నకారు రైతుల ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయన్న శివరాజ్‌సింగ్.. వరి మాత్రమే కాకుండా ఉద్యాన, పూలు, ఆక్వా ఇలా అన్ని రంగాల్లోనూ రైతులు అభివృద్ధి సాధించాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో నిరుపేదలు కచ్చా ఇంటిలో ఉండకూడదనే ఉద్దేశంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పక్కా ఇళ్ల నిర్మాణానికి సహకరిస్తున్నామని, ఇందుకు ప్రత్యేక సర్వే చేపట్టబోతున్నట్లు వివరించారు. ఏపీలో రూ.5 వేల కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని.. తాజాగా ఏపీలోని పల్లెల్లో రోడ్ల నిర్మాణానికి రూ.358.82 కోట్లు కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వుల ప్రతిని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు అందజేశారు.

జగన్ మందు కల్తీ.. మాట కల్తీ.. మనసు కల్తీ..

పల్లెలే దేశ ప్రగతికి పట్టుగొమ్మలని, వాటికి భూమి తల్లి అయితే, నీరు ప్రాణమని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. యూరియా కొరత పరిష్కారానికి కేంద్ర మంత్రి చౌహాన్ కృషి చేశారని.. విజయవాడ వరదల్లో అన్ని ప్రాంతాలు పరిశీలించి రూ.వెయ్యి కోట్ల సాయం వచ్చేలా చేశారన్నారు. 2019కు ముందు నరేగా పనులు చేసి చిన్న గుత్తేదార్లు నష్టపోతే రూ.180 కోట్ల బిల్లులు విడుదల చేసి రాష్ట్రానికి న్యాయం చేశారన్నారు. చివరగా "జగన్ మందు కల్తీ, మాట కల్తీ, మనసు కల్తీ, మనిషి మొత్తం కల్తీ.." అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సభలో మంత్రి కందుల దుర్గేష్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రసంగించారు.

విజేతలకు ప్రోత్సాహక బహుమతులు

వాటర్‌షెడ్ జన్‌భాగీదారీ కప్-2025 పోటీలో విజేతలుగా చిత్తూరు జిల్లా చెరుకువారిపల్లి ప్రాజెక్టు, శ్రీసత్యసాయి జిల్లా మర్రికొమ్మదిన్నె ప్రాజెక్టు, గంగాళమ్మ చెరువు ప్రాజెక్టు, అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లి ప్రాజెక్టు, ప్రకాశం జిల్లా తువ్వపాడు ప్రాజెక్టు, మారెళ్ల ప్రాజెక్టు, విజయనగరం జిల్లా మెరకముడియం ప్రాజెక్టు నిలిచాయి. వాటి నిర్వాహకులకు రూ.20 లక్షల చొప్పున ప్రోత్సాహక మొత్తాన్ని చెక్కు రూపంలో మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్ అందజేశారు.

డబ్ల్యూడీసీ-పీఎంకేఎస్‌వై 3.0 రూపకల్పన

వాటర్‌షెడ్ మహోత్సవ్‌లో రెండురోజులపాటు చర్చలు, మేధోమథనం ద్వారా వచ్చిన సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని వాటర్‌షెడ్ అభివృద్ధి సదస్సు-ప్రధానమంత్రి కృషి సించాయి యోజన 3.0 రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. డాక్యుమెంట్ రూపంలో నివేదిక తయారు చేసేందుకు కమిటీలను నియమించారు. ఇక్రిశాట్, ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తలు వివిధ అంశాలను వివరించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీతలు శ్యామ్‌సుందర్ పాలీవాల్, ఉమాశంకర్ పాండేలు నీటి సంరక్షణ, భూగర్భజలాల పెంపులో ఏవిధంగా విజయవంతమయ్యామో వివరించి ఇతర రాష్ట్రాల వారు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

బిహార్ మళ్లీ ఎన్డీయేదే!

(మొదటి పేజీ తరువాయి)

ఈ కూటమికి గరిష్ఠంగా 167 స్థానాలు లభిస్తాయని మ్యాట్రిజ్ సర్వే పేర్కొనగా...130 స్థానాల కన్నా తక్కువ రావని అన్ని సర్వే సంస్థలు తెలిపాయి. విపక్ష మహాగఠ్‌బంధన్ గరిష్ఠంగా 108 స్థానాలను గెలుచుకునే అవకాశం ఉందని చాణక్య స్ట్రాటెజీస్ అంచనా వేసింది. అయితే, ఈ కూటమి 70కి పైగా స్థానాలను దక్కించుకుంటుందని అన్ని సర్వే సంస్థలూ చెబుతున్నాయి. ప్రశాంత్ కిశోర్‌కు చెందిన జన్ సురాజ్ పార్టీకి 5 స్థానాలకు మించి గెలిచే అవకాశాలు లేనట్లు విశ్లేషించాయి. 'గతంలో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పిన సందర్భాలున్నాయి. ఈ సారి కూడా అదే జరగబోతోంది. తేజస్వీ యాదవ్ సర్కారు ఏర్పడడం ఖాయం' అని ఆర్జేడీ నేత మృత్యుంజయ్ తివారీ పేర్కొన్నారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాల కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తామని ఎన్డీయే నేత, బిహార్ ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరీ విశ్వాసం వ్యక్తం చేశారు.

ఎన్డీయేలో ప్రధాన భాగస్వామ్య పక్షాలు
జేడీయూ, భాజపా, ఎల్జేపీ(రామ్ విలాస్)

మహాగఠ్‌బంధన్‌లో కీలక పార్టీలు
ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలు

ఓటెత్తిన బిహార్..

బిహార్ శాసనసభ రెండో దశ ఎన్నికల్లో మంగళవారం 122 సీట్లకు పోలింగ్ జరగ్గా గతంలో ఎన్నడూ లేని విధంగా 68.79 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ నెల 6న తొలి విడతలో 121 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 65.08 శాతం పోలింగ్ నమోదైంది. రెండు విడతలకు కలిపి సగటున 66.90 శాతం పోలింగ్ నమోదైంది. 2020 అసెంబ్లీ కన్నా ఇది 9.6శాతం అధికమని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వినోద్ సింగ్ తెలిపారు. 1951లో రాష్ట్ర అసెంబ్లీ తొలి ఎన్నికల తర్వాత అత్యధిక పోలింగ్ నమోదు ఇప్పుడేనని వెల్లడించారు. ■ బిహార్‌లో మంగళవారం నిర్వహించిన రెండో విడత పోలింగ్ చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. ■ రాజస్థాన్, మిజోరం, ఝార్ఖండ్, తెలంగాణ, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాల్లోని ఒక్కో శాసనసభ స్థానానికి, కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌లోని రెండు అసెంబ్లీ సీట్లకు మంగళవారం జరిగిన ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఆయా స్థానాల్లో కనిష్ఠంగా 48.47శాతం, గరిష్ఠంగా 82.34శాతం ఓట్లు పోలయ్యాయి.

కూటమి / పార్టీ గెలుచుకునే స్థానాలపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలివి...

	మ్యాట్రిజ్	దైనిక్ భాస్కర్	పీపుల్స్ ఇన్‌సైట్	పీపుల్స్ పల్స్	పి.మార్క్	పోల్‌స్ట్రాట్	చాణక్య స్ట్రాటెజీస్
ఎన్డీయే	147–167	145–160	133–148	133–159	142–162	133–148	130–138
మహాగఠ్ బంధన్	70–90	73–91	87–102	75–101	80–98	87–102	100–108
జన్ సురాజ్	0–2	0–3	0–2	0–5	1–4	--	--
ఇతరులు	2–8	5–10	3–6	2–8	0–3	3–5	

21లోగా కోర్టుకు హాజరవుతా

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబరులో జగన్ యూరప్ పర్యటనకు వెళ్లే ముందు సీబీఐ కోర్టు అనుమతి కోరారు. కోర్టు అనుమతి మంజూరు చేస్తూ.. పర్యటన ముగించుకొని వచ్చాక నవంబరు 14న వ్యక్తిగతంగా హాజరుకావాలని షరతు విధించింది. పర్యటన ముగించుకొని వచ్చిన జగన్ కోర్టు ఎదుట హాజరుకాలేదు. కోర్టు విధించిన గడువు సమీపిస్తున్న నేపథ్యంలో తన వ్యక్తిగత హాజరును మినహాయించాలని కోరుతూ ఈనెల 6న మెమో దాఖలు చేశారు. దీనిపై సీబీఐ ప్రధాన కోర్టు న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం మంగళవారం విచారణ చేపట్టారు. ఈ మెమోను వ్యతిరేకిస్తూ సీబీఐ కౌంటరు దాఖలు చేసింది. బెయిలు షరతుల ప్రకారం ప్రతి విచారణకు జగన్ హాజరుకావాల్సి ఉందని పేర్కొంది. జగన్ తరఫు న్యాయవాది జి.అశోక్‌రెడ్డి స్పందిస్తూ హాజరు మినహాయిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. జగన్ తరపున ఆయన న్యాయవాది హాజరుకావడానికి అనుమతించిందని పేర్కొన్నారు. కోర్టు ముందు హాజరుకావడానికి అభ్యంతరం లేదని, ప్రత్యేక భద్రతా ఏర్పాట్లకు అధికార యంత్రాంగానికి ఇబ్బంది అన్న ఉద్దేశంతో మినహాయింపు కోరినట్లు పేర్కొన్నారు. ఈనెల 21లోగా జగన్ హాజరవుతారని మెమో దాఖలు చేసినట్లు తెలిపారు. వాదనలను విన్న న్యాయమూర్తి గతంలో దాఖలు చేసిన మెమోను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉగ్ర పంజాయే

(మొదటి పేజీ తరువాయి)

డిటొనేటర్లు అయి ఉండవచ్చని, ఆత్మాహుతి దాడిని తోసిపుచ్చలేమని అధికారులు చెబుతున్నారు. పేలుడుకు కారకులైనవారిలో ఎవరినీ వదిలిపెట్టేది లేదని, భద్రతాబలగాల ప్రతాపమేంటో వారికి చూపిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హెచ్చరించారు. దిల్లీతోపాటు దేశవ్యాప్త పరిస్థితులపై ఆయన ఉన్నతస్థాయిలో రెండుసార్లు సమీక్ష నిర్వహించారు. అంగోలా పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పేలుడుపై దర్యాప్తు వివరాలను త్వరలోనే బహిర్గతం చేస్తామని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. దోషులను ఎట్టిపరిస్థితుల్లోనూ చట్టం ముందు నిలబెడతామని చెప్పారు.



పేలుడు ఘటనలో మృతిచెందిన పంకజ్ సాహ్నీ మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదిస్తున్న అతడి తల్లి గాయత్రీ దేవి

ఆ 3 గంటల్లో ఏం జరిగింది?

సోమవారం మధ్యాహ్నం 3:19 గంటలకు ఎర్రకోట పార్కింగ్ ప్రదేశానికి వచ్చిన కారు సాయంత్రం 6:22 గంటల వరకు అక్కడే ఉంది. ఆ కారులో ముగ్గురు ఉన్నట్లు సోమవారం భావించగా అందులో డాక్టర్ ఉమర్ ఒక్కడే ఉన్నాడని, ఒక్కసారి కూడా దాని నుంచి కిందికి దిగలేదని పోలీసులు తాజాగా చెబుతున్నారు. ఆ మూడు గంటలు ఏం చేశాడు? ఎవరితో మాట్లాడాడనే దానిపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. ఎక్కువ రద్దీ ఉండే సమయం కోసం వేచి ఉన్నాడా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఉగ్రమూకల తుది ఆదేశాల కోసం, లేదా ఏదైనా సాయం కోసం అతడు అక్కడ ఎదురుచూసి ఉండవచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. ఉమర్ నబీ ఒకప్పుడు ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ వైద్య కళాశాలలో రెసిడెంట్ డాక్టర్‌గా పనిచేశాడు. అక్కడే మరో ఉగ్ర అనుమానితుడు ముజమ్మిల్ షకీల్‌కు సన్నిహితుడయ్యాడని తెలుస్తోంది. ఇద్దరూ కలిసి పేలుడు పదార్థాలతో దిల్లీకి వచ్చారా? లేక వేర్వేరుగానా అనేది ఆరా తీస్తున్నారు. అధికారుల అనుమానం ప్రకారం.. ఉమర్ గత కొంతకాలంగా ఉగ్రవాద సిద్ధాంతానికి ప్రేరేపితుడయ్యాడు.

ఎన్ఐఏకు అప్పగింత

కేంద్ర హోంశాఖ ఈ కేసును ఎన్ఐఏకు అప్పగించింది. తొలుత దిల్లీ పోలీసులు 'చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం' (ఉపా) కింద, పేలుడు పదార్థాల చట్టం కింద కేసు నమోదు చేశారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ఉమర్ నబీ ఈ పేలుడులో కీలక వ్యక్తి అని నిఘా వర్గాలు బలంగా అనుమానిస్తున్నాయి. కారులో దొరికిన శరీర భాగాలు ఉమర్‌వా, కాదా తెలుసుకునేందుకు పుల్వామాలో అతడి తల్లి షమీమా బేగం నుంచి డీఎన్ఏ నమూనాలు తీసుకున్నారు. స్లీపర్‌సెల్స్‌గా ఎవరైనా పనిచేశారా? ఇటీవల భారీస్థాయిలో స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు, ఆయుధాలను ఎక్కడినుంచి తీసుకువచ్చారనే విషయాలపైనా దర్యాప్తు కొనసాగుతోంది. సంప్రదింపుల కోసం ఉపయోగించిన సోషల్ మీడియా ఖాతాల్లో ఇతర సభ్యులు, నెట్‌వర్క్ వెనుక ఉన్నవారిని గుర్తించే పనిలో దర్యాప్తు సంస్థలు నిమగ్నమయ్యాయి. రాజధానిలో పలుచోట్ల సోదాలు నిర్వహించారు. దిల్లీకి వస్తున్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. పోలీసులు, ఫోరెన్సిక్ సైన్స్ నిపుణులు, ప్రత్యేక బృందాలవారు వేర్వేరు అంశాలను దర్యాప్తు చేస్తున్నారు.

దిల్లీలో హై అలర్ట్

ఉగ్రదాడి నేపథ్యంలో దిల్లీలో హై అలెర్ట్ ప్రకటించారు. మార్కెట్లు, రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లలో భద్రత కట్టుదిట్టం చేశారు. హోటళ్లు, అతిథిగృహాల్లో దిల్లీ పోలీసులు సోదాలు నిర్వహించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున పరిహారాన్ని దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రకటించారు.

మరొక ప్రాంతంలో దాడికి వెళ్తున్నారా?

నిందితుడు భారీ పేలుడుకు ప్రయత్నించినా ఫరీదాబాద్ ఉగ్రకుట్ర భగ్నం కావడంతో ఆలోచన మార్చుకున్నట్లు అనుమానిస్తున్నారు. మృతులు ఎక్కువగా ఉండేలా ఫిదాయీ తరహా ఆత్మాహుతి దాడి మార్గాన్ని ఎంచుకున్నట్లు భావిస్తున్నారు. మరొక ప్రాంతంలో దాడి చేయాలనే లక్ష్యంతో వెళ్తుండగా ఇది జరిగిందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. పేలుడులో ఉపయోగించిన హ్యుందాయ్ ఐ20 కారును అమ్మిన, కొనుగోలు చేసిన వారిలో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ముగ్గురు కూడా జమ్మూకశ్మీర్ ప్రాంతానికి చెందిన వారే.

గ్రహం అనుగ్రహం
12-11-2025 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తిక మాసం, బహుళపక్షం
అష్టమి: తె. 3-58 తదుపరి నవమి
ఆశ్లేష: రా. 12-16 తదుపరి మఖ
వర్జ్యం: మ. 1-14 నుంచి 2-49 వరకు
అమృత ఘడియలు: రా. 10-41 నుంచి 12-16 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-21 నుంచి 12-06 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6.06; సూర్యాస్తమయం: సా.5.21

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	36.0	22.5
అనంతపురం	33.4	20.2
నరసాపురం	33.3	24.3
కడప	33.0	23.0
కర్నూలు	33.0	20.4
ఒంగోలు	32.8	24.2
తాడేపల్లిగూడెం	32.0	29.0
గుంటూరు	32.0	24.0
శ్రీకాకుళం	32.0	21.0
విజయవాడ	31.6	23.2
నెల్లూరు	31.1	25.8
తిరుపతి	30.7	23.1
విశాఖపట్నం	30.4	22.4
హైదరాబాద్	30.2	16.6
విజయనగరం	30.0	22.0

అతివేగం ఆయువు తీసింది

- జాతీయ రహదారి నుంచి సర్వీసు రోడ్డుపైకి కారు పల్టీలు
- నలుగురు యువకుల మృత్యువాత


చింతయ్య ప్రిన్స్ రాకేశ్ పాపారావు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం- న్యూస్‌టుడే, ఉయ్యూరు, ఉయ్యూరు గ్రామీణం: పాతికేళ్లయినా నిండని నలుగురు యువకుల ప్రాణాలను అతివేగం బలిగొంది. ఆశలన్నీ వారిపైనే పెట్టుకున్న తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది. కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం గండిగుంట గ్రామం వద్ద ఈ ప్రమాదం సంభవించింది. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి దాటాక ఉయ్యూరు వైపునకు ఓ కారు వేగంగా దూసుకొచ్చింది. అదుపు తప్పి పక్కనున్న సర్వీసు రోడ్డుపైకి ఎక్కి సుమారు 50 మీటర్ల దూరం పల్టీలు కొట్టింది. కారు నడుపుతున్న విజయవాడ మొగల్రాజపురానికి చెందిన చాట్రగడ్డ రాకేశ్(24), అతని స్నేహితులు ఈటే ప్రిన్స్(22), గొరిపర్తి పాపారావు(23), కంకిపాడు మండలం కుందేరుకు చెందిన కొణతం చింతయ్య(19) చెల్లాచెదురుగా ఎగిరిపడ్డారు. ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పాపారావు మరణించారు. వీరు సరదాగా తిరిగేందుకు వచ్చారా? ఏదైనా పనిమీద వెళ్తూ ప్రమాదానికి గురయ్యారా? స్పష్టంగా తెలియట్లేదని ఉయ్యూరు సీఐ రామారావు చెప్పారు. ప్రమాదం అర్ధరాత్రి 1.34 గంటలకు జరిగినట్లు, కారు 120 కి.మీ. వేగంతో వెళ్లినట్లు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఉయ్యూరు సీహెచ్‌సీకి తరలించారు. ఆసుపత్రి వద్ద యువకుల తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు గుండెలవిసేలా విలపించడం.. అక్కడి వారిని కంటతడి పెట్టించింది.

ఎయిర్ బ్యాగులు తెరుచుకున్నా..

కారు అదుపు తప్పడానికి కారణంపై స్పష్టత రాలేదు. ఘటనా స్థలానికి కొంచెం దూరంలో ఉన్న సీసీటీవీ కెమెరాలో కారు అతివేగంగా వెళ్లినట్లు రికార్డయింది. తర్వాత జాతీయ రహదారి పక్కనున్న పల్లపు ప్రదేశంలో పడి పక్కనున్న సర్వీసు రోడ్డుపైకి ఎక్కి పల్టీలు కొట్టింది. ముందు టైరు ఊడింది. ఎయిర్ బ్యాగులు తెరుచుకున్నా.. ప్రయోజనం లేకపోయింది. రాకేశ్, ప్రిన్స్, పాపారావు విజయవాడలోని ఓ పాఠశాలలో చదివారు. చర్చికి వెళ్తున్నానని చెప్పి రాకేశ్ ఇంటి నుంచి బయటకు వచ్చాడు. స్నేహితులను కారులో ఎక్కించుకొని విజయవాడ నుంచి బయలుదేరాడు. వారు అర్ధరాత్రి కుందేరు వచ్చి చింతయ్యను తీసుకుని వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదానికి బలయ్యారు.

కంటెయినర్ బీభత్సం

- బైకులను ఢీకొట్టి... వ్యాపారులపైకి దూసుకెళ్లి..
- తండ్రీకుమారుడు సహా ముగ్గురి మృతి


షేక్ ఖాజా నజీం మొహిద్దీన్ షేక్ ముజాహిద్ అలీ ఎ.సురేష్

ఈనాడు, నెల్లూరు-న్యూస్‌టుడే, నెల్లూరు నేర విభాగం: వేగంగా వెళ్తున్న మినీ కంటెయినర్ మృత్యుశకటమైంది. ఏం జరుగుతోందో తెలుసుకునేలోపు ముగ్గురు మృతి చెందగా.. ఐదుగురికి గాయాలయ్యాయి. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఎన్టీఆర్ నగర్ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన ప్రమాదం పలు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో చేపల లోడును దించేసి వెళ్తున్న కంటెయినర్ నెల్లూరు బైపాస్‌లోని ఎస్వీజీఎస్ కళాశాల మైదానం సమీపంలో అదుపు తప్పింది. గ్రీన్ సిటీ వైపు నుంచి వచ్చి రోడ్డు దాటుతున్న బైకును ఢీకొట్టింది. అక్కడితో ఆగకుండా.. మరో రెండు బైకులను ఢీకొట్టుకుంటూ రోడ్డు పక్కనున్న చిరు వ్యాపారులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో దుకాణాల దగ్గర ఉన్న నెల్లూరు గ్రామీణ మండలం అల్లీపురం సిరిగార్డెన్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఎ.సురేష్(35), బైకుపై వెళ్తున్న విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ ఖాజా నజీం మొహిద్దీన్(70), ఆయన కుమారుడు, సచివాలయ ఉద్యోగి షేక్ ముజాహిద్ అలీ(35) అక్కడికక్కడే మృతి చెందారు. రోడ్డు పక్కన మొక్కజొన్న కండెలు విక్రయిస్తున్న మంజుల, కొబ్బరికాయల దుకాణదారుడు మాలకొండయ్య, లైన్‌మన్ ఇ.అనిల్, కోటిలకు గాయాలయ్యాయి. పోలీసులకు, అంబులెన్స్‌కు స్థానికులు సమాచారం అందించారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. కంటెయినర్ డ్రైవర్ బిహార్‌కు చెందిన శ్రావణ్‌కుమార్‌యాదవ్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరారయ్యాడు. సంఘటన స్థలాన్ని ఎస్పీ అజిత వేజెండ్ల పరిశీలించారు. ప్రమాదం గురించి తెలుసుకున్న మంత్రి నారాయణ, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.


ఘటనా స్థలంలో షేక్ ఖాజా నజీం మొహిద్దీన్ మృతదేహం

మరో అడుగు ముందుకు గగన్‌యాన్

ఇంటిగ్రేటెడ్ మెయిన్ పారాచూట్ ఎయిర్‌డ్రాప్ టెస్ట్ పూర్తి


తెరుచుకున్న పేలోడ్ పారాచూట్లు

ఈనాడు డిజిటల్, తిరుపతి: మానవ సహిత అంతరిక్ష ప్రయోగం దిశగా ఇస్రో మరో కీలక ముందడుగు వేసింది. గగన్‌యాన్ సన్నాహక పరీక్షల్లో భాగంగా ఈ నెల 3న నిర్వహించిన.. ఇంటిగ్రేటెడ్ మెయిన్ పారాచూట్ ఎయిర్‌డ్రాప్ టెస్ట్ (ఐఎంఏటీ) విజయవంతమైంది. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఝాన్సీలోని బబీనా ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ (బీఎఫ్ఎఫ్ఆర్)లో ఈ పరీక్షలను నిర్వహించినట్లు ఇస్రో మంగళవారం ఓ వీడియో విడుదల చేసింది. ఐఎంఏటీలో భాగంగా తొలుత వైమానిక దళానికి చెందిన ఐఎల్-76 విమానం నుంచి క్రూ మాడ్యూల్ బరువుకు సమానమైన ఆరు టన్నుల పేలోడ్‌ను 2.5 కి.మీ. ఎత్తు నుంచి జారవిడిచారు. పారాచూట్ వ్యవస్థ సక్రమంగా పనిచేయడంతో పేలోడ్ సురక్షితంగా ల్యాండ్ అయింది. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ), డీఆర్డీవోకు చెందిన ఏరియల్ డెలివరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏడీఆర్డీఈ), ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ క్రియాశీలకంగా వ్యవహరించాయి.

తెరుచుకోవడం ఆలస్యమైతే..?: గగన్‌యాన్ క్రూ మాడ్యూల్ సురక్షిత ల్యాండింగ్ కోసం మొత్తం నాలుగు రకాలైన పది పారాచూట్లు ఉంటాయి. ఇందులో ఉండే మూడు ప్రధాన పారాచూట్లు క్రూ మాడ్యూల్‌ను సురక్షితంగా భూమిపైకి తీసుకురావడంలో కీలకంగా వ్యవహరిస్తాయి. వాస్తవానికి సురక్షిత ల్యాండింగ్‌కు రెండు ప్రధాన పారాచూట్లు సరిపోతాయి. తాజా పరీక్షలో ఇవి రెండూ తెరుచుకోవడం ఆలస్యమైతే మాడ్యూల్ ల్యాండింగ్ వ్యవస్థ ఎలా పని చేస్తోంది, వేగంలో నియంత్రణ ఏ మేరకు ఉందనే అంశాలను పరిశీలించారు.


కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు

స్వచ్ఛతలో విశాఖ పోర్టుకు ప్రథమస్థానం

విశాఖపట్నం (వన్‌టౌన్), న్యూస్‌టుడే: స్వచ్ఛ కార్యక్రమాల్లో విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ) సత్తా చాటింది. దేశంలోని పరిశ్రమల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ముంబయిలో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్ చేతుల మీదుగా పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు స్వచ్ఛ అవార్డు స్వీకరించినట్లు మంగళవారం పోర్టు వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా అంగముత్తు మాట్లాడుతూ... “పోర్టులో పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. కేంద్ర సూచనలతో మొక్కలు నాటించి, సఫాయి మిత్రసురక్ష వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశాం. ఉద్యోగులు, వ్యాపార భాగస్వాములు, పీపీపీ నిర్వాహకులు, కార్మిక సంఘాల నాయకుల సహాయ, సహకారాలతో లక్ష్యాలు సాధిస్తున్నాం..” అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, చీఫ్ ఇంజినీర్ ఎస్ఎస్ఆర్‌సీ మూర్తి, సీఎంఈ రాంప్రసాద్, సీఎంఓ డాక్టర్ ఎస్.ఉషాదేవి పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ట్రావెల్స్ బస్సు దగ్ధం

- ఇంజిన్‌లో మంటలు గమనించి వెంటనే ఆపేసిన డ్రైవర్
- ప్రయాణికులు వెంటవెంటనే దిగడంతో తప్పిన పెను ప్రమాదం.. అందరూ సురక్షితం


పూర్తిగా కాలిపోయిన బస్సు

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్(విద్యుదాఘాతం)తో ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు పూర్తిగా దగ్ధమైన ఘటన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ప్రయాణికులంతా మెలకువగా ఉండటం.. వెంటవెంటనే దిగిపోవడంతో త్రుటిలో పెను ప్రమాదంతప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విహారి ట్రావెల్స్‌కు చెందిన ఎన్ఎల్01 బి3250 నంబరు గల ప్రైవేటు బస్సు సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి ఏపీలోని నెల్లూరు జిల్లా కందుకూరుకు 29 మంది ప్రయాణికులతో బయలుదేరింది. నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారుకు రాగానే అంతర్గతంగా చోటుచేసుకున్న షార్ట్‌సర్క్యూట్‌తో ఇంజిన్లో మంటలు వచ్చాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే బస్సును రోడ్డు పక్కన నిలిపారు. దీంతో ప్రయాణికులంతా వెంటవెంటనే దిగారు. ఐదు నిమిషాల వ్యవధిలోనే బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికుల బ్యాగులు, ఇతర సామగ్రి బస్సులోనే కాలిపోయాయి. ఫైర్ ఇంజిన్‌కి సమాచారం ఇచ్చినా.. అది వచ్చేసరికే బస్సు పూర్తిగా కాలిపోయింది. ప్రమాదానికి పది నిమిషాల ముందే చౌటుప్పల్ శివారులోని ఓ హోటల్ వద్ద టీ తాగేందుకు బస్సు ఆపి బయలుదేరారు. దీంతో ప్రయాణికులంతా మెలకువతో ఉండటంతో వెంటనే దిగగలిగారు. ప్రమాద సమయంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులందరినీ మరో బస్సులో గమ్యస్థానాలకు చేరవేశారు.

తెలుగు రాష్ట్రాల్లో ఉగ్రదాడులకు కుట్ర

సిరాజ్, సమీర్‌పై ఎన్ఐఏ అభియోగాల నమోదు

ఈనాడు-విశాఖపట్నం, న్యూస్‌టుడే-విశాఖ లీగల్: విజయనగరం ఉగ్రవాద కుట్రకేసులో ఈ ఏడాది మే నెలలో అరెస్టయిన విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహమాన్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్‌లు దేశ సమైక్యత, సమగ్రత, భద్రత, మత సామరస్యానికి విఘాతం కలిగించారంటూ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) మంగళవారం విశాఖలోని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానంలో అభియోగపత్రాలు దాఖలు చేసింది. ‘నిందితులు ఐసిస్ భావజాలంతో ప్రేరణ పొందారు. సామాజిక మాధ్యమాలను ఉపయోగించి ఏపీ, తెలంగాణ సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉగ్రదాడులకు రూపకల్పన చేయడం, యువతను తీవ్రవాదం వైపు ఆకర్షించడం తదితర ఉగ్రవాద కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు’ అని వాటిలో పేర్కొంది. యువతను సోషల్ మీడియా వేదికగా ఆకర్షించి స్లీపర్‌సెల్స్‌గా మార్చి, అహిం పేరిట ఉగ్ర కార్యకలాపాలు ప్రారంభించినట్లు, వివిధ సామాజిక మాధ్యమాల్లో రాడికల్ కంటెంట్‌ను వ్యాప్తి చేయడంలో చురుగ్గా పాల్గొన్నట్లు ఎన్ఐఏ కీలక ఆధారాలు సమర్పించింది. బాంబు పేలుళ్లకు విజయనగరంలో సిరాజ్ ఓసారి నమూనా పరీక్షలు చేశాడు. మరోసారి బాంబు పేలుళ్ల పరీక్షలకు సిద్ధమవుతుండగా అప్పట్లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.


ఈనాడు

నిఘా పెంచి వేటాడాలి!

'ఉగ్రవాదం ఏ స్థాయిలో ఉందంటే, తమపై దాడులు జరిగే అవకాశం లేదని ఏ ఒక్కరూ ధీమాగా ఉండటానికి వీల్లేదు' అంటూ పద్దెనిమిదేళ్ల క్రితం ముఖ్యమంత్రుల సదస్సులో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ అసహాయత వ్యక్తపరిచారు. జనవరి 2009లో మరోసారి సీఎంల సమావేశంలో ఆయన మాట్లాడుతూ- సరికొత్త సాంకేతికతలతో అనూహ్యంగా పేట్రేగిపోతున్న ముష్కరమూకలను గుర్తించడం కష్టసాధ్యమవుతోందని వాపోయారు. అప్పట్లో దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లోని జనసమ్మర్ద ప్రాంతాల్లో వరసగా పేలిన బాంబులు ప్రజలను తీవ్ర భయోత్పాతాలకు గురిచేశాయి. ముష్కర మిన్నాగుల కోరలు ఊడబెరకలేని అధికారవర్గాల అసమర్థత మూలంగా ఆనాడు ఎన్నో కుటుంబాలు ఛిద్రమయ్యాయి. పట్టణభారతం కంటిపై కునుకులేకుండా చేసిన ఆ భయంకర ఉగ్రదాడులను తిరిగి జ్ఞప్తికి తెస్తూ సోమవారం సాయంత్రం దిల్లీలో చోటుచేసుకున్న భీకర విస్ఫోటనం యావద్దేశాన్నీ నిర్ఘాంతపరిచింది. దేశ రాజధానికి దగ్గర్లోని ఫరీదాబాద్‌లో 2900 కిలోల పేలుడు పదార్థాలు, ఇతర ఆయుధాలు బయటపడిన గంటల వ్యవధిలోనే ఎర్రకోటకు సమీపంలో మారణహోమం జరగడం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఫరీదాబాద్‌లో పట్టుబడిన ముష్కరులకూ మొన్నటి పేలుడు బాధ్యులకు సంబంధం ఉందన్న కథనాలు- భారతావనిపై కత్తిగట్టిన ప్రతీపశక్తుల కుతంత్రాల తీవ్రతను కళ్లకుకడుతున్నాయి. ఆ కుట్రల మూలాలనే ఇప్పుడు ఛేదించాలి. దిల్లీలో నరమేధం సృష్టించినవారిని చట్టం ముందు నిలబెట్టి తీరతామన్న ప్రధాని మోదీ ప్రతిన మేరకు ఆ కిరాతకులందరినీ దర్యాప్తు సంస్థలు సమష్టిగా వడివడిగా వేటాడాలి!

ఉగ్రవాదాన్ని జాతీయ విధానంగా మార్చుకున్న పాకిస్థాన్- కొన్ని దశాబ్దాలుగా ఇండియాపై ప్రచ్ఛన్న యుద్ధం చేస్తోంది. మతఛాందస భావాలను తలకెక్కించి యువతను నరహంతక ముష్కరులుగా మార్చి, అధునాతన ఆయుధాల వాడకంలో వారికి శిక్షణనిచ్చి భారతావనిపైకి ఎగదోస్తోంది. ఈ నేపథ్యంలోనే గడచిన పాతికేళ్లలో మన దేశంలో 24,495 ఉగ్రవాద సంబంధిత దారుణోదంతాలు నమోదయ్యాయి. వాటిలో 22వేలకు పైగా నిండు జీవితాలు బలయ్యాయి. సరిహద్దుల్లో చొరబాట్లను కట్టడిచేయడంలో మన భద్రతా బలగాలు విజయం సాధిస్తుండటంతో పాక్ ఐఎస్ఐ, దాని ప్రాపకంలోని ముష్కరమూకలు ఇప్పుడు మన వేలితో మన కంట్లోనే పొడిచే కుయుక్తులను పెద్దయెత్తున అమలు చేస్తున్నాయి. అవే ఇప్పుడు జాతీయ భద్రతకు పెనుసవాళ్లు విసురుతున్నాయి!

మతపరమైన విషయాల్లో ఆసక్తి కలిగిన విద్యార్థులు, వైద్యులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వృత్తినిపుణులను రకరకాలుగా ఆకర్షిస్తున్న సీమాంతర టెర్రరిస్టు సంస్థలు- భారతావనిపై వాళ్లకు విద్వేష భావనలను నూరిపోస్తున్నాయి. తక్కువ ఖర్చుతో ఎవరికి వారుగా విధ్వంసాలు సృష్టించే విధంగా ప్రేరేపిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న ఈ చీకటి కార్యకలాపాల ఆనుపానులను ఆరాతీయడం, స్వదేశానికి ద్రోహం తలపెట్టజూసే వ్యక్తులను గుర్తించి తగిన కఠిన దండనలు విధించడం అత్యావశ్యకం! హైదరాబాద్ నుంచి రాయచోటి, ధర్మవరం, విజయనగరం వరకు తెలుగు రాష్ట్రాల్లోనూ ఉగ్రవాద రక్కసి జాడలు తరచూ వెలుగు చూస్తున్నాయి. ప్రతిచోటా విరివిగా దొరికే వివిధ పదార్థాలూ రసాయనాలతో మారణాయుధాల తయారీకి తెగబడుతున్న ప్రబుద్ధుల దుస్సాహసాలు సమాజానికి పెనుముప్పుగా పరిణమిస్తున్నాయి. వాటిని నిరోధించాలంటే- కృత్రిమమేధ సాయంతో సైబర్ భద్రతను, స్థానిక పోలీసు నిఘా వ్యవస్థలను పటిష్ఠ పరచాలి. ఉగ్రవాద భావజాల వ్యాప్తిని అరికట్టే వ్యూహాలనూ పదునుతేల్చాలి!



మనం లేకపోయినా పక్షులు బతుకుతాయి.
కానీ పక్షులు లేకపోతే మనిషికి మనుగడ లేదు.
ఆ సత్యాన్ని అనుక్షణం గుర్తు చేసుకుంటేనే పర్యావరణానికి
హాని కలిగించే పనులు చేయకుండా ఉంటాం.

– సలీం అలీ, పక్షి శాస్త్రవేత్త

మనసే కోవెల

పొరాడే పసిపాపకు తల్లి ఒడే గర్భగుడి. అమ్మే దేవత. వయసు పెరుగుతున్న కొద్దీ ఆ బిడ్డే వివేకవంతుడై తల్లితో పాటు తండ్రి కష్టాన్నీ గుర్తిస్తాడు. తన భవితకు దారి చూపే చుక్కానిగా గురువును నమ్మి జీవిత పరమార్థాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తాడు. తన వికాసానికీ, ఎదుగుదలకూ తోడ్పడిన పంచభూతాత్మకమైన ప్రకృతిని ఆరాధిస్తాడు. ఆ ప్రకృతికి సాకార రూపమైన భగవంతుడు అతడికి అక్కడ చేరువవుతాడు.

విగ్రహారాధనతో ఆ వ్యక్తి తన ఆధ్యాత్మిక ఉన్నతికి ఓనమాలు దిద్దుతాడు. మనసుకు నచ్చినట్లుగా ఆ చిదానంద రూపాన్ని కొలుస్తూ తాపత్రయాల నుంచి విముక్తుడవటానికి ప్రయత్నిస్తాడు. అధిభౌతిక, అధిదైవిక, ఆధ్యాత్మికంగా కనపడే ఈ తాపత్రయాల్లో భౌతిక ప్రపంచం వల్లనో, ప్రకృతి వైపరీత్యాల వల్లనో సగటు మనిషికి ఏర్పడే ఇబ్బందులు మొదటి రెండు. అరిషడ్వర్గాల వల్ల తనకు తాను ఏర్పరచుకున్న ఈతి బాధలు ఆధ్యాత్మిక తాపం కోవకు చెందుతాయి. ఈ తాపమే మనిషిని తన బాధల నుంచి బయట పడే దారులకోసం దేవుణ్ని పూజించటానికి ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. అందుకేనేమో.. కుంతి, నిరంతరం కష్టాలలో మునిగిపోయే వరమివ్వమంటూ అలా కృష్ణ స్వామిని నిరంతరం తలచుకునే భాగ్యశాలిని అవుతానని తలపోసింది.



అంతర్యామి

కలియుగంలో నామస్మరణను మించిన ధన్యోపాయం లేదంటారు. ఆ దేవదేవుణ్ని కృతజ్ఞతా పూర్వకంగా తలచుకుంటే చాలు, వెన్నంటి ఉంటాడని చెబుతున్నాయి పురాణాలు. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధి- అనే అష్టాంగ మార్గం ఆ భగవంతుణ్ని చేరే సోపానక్రమం. వీటిలో కనులారా చూసుకున్న భగవద్రూపాన్ని మనసారా నింపుకోవడం ధ్యానానికి సంబంధించిందైతే, ఆ భగవానుడికి తమ స్థాయిభేదాలతో సంబంధం లేకుండా హృదయంలో అర్చన చేసుకోగలగడం ధారణకు చెందుతుంది. మనసును పరమాత్మపై లగ్నం చేసి, మనసులోనే ఆ కొండంత మూర్తికి చేసుకోగలిగే పూజే మానసిక పూజ.

బంగారు బిందెలతో ఆకాశగంగను తెచ్చి అభిషేకించినా, గంగలోని చేపకప్పల్/ ఎంగిలంటున్నాయంటూ వెతలు వెళ్లబోసుకున్నా అది మానసిక పూజకే చెల్లుతుంది. ఈ విధానం మన మనసును ఆ నిరాకారునికి నిజంగా చేరువ చేయగలదు. సర్వకాలాల్లో సంతోష చిత్తంతో, ఏకాగ్రతతో భగవదర్పితమైన మనసు కలిగినవాడు తనకు అత్యంత ప్రియమైన భక్తుడన్నది సాక్షాత్తు శ్రీకృష్ణుడి వచనం. అందుకే బాహ్యాడంబరాలు లేని ప్రశాంత చిత్తంతో భగవద్రూపాన్ని ధారణ చేయడానికి సాధన చేయాలన్నది శంకరుల ఉద్బోధ.


తత్వమసి, సోహం, అహం బ్రహ్మాస్మి వంటి అద్భుత ఉపనిషద్ వాక్యాలను పరిచయం చేసే మార్గమే మానసిక పూజ. జీవాత్మ పరమాత్మల నడుమ గల అద్వైత భావనలకు బలం చేకూరుస్తుందిది. 'ఆత్మవత్ సర్వభూతాని' అంటూ తన లోపల గల దైవాన్ని సమస్త ప్రపంచంలో చూస్తూ ఆధ్యాత్మిక శాంతిని పొందడంలో చేయూతనివ్వగలదు. ఆధ్యాత్మిక చింతన అనేది ఎవరికి వారే ఎన్నుకుని ఆ మార్గంలో పయనించే ప్రక్రియ. నదీనాం సాగరో గతిః అన్న చందాన, మార్గం ఏదైనా భగవానుడిపై సంపూర్ణ విశ్వాసంతో చేసే ఏ సత్కార్యమైనా పూజే కాగలదు కదా!

– ప్రాణంది అపర్ణ

అందరికీ న్యాయసేవలు... అందేదెప్పుడో!

నిస్సహాయులకు న్యాయాన్ని చేరువ చేసేందుకు ఉద్దేశించిన న్యాయసేవా ప్రాధికార సంస్థలు పూర్తిస్థాయిలో పనిచేయలేకపోతున్నాయి. వీటిని బలోపేతం చేయడం అత్యావశ్యకం. 'న్యాయం ఏ కొందరికో పరిమితమయ్యే ప్రత్యేక గౌరవం కాదు. ఇది అందరి హక్కు. న్యాయ వెలుగులు చివరి వ్యక్తి వరకూ చేరేలా చూడటం జడ్జిలూ న్యాయవాదుల ధర్మం' అన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ తాజా వ్యాఖ్యలు సర్వదా అనుసరణీయం.

భారత రాజ్యాంగంలోని 14వ అధికరణ పేర్కొన్న 'సమానత్వ హక్కు', 39ఏ అధికరణ నిర్దేశించిన 'అందరికీ సమాన అవకాశాలు' స్ఫూర్తితో నిస్సహాయులకు న్యాయవితరణ చేయడం ప్రభుత్వాల కర్తవ్యం. ఆ మేరకు రూపుదిద్దుకున్న న్యాయసేవా ప్రాధికార చట్టం-1987 కింద పేదలు, అణగారిన వర్గాలు, మహిళలకు న్యాయ సహాయం అందించేందుకు జాతీయ న్యాయసేవల అథారిటీ (నాల్సా) ఏర్పడింది. దీనికింద రాష్ట్ర, జిల్లా స్థాయుల్లోని న్యాయసేవా అథారిటీలు పనిచేస్తున్నాయి. జైళ్లలో మగ్గుతున్న విచారణ ఖైదీలకు సైతం ఉచిత న్యాయ సహాయం అందించడంలో ఇవి నిమగ్నమయ్యాయి. నల్సా గణాంకాల ప్రకారం, 2019లో సుమారు 12లక్షల మంది న్యాయవితరణ పొందగా, 2024 మార్చి నాటికి ఆ సంఖ్య 15.5లక్షలకు చేరింది. ఈ క్రతువులో న్యాయసేవా, న్యాయ బంధువకీళ్లు... పారా లీగల్ వాలంటీర్లతో పాటు ప్రత్యేక లోక్‌అదాలత్, సత్వర న్యాయవితరణ వంటి వ్యవస్థల కృషి ఎంతో ఉంది.



నిధులు ఒక్క శాతంలోపే!

న్యాయ వితరణ కోసం రాష్ట్రాలు కొంత నిధులు కేటాయిస్తే, కేంద్రం ఈ కోర్టులకూ, ఇతరత్రా ప్రత్యేక కార్యక్రమాలకూ బడ్జెట్లు ప్రత్యేకించిందని ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025 పేర్కొంది. అయితే, 2022-23లో ఏ రాష్ట్రమూ తన పద్దులో ఒక్క శాతం కంటే ఎక్కువ నిధులను న్యాయవ్యవస్థ కోసం ఖర్చు చేయలేదు. కేంద్ర ప్రభుత్వ వ్యయమైతే 0.59శాతాన్ని మించలేదు. అత్యధికంగా పంజాబ్ సర్కారు తన బడ్జెట్‌లో 0.88శాతాన్ని వ్యయం చేస్తే, అరుణాచల్‌ప్రదేశ్ అత్యల్పంగా 0.17శాతమే వెచ్చించడాన్ని ఇక్కడ గమనించాలి. వాస్తవానికి 2015 నుంచి న్యాయ వితరణను మరింతగా ప్రజలకు చేరువ చేయడానికి కేంద్ర, రాష్ట్ర స్థాయుల్లో అనేక ప్రయత్నాలైతే జరుగుతున్నాయి. వాణిజ్య కోర్టుల మీద పని భారం తగ్గించడానికి సంబంధిత చట్టానికి సవరణలు చేపట్టి- కేసు దాఖలు చేయడానికి ముందే కక్షిదారులు మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకోవడానికి వీలు కల్పించారు. ఉచిత న్యాయ సహాయానికి ప్రాచుర్యం కల్పించడానికి కేంద్ర న్యాయశాఖ లా కాలేజీల్లో 'ప్రో బోనో క్లబ్'లను ఏర్పాటు చేస్తోంది. ఇందుకు న్యాయవాదుల సాయం తీసుకుంటోంది. అయినప్పటికీ, న్యాయ సేవల్లో లోపాలు లేకపోలేదని ఇండియా జస్టిస్ రిపోర్టు ఏకరువుపెట్టింది.

- దేశంలోని కారాగారాలు ఖైదీలతో కిటకిటలాడిపోతున్నాయి. సామర్థ్యాన్ని మించి 130శాతం ఆక్యుపెన్సీతో అవి నిండిపోయి ఉంటున్నాయి. ఖైదీల్లో 77శాతం మంది విచారణను ఎదుర్కొంటున్నవారే. అంటే, నేరం చేశారా లేదా అన్నది ఇంకా నిర్ధారణ కానివారే. ఉచిత న్యాయసేవ, న్యాయసేవా ప్రాధికార సంస్థలు కృషి చేస్తున్నా- మూడు కోట్లకు పైగా క్రిమినల్ కేసుల్లో తీర్పులు రాక జైళ్లలో మగ్గుతున్నవారు పెద్దసంఖ్యలో ఉండటం బాధాకరం.
- దేశవ్యాప్తంగా చూస్తే చండీగఢ్ కోర్టులు మాత్రమే పూర్తిస్థాయి న్యాయమూర్తులతో పనిచేస్తున్నాయి. మిగతా రాష్ట్రాల్లో చాలామటుకు న్యాయమూర్తుల పదవులు ఖాళీగానే ఉన్నాయి.
- మరోవైపు, న్యాయసేవల క్లినిక్‌ల సంఖ్య కూడా క్షీణించింది. 2017-18లో మొత్తం 14,161 క్లినిక్‌లు ఒక్కొక్కటి సగటున 42 గ్రామాలకు సేవలు అందించేవి. అయితే, నిరుడు మార్చి నాటికి అవి 3,659కి పడిపోయాయి. దాంతో కేసుల భారం పెరిగి ఒక్కో క్లినిక్ 163 గ్రామాలకు సేవలు అందించాల్సి వస్తోంది.
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మహిళా పోలీసు అధికారులు నిర్దేశిత సంఖ్యలో లేరు. ఈ కొరత సమస్యను మరింత పెంచుతోంది.
- రాష్ట్ర మానవ హక్కుల కమిషన్లు అన్నింటిలో కలిపి మొన్న పంద్రాగస్టు నాటికి 35,120 కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. గడచిన అయిదేళ్లలో కమిషన్లు సగటున 88,471 కేసులు పరిష్కరించాయి. కానీ, ఈ కమిషన్లు 44శాతం సిబ్బంది లేమితో ఇబ్బంది పడుతున్నాయి.
- చిన్న కేసుల విషయంలో పోలీస్‌స్టేషన్ స్థాయిలోనే బెయిల్ మంజూరు చేయకపోవడం న్యాయవ్యవస్థకు పెద్ద సవాలుగా మారుతోంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 320(1) ప్రకారం, కోర్టు అనుమతి లేకుండానే కక్షిదారులు రాజీపడేందుకు అవకాశముంది. కానీ, పోలీసులకు సరైన అవగాహన, శిక్షణ లేకపోవడం వల్ల చిన్నపాటి కేసులు సైతం కోర్టుల వరకు వెళ్తున్నాయి.
- లోక్ అదాలత్‌లు, కుటుంబ న్యాయస్థానాల్లో కేసులు వాదించుకోవడానికి న్యాయవాదులే అక్కర్లేదు. దీనిపై ప్రజల్లో అవగాహన కొరవడింది. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార పద్ధతుల గురించి కక్షిదారులకు వివరించకుండా వారిని కోర్టుల వెంట తిప్పడం పరిపాటిగా మారింది.

ఖాళీలను భర్తీ చేస్తేనే...

అనేక సమస్యలు ముసురుకున్న న్యాయసేవా వ్యవస్థలు గాడిన పడాలంటే కేంద్రం, రాష్ట్రాలు వీటికి అవసరమైనన్ని నిధులను సకాలంలో విడుదల చేయాలి. ప్రత్యేక డ్రైవ్ ద్వారా దిగువస్థాయి నుంచి అన్ని న్యాయస్థానాల్లోనూ సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలి. ప్రత్యామ్నాయ వివాద పరిష్కారంలో స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేయడంతో పాటు ఈ పద్ధతులను ప్రోత్సహించేందుకు అవగాహన సదస్సులు నిర్వహించాలి. న్యాయసేవా ప్రాధికార సంస్థల్లో పనిచేస్తున్న వకీళ్లకు సరైన ప్రోత్సాహకాలు ఉండటం లేదు. కేసుకు ఇంత అని ఎప్పుడో ఏడాదికి ఒకసారి ఇవ్వడం కాకుండా, నెల జీతం మీద న్యాయవాదులను నియమించుకోవాలి. విచారణ ఖైదీల కోసం 'ప్రో బోనో' సాయాన్ని వేగవంతం చేయాలి. లీగల్-ఎయిడ్ క్లినిక్‌లను, గ్రామ న్యాయస్థానాల వ్యవస్థలను పునర్వ్యవస్థీకరించాలి. వీటితో పాటు కేటాయించిన నిధులు సక్రమంగా ఉపయోగపడేలా చూడటం అత్యావశ్యకం. అప్పుడే పేదల కోసం ఏర్పడ్డ న్యాయసేవా సంస్థలు మరింత మెరుగ్గా పనిచేయగలుగుతాయి.



డాక్టర్ పి.మాధవరావు
ఐక్యరాజ్య సమితి మాజీ సీనియర్ సలహాదారు



చెప్పే పద్ధతి తెలియాలి!

'బిఫోర్ అంటే ముందు, ఆఫ్టర్ అంటే తరవాత. ఇప్పుడు చెప్పు చింటూ... 47 తరవాత ఏమొస్తుంది?' అంటూ యూకేజీ చదువుతున్న పిల్లాడితో హోంవర్క్ చేయిస్తున్నాడు నాన్న. '48' అన్నాడు చింటూ. 'వెరీ గుడ్... మరి 48కి బిఫోర్ అంటే, ముందు ఏమొస్తుంది?' అడిగాడు నాన్న. తెల్ల మొహం వేశాడు చింటూ. ఓపిక నశించిన నాన్న, 'వారం నుంచి చెబుతున్నా, అయినా రావట్లేదా?' అంటూ కసురుకున్నాడు. చింటూ ఏడ్చేశాడు. కోపాన్ని తమాయించుకుని, 'ఏడవకు. నీకు అర్థమయ్యేలా మళ్లీ చెబుతాలే. కాసేపు ఆడుకో' అంటూ వాణ్ని దగ్గరికి తీసుకుని సముదాయించాడు. చింటూ స్నేహితులతో ఆడుకోవడానికి వెళ్లాడు.

అసలు చింటూకి ఏమైంది? ఇదేమీ కష్టమైన కాన్సెప్ట్ కాదే? ఇదే అర్థం చేసుకోలేకపోతే, పెద్దయ్యేకొద్దీ లెక్కల్లో ఇంకా క్లిష్టమైన విషయాలు వస్తాయి. వాటినెలా అర్థం చేసుకోగలుగుతాడు? అన్న ఆలోచన నాన్నలో ఆందోళన పెంచింది. కాసేపు స్థిమితంగా కూర్చుని- నాకది చిన్న లెక్కలా అనిపించినా, వాడి స్థాయికి పెద్దదే. అర్థం కావట్లేదంటే... ఎక్కడో తికమక పడుతున్నాడు. అదేంటో తెలిస్తే అర్థమయ్యేలా చెప్పొచ్చు... అనుకుంటూ చింటూ లెక్కల నోట్‌బుక్ తెరిచాడు. అందులో ఒకటి నుంచి వంద వరకు అంకెలను నిలువు వరసల్లో ఒక్కో వరసలో పది చొప్పున రాయించారు. అది చూశాక, సమస్య ఏంటో నాన్నకు అర్థమైంది.

పై నుంచి కిందికి వరసలో రాసినప్పుడు, ఒక అంకెకి పైన- కింద ఉంటాయి కానీ ముందు- వెనక ఉండవు. అందుకే అర్థం చేసుకోలేకపోతున్నాడనిపించింది నాన్నకి. చింటూ ఆట నుంచి వచ్చేలోగా ఒక చార్ట్ మీద వంద వరకు నంబర్స్ అడ్డంగా పది వరుసల్లో రాసి గోడకి అంటించాడు. చింటూ రాగానే అది చూపిస్తూ ఒక నంబర్‌కి ముందు, తరవాత ఉండే నంబర్స్ చెప్పడం ఎలాగో నేర్పించాడు. అప్పుడు చింటూ తేలిగ్గా చెప్పగలిగాడు. ఇలా వరసగా రెండు రోజులు చేసేసరికి మూడో రోజు చార్టు అవసరం లేకుండానే చింటూ ఏదడిగినా చకచకా చెప్పేశాడు. అలాగే 18, 23లో ఏది పెద్ద అంకె అని పిల్లలకి చెప్పేటప్పుడు 18 తరవాత 23 వస్తుంది కాబట్టి అదే పెద్దది అంటే పిల్లలకు ఒకపట్టాన అర్థమవదు. అదే 'కుడి చేతిలో 18 చాక్లెట్లు ఉన్నాయి. ఎడమ చేతిలో 23 ఉన్నాయి. ఏ చేతిలో ఎక్కువ చాక్లెట్లు ఉన్నాయి?' అని అడగండి, టక్కున చెబుతారు. ప్రీ ప్రైమరీ స్థాయి పిల్లలకు ప్రతి సబ్జెక్టూ ఆటలాగా నేర్పిస్తే త్వరగా అర్థమవుతుంది. పెద్దలు సాధారణంగా చేసే పొరపాటు- తమకు తెలిసిన పద్ధతిలోనే చెప్పి పిల్లలు అర్థం చేసుకోకపోతే వారికా శక్తి లేదనే నిర్ణయానికి రావడం. అలా కాకుండా వాళ్లెక్కడ కన్‌ఫ్యూజ్ అవుతున్నారో కనిపెట్టి దాని ప్రకారం మనం చెప్పే పద్ధతి మార్చుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

– రవితేజ బొప్పూడి

అప్పుల కుప్పలు

కిందటి సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది జీడీపీలో ప్రపంచ దేశాల రుణ భారం 92.4 శాతం నుంచి 94.7 శాతానికి పెరిగింది. ఈ ఏడాది ఇండియా జీడీపీలో అప్పు 81శాతానికి చేరింది. చైనాలో అది 96శాతమైతే, పాకిస్థాన్‌లో 72, రష్యా 23శాతం. మకావు ప్రభుత్వ రుణం సున్నా శాతంగా తేలింది! పలు దేశాల అప్పు జీడీపీలో వందశాతాన్ని మించిపోయింది. ఆయా దేశాలు, వాటి అప్పు-జీడీపీ నిష్పత్తి... (శాతాల్లో)

జపాన్	230
సూడాన్	222
సింగపూర్	176
వెనెజువెలా	164
గ్రీస్	147
ఇటలీ	137
మొజాంబిక్	131
సెనెగల్	123
అమెరికా	125
ఫ్రాన్స్	117
జాంబియా	115
కెనడా	114
ఉక్రెయిన్	109
భూటాన్	106
యూకే	103
శ్రీలంక	101

(ఆధారం: ఐఎంఎఫ్)

స్టేబుల్ కాయిన్లతో అమెరికా కొత్తాట!

అమెరికా కాంగ్రెస్(పార్లమెంటు) ఇటీవల ఆమోదించిన జీనియస్ చట్టం ఆ దేశ డాలర్లను ప్రభుత్వాలతో పాటు వ్యక్తులు కూడా స్టేబుల్ కాయిన్ రూపంలో కొనడానికి వీలు కల్పిస్తోంది. తద్వారా క్రిప్టో మార్కెట్‌పై అమెరికా పట్టు పెరుగుతుంది. స్టేబుల్ కాయిన్ కూడా ఒక తరహా క్రిప్టో కరెన్సీ అయినప్పటికీ దాని విలువ డాలర్ వంటి అధికార కరెన్సీలతో, బంగారంతో ముడిపడి ఉంటుంది. వాటిపై ఆర్‌బీఐ వంటి కేంద్ర బ్యాంకుల అజమాయిషీ ఉంటుంది.

తొమ్మిది ఐరోపా దేశాల బ్యాంకులతోపాటు అమెరికాకు చెందిన సిటీ బ్యాంకు కూడా యూరోల మీద ఆధారపడిన స్టేబుల్ కాయిన్లను తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో క్రిప్టో కరెన్సీలను మొదటి నుంచీ గట్టిగా వ్యతిరేకిస్తూ వచ్చిన భారతదేశం ఇప్పుడు పునరాలోచనలో పడినట్లు కనిపిస్తోంది. స్టేబుల్ కాయిన్లలో లావాదేవీలకు సిద్ధంగా ఉండాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల సూచించడమే ఇందుకు నిదర్శనం. బిట్‌కాయిన్, ఎథీరియం వంటి ప్రైవేట్ క్రిప్టోకరెన్సీలపై అధికారిక నియంత్రణ ఉండదు. అందుకే రిజర్వు బ్యాంకు(ఆర్బీఐ) క్రిప్టోలను గట్టిగా వ్యతిరేకించింది. కానీ కోర్టులు ఆ అభ్యంతరాలను తోసిపుచ్చాయి. దాంతో కేంద్రం క్రిప్టోలను చట్టబద్ధం చేయకుండా, వాటి ద్వారా లభించే మూలధన లాభాలపై 30 శాతం పన్నుకు తోడు ఒక శాతం టీడీఎస్ విధిస్తోంది. క్రిప్టోలను పూర్తిగా నిషేధించి, వాటికి ప్రత్యామ్నాయంగా కేంద్ర బ్యాంకు డిజిటల్ కరెన్సీ(సీబీడీసీ)ని, అంటే డిజిటల్ రూపాయిని తీసుకురావడానికి ఆర్బీఐ 2022లో పైలట్ ప్రాజెక్టును ప్రారంభించింది. మొన్న అక్టోబరు నుంచి సీబీడీసీ ఆధారంగా డిపాజిట్ టోకనైజేషన్ పైలట్ ప్రాజెక్టును కూడా చేపట్టింది. దీనికింద బ్యాంకు డిపాజిట్లు, షేర్లు, బాండ్లను బ్లాక్‌చెయిన్‌పై డిజిటల్ రూపంలోకి మార్చి సులభంగా బదిలీ చేయవచ్చు, చెల్లింపులు జరపవచ్చు. ఇలా సొంత డిజిటల్ రూపాయి కోసం చర్యలు తీసుకుంటున్న ఇండియా- ఉన్నట్టుండి స్టేబుల్ కాయిన్‌పై సానుకూలత వ్యక్తం చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. స్టేబుల్ కాయిన్లపై అమెరికా తాజా విధానమే భారత వైఖరిలో మార్పునకు కారణంగా తెలుస్తోంది.



రుణభారంపై ట్రంప్ వ్యూహం

అమెరికా సర్కారు సొంత ప్రజల నుంచీ... బీమా, పింఛన్ నిధులు, కంపెనీలు, స్థానిక రాష్ట్రాలతోపాటు ఇతర దేశాల నుంచీ బాండ్ల రూపంలో రుణాలు సేకరిస్తోంది. ఆ అప్పులు 37లక్షల కోట్ల డాలర్ల దాకా పేరుకుపోయాయి. వీటికి ఏటా లక్ష కోట్ల డాలర్ల మేర వడ్డీ అవుతోంది. అమెరికా సర్కారు ఇంత బాకీని చెల్లించగలదా అని వ్యక్తమవుతున్న అనుమానం డాలర్ విలువను క్షీణింపజేస్తోంది. దాంతో డాలర్‌కు బదులు కేంద్ర బ్యాంకులు, కార్పొరేట్లు... వ్యక్తిగత, సంస్థాగత మదుపరులు బంగారాన్ని కొంటున్నారు. గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్లలో వాటాలనూ కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా ప్రపంచమంతటా బంగారం ధరలు పెరిగిపోతున్నాయి. ఈ స్థితిలో అమెరికాకు ఆదాయం పెంచడానికి ట్రంప్ అన్ని దేశాలపైనా ఎడాపెడా సుంకాలు బాదేస్తున్నారు. మరోవైపు, స్టేబుల్ కాయిన్‌నూ తీసుకొచ్చారు. ప్రపంచంలో ఎవరైనాసరే బ్యాంకు ఖాతా లేకుండానే పబ్లిక్ బ్లాక్ చెయిన్ ద్వారా డాలర్లను కొనడానికీ, నిల్వ చేసుకోవడానికీ, అమ్మడానికీ స్టేబుల్ కాయిన్లు వీలు కల్పిస్తాయి. నేడు 99.8శాతం స్టేబుల్ కాయిన్ మార్కెట్ డాలర్ల ఆధారంగానే నడుస్తోంది. ఈ మార్కెట్ ప్రస్తుత విలువ 30వేల కోట్ల డాలర్లు పైనే అని అంచనా. నేడు దేశదేశాల్లో బ్యాంకు డిపాజిట్ల రూపంలో ఉన్న నగదు 117లక్షల కోట్ల డాలర్లు. అందులో వ్యక్తిగత డిపాజిట్లు 67లక్షల కోట్ల డాలర్లు. ఈ సొమ్మును స్టేబుల్ కాయిన్ల రూపంలో అమెరికా ఒడిసిపడితే ఆర్థిక సమస్యలకు పరిష్కారం దొరికినట్లే. ఆ ఉద్దేశంతోనే ప్రజలు స్టేబుల్ కాయిన్లను నేరుగా కొనుగోలు చేసే వెసులుబాటు కల్పించాలని అమెరికా భావిస్తోంది.

ఎందుకైనా మంచిదని...


అంతర్జాతీయ రిజర్వు కరెన్సీగా డాలర్ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి స్టేబుల్ కాయిన్ పనికొస్తుందన్నది అమెరికా యోచన. పైగా విదేశీయులు వీటి ద్వారా అమెరికా ప్రభుత్వ బాండ్లను కొనగలిగితే వాటికి కొత్త గిరాకీ వస్తుందని ఆ దేశ ఆర్థికమంత్రి బెసెంట్ లోగడ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ బ్యాంకు డిపాజిట్లలోని సొమ్ము స్టేబుల్ కాయిన్ల రూపంలో దేశాలు దాటితే అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో విస్తృత మార్పులు వస్తాయి. అందుకే ఈ రంగంలోకి ప్రైవేట్ సంస్థలూ దూకేశాయి. ట్రంప్ కుటుంబానికి చెందిన వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్ సంస్థ డాలర్ ఆధారిత స్టేబుల్ కాయిన్‌ను విడుదల చేసింది. పాకిస్థాన్ క్రిప్టో కౌన్సిల్‌తోనూ ఒప్పందం కుదుర్చుకుంది. ట్రంప్ అమెరికా రుణ భారాన్ని స్టేబుల్ కాయిన్లలోకి మార్చి, వాటి విలువను అమాంతం పెంచేసి ఆ క్రిప్టో కరెన్సీతోనే పాత బాకీలను చెల్లించేయాలనే పథకం పన్నుతున్నారని రష్యా అధినేత పుతిన్ సలహాదారుడైన ఆంటాన్ కొబ్యకోవ్ ఇటీవల ఆరోపించారు. అదంతా ఊహాగానమని కొట్టిపారేసేవారూ ఉన్నారు. ఏ పుట్టలో ఏ పాముందో తెలియదు కాబట్టి ఇష్టమున్నా లేకున్నా స్టేబుల్ కాయిన్లతో వ్యవహరించడానికి భారత్ సిద్ధంగా ఉండాలన్నది నిర్మలా సీతారామన్ సూచన!

– ఏవీవీ ప్రసాద్

చెప్పుడు మాటలు..!

ఒక అడవిలో ఎలుక, పిచ్చుక, కప్ప స్నేహంగా ఒకేచోట కలిసి జీవించేవి. పిచ్చుక ఎగురుతూ వెళ్లి ఎండిన కొమ్మలూ ఆకులూ ఏరి తెచ్చేది. కప్ప నీటిని మోసుకొచ్చేది. ఎలుక ఇంట్లోనే ఉండి వంట చేసి పెట్టేది. మూడూ సంతోషంగా ఉంటున్నాయి. ఒకరోజు పుల్లలకోసం వెళ్లిన పిచ్చుకకి మరో పక్షి పరిచయమైంది. తాను తన ఫ్రెండ్స్‌తో ఎంత సంతోషంగా ఉంటోందో చెప్పింది పిచ్చుక.

'నువ్వు అమాయకురాలివి.. పిచ్చి మొహానివి. అవి రెండూ ఇల్లు కదలకుండా నీచేత పనంతా చేయిస్తున్నాయి. అది నీకు అర్థంకావట్లేదు' అంది కొత్త పక్షి. 'ఇది చెప్పేది నిజమే కదా' అనుకుని ఆలోచనలో పడింది పిచ్చుక. దాంతో ఇంటికొచ్చాక తాను రోజూ చాలా అలసిపోతున్నాననీ పనులు మార్చుకుందామనీ చెప్పింది. సరేనని దానికి వంటపని అప్పజెప్పి ఎలుక, కప్ప.. పుల్లలు, నీళ్లు తీసుకురావడానికి వెళ్లాయి. పిచ్చుక పొయ్యి వెలిగించింది కానీ దానికి వంట ఎలా చేయాలో తెలియట్లేదు. ఇంతలో మంట ఎగసి పక్కనే ఉన్న ఎండుపుల్లలన్నీ అంటుకున్నాయి. భయంతో పిచ్చుక బయటికి వచ్చేసింది. ఎలుకా కప్పా వచ్చేసరికి మొత్తం ఇల్లంతా కాలి బూడిదైంది. పిచ్చుకతో కలిసి బతకడం ఇక సాధ్యం కాదని భావించిన అవి రెండూ వెళ్లి విడిగా ఉంటున్నాయి. ఇక పిచ్చుక ఒంటరిగా మిగిలిపోయింది. చెప్పుడు మాటలు నమ్మకూడదని ఇప్పుడు దానికి అర్థమైంది. 'ఎవరో చెప్పిన మాటలు విని నా మిత్రులను నేనే దూరం చేసుకున్నాను. అప్పుడే వినకుండా ఉండాల్సింది. ఎంచక్కా ఇప్పుడు వాళ్లతో కలిసి ఉండేదాన్ని' అని బాధపడింది. కానీ చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం లాభం? ఇక అప్పటి నుంచి తన స్నేహితులతో సంతోషంగా గడిపిన రోజులు తలచుకుని బాధపడుతూ ఉండిపోయింది. ★



హాయ్! బుజ్జీ!!

పదాలేవి?

ఇక్కడ కొన్ని పదాలు అసంపూర్తిగా ఉన్నాయి. మొదటిపదం చివరి అక్షరాలతోనే రెండోది మొదలవుతుంది. ఓసారి ప్రయత్నించండి.

1. FO☐☐☐TOM
2. DEP☐☐OUGHT
3. P☐☐☐GUAGE
4. CONT☐☐☐E
5. C☐☐☐☐ER
6. CO☐☐☐SION

జవాబు: 1.FOCUS, CUSTOM 2.DEPTH, THOUGHT 3.PLAN, LANGUAGE 4.CONTROL, ROLE 5.CLOCK, LOCKER 6.COVER, VERSION

చదువుల తల్లికి చిరుకానుక!



ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి.. బస్‌పాస్, రూట్‌పాస్, రెన్యువల్ అని నెలకు రూ. వందల్లో ఖర్చుచేసే విద్యార్థినులకు... కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన స్త్రీ శక్తి పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంది. అక్షర కోవెలలకు వచ్చీ వెళ్లే తరుణంలో సిటీ, మెట్రో, ఎక్స్‌ప్రెస్.. తేడా లేకుండా ఏది వస్తే అది ఎక్కి ఉచితంగా ప్రయాణించి గమ్యానికి చేరుతున్నారు. 'అమ్మాయి చదువు ఇంటికి వెలుగు' అనేలా పూర్తిగా చదువుపైనే ధ్యాస ఉంచి ప్రయాణం, ఖర్చులనే జంజాటం లేకుండా సాఫీగా సాగిపోతున్నారు. - **ఈనాడు, అమరావతి**

ఈనాడు అమరావతి
ఎన్టీఆర్

చితికిన మోములు.. చెదిరిన ఆశలు..!



- నిశీధిలో ఉసురు తీసిన అతివేగం
- నాలుగు కుటుంబాల్లో తీరని శోకం

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం- న్యూస్‌టుడే ఉయ్యూరు, గ్రామీణం, విజయవాడ సిటీ

"చదువుల్లో చలాకీ ఒకరు.. ఉద్యోగాల్లో కుదురుకున్న ఇద్దరు.. బాల్యం నుంచి స్నేహం వారిని కలిపింది.. ఆటలైనా, పాటలైనా, ఆనందమైనా అన్నీ కలిసే...అమ్మానాన్నలకు చేదోడు మరొకరు.. ఎదిగొచ్చిన బిడ్డలను చూసి అమ్మానాన్నలూ, ఆప్తులూ మురిసేవారు..."

"సోమవారం రాత్రి.. అప్పటి వరకు అందరూ ఆనందంగా గడిపారు.. ఎప్పటిలాగే పిల్లలు స్నేహితులతో కలిసి బయటకు వెళ్లారు.. తిరిగొస్తారనే నమ్మకంతో.. అలా కన్నవారు కునుకు తీశారు. ఇంత లోనే మీ బిడ్డలు ఇక లేరనే వార్తతో.. ఉన్నఫళంగా పరుగులు తీశారు"

"అపురూపంగా పెంచుకున్న బిడ్డల శరీరాలు ఛిద్రమైన వేళ... కన్నోళ్ల గుండెలు పగిలాయి. కలలు కల్లలుగా మారిన వేళ.. ప్రతి కన్నూ సంద్రమైంది. ఆశలన్నీ నీ పైనే బిడ్డా.. ఒక్కసారి లేవండి కన్నా... అని తల్లిదండ్రులు కుమిలిన తరుణాన ప్రతి హృదయం బరువెక్కింది. పాతికేళ్లు కూడా నిండని బిడ్డలు మరి లేరని తెలిసి బంధువులు, ఆప్తుల రోదనలు మిన్నంటాయి."



ఉయ్యూరు సీహెచ్‌సీలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్



విజయవాడ-బందరు జాతీయ రహదారిపై గండిగుంట వద్ద సోమవారం అర్ధరాత్రి దాటాక వేగంగా దూసుకొచ్చిన కారు పల్టీ కొట్టిన ప్రమాదం నాలుగు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఉయ్యూరు సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద కన్నవారు.. బంధువుల రోదనలతో తీవ్ర విషాదం నెలకొనగా.. ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మృతదేహాల్ని పరిశీలించి తల్లిదండ్రులను పరామర్శించారు.

మృత్యువులోనూ స్నేహితులతోనే..

1 మొగ్రాజపురం బందలదొడ్డి ప్రాంత వాసి గొలపూడి పాపారావు చిన్నకొడుకు. తండ్రి శివయ్య ట్రాక్టర్ డ్రైవరు. ఎప్పుడూ స్నేహితులతోనే కలిసి ఉండే పాపారావు.. దుర్ఘటన వేళ వారితోనే ప్రాణాలు విడిచాడు. కుటుంబానికి అండగా ఉండే.. అందొచ్చిన కొడుకు దూరమవ్వడంతో కుటుంబం శోక సంద్రంలో మునిగింది.

చదువులో చురుకు...

2 మొగ్రాజపురం బందలదొడ్డి సమీపంలో ఉండే దస్తావేజు లేఖరి దాట్లగడ్డ చక్రపాణి కుమారుడు రాకేశ్.. డిగ్రీ ఫైనలియర్ చదువుతూ తండ్రికి అన్ని పనుల్లో సహాయపడేవాడు. రాకేశ్ ఇకలేరని తల్లిదండ్రులు స్పృహ్య, చక్రపాణిలు గుండెలు పగిలేలా విలపించారు.

పెళ్లి చేసుకునే తరుణంలో..

3 విజయవాడ గిరిపురంవాసి ఈట్ ప్రిన్స్ ఓ ప్రైవేటు వైద్యశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తూ.. అందరితో సరదాగా ఉండేవాడు. ఇద్దరు చెల్లెళ్ల వివాహం చేశారు. ప్రిన్స్‌కు పెళ్లి చేసే తరుణంలో సంబంధాలు చూస్తుండగా.. ఆ దిని మృత్యువు కబళించింది. తమ చెల్లెళ్లకు ఎంతో బాధ్యత వహించిన అన్న ఇక లేడని ఆ చెల్లెళ్ల రోదన చూపరులను కంటతడి పెట్టించింది. తండ్రి రమేష్‌బాబు, తల్లి రత్నశ్రీ రోదనలు ఆపడం ఎవరి తరం కాలేదు. అప్పటి వరకు అందరితో కలివిడిగా ఉండే యువకుడు ఇక లేడని తెలిసి బంధువులు, స్నేహితులు విలపించారు.

ఎదిగొచ్చిన బిడ్డ ఎళ్లిపోయాడే..

4 కంకిపాడు మండలం కుందేరు గ్రామానికి చెందిన కొంతం చింతయ్య పది తరగతితో ఆపేసి కౌలుకు సాగు చేసే తండ్రి బాలకృష్ణకు చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. సోమవారం అర్ధరాత్రి విజయవాడ నుంచి కారులో వచ్చిన సమీప బంధువు పాపారావు చింతయ్యను ఎక్కించుకెళ్లారు. అప్పటి వరకు ప్రశాంతంగా నిద్రపోతున్న కుమారుడు బయటకు వెళ్లిన అరగంటలోనే మృత్యువు కబళించిందనే వార్త తల్లిదండ్రులకు తెలియగానే కన్నీటి పర్యంతమయ్యారు. ఎంతో సహాయకారిగా ఉండే బిడ్డ లేడని తల్లిదండ్రులు రామలక్ష్మి, బాలకృష్ణ గుండెలవిసేలా విలపించారు.

పుట్టెడు దుఃఖం



కదిపితే కన్నీటి వరదే..

నిర్మాణ లోపం.. నిర్లక్ష్య శాపం



బెజవాడ-బందరు దారిపై రుధిర ధారలు

2025 (జనవరి- అక్టోబరు)

	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
పెనమలూరు	46	22	28
కంకిపాడు (రూరల్)	18	9	12
ఉయ్యూరు	14	8	11
ఉయ్యూరు గ్రామీణం	7	5	8
పమిడిముక్కల	12	11	13
పామర్రు	19	10	19
కూచిపూడి	6	2	5
గూడూరు	18	10	47
ఇనకుదురుపేట	4	0	4

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం - న్యూస్‌టుడే, పామర్రు గ్రామీణం

"విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి-65పై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారులు అభివృద్ధికి చిహ్నాలు. కానీ... ఏళ్ల అవసరాలకు తగ్గట్లుగా.. ముందుచూపుతో నిర్మాణాలు లేక ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ప్రస్తుత అవసరాలకు తగినట్లు అండర్‌పాస్‌లు లేవు.. వీధి దీపాలు వెలగవు.. యూటర్న్.. సర్వీసు రోడ్లు లేవు. ఈ లోపాలకు చోదకుల నిర్లక్ష్యం తోడై రక్తమోడుతోంది."



తాడంకి: వానొస్తే చెరువులా అండర్‌పాస్

నిర్మాణ లోపాలతో నరకం...

విజయవాడ ఆటోనగర్ నుంచి మచిలీపట్నం వరకు 63 కి.మీ. మేర ఉన్న ఈ రహదారి నిర్మాణంలో లోపాలు, మానవ తప్పిదాలు, అతివేగం, చోదకుల నిర్లక్ష్యం.. నిత్య నరకంలా మారింది. గ్రామాల మధ్య నుంచే రహదారి నిర్మించారు. ప్రజలు ఇంటి నుంచి బయటకు వస్తే నేరుగా జాతీయ రహదారిపై అడుగు పెట్టాల్సిందే. చాలా చోట్ల రోడ్డు దాటేందుకు, యూటర్న్ వంటివి ఐదారు కి.మీ.., కొన్నిచోట్ల 10 కి.మీ దూరంలో కానీ లేవు. దీంతో అపసవ్య దిశలోనే ప్రయాణిస్తున్నారు. అక్కడక్కడ నిర్మించిన అండర్ పాస్‌లు వానొస్తే చెరువులా మారుతున్నాయి.

అడుగడుగునా ఇబ్బందులే ...

ఆటోనగర్ నుంచి ఈడుపుగల్లు వరకు... అండర్ పాసులు, సర్వీసు రోడ్లు లేక ఏడు కూడళ్లు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. నిడుమోలు, గూడూరు తదితర చోట్ల సర్వీసు రోడ్డు లేదు. చాలా గ్రామాల్లో గృహాలు, దుకాణాలు రహదారిని ఆనుకుని ఉన్నాయి. కంకిపాడు, తాడంకి, పామర్రు తదితర చోట్ల అండర్ పాస్‌లు వానొస్తే చెరువులా మారుతున్నాయి. ✦ కానుమూరు, నిమ్మకూరు, నిడుమోలు, గూడూరు, రామరాజుపాలెం తదితర చోట్ల యూటర్న్ దూరంగా ఉండటంతో రాంగ్‌రూట్‌లో వాహనాలు వస్తున్నాయి. ✦ పలు పైవంతెనల నుంచి ఒకేసారి తగ్గు ఉండటంతో వాహనాలు వేగంగా కిందకు వస్తూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ✦ మచిలీపట్నం, గూడూరు, నిడుమోలు, పామర్రు, ఉయ్యూరు, కంకిపాడు, పోరంకి వరకు వీధి దీపాలు సరిగా వెలగట్లేదు.

ఇదీ పరిష్కారం...

ఆరు వరుసలుగా రహదారి విస్తరించనున్న వేళ.. రోడ్డుకు ఆనుకుని ఉన్న గ్రామాలకు సర్వీసు రోడ్లు.. చెరువులా మారకుండా అండర్‌పాస్‌లు.. సరైన డ్రెయినేజీ వ్యవస్థ.. అనుకూలంగా యూటర్న్.. రాత్రుళ్లు వెలిగేలా సెంట్రల్ లైటింగ్.. భారీ వాహనాలు నిర్దేశిత ట్రాక్ బేలకు తరలించడం.. నిరంతరం ఎన్‌హెచ్ అధికారుల పర్యవేక్షణ ఉండాలి.

దశల వారీగా చక్కదిద్దుతాం..

బందరు-బెజవాడ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు డివైడర్లు ఎత్తు పెంచేలా.. సెంట్రల్ లైటింగ్ సక్రమంగా ఉంచాలని ఎన్‌హెచ్ అధికారులతో చర్చించాం. రహదారిపై నీరు నిలవడం తదితర సమస్యలు విస్తరణలో పరిష్కారం అవుతాయి. అత్యవసర సమస్యలు పరిష్కరిస్తాం.

- బాలాజీ, కలెక్టర్- విద్యాసాగర్, ఎస్పీ


రూ.100 టికెట్‌తో నగరమంతా ప్రయాణం

విజయవాడ బస్ స్టేషన్, న్యూస్‌టుడే: విజయవాడ నగర పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో ట్రావెల్ యాస్ యూలైక్ టికెట్లు రూ.100 టికెట్ తీసుకొని నగర పరిధిలో 24 గంటల వరకు ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి ఎం.వై దానం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ సిటీ ఆర్డనరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఈ అవకాశం అందుబాటులో ఉంటుందన్నారు. బుధవారం నుంచి ఈ టికెట్‌లు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. కండక్టరు వద్ద టికెట్ అడిగి తీసుకోవచ్చన్నారు.

జోగి, జనార్దనరావుల బంధం దృఢమైనది

★ కస్టడీలో కీలక వివరాలు రాబట్టిన సిట్, ఎక్సైజ్
★ నిందితుల ఫోన్లలో తొలగించిన ఆధారాలు లభ్యం

ఈనాడు - అమరావతి: వైకాపా నేత జోగి రమేష్, అద్దేపల్లి జనార్దనరావుల మధ్య ఎప్పటి నుంచో వ్యాపార బంధం ఉందనీ.. రమేష్, అతని సోదరుడు రాముతోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నాయని నకిలీ మద్యం కేసులో నిందితులు కస్టడీలో వెల్లడించారు. జనార్దనరావుకు ఈ కేసులో నిందితుడైన రవి సమీప బంధువు. నకిలీ మద్యం వ్యవహారంలో ప్రధాన నిందితుడితోపాటు గోవా వెళ్లాడు. లేబుళ్ల డిజైన్, ముద్రణలో కీలకంగా వ్యవహరించాడు. దీంతో జోగి, అద్దేపల్లి మధ్య సంబంధ వివరాలను రాబట్టేందుకు పోలీసులు దృష్టి సారించారు. అక్రమ, నకిలీ మద్యం అమ్మకాలు సాగించినందుకు రమేష్‌కు పలు దఫాలు ముడుపులు కూడా ఇచ్చేవాడని చెప్పాడు. మరో నిందితుడు కల్యాణ్ కీలక వివరాలు వెల్లడించాడు.



జనార్దనరావు భాగస్వామిగా ఉన్న శ్రీనివాస వైన్స్‌లో నిర్వహణ బాధ్యతలను చూసేవాడు. ఇబ్రహీంపట్నం నుంచి నకిలీ మద్యాన్ని ఈ దుకాణంలో విక్రయించారు. వీరితో పాటు మిగిలిన నిందితుల నుంచి ముఖ్య విషయాలను రాబట్టారు.

గోవా నుంచి తెద్దామని .. నకిలీ మద్యం తయారీకి ముందు.. గోవా నుంచి అక్రమ మద్యం తెచ్చి ఇబ్రహీంపట్నంలో అమ్ముదామని జనార్దనరావు ప్లాన్ చేసుకున్నాడు. వైకాపా ఏలుబడిలో ఏపీలో మద్యం ధరలు మిగిలిన రాష్ట్రాల కంటే అధికంగా ఉండడంతో ఈ ప్రణాళిక సిద్ధం చేశాడు. ఇందుకు గోవా వెళ్లినప్పుడు బాలాజీతో చర్చించాడు. అక్కడి నుంచి ఇబ్రహీంపట్నం తీసుకొచ్చి అమ్మకాలు సాగించాలంటే కష్టమని భావించి ప్రణాళికను పక్కనపెట్టారు. దీనికి బదులుగా గోవా నుంచి స్పిరిట్ తెచ్చి ఇబ్రహీంపట్నంలోనే నకిలీ మద్యం తయారీకి సాయం చేస్తానని బాలాజీ చెప్పడంతో దీనికి అంగీకరించాడు.

మొబైళ్లలో కీలక ఆధారాలు... నిందితుల ఫోన్లలో ఆధారాలను తొలగించినా.. ఫోరెన్సిక్ ల్యాబ్‌లో వీటిని తిరిగి రాబట్టారు. మొబైళ్లలో కాల్ రికార్డులు, లావాదేవీల స్క్రీన్ షాట్‌లు, ఫొటోలు, తదితరాలను రిట్రీవ్ చేశారు. హైదరాబాద్‌లో జనార్దనరావు ప్రారంభించిన ఈ7 బార్ నుంచి అక్రమంగా మద్యాన్ని క్యాన్లలో ఇబ్రహీంపట్నం తెచ్చినట్లు కాగితాల్లో రాసుకున్న వివరాలు కూడా బయటకు వచ్చాయి. బార్ ఏర్పాటుకు ముందు హైదరాబాద్‌లో మద్యం కొని తరలించిన ఆధారాలూ లభించాయి. 2021 నుంచి ఎన్డీపీఎల్‌ను జిల్లాకు తెచ్చి సీసాల్లో నింపినట్లు తేలింది. నిందితుల ఫోన్లలో వాట్సాప్ చాట్స్ కూడా లభ్యమయ్యాయి. వీటిలో నకిలీ లేబుళ్ల డిజైన్లు, ప్రింటింగ్ ఆర్డర్లు కూడా దొరికాయి.

కోర్టులో హాజరు... నిందితులు రవి, బాదల్ దాస్, ప్రదీప్ దాస్, శ్రీనివాస్‌రెడ్డి, కల్యాణ్, రమేష్ బాబు, అల్లాభక్ష్‌ల కస్టడీ ముగియడంతో మంగళవారం విజయవాడ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరిచారు. తర్వాత వారిని నెల్లూరు, విజయవాడ కారాగారాలకు తరలించారు. నిందితుల నేర అంగీకార స్టేట్‌మెంట్లు, వీడియోలను సిట్ అధికారులు కోర్టులో సమర్పించారు.

పారిశ్రామిక... ప్రగతి వీచికలు!

జిల్లాలో స్థాపనకు రూ.42 కోట్ల కేటాయింపు

ఈనాడు - అమరావతి: జిల్లాలో పారిశ్రామిక ప్రగతి పరవళ్లు తొక్కించేందుకు కూటమి సర్కారు నడుం బిగించింది. ఏపీఐఐసీ ద్వారా ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి జిల్లాకు రూ.42 కోట్లు కేటాయించింది. మూడు నియోజకవర్గాల్లో ఇప్పటికే స్థల సేకరణ పూర్తవగా ఆరు నెలల్లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులు నిర్మాణం పూర్తి చేసేలా అధికారులు అడుగులు వేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం వర్చువల్ విధానంలో వీటికి శంకుస్థాపనలు చేశారు. మిగిలిన నియోజకవర్గాల్లో సైతం స్థల సమీకరణ చేసి త్వరలో ప్రాజెక్టులను పట్టాలెక్కించనున్నారు.

జిల్లాలో మూడు చోట్ల.... నియోజకవర్గానికి ఓ పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేయాలనే కూటమి సర్కారు ఆశయం సాకారం దిశగా సాగుతోంది. విజయవాడ సెంట్రల్, మైలవరం, జగ్గయ్యపేట మండలాల పరిధిలో ఈ ప్రాజెక్టులను పట్టాలెక్కిస్తున్నారు. విజయవాడ వాంబే కాలనీ, మైలవరం పరిధిలోని చంద్రగూడెం ప్రాంతాల్లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ విధానంలో రూ.42 కోట్ల అంచనా వ్యయంతో రెండు నిర్మాణాలు చేపడతారు. దీనికి ప్రభుత్వం నిర్దేశించిన సాధారణ ధరలు చెల్లిస్తే ఆయా కాంప్లెక్స్‌ల్లో వ్యాపారం నిర్వహించవచ్చు.

ఆరు నెలల్లో పూర్తి... జగ్గయ్యపేట మండలం జయంతిపురంలో 20 ఎకరాల ప్రభుత్వ స్థలం పారిశ్రామిక పార్కుకు కేటాయించారు. ఇక్కడ పారిశ్రామికవేత్తలకు పరిశ్రమలకు స్థాపన కోసం స్థలాలు ఇస్తారు. ఈ మూడు ప్రాజెక్టులను ఆరు నెలల్లోగా పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు పని చేస్తున్నారు. విజయవాడ పశ్చిమ, తూర్పు, తిరువూరు, నందిగామ నియోజకవర్గాల్లో కూడా అధికారులు భూములు గుర్తించే పనిలో ఉన్నారు. అక్కడ సైతం అందుబాటులో ఉన్న భూమిని బట్టి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలా లేదా పారిశ్రామిక పార్కును అందుబాటులోకి తేవాలా అని నిర్ణయిస్తారు.



వాంబే కాలనీలో ఎంఎస్‌ఎంఈ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, విప్ బొండా ఉమా తదితరులు

యువతకు సువర్ణావకాశం... కూటమి ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ స్థాపన ఆలోచన యువతకు వరంగా మారనుంది. పరిశ్రమలు స్థాపించాలనే తలంపు ఉండి పెట్టుబడి, ప్రోత్సాహం లేని ఎందరో యువతకు మంచి అవకాశాలు దొరుకుతాయి. ఏపీఐఐసీ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు, బీసీలకు ఇచ్చే పెట్టుబడి, పరిశ్రమల స్థాపన రాయితీలు వీటికి కూడా వర్తిస్తాయి.

విజన్-2047 దిశగా అడుగులు...

తక్కువ పెట్టుబడితో పారిశ్రామిక యూనిట్లను స్థాపించి తమ కాళ్లపై తాము నిలబడటమేకాక పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి మహిళలు, యువత ఎదగాలనే విజన్-2047 దిశగా అడుగులు వేస్తున్నాం.. పారిశ్రామిక వికేంద్రీకరణకు, సమ్మిళిత, సుస్థిర అభివృద్ధికి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులు, ఎంఎస్‌ఎంఈ పార్కులు వేదికలుగా నిలుస్తాయి. **- లక్ష్మీశ, కలెక్టర్**

అడ్డగోలుగా కట్టి.. ముడుపులు కొల్లగొట్టి!

ఈనాడు, అమరావతి

- విద్యుత్తు టవర్ల ఎలైన్‌మెంట్ మార్చి భారీగా వసూళ్లు
- ఎన్‌హెచ్‌ఏఐ, ట్రాన్స్‌కో, పవర్‌గ్రిడ్ సిబ్బంది చేతివాటం




ఇది నున్న సమీపంలో నిర్మించిన విద్యుత్తు టవర్ల ఎలైన్‌మెంట్ చిత్రం. అప్రూవ్డ్ ఎలైన్‌మెంట్ ప్రకారం **ఆకుపచ్చ గీత వెళ్లిన మార్గంలో టవర్లు నిర్మించాలి. ఇక్కడ మాత్రం ఎరుపు గీత గుండా అడ్డగోలుగా.. అడ్డదిడ్డంగా టవర్లు నిర్మిస్తున్నారు.** ఇలా నున్నలో ఓ టవర్ ప్రైవేట్ లేఔట్‌లో నిర్మిస్తుండగానే వివాదం చెలరేగింది.

"పశ్చిమ బైపాస్ పరిధిలో వెళుతున్న విద్యుత్తు టవర్ల నిర్మాణం అడ్డగోలుగా చేపడుతున్నారు. అధికారిక ఎలైన్‌మెంట్‌కు, క్షేత్రంలో నిర్మాణాలకు పొంతన లేదు. ఎన్‌హెచ్‌ఏఐ, ఏపీ ట్రాన్స్‌కో, పవర్‌గ్రిడ్‌లో కొందరు ఒప్పంద సిబ్బంది చేతివాటం వల్లే ఈ అతిక్రమణలు జరుగుతున్నాయి. ఫలితంగా పశ్చిమ బైపాస్‌పై హైటెన్షన్ వైర్ల వివాదాలు కొలిక్కి రావడం లేదు."

రూ.లక్షల్లో ముడుపులు...

పశ్చిమ బైపాస్ రావడంతో సమీపంలో భూముల విలువ భారీగా పెరిగింది. బైపాస్‌పై 13 చోట్ల విద్యుత్తు టవర్ లైన్లు దాటుకుంటూ వెళ్లాల్సి ఉంది. ఇదే అదనుగా ఎన్‌హెచ్‌లో కొందరు ఒప్పంద ఉద్యోగులు.. పవర్‌గ్రిడ్, ట్రాన్స్‌కో సిబ్బందిలతో కుమ్మక్కయ్యారు. విద్యుత్తు టవర్ల నిర్మాణానికి ఇచ్చిన ఎలైన్‌మెంట్ ప్రకారం టవర్లు నిర్మాణం, లైన్లు వెళ్లే భూముల యజమానులతో మాట్లాడారు. రూ.కోట్ల విలువైన మీ భూముల్లో టవర్లు నిర్మించినా, లైన్లు వెళ్లినా విలువలు పాతాళానికి పడిపోతాయని భయపెట్టారు. ఎలైన్‌మెంట్ మార్చేస్తామని బేరం తెగ్గొట్టారు. ఒక్కొక్కరి నుంచి భూమి విలువ బట్టి రూ.20-30 లక్షలు వసూలు చేశారు. తర్వాత కొందరు భూ యజమానులతో జాయింట్ వెంచర్‌గా అభివృద్ధి చేసేందుకు ఒప్పందాలు చేసుకుంటున్నారు. 7 నుంచి 10 టవర్ల వరకు ఇలా ఎలైన్‌మెంట్ మార్చి నిర్మించారు. దీంతో మార్చిన ఎలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చే రైతులు భూములు నష్టపోతున్నారు. ఇంత జరుగుతున్నా ఎన్‌హెచ్‌ఏఐ, ట్రాన్స్‌కో, పవర్‌గ్రిడ్ అధికారులు మిన్నకుండటంపై అనుమానాలు వస్తున్నాయి.



ఇదీ సూరంపల్లి సమీపంలో పశ్చిమ బైపాస్‌పై వెళ్లిన విద్యుత్తు టవర్ల నిర్మాణ చిత్రం. అప్రూవుడ్ ఎలైన్‌మెంట్ ప్రకారం **(ఆకుపచ్చ గీత)** రోడ్డు నుంచి 41 మీటర్ల దూరంగా టవర్ల నిర్మించాలి. ఇక్కడ మాత్రం రోడ్డుకు 19 మీటర్ల దూరంలోనే **(ఎరుపు గీత)** టవర్లు నిర్మించారు.

దుర్గగుడి అంతరాలయ దర్శనం నిలుపుదల

ఇంద్రకీలాద్రి: దుర్గగుడి అంతరాలయ దర్శనం నిలిపి వేస్తున్నట్లు ఆలయ ఈవో ఈవో శీనానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్తిక మాసం ముగుస్తుండడంతో భక్తుల రద్దీ దృష్ట్యా ఈనెల 14, 15, 16 తేదీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు అంతరాలయ దర్శనం రూ.500 టికెట్ల విక్రయం నిలిపి వేస్తున్నట్లు చెప్పారు. ఈ మూడు రోజులు భక్తులందరికి బంగారు వాకిలి దర్శనం మాత్రమే ఉంటుందని తెలిపారు. వీఐపీ సిఫార్సు లేఖలు కూడా అనుమతించమని భక్తులు సహకరించాలని కోరారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నర్సాపూర్, సికింద్రాబాద్, అనకాపల్లి, సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

✦ **రైలు నంబరు 07455 నర్సాపూర్-సికింద్రాబాద్‌కు:** ఈ నెల 12వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు నర్సాపూర్‌లో బయలుదేరి 13వ తేదీ ఉదయం 5 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ఆగుతుంది. ✦ **07179 అనకాపల్లి-సికింద్రాబాద్‌కు:** 15వ తేదీ సాయంత్రం 5.35 గంటలకు అనకాపల్లిలో బయలుదేరి 16 తేదీ ఉదయం 8 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. తుని, అన్నవరం, సామర్లకోట, రాజమహేంద్రవరం, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నల్గొండ స్టేషన్లలో ఆగుతుంది.



శబరిమలకు...

07115/07116 చర్లపల్లి-కొట్టాయంకు: ఈ నెల 24న చర్లపల్లి, తిరుగు ప్రయాణంలో 25న కొట్టాయంలో బయలు దేరుతుంది. జనగాం, ఖాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, కొండపల్లి, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి, జోలార్‌పేట, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, త్రిసూర్, ఎర్నాకులం స్టేషన్లలో ఆగుతుంది.

✦ **20న రెండు రైళ్ల రద్దు..** విజయవాడ డివిజన్ పరిధిలోని తుని, హంసవరం, అన్నవరం, రావికమతం స్టేషన్ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ పనుల దృష్ట్యా ఈ నెల 20న రైలు నంబరు 17267/17268 కాకినాడ పోర్ట్-విశాఖపట్నం, 67285/67286 రాజమహేంద్రవరం-విశాఖపట్నం రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నష్టపోయిన ప్రతిరైతుకూ పరిహారం అందించాలి

మచిలీపట్నం, న్యూస్‌టుడే: మొంథా తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకూ నష్టపరిహారం దక్కేలా చర్యలు తీసుకోవాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధికారులకు సూచించారు. జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన స్థాయీ సంఘ సమావేశాల్లో వివిధ అంశాలను సభ్యులు ప్రస్తావించారు. పంట నష్టం లెక్కింపు విషయంలో వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలని కొందరు సూచించగా, మరి కొందరు పడిపోయిన పైరే కాకుండా. .నిలుచుని ఉన్న పంట దెబ్బతిన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులను ఆదుకోవాలని కోరారు. కోఆప్షన్ సభ్యుడు గౌస్ మాట్లాడుతూ నూతన పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా మంజూరు కాలేదన్నారు.

డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయండి: ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా వైద్యం చేయించుకున్న వారి నుంచి కొన్ని ఆస్పత్రుల్లో అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని సభ్యులు చెప్పడంతో ఆరోగ్యశ్రీ సమన్వయ అధికారి స్పందిస్తూ..ఎవరికీ అదనంగా ఒక్క రూపాయి చెల్లించనవసరం లేదన్నారు. ఎవరైనా నగదు డిమాండ్ చేస్తే 9281068152, 9440701873లో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

అధికారుల గైర్హాజరుపై..కొందరు అధికారులు స్థాయీ సంఘ సమావేశాలకు రావడం లేదన్న ఫిర్యాదుపై సీఈవో కన్నమనాయుడు స్పందిస్తూ బాధ్యుడైన ప్రతి అధికారి సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని, గైర్హాజరైన వారి వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.

వినోద ప్రపంచం

పీపీపీ పద్ధతిలో భవానీద్వీపం అభివృద్ధి


వాటర్ పార్కు

భవానీపురం, న్యూస్‌టుడే

కృష్ణానది మధ్యలో ఉన్న భవానీద్వీపానికి నూతన శోభ చేకూరనుంది. అమరావతి రాజధాని ప్రాంతంలో ఉన్న ఈ ద్వీపాన్ని అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ద్వీపాన్ని పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయనున్నారు. అమరావతి ప్రాంతానికే వన్నె తీసుకొచ్చేలా ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. విశ్వనాథ్ అవెన్యూస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు భవానీద్వీపం అభివృద్ధి బాధ్యతలను అప్పగించనున్నారు. ద్వీపంలో అభివృద్ధి పనులు చేపట్టేలా పూర్తి మాస్టర్ ప్లాన్... సంబంధించి ఏపీ క్యాబినెట్ సమావేశంలోనూ తీర్మానం చేశారు. చిన్నారుల దగ్గర నుంచి పెద్దల వరకు అందరినీ మెప్పించేలా అభివృద్ధి పనులను చేపట్టనున్నారు.


అత్యున్నత స్థాయి ప్రమాణాలతో..

పర్యాటకానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నారు. ద్వీపానికి వచ్చిన వారు రోజంతా సంతోషంగా గడిపే విధంగా వివిధ రకాల సౌకర్యాలను కల్పించనున్నారు. ఆ విధమైన అభివృద్ధి పనులు చేపట్టనున్నారనే విషయమై డిజైన్లను సైతం ప్రభుత్వ పెద్దలు, ఏపీ పర్యాటక శాఖ అధికారులకు అందజేశారు.


ఈతకొలను


ఆకర్షణీయమైన కేఫ్


అభివృద్ధి నమూనా చిత్రం


మినీ వరల్డ్

ఈత కొలనులు, క్రీడామైదానాలు, ప్రార్థనా మందిరాలు, చిన్నారులు, పెద్దల కోసం అడ్వెంచర్ స్పోర్ట్స్ తదితర వాటిని ఏర్పాటు చేయనున్నారు.


వివిధ రకాల క్రీడా సముదాయం

హోటల్, రెస్టారెంట్లు, స్పైడర్, చిన్నారులు, పెద్దలు, వేవ్ పూల్స్, కేఫ్, స్పోర్టియల్, ఆర్ట్ ఫ్యాక్టరీ, అడ్వెంచర్ స్పోర్ట్స్, కిడ్స్ జోన్, ఉద్యానాలు, గోకార్టింగ్, బుల్ రైడింగ్, బ్యాడ్మింటన్ కోర్టులు, రోప్ కోర్స్, జిప్‌లైన్, 360 సైకిల్ తదితర వాటిని ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు వివిధ ఆలయాలు, చారిత్రకకట్టడాల నమూనాలతో కూడిన మినీ వరల్డ్ ప్రాంతం ఆకట్టుకునేలా తీర్చిదిద్దనున్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

పాయకాపురం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల బారిన పడకుండా యువతను చైతన్య పరచాలని, దీనిపై అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అధికారులను


సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఆదేశించారు. మంగళవారం నగరంలోని కలెక్టరేట్‌లో నషాముక్త్ భారత్ అభియాన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 217 డ్రగ్ హాట్‌స్పాట్లను గుర్తించినట్లు తెలిపారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. గత మూడు నెలల్లో జిల్లా ఈగల్ బృందం.. రైళ్లు, బస్సులు, బైకులు, గోదాంలలో తనిఖీలు చేసి, డ్రగ్స్ సీజ్ చేసినట్లు తెలిపారు. దాదాపు 200 మంది బాధితులను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి మాదక ద్రవ్యాలు సరఫరా అవుతున్న పరిస్థితిపై దృష్టి సారించి, నియంత్రించాలని కోరారు. ఆటోనగర్‌లో జరిపిన ఓ ముఠాను అరెస్టు చేసిన ఈగల్ బృందానికి అభినందనలు తెలిపారు. డ్రగ్స్ సంబంధిత సమాచారాన్ని ఈగల్ నంబర్-1972కు తెలపాలని కోరారు. బాధితులకు ఆరోగ్యపరంగా, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఉచితంగా కౌన్సెలింగ్ సేవలు అందిస్తున్నట్లు వివరించారు. సామాజిక బాధ్యతగా తమ వంతు కర్తవ్యం నిర్వర్తిస్తామని సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. గోడ పత్రికలు ఆవిష్కరించారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ కామరాజు, ఈగల్ సీఐ ఎం.రవీంద్ర, ఎస్సై ఎం.వీరాంజనేయులు, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ఎన్జీవోలు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో కేసుల దర్యాప్తు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: వివిధ రకాల కేసుల దర్యాప్తులో సాంకేతికతను వినియోగించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని.. తద్వారా పోలీసులపై పని భారం తగ్గుతుందని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సైబర్ నేరాల దర్యాప్తుపై పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టులు, సోషల్ మీడియా కేసులను త్వరితగతిన ఏ విధంగా ఛేదించాలి. సైబర్ నేరాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి? సైబర్ చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఇప్పుడు నేర్చుకున్న అంశాలతో తమ తమ స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులను త్వరితగతిన ఛేదించాలని సూచించారు. నేరాల నివారణలో పలు చిట్కాలు, జాగ్రత్తలు తెలియజేశారు. డిజిటల్ అరెస్టు అనేది అసలు లేనేలేదని.. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరూ వాట్సాప్, వీడియో కాల్స్ ద్వారా అరెస్టు చేయరు. అలాంటి వాటిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డీసీపీలు కె.జి.వి.సరిత, కె.తిరుమలేశ్వర్‌రెడ్డి, కృష్ణప్రసన్న, కృష్ణకాంత్ పాటిల్, బి.లక్ష్మీనారాయణ, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.


పోలీసు అధికారులకు సూచనలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

దుర్గగుడి భద్రతపై అప్రమత్తత అవసరం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఢిల్లీలో బాంబు పేలుళ్ల నేపథ్యంలో దుర్గగుడి భద్రతపై సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఈవో శీనానాయక్ సూచించారు. మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీఎఫ్, సెక్యూరిటీ సిబ్బందికి ఈవో దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై సమాచారాన్ని ఆలయ అవుట్ పోస్టు పోలీసులకు తెలియచేయాలన్నారు. దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడిని తనిఖీ చేసి పంపించాలని చెప్పారు. మెటల్ డిటెక్టర్ డోర్ ఫ్రేమ్‌లు వినియోగించాలన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారికి స్థానిక పరిస్థితులపై అవగాహన ఉండదని వారితో ఆత్మీయంగా ఉండాలని చెప్పారు. లగేజ్, ఫోన్లు భద్రపరిచే సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.


సెక్యూరిటీ సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఈవో శీనానాయక్

బహుభాషా ప్రావీణ్యుడు.. అబుల్ కలాం ఆజాద్

పాయకాపురం, న్యూస్‌టుడే: మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యార్థులకు నిత్యస్ఫూర్తి అని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం నగరంలోని కలెక్టరేట్‌లో మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మౌలానా బహుభాషా ప్రావీణ్యుడని, భారత తొలి విద్యాశాఖ మంత్రిగా సేవలందించారని కొనియాడారు. ఆయనకు భారత ప్రభుత్వం భారతరత్న ప్రకటించిందన్నారు. 35ఏళ్ల వయసులోనే భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేశారని తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమశాఖ సూపరింటెండెంట్ కోటేశ్వరమ్మ, జిల్లా ఈగల్ సీఐ ఎం.రవీంద్రనాథ్, మైనార్టీ సంక్షేమశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి మౌలానా బాటలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ అని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి డీసీపీ కృష్ణకాంత్ పాటిల్‌తో కలిసి సీపీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యారంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తుగా 1992లో భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించిందన్నారు. 11 సంవత్సరాల పాటు విద్యాశాఖామంత్రిగా పని చేశారని కొనియాడారు. కార్యాలయం సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న డీసీపీ కృష్ణకాంత్ పాటిల్

ప్రభుత్వ ఉర్దూ కళాశాల అధ్యాపకుడికి అవార్డు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: కబేళా సెంటర్ సమీపంలోని ప్రభుత్వ ఉర్దూ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఎం.డి.నిజాముద్దీన్‌కు బెస్ట్ లెక్చరర్ అవార్డును మంత్రి ఎండీ ఫరూక్ చేతుల మీదుగా మంగళవారం అందుకున్నారు. 2025 అక్టోబరు 26న ఢిల్లీలో ఉర్దూ సహిత్య కరమ్‌జా సంఘం నిర్వహించిన కార్యక్రమంలో నేషనల్ ఉర్దూ అవార్డును నిజాముద్దీన్ అందుకున్నారు. ఉర్దూ భాష అధ్యాపకుడిగా విద్యార్థులను ఆకట్టుకున్న నిజాముద్దీన్‌కు ప్రతిష్ఠాత్మకమైన నేషనల్ ఉర్దూ అవార్డు, రాష్ట్ర ప్రభుత్వ అందజేసిన ఉత్తమ అధ్యాపక అవార్డులను 15 రోజుల వ్యవధిలో పొందడం పట్ల ఉర్దూ కళాశాల అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.


అవార్డుతో నిజాముద్దీన్

కుష్ఠు వ్యాధి నివారణకు కృషి చేద్దాం

పాయకాపురం: జిల్లాలో కుష్ఠువ్యాధి నివారణకు సమష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. మంగళవారం నగరంలోని కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధి గుర్తింపు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సత్వరమే వైద్య సహాయం అందించాలని సూచించారు. వ్యాధి నివారణకు ప్రభుత్వపరంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వ్యాధి లక్షణాలను సకాలంలో గుర్తించి, వైద్యం పొందితే నివారణ సాధ్యమని పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికోసం 1296 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ప్రత్యేక సర్వే చేస్తున్నట్లు చెప్పారు. శిబిరాలకు సంబంధించిన గోడపత్రికలను కలెక్టర్ తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.సుహాసిని, జిల్లా కుష్ఠువ్యాధి నివారణ అధికారి బి.భానునాయక్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఎం.రమాదేవి, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ఇందుమతి, అధికారులు స్నేహాసమీరా, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జోగి పిటిషన్‌పై ముగిసిన వాదనలు

13 న వెలువడనున్న తీర్పు

ఈనాడు - అమరావతి: ములాఖత్‌లు పెంచాలన్న వైకాపా నేత జోగి రమేష్ పిటిషన్‌పై విజయవాడ ఎక్సైజ్ కోర్టులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. నకిలీ మద్యం కేసులో నెల్లూరు కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న జోగి.. ములాఖత్‌లు పెంచాలని పిటిషన్ వేయగా మంగళవారం విచారణ జరిగింది. తీర్పు నిమిత్తం ఈనెల 13వ వాయిదా పడింది. ఈ కేసులో తొమ్మిది మంది నిందితులు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై కౌంటర్లు దాఖలు చేసేందుకు 13వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు. జనార్దనరావు, జగన్మోహనరావుల రెండో విడత కస్టడీ కోసం సిట్ దాఖలు చేసిన పిటిషన్లపై నిందితుల తరఫు న్యాయవాదులు కౌంటర్లు దాఖలు చేసేందుకు వీలుగా 17వ తేదీకి వాయిదా పడింది. జోగి రమేష్, రాముల కస్టడీ పిటిషన్లపై విచారణ గురువారానికి వాయిదా వేశారు. ములకలచెరువు కేసులో అరెస్టు అయి మదనపల్లి కారాగారంలో రిమాండ్‌లో ఉన్న మిథున్‌దాస్, అంతదాస్, హాజి, రాజులను పీటీ వారెంట్‌పై విజయవాడ కోర్టులో హాజరుపర్చేందుకు తీసుకొస్తున్నారు. వీరిని బుధవారం న్యాయస్థానంలో హాజరుపర్చి, రిమాండ్ విధించిన తర్వాత మదనపల్లికి తరలించే వీలుంది. ఈ కేసులో అరెస్టు అయిన సతీష్ (ఏ17)ను కస్టడీకి ఇస్తూ కోర్టు బుధవారం ఉత్తర్వులిచ్చింది. ఈనెల 13 నుంచి 17 వరకు కోర్టు అనుమతించింది.

నిడిగుంట అరుణ కస్టడీపై..

విజయవాడ (సూర్యారావుపేట): ఎస్సై, అంగన్‌వాడీ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఓ వృద్ధుడిని రూ.24.5 లక్షల మేర మోసం చేసిన కేసులో నిందితురాలు నిడిగుంట అరుణ కస్టడీ పిటిషన్‌పై మంగళవారం వాదనలు ముగిశాయి. గత నెల 13న విజయవాడ, సూర్యారావుపేట పోలీసులు ఆమెపై కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఈ కేసులో మరింత సమాచారం నిమిత్తం ఆమెను నాలుగు రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇవ్వాలని ఇటీవల సూర్యారావుపేట పోలీసులు ఒకటో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇది మంగళవారం న్యాయస్థానంలో విచారణకు వచ్చింది. దీనిపై ప్రాసిక్యూషన్, డిఫెన్స్ న్యాయవాదులు తమ తమ వాదనలు వినిపించారు. అనంతరం కస్టడీ పిటిషన్‌పై తీర్పు వెలువరించేందుకు న్యాయమూర్తి బుధవారానికి(నేటికి) వాయిదా వేశారు.

‘జగన్‌కు పీపీపీ అంటే అర్థం తెలుసా?’


మాట్లాడుతున్న యామిని శర్మ

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే: పీపీపీ అంటే అర్థం తెలియకుండా వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నట్లు వైకాపా అధినేత జగన్ ప్రజల్లో అసత్యాలు ప్రచారం చేస్తున్నారని భాజపా అధికార ప్రతినిధి సాధినేని యామిని శర్మ పేర్కొన్నారు. వైకాపా నాయకులు చేస్తున్న అబద్ధపు ప్రచారాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. మంగళవారం విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ‘అబద్ధాల ప్రజల్లోకి తీసుకు వెళ్లగలిగే నైపుణ్యం మాజీ సీఎం జగన్, ఆయన పార్టీ నాయకులకు ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఎన్ని భవనాలు కట్టారో.. చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలకు తెలుసాన్నారు. కూటమి ప్రభుత్వం నిర్మిస్తున్న వాటిని తానే కట్టించినట్లు చెబుతున్నాడని పేర్కొన్నారు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని వేల కోట్లు కొల్లగొట్టాడని, గత వైకాపా పాలనలో అన్నీ దోచుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంపై బురద చల్లాలనే ఉద్దేశంతో రోజుకో అంశాన్ని తెరపైకి తెస్తున్నారని చెప్పారు. వైద్య కళాశాలలకు గ్రాంట్ల కింద కేంద్రం నిధులు ఇస్తే ఖర్చు చేయకుండా పునాదుల్లోనే వదిలేశారని తెలిపారు. ప్రభుత్వ ఆధీనంలో భూములు, ఫీజులు, వైద్యం, బెడ్లు ఉంటాయని, నిర్వహణ మాత్రం ప్రైవేట్‌కు ఉంటుందని’ ఆమె పేర్కొన్నారు. మరో భాజపా ఏపీ అధికార ప్రతినిధి బుచ్చిరాజు మాట్లాడుతూ.. కేంద్రం ఇచ్చే నిధులతో వైద్య కళాశాలలను ఎప్పుడో పూర్తి చేయాల్సి ఉందని, గత ప్రభుత్వం నిధులు సరిగా ఖర్చు చేయకుండా దుర్వినియోగం చేశారన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక దగ్గర నుంచి ప్రభుత్వ యంత్రాంగం వరకు అన్నీ ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారనే విషయం వారికి తెలిదా అని ప్రశ్నించారు.


న్యాయవాదుల రక్షణ చట్టం తేవాల్సిందే

విజయవాడ (గవర్నర్‌పేట): న్యాయవాదులపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ న్యాయవాదుల సంరక్షణ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ డోన్ బార్ అసోసియేషన్ సభ్యులు ఎల్.కృష్ణప్రసాద్, కె.ఈశ్వరయ్య చేపట్టిన పాదయాత్ర మంగళవారం మధ్యాహ్నం విజయవాడకు చేరుకుంది. బీబీఏ అధ్యక్షుడు ఎ.కె.బాషా ఇతర న్యాయవాదులు సాదర స్వాగతం పలికారు. బాషా మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ చట్టం అమలయ్యే వరకు పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. డోన్ సభ్యుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సీనియర్ న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. న్యాయవాదులకు రక్షణ చట్టం తప్పనిసరి, అని దీని అమలుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


కృష్ణప్రసాద్, ఈశ్వరయ్యలకు స్వాగతం పలుకుతున్న బీబీఏ సభ్యులు

కార్యాచరణ కమిటీ ఏర్పాటు.. బెజవాడ బార్ అసోసియేషన్ నుంచి అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ కార్యాచరణ కమిటీని నియమించారు. కమిటీ అధ్యక్షుడిగా ఎ.ఎస్.ఎస్.రాంప్రసాద్, సభ్యులుగా బత్తుల సాయి, బైపూడి నాగేశ్వరరావు, పి.జయలక్ష్మిలను నియమించారు. ఈ కార్యక్రమంలో జి.వరాహలక్ష్మి, ఎ.రాజా, పి.రాంబాబు పాల్గొన్నారు.

ధర వరలు



వంకాయలు-50/60/64, టమాటా-28, బెండ-44, పచ్చిమిర్చి-38, కాకర-48, బీర-48/50, క్యాలీ ఫ్లవర్-20/25, క్యాబేజీ-30, క్యారెట్-50/78, దొండ-48, బంగాళదుంప-30, ఉల్లిపాయలు-24, గోరుచిక్కుళ్లు-54, దోస-26, సొర-35/30, పొట్ల-28/30, అరటికాయ-5/6, చామదుంప-28, అల్లం-80, మునగ-10/8, ఆకు కూరలు (కట్ట)-4/10, కంద-48, బీట్ రూట్-50, కీరదోస-38, బీన్స్-80/70, క్యాప్సికమ్-70, చింతకాయలు-70, (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

పెరిగిన కృష్ణా వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నదిలో వరద ప్రవాహం మంగళవారం పెరిగింది. ఉదయం ఆరు గంటలకు ఎగువ నుంచి 23,695 క్యూసెక్కులు వచ్చింది. ఈ క్రమంలో 14,500 క్యూసెక్కులను సముద్రంలోకి, 9,195 క్యూసెక్కులను కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు విడుదల చేశారు. తర్వాత క్రమేపీ పెరిగింది. సాయంత్రం ఆరు గంటలకు ఎగువ నుంచి 53,780 క్యూసెక్కుల వరద వచ్చింది. 60 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. మిగతా 10 గేట్లు మూసి ఉన్నాయి. 43,500 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. పంట కాల్వలకు నీటిని పెంచి 10,280 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 4,020, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 6,034, గుంటూరు ఛానల్‌కు 226 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ 2,283, ఏలూరు 937, కేఈబీ 500, బందరు కాల్వలకు 300 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు.

డిసెంబరు 16న సీసీఎల్ఏ కార్యాలయం ముట్టడి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిసెంబరు 16న మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ తెలిపారు. వీఆర్ఏలకు తెలంగాణ తరహాలో పే స్కేల్ అమలు, అర్హులకు పదోన్నతులు, కారుణ్య నియామకాలు తదితర ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. మంగళవారం దాసరిభవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని ఏడాది నుంచి వీఆర్ఏలు కోరుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం విచారకరమన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు. రూ.10,500తో ఎలా బతుకుతారని ప్రశ్నించారు. వీఆర్ఏల సంఘాలన్నీ ఒకే వేదికపైకి వచ్చి ఐకాసగా ఏర్పడడం శుభపరిణామమన్నారు. ఐకాస ఛైర్మన్‌గా ఎన్నికైన ఎన్.పెద్దన్న మాట్లాడుతూ.. సమస్యలను రెవెన్యూ శాఖామంత్రితో పాటు మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమన్నారు. ఐక్య ఉద్యమాల కోసం ఐకాసగా ఏర్పడినట్లు తెలిపారు. చలో సీసీఎల్ఏ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఐకాస నూతన కమిటీలో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.బాలకాశి, వైస్ ఛైర్మన్లుగా టి.అంజి, ఎన్.నాగేష్, జి.ధైర్యం, మర్రి వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా గణేష్, ఈశ్వరయ్య, సురేష్, రాజు, వీరభద్రరావు, వివేకానంద నియమితులయ్యారు.


ఐక్యత చాటుతున్న రవీంద్రనాథ్, బాలకాశీ, పెద్దన్న, ఐకాస నాయకులు

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -109 రిటైల్ ధర 134 చికెన్ విత్ స్కిన్ -197, చికెన్ స్కిన్‌లెస్ - 224.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 246 చికెన్ స్కిన్‌లెస్ - 256.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.93/-.

విలాసాలకు అలవాటు పడి చోరీలు

సూర్యాపేట (హుజూర్‌నగర్ గ్రామీణం): విలాసాలకు, బెట్టింగులకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడిని సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం భీమవరానికి చెందిన మల్లికార్జున్‌రెడ్డి అలియాస్ మల్లి బీటెక్ చదివి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో విలాసాలకు అలవాటు పడి బెట్టింగ్‌కు బానిసయ్యాడు. చేతిలో డబ్బులు లేకపోవడంతో చోరీలు చేసి ఆ సొత్తును అమ్ముకొని వాటితో జల్సా చేస్తూ, బెట్టింగ్‌లకు పాల్పడుతూ డబ్బు పోగొట్టుకున్నాడు. హుజూర్‌నగర్ మండలం వేపలసింగారంలో ఈనెల 5న ముడెం గోపిరెడ్డి ఇంటికి తాళం వేసి పొలం వద్దకు వెళ్లడాన్ని గమనించిన మల్లికార్జున్‌రెడ్డి ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, రూ.90 వేల నగదును దొంగిలించాడు. గోపిరెడ్డి ఫిర్యాదుతో పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి విచారణ చేపట్టారు. మంగళవారం మిర్యాలగూడ రోడ్డులో ఎస్సై మోహన్‌బాబు వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మల్లికార్జున్‌రెడ్డిని పట్టుకొని విచారించగా వేపలసింగారంలో దొంగిలించిన బంగారాన్ని కరిగించి అమ్మడానికి మిర్యాలగూడ వెళ్తున్నట్లు అంగీకరించాడు. అనంతగిరి మండలంలోని అమీనాబాద్‌లో, ఖమ్మం జిల్లా చింతకాని మండల పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామంలో ఇలాగే తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసి ఇంట్లోని నగదు, బంగారాన్ని దొంగిలించినట్లు విచారణలో తేలిందని సీఐ పేర్కొన్నారు. నేరస్థుడి వద్ద నుంచి 51.78 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2,85,000 నగదు, స్కూటర్, చరవాణిని స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

14న డయల్ యువర్ డాక్టర్

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై ఈ నెల 14న 'ఈనాడు-మీతోడు' ఆధ్వర్యంలో డయల్ యువర్ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సమస్యలు, కాలుష్యంతో వచ్చేవి, దీర్ఘకాలిక వ్యాధుల గురించి, మందుల లభ్యత, కుక్కకాటు టీకాల వివరాలు వంటివి వైద్యుల దృష్టికి తీసుకురావచ్చు. కొండపల్లి పీహెచ్‌సీ పరిధిలోని కొండపల్లి పురపాలక, ఈలప్రోలు, గొల్లపూడి ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

సమయం: శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్యలో, ఫోన్ చేయాల్సిన చరవాణి నంబర్: 9182022206

రహదారి మరమ్మతులకు నిధుల మంజూరు


తిరువూరు-రాజవరం మార్గం

గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు-రాజవరం ఆర్అండ్‌బీ రహదారి ప్రత్యేక మరమ్మతుల నిమిత్తం ప్రభుత్వం రూ.7.80 కోట్లు మంజూరు చేసినట్లు ఆ శాఖ ఏఈ ఒ.అచ్చారావు మంగళవారం తెలిపారు. తిరువూరు జీరో కి.మీ నుంచి 4కి.మీ వరకు, సత్యాలపాడు సమీప 12వ కి.మీ నుంచి రాజవరం 29వ కి.మీ వరకు మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. పనుల నిర్వహణకు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని ఏఈ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

తిరువూరు టౌన్ న్యూస్‌టుడే: పట్టణంలోని మూడో వార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేయించాలని స్థానికుడు వరప్రసాద్ 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ స్పందించి.. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

★ తిరువూరు ఒకటో వార్డులో డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోయి.. మురుగునీటి పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికుడు పద్మప్రియ 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. శానిటరీ అధికారి సంతోష్ స్పందించి.. సిబ్బందితో సమస్య పరిష్కరించారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట పంచాయతీ కార్యాలయం రోడ్డులో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. పంచాయతీ ఈవో కేశవ హరికృష్ణ కుమార్ స్పందించి.. పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు.

ఖరీఫ్ వరి కోతలు ముమ్మరం!

గంపలగూడెం, న్యూస్‌టుడే


కోకిలంపాడు కేంద్రంలో కొనుగోలు చేసిన ధాన్యం బస్తాల వద్ద ఏవో, రైతులు

తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో ఖరీఫ్ వరి కోతలు ఊపందుకున్నాయి. ముందుగా సాగు చేసిన రైతులు పంటను యంత్రాలతో నూర్పిడి చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా చెల్లించే ధర గిట్టుబాటుగా ఉన్నా.. కొందరు పచ్చి వడ్లు కళ్లాల్లో ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. మద్దతు ధర ఆశించిన సాగుదారులు నూర్పిడి చేసిన ధాన్యాన్ని రెండు రోజుల పాటు తేమ తగ్గేందుకు ఆరబెట్టి ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయిస్తున్నారు.

21వేల హెక్టార్లలో..

తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 21వేల హెక్టార్లలో వరిసాగు చేశారు. పలు గ్రామాల్లో వారం రోజుల నుంచి పంట నూర్పిడులు చేస్తున్నారు. ఐదు మండలాల్లో 59 పీఏసీఎస్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ప్రస్తుతం 18 చోట్ల ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. మంగళవారం నాటికి 1183 టన్నులు కొనుగోలు చేశారు. రెవెన్యూ డివిజన్‌లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.31 లక్షల టన్నులు వడ్లు కొనుగోలు లక్ష్యంగా ఉంది. ప్రస్తుతానికి వావిలాల కేంద్రం 320, కోకిలంపాడులో 260, చింతలపాడు 94, కంగర 102 టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేశారు. రైతులు ప్రైవేటు వ్యాపారులకు సరకు విక్రయించకుండా ప్రభుత్వ మద్దతు ధరపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో కరపత్రాలు, మైక్ ద్వారా ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మంగళవారం వరకు కొనుగోళ్లు ఇలా.. (టన్నుల్లో..)

మండలం	కేంద్రాలు	ధాన్యం
తిరువూరు	7	818
విస్సన్నపేట	4	184
గంపలగూడెం	2	40
ఎ.కొండూరు	3	71
రెడ్డిగూడెం	2	70

తాగునీటి పథకంలోకి మరోసారి బూడిదనీరు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే



మైలవరం నియోజకవర్గ ప్రజలకు కలుషిత తాగునీరే దిక్కయ్యింది. రక్షిత తాగునీటి పథకంలోకి మంగళవారం మరోసారి బూడిద నీరు వచ్చి చేరింది. దీనిపై స్థానికులు గగ్గోలు పెడుతున్నా ఏ ఒక్కరికీ పట్టడం లేదు. అదేమంటే.. పథకం ఎన్టీటీపీఎస్ పరిధిలో ఉన్నందున బూడిద వస్తుందనడం అధికారులకు పరిపాటిగా మారింది. అక్టోబర్ 5న బూడిద నీరు రావడంతో స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ సందర్భంగా ఆర్డీవో చైతన్య, పురపాలక కమిషనర్ రమ్యకీర్తనలతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్టీటీపీఎస్ అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. సమస్య పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆర్డీవో స్థానిక అధికారులను ఆదేశించారు. నెల రోజుల తరువాత మళ్లీ భారీగా బూడిద నీరు రావడంతో రక్షిత పథకం నిర్వహణ అక్కడి సిబ్బంది మోటార్లను ఆపేశారు. ఉన్నతాధికారులు స్పందించి.. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

భూసార పరీక్షలపై అవగాహన


కుంటముక్కల గురుకులంలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ప్రియాంక తదితరులు


మైలవరంలో..

జి.కొండూరు, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయిలో విద్యార్థులు భూసార పరీక్షలపై అవగాహన కలిగి ఉండి.. రైతులను చైతన్యవంతులను చేయాలని భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయ అధికారిణి పాగోలు ప్రియాంక అన్నారు. కుంటముక్కల డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో మంగళవారం విద్యార్థులకు భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. నేల ఆరోగ్యం, స్థూల పోషకాలు, సూక్ష్మ పోషకాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు సువర్ణకుమారి, సురేష్, ప్రిన్సిపల్ బ్యూలా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: భూసార పరిరక్షణ పథకంలో భాగంగా స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు మంగళవారం గొల్లపూడి భూసార పరీక్షా కేంద్రంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో పి.ప్రియాంక.. విద్యార్థినులకు పలు అంశాలను వివరించారు. పథకం ద్వారా పాఠశాలలో మినీ సాయిల్ ల్యాబ్‌ను ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని, విద్యార్థులు రైతుల నుంచి మట్టి నమూనాలు సేకరించి, విశ్లేషణ చేసి.. నేలలో పోషకాలపై రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వై.రాజశేఖర్, ఏవో సురేష్, సహాయకులు పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనతో మెరుగైన ఉపాధి అవకాశాలు



సభలో మాట్లాడుతున్న ఆర్డీవో చైతన్య

మైలవరం, న్యూస్‌టుడే: పరిశ్రమల స్థాపనతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య పేర్కొన్నారు. ప్రభుత్వం 'ఒక కుటుంబం, ఒక స్థాపకుడు' కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గానికో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టగా, నియోజకవర్గానికి సంబంధించి చంద్రగూడెంలో ఎంఎస్ఎంఈ పార్కును నిర్మిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా శంకుస్థాపన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించగా, చంద్రగూడెంలో ఆర్డీవో పాల్గొని నిర్మాణ వివరాలను వెల్లడించారు. గ్రామంలో మొత్తం 6.21 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు నిర్మించనున్నారు. తొలి విడతలో 2 ఎకరాల్లో 26 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక సదుపాయాలతో పరిశ్రమ సముదాయాన్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.14.50 కోట్లు కేటాయించినట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచి బి.శ్రీనివాసరావు, గృహనిర్మాణ సంస్థ జిల్లా పీడీ రజనీకుమారి, తహసీల్దార్ అబ్దుల్ దరియా, ఎంపీడీవో అనురాధ, ఏఎంసీ ఛైర్మన్ నవ్యశ్రీ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.రోశాలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య సేవలు



పశువుల దాణా అందజేస్తున్న శ్రీహరి తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: కుంటముక్కల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించగా.. విశేష స్పందన లభించింది. పీఏసీఎస్ అధ్యక్షుడు సుఖవాసి శ్రీహరి ప్రారంభించారు. మైలవరం పశుసంవర్ధక శాఖ ఏడీఏ హరిహరనాథ్ ఆధ్వర్యంలో పశువులకు పరీక్షలు నిర్వహించారు. గర్భకోశ వ్యాధులపై అవగాహన కల్పించి, ఉచితంగా మందులు, దాణా అందజేశారు. కార్యక్రమంలో మండల పశుసంవర్ధకశాఖ అధికారులు వి.శ్రీకాంత్, సీహెచ్ దుర్గా మహేష్, పశుపోషకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడి అక్రమ నిర్మాణాలను సీఆర్‌డీఏ అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది తొలగించారు. గొల్లపూడి దేవాదాయ శాఖ ఆలయ ప్రాంతంలో రెండు భవనాలను అక్రమంగా నిర్మాణం చేసినట్లు సీఆర్‌డీఏ అధికారుల దృష్టికి వెళ్లింది. వాటిని పరిశీలించగా ప్లాన్ లేకుండా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వాటి యజమానులకు నోటీసులు జారీ చేశారు. అనధికారికంగా చేపట్టిన నిర్మాణాలను మంగళవారం తొలగించారు. ప్లాన్ లేకుండా భవన నిర్మాణాలను చేపడితే చర్యలు తీసుకుంటామని, కూలగొడతామని హెచ్చరించారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం


చెవుటూరు ప్రాథమిక పాఠశాలలో ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రమాదేవి తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని చెవుటూరు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రధానోపాధ్యాయిని రమాదేవి, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆజాద్ కృషితోనే దేశంలో ఐఐటీ, యూజీసీ తదితర సంస్థలు స్థాపించబడ్డాయని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాసు, నాగరాజు, కిరణ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఆజాద్ కృషి

గొల్లపూడి, న్యూస్‌టుడే: దేశంలో విద్యాభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ కృషిచేశారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని గొల్లపూడిలోని ఆయన కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యా రంగం అభివృద్ధే లక్ష్యంగా ఆజాద్ కృషి చేశారన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి


మద్దులపర్వలో ధాన్యం కొనుగోలు గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జె.సుశీలాదేవి తెలిపారు. వ్యవసాయ, అనుబంధశాఖల ఆధ్వర్యంలో మద్దులపర్వ, ముచ్చనపల్లి గ్రామాల్లో మంగళవారం 'పొలంపిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏవో డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సీడ్ మొక్కజొన్న సాగు చేసే రైతులు కంపెనీలతో ముందస్తు ఒప్పందం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి బి.నరేంద్రకుమార్, ఆర్ఐ జి.పుల్లయ్య, రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని తెల్లదేవరపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో టిప్పు సుల్తాన్ రైతులకు పలు సూచనలు చేశారు. ఖరీఫ్ వరిని కర్రపచ్చిగా ఉన్నప్పుడే కోయాలని చెప్పారు. ధాన్యాన్ని బాగా ఆరబెట్టి, తేమ శాతం 17 లోపు ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో పంట అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాయల సురేష్, ఏఈవో జి.ఉషారాణి, గ్రామ ఉద్యాన సహాయకుడు ఎం.వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: కుంటముక్కల గ్రామంలో వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన 'పొలంపిలుస్తోంది' కార్యక్రమంలో ఖరీఫ్ పంటలను పరిశీలించి పాటించాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకుడు లంకా రామకృష్ణ, అసిస్టెంట్ ఏవో నాగరాజు, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ల శిక్షణతో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రవి

మైలవరం, న్యూస్‌టుడే: ఆధునిక సమాజంలో అన్ని రంగాల్లోకి విస్తరించిన డ్రోన్ల నిర్వహణపై శిక్షణ పొందడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇళ్ల రవి పేర్కొన్నారు. పీఎం ఉషా పథకం కింద కళాశాలలో ఐ క్వాక్, ఐఐసీ ఆధ్వర్యంలో ఏరీస్ ఆగ్రోస్ సంస్థ సహకారంతో డ్రోన్లపై శిక్షణా తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ బీఎస్సీ, బీకాం విద్యార్థులకు ఐదు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆధునిక వ్యవసాయం, పర్యావరణ పరిశీలన, లాజిస్టిక్స్ రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరిగిందన్నారు. ఉప ప్రిన్సిపల్ రంగారావు, కళాశాల దాత లకిరెడ్డి హనిమిరెడ్డి, ఐక్వాక్ ఇన్‌ఛార్జి సుభాషిణి, ఐఐసీ కోఆర్డినేటర్ ఉమాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పొదలు.. ప్రమాదాలు!



రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: నూజివీడు-గంపలగూడెం ఆర్అండ్‌బీ రహదారిలో ఇరువైపులా పెరిగిన పిచ్చిపొదల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సందర్భంలో తప్పుకొనే ప్రయత్నంలో అంచుల్లోకి దిగిన సందర్భాల్లో వాహనదారులు పడిపోతున్నారు. మలుపుల వద్ద పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మృతి



మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక ప్రముఖుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండి వెంకటకృష్ణ రామారావు(72) మంగళవారం ఆయన నివాసంలో మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందారు. పలు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన ఆయన.. ఉద్యోగ విరమణ అనంతరం మైలవరం పీఏసీఎస్ అధ్యక్షుడి గానూ మూడేళ్ల పాటు పనిచేశారు. పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయ సంఘాలు వెంకటకృష్ణ రామారావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

నీళ్లిచ్చి ముఖం కడిగించారు

ఇబ్రహీంపట్నం, గ్రామీణం, న్యూస్‌టుడే: తెల్లవారుజామున జరిగే రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం గుంటుపల్లి నుంచి దొనబండ వరకు మంగళవారం తెల్లవారుజామున ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసులు 'ఫేస్ వాష్ అండ్ గో' కార్యక్రమం నిర్వహించారు. సీఐ చంద్రశేఖర్ పర్యవేక్షణలో ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు.. సిబ్బందితో కలిసి తెల్లవారుజామున రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు గుంటుపల్లి, ఇబ్రహీంపట్నం, మూలపాడు, దొనబండ కూడళ్ల వద్ద రహదారిపై వెళుతున్న వివిధ వాహనాలను ఆపి వాటి చోదకులను కిందకు దింపి ముఖం కడిగించి పంపారు.

మధిర కాలువకు 653 క్యూసెక్కుల నీరు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు మంగళవారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం వద్ద 72వ కి.మీ నియంత్రిక నుంచి 653 క్యూసెక్కుల నీరు విడుదలైనట్లు ఏఈ మహేశ్‌బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 294 క్యూసెక్కులు చేరగా దిగువన మేజర్లవారీగా గంపలగూడెం 20, ఊటుకూరు-1కి 40, పెదకొమెర 20, మధిర 15, నిదానపురం 40 క్యూసెక్కులు సరఫరా చేసినట్లు ఏఈ తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

గంపలగూడెం: కనుమూరు, అనుముల్లంక, వినగడప తండా గ్రామాల పరిధిలో బుధవారం మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరమ్మతుల నిమిత్తం త్రీఫేస్ సరఫరా ఆపేస్తున్నట్లు ఏఈశ్రీనివాసరావు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం గుర్తింపు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సడక్ రోడ్డులోని వరి పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు మంగళవారం గుర్తించారు. వీరయ్య అనే వ్యక్తి వరి పొలాలకు పురుగుల మందు కొట్టడానికి వెళ్లిన సమయంలో.. 40 సంవత్సరాల వయసు కలిగిన మగ వ్యక్తి చనిపోయి ఉండటాన్ని గమనించి.. వీఆర్వో బసవేశ్వరరావుకు తెలియజేశారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థలాన్ని అప్పగించి.. న్యాయం చేయాలి

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడి నల్లకుంట సమీపంలోని తమకు సంబంధించిన స్థలాన్ని అప్పగించి అధికారులు న్యాయం చేయాలని స్థల యజమాని బొమ్మసాని సాంబశివరావు కోరారు. గొల్లపూడిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో తహసీల్దార్, సర్వేయర్ తమకు హద్దులు నిర్ణయించి స్థలం అప్పగించారని తెలిపారు. ఆ మేరకు తాము హద్దుల్లోనే ఉన్నట్లుగా పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో గొల్లపూడి మాజీ సర్పంచి బొమ్మసాని సుబ్బారావు ప్రమేయం లేదన్నారు. ఆయనపై అనవసరంగా కొందరు లేనిపోని ఆరోపణలు చేయటం తగదన్నారు.

చదువు

e-mail: edc@eenadu.in

మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్‌లో..

మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్(మిధాని), హైదరాబాద్.. పలు విభాగాల్లో అప్రెంటిస్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

✦ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: 30 ✦ టెక్నీషియన్ డిప్లొమా అప్రెంటిస్: 20 ✦ ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్: 160

ట్రేడులు: ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, టర్నర్, డీజిల్ మెకానిక్, ఏసీ మెకానిక్, వెల్డర్, సీవోపీఏ, ఫొటోగ్రాఫర్, ప్లంబర్, కార్పెంటర్, మెటలర్జీ, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఐటీ.. తదితరాలు.


అర్హత: సంబంధిత విభాగం/ట్రేడులో.. డిప్లొమా/ డిగ్రీ/ ఐటీఐ.

స్టైపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.12,300; టెక్నీషియన్‌కు రూ.10,900; ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.9,600.

ఎంపిక: విద్యార్హతల్లో పొందిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలతో.

దరఖాస్తు: అప్రెంటిస్‌షిప్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. తర్వాత అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పూర్తిచేయాలి. దరఖాస్తు హార్డ్‌కాపీలను తపాలా ద్వారా అడిషనల్ జనరల్ మేనేజర్, ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్, మిధాని, కంచన్‌భాగ్, హైదరాబాద్ చిరునామాకు పంపించాలి. **తపాలా ద్వారా దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ:** 10.12.2025.

వెబ్‌సైట్: https://midhani-india.in/



దారి కనరాని ప్రయాణంలో వేగుచుక్క డేటా. సమాచారమనే కాగడా పట్టుకొని దివ్యంగా గమ్యాన్ని చేరవచ్చు. కళ్ల ముందు దృశ్యం అస్పష్టంగా ఉన్నప్పుడు డేటానే మనకు బాట చూపుతుంది. వినియోగదారులు లక్షల్లో, లావాదేవీలు కోట్లలో జరుగుతున్నాయి. దీంతో కీలకమైన విషయాల్లో నిర్ణయం తీసుకోవాలంటే వెనక్కి వెళ్లి పేరుకుపోయిన డేటా అనే పర్వతంపై నిలబడితే మన తీర్పు ఎలా ఉండాలో తేటతెల్లమవుతుంది.

కొలువుల కోటకు.. డేటా బాట

ప్రపంచీకరణ తర్వాత దేశంలో వినిమయ సంస్కృతి బాగా పెరిగింది. నిత్యావసర వస్తువుల కొనుగోలు నుంచి ఆకాశయానం వరకు లావాదేవీలు కోట్లలో ఉంటున్నాయి. ఒకప్పుడు ఈ లావాదేవీల ఫలితంగా పేరుకుపోయిన సమాచారాన్ని కంప్యూటర్లకు భారమని.. ఎలా వదిలించుకోవాలని సంస్థలు తలలు పట్టుకున్నాయి. అయితే కొద్దికాలంలోనే ఇది భారం కాదు.. సంస్థకు సంపద (అసెట్) అని అర్థమైంది. వ్యాపార రంగంలో ప్రతి చిన్న నిర్ణయం కోట్ల రూపాయల పరిమాణంలో ప్రభావం చూపే అవకాశం ఉంది. ఏ నిర్ణయం తీసుకోవాలన్నా గత డేటాను పరిశీలించేందుకు పాత డేటానే ఆధారమని సంస్థలు గుర్తించాయి. దీంతో డేటాను నిల్వ చేయడం ప్రారంభించాయి. వాటి ఆధారంగా తీసుకునే నిర్ణయాలు సత్ఫలితాలు ఇవ్వడం గ్రహించాయి. డేటా కోసం వేట మొదలుపెట్టాయి. ఏ దుకాణంలోనైనా ఒక వస్తువు కొనుగోలు చేసి, బిల్ చెల్లించేటప్పుడు.. మన కాంటాక్ట్ నంబరు, కుదిరితే ఈ-మెయిల్ తీసుకోవడం ఇందులో భాగమే.

రాజకీయ రంగంలోనూ..

కార్పొరేట్లు విస్తృతంగా వినియోగిస్తూ, ప్రయోజనం పొందుతున్న డేటా ఇప్పుడు ప్రజాపాలనలోకీ ప్రవేశించింది. ఒకప్పుడు ఎన్నికల వ్యూహాల రచనకు వినియోగపడిన డేటా నేడు గవర్నెన్స్ పబ్లిక్ పాలసీ రూపకల్పనకూ ఆధారమవుతోంది. ఇకపై డేటా డ్రివెన్ గవర్నెన్స్ ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఇటీవల ప్రకటించారు. సమాచారాన్ని సమర్థ పాలనకు వినియోగించుకునేందుకు రంగం సిద్ధమవుతోంది. పాలనలో క్షేత్ర స్థాయిలో చివరి మెట్టు అయిన గ్రామ సచివాలయ స్థాయిలోనే డేటా ఆధారాలు - నిర్ణయాలు పాలన ఉంటుందని దీని అర్థం.



స్వరూపం.. విస్తృతం

కార్పొరేట్, ఐటీ ప్రపంచంలో డేటా అన్నప్పుడు విస్తృతార్థంలో చూడాలి. దీనికి రెండు కోణాలు ఉన్నాయి. డేటాను నిల్వచేసే మౌలిక నిర్మాణ వ్యవస్థ ఒకటైతే, వినియోగదారుల సమాచారం మరొకటి. గూగుల్ సంస్థ వైజాగ్‌లో నెలకొల్పుతున్నది మొదటి దాని ప్రతిబింబం కాగా, వినియోగదారుల డేటా సేకరణ అనేది ప్రతి భారీ వాణిజ్య సంస్థలో భాగంగా ఉంటుంది. మౌలిక వసతుల వ్యవస్థను డేటా సెంటర్లు అని పిలుస్తుంటే నిర్ణయాలు తీసుకునేందుకు సమాచారాన్ని పరిశీలించడం డేటా సైన్స్‌గా పరిగణిస్తున్నారు. రెండు మార్గాలలోనూ యువతకు అపార అవకాశాలు స్వాగతిస్తున్నాయి.

విభిన్న హోదాలు

భారీ పెట్టుబడులతో రూపుదిద్దుకునే డేటా మౌలిక వసతుల కేంద్రాలలో వ్యవస్థాపనకు, నిర్వహణకు వివిధ హోదాల అవసరం ఉంటుంది. వాటిలో కొన్ని..

డేటా సెంటర్ టెక్నీషియన్: డేటా సెంటర్ల నిర్వహణను పర్యవేక్షించే కీలక హోదా ఇది. డేటా సెంటర్ వ్యవస్థ రోజువారీ పనితీరును సాఫీగా జరిగేలా చూడటం, ఎప్పుడు ఏ అవాంతరం లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం వంటి విధులు నిర్వర్తిస్తున్న టెక్నీషియన్ బాధ్యత. సెంటర్‌లోని సర్వర్ వంటి భారీ యంత్రాల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తుండటం అవసరం. ఇవి సాఫీగా పనిచేస్తుండటమే కాదు వేగంగా నాణ్యమైన సేవలు అందించ గలుగుతున్నాయా? లేదా? అని నిరంతరం డేటా సెంటర్ టెక్నీషియన్ పర్యవేక్షిస్తుంటారు.

ఇన్వెంటరీ, అసెట్ టెక్నీషియన్: డేటా సెంటర్ అనేది భారీ యంత్రాలతో నెలకొల్పిన వ్యవస్థ. వీటి నిర్వహణకు అనేక హార్డ్‌వేర్ విడి భాగాల (స్పేర్ పార్ట్స్) అవసరం ఉంటుంది. ఏ విడిభాగం ఎప్పుడు అవసరమైనా సిద్ధంగా ఉండాలి. లేకపోతే సర్వర్లు నిలిచిపోయే పరిస్థితి ఉత్పన్నం కాకూడదు. స్పేర్ పార్ట్స్ ఆర్డర్ చేయడం నుంచి, సకాలంలో సేకరించి ఇన్వెంటరీ (నిల్వ చేయడం)లో ఉంచడం ఈ టెక్నీషియన్ల బాధ్యత.

క్రిటికల్ ఎన్విరాన్‌మెంట్ టెక్నీషియన్: డేటా సెంటర్లకు రెండు అవసరాలు ఆయువుపట్టుగా నిలుస్తాయి. ఉష్ణోగ్రత, విద్యుత్ శక్తి. భారీ యంత్రాలున్న డేటా సెంటర్లలో శీతల ఉష్ణోగ్రతలు నిరంతరం ఉండాలి. దానికి అంతరాయం లేని విద్యుత్ సరఫరా ఉండాలి. ఈ రెండిటి బాధ్యతలను క్రిటికల్ ఎన్విరాన్‌మెంట్ టెక్నీషియన్ వహిస్తారు.

నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్: డేటా సెంటర్‌కు నెట్‌వర్క్ జీవనాడి వంటిది. నెట్‌వర్క్ నిర్మాణం, అమలు, నిర్వహణను నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్ లేదా ఇంజినీర్ పర్యవేక్షిస్తారు. డేటా సెంటర్ నెట్‌వర్క్ వ్యవస్థ ఏ ఆటంకం లేకుండా పనిచేసేలా జాగ్రత్తలు తీసుకుంటుంటారు.

ఫెసిలిటీస్ ఇంజినీర్: డేటా సెంటర్లో భౌతిక వసతులకు బాధ్యత వహిస్తారు. పవర్, కూలింగ్ వ్యవస్థ, ఇతర యంత్రాల బాగోగులు పర్యవేక్షిస్తారు. ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీర్ల సేవలు అవసరమైతే ఫెసిలిటీస్ ఇంజినీర్ వినియోగించుకుంటారు.

క్లౌడ్ ఇంజినీర్ లేదా అడ్మినిస్ట్రేటర్: డేటా సెంటర్‌లో క్లౌడ్ ఆధారిత మౌలిక నిర్మాణానికి క్లౌడ్ ఇంజినీర్ సేవలు తీసుకుంటారు. ఈ నిర్ణయంలో డేటా సెంటర్ మౌలిక వసతులను పర్యవేక్షించే నిపుణుల సహకారం తీసుకుంటారు. డేటా సెంటర్‌లో భాగంగా క్లౌడ్ వసతి కల్పిస్తారు.

డేటా సెంటర్ పరిమాణాన్ని బట్టి ఈ హోదాలు ఉంటాయి. చిన్న కేంద్రాలలో తక్కువ సంఖ్యలో ఉద్యోగాలున్నా, భారీ డేటా సెంటర్లలో ఒక్కో హోదాకూ పదులు, వందల సంఖ్యలో నిపుణులను నియమిస్తారు. అందుకే వైజాగ్‌లో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం పూర్తయి, కార్యకలాపాలు మొదలయ్యే నాటికి లక్ష మంది నిపుణులకు ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేశారు. డేటా సెంటర్ స్థాయిని బట్టి కూడా హోదాల సంఖ్య ఆధారపడి ఉంటుంది. ఏది ఏమైనా డేటా సెంటర్ పరిమాణం ఎంతైనప్పటికీ.. హోదాలకు, కొలువులకు ఢోకా లేదు.



యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

బీఎస్సీ తర్వాత.. ఏ కోర్సులు బాగు?

బీఎస్సీ కంప్యూటర్స్ చేశాను. ఎమ్మెస్సీ/ ఎంసీఏ/ ఎంబీఏ వీటిల్లో ఏది చదివితే మేలు? మాస్టర్స్ డిగ్రీలో ఏ బ్రాంచ్ తీసుకుంటే ఉద్యోగావకాశాలు బాగుంటాయి? - నీల



■ బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తిచేసిన వారికి ప్రస్తుత సాంకేతిక ప్రపంచం అనేక ఉపాధి మార్గాలను చూపిస్తుంది. కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్, డేటాబేస్‌లు, వెబ్ టెక్నాలజీలు, జావా, పైతాన్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, సెలీనియం ఆటోమేషన్ వంటి నైపుణ్యాలు ఉన్నవారికి చాలా ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, ఉన్నత చదువులు కొనసాగించాలా, లేదా ఉద్యోగ రంగంలోకి అడుగుపెట్టాలా అనేది విద్యార్థి ఎదుర్కొనే ముఖ్యమైన ప్రశ్న.

టెక్నికల్ రంగంలో ప్రవేశించి పరిశోధనలు చేయాలనుకుంటే ఎంటెక్‌లో చేరడం మంచి ఆలోచన. కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కోర్సులు బలమైన సాంకేతిక నైపుణ్యాలను సమకూరుస్తాయి. భారతీయ విశ్వవిద్యాలయాల్లో మూడేళ్ల బీఎస్సీ కంప్యూటర్స్ చదివినవారు నేరుగా ఎంటెక్‌లో చేరడం వీలు పడదు. బీఎస్సీ తర్వాత ఎంసీఏ లేదా ఎమ్మెస్సీ పూర్తిచేసి, గేట్‌తో ఎంటెక్‌లో ప్రవేశం పొందాలి. యూకేతో పాటు మరికొన్ని యూరోపియన్ యూనివర్సిటీల్లో మూడు సంవత్సరాల డిగ్రీతో కంప్యూటర్ సైన్స్‌లో ఒకటి/ రెండేళ్ల వ్యవధి గల ఎంఎస్ చేసే అవకాశం ఉంది.

ప్రపంచ స్థాయిలో అవకాశాల కోసం చూస్తున్న వారికి ఎంఎస్ విస్తృత ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది. విదేశీ విశ్వ విద్యాలయాల్లో ఎంఎస్‌లో.. డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులు డేటా సైంటిస్ట్, ఏఐ ఇంజనీర్, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, క్లౌడ్ సొల్యూషన్ ఆర్కిటెక్ట్ వంటి అధిక వేతనం అందించే ఉద్యోగాల్లో స్థిరపడొచ్చు. ఇక ఎంసీఏ విషయానికి వస్తే, ఇది రెండేళ్ల వ్యవధి గల కంప్యూటర్ అప్లికేషన్స్ పీజీ ప్రోగ్రాం. ఇందులో కంప్యూటర్ అప్లికేషన్స్, సాఫ్ట్‌వేర్ డిజైన్, అల్గారిథమ్స్, నెట్‌వర్కింగ్, డేటాబేస్ మేనేజ్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి ఆధునిక రంగాలలో లోతైన అవగాహన అందిస్తుంది. ఎంసీఏ పూర్తి చేసినవారికి సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో విస్తృత ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ప్రభుత్వ రంగంలో కూడా ఎన్ఐసీ, ఇస్రో, డీఆర్‌డీవో, బ్యాంకులు, రైల్వే లాంటి సంస్థల్లో కంప్యూటర్ సంబంధిత ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు బోధన, స్టార్టప్, ఫ్రీలాన్సింగ్ వంటి మార్గాల్లోనూ కెరియర్ నిర్మించుకోవచ్చు.

మీ వ్యక్తిగత స్వభావం.. నిర్వహణ, నాయకత్వం, బృందాల్ని నడిపించడం వంటి లక్షణాలకు దగ్గరగా ఉంటే ఎంబీఏ ఉత్తమమైన మార్గం. ప్రత్యేకంగా ఐటీ, బిజినెస్ అనలిటిక్స్, ఫైనాన్స్ వంటి స్పెషలైజేషన్లు బీఎస్సీ కంప్యూటర్స్ చదివినవారికి అనుకూలం. ఈ స్పెషలైజేషన్లు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, ప్రాబ్లం సాల్వింగ్, డెసిషన్ మేకింగ్, బిజినెస్ విశ్లేషణ వంటి నైపుణ్యాలను పెంపొందించి కార్పొరేట్ రంగంలో పెద్ద స్థాయికి ఎదగడానికి దోహదపడతాయి. పై విషయాలన్నీ దృష్టిలో పెట్టుకొని నచ్చిన మార్గాన్ని ఎంచుకోండి.



-ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్ సేల్స్

సంస్థ: నవిగ్రిట్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఇంగ్లిష్, హిందీ మాట్లాడటం, సేల్స్
స్టైపెండ్: రూ.10,000-20,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 4
☛ https://shorturl.at/4ife8

ఎడ్యుకేషన్ సేల్స్ అసోసియేట్

సంస్థ: టెకియర్/ కాన్‌సెప్ట్రిక్స్ అనలిటిక్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 4
☛ https://shorturl.at/bvDKI

‘మొంథా’ తక్షణ సాయంగా రూ.2,622 కోట్లు ఇప్పించండి

- కేంద్ర బృందానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వినతి
- ఆర్టీజీఎస్ ముందస్తు హెచ్చరికలతో నష్టాన్ని తగ్గించారు
- సీఎంను ప్రశంసించిన కేంద్ర బృందం



మొంథా తుపాను ప్రభావాన్ని కేంద్ర బృందానికి చూపుతున్న చంద్రబాబు

ఈనాడు, అమరావతి: మొంథా తుపాను కారణంగా వివిధ రంగాలకు రూ.6,384 కోట్ల మేర నష్టం జరిగిందని, దాదాపు 10 లక్షల మందిపై ప్రభావం పడిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. రహదారులు, విద్యుత్, మౌలిక సౌకర్యాల పునరుద్ధరణకు తక్షణ సాయంగా రూ.2,622 కోట్లు మంజూరు చేయించాలని కోరారు. ‘తీరప్రాంత కోత నివారణ ప్రాజెక్టులో భాగంగా కాకినాడ సమీపంలోని ఉప్పాడ వద్ద సముద్రపు కోత నివారణ పనులకు రూ.323 కోట్లు, విశాఖ సమీపంలో పనులకు రూ.203 కోట్లు, శ్రీకాకుళానికి రూ.98 కోట్లు కేటాయించేలా చూడాలి. పిడుగుపాటు హెచ్చరికల వ్యవస్థ, లైటనింగ్ అరెస్టర్ల ఏర్పాటుకు రూ.11.77 కోట్లు, అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణ వ్యవస్థ ఏర్పాటుకు రూ.18.48 కోట్లు కేటాయించాలి’ అని విజ్ఞప్తి చేశారు. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి పౌసుమి బసు నేతృత్వంలోని కేంద్రబృందం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన తర్వాత మంగళవారం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబుతో సమావేశమైంది. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి వారికి మొంథా తుపాను నష్టంపై ప్రజంటేషన్ ఇచ్చారు. తుపాను నష్టంపై త్వరితగతిన నివేదిక ఇచ్చి.. ఉదారంగా రాష్ట్రాన్ని ఆదుకునేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర బృందాన్ని కోరారు. తుపాను నష్టానికి సంబంధించిన తుది అంచనాల్ని రెండు రోజుల్లో కేంద్రానికి పంపిస్తామన్నారు. పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని.. తడిసిన ధాన్యం కొనుగోలుకు నిబంధనలను సవరించేలా కేంద్రానికి సిఫార్సు చేయాలన్నారు.

★ వైకాపా హయాంలో విపత్తు నిధిని కూడా దారి మళ్లించారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు నిలిపేశారని.. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

★ ఆర్టీజీఎస్ సాయంతో తుపానుపై ముందస్తు హెచ్చరికలు పంపడం ద్వారా సరైన సమయంలో విలువైన ప్రాణాల్ని కాపాడారని కేంద్ర బృందం ముఖ్యమంత్రిని కొనియాడింది. సమావేశంలో సీఎస్ విజయానంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సెప్టెంబరులో శంకుస్థాపన.. ఫిబ్రవరిలో ప్రారంభోత్సవం

- కర్నూలులో సిద్ధమవుతున్న ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బెవరేజెస్ యూనిట్
- మా ప్రభుత్వ పనితీరుకు ఇదే నిదర్శనం
- పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు
- 87 ప్రాంతాల నుంచి ఆన్‌లైన్‌లో అనుసంధానం



వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడుతున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్త అనుదీప్

ఈనాడు, ఒంగోలు: “కర్నూలు జిల్లాలో ప్రపంచంలోనే రెండో అతి పెద్ద బెవరేజెస్ యూనిట్ రిలయన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. సెప్టెంబరులో శంకుస్థాపన జరిగింది. వచ్చే ఫిబ్రవరి నాటికి ప్రారంభోత్సవం చేసేలా పనులు సాగుతున్నాయి. మా ప్రభుత్వ ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’కు ఇదొక ఉదాహరణ” అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. మంగళవారం ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం గుంటూరు లింగన్నపాలెంలో ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడి నుంచే రాష్ట్రంలోని 87 ప్రాంతాల్లో ఉన్న పారిశ్రామికవేత్తలతో ఆన్‌లైన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రపంచంలో రెండోది, దేశంలో అతి పెద్దదైన బెవరేజెస్ ప్లాంట్ నిర్మాణాన్ని ప్రభుత్వ ప్రోత్సాహంతో చురుగ్గా చేస్తున్నామని రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు అర్పన్ బసు ముఖ్యమంత్రితో చెప్పారు. ఐదు వేల మందికి ఉపాధి కల్పించే ఈ ప్రాజెక్టు పనులు ఇప్పటికే నలభై శాతం పూర్తయ్యాయని వివరించారు. విద్యుత్తు, నీరు, రహదారి సౌకర్యం వంటివి కూడా పూర్తయితే వచ్చే ఫిబ్రవరి నాటికే ప్లాంట్‌ను ప్రారంభిస్తామన్నారు. అన్ని సౌకర్యాలూ కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

20 మందికి పని కల్పిస్తున్నా: మైథిలి, చిత్తూరు

వేస్ట్ ఆయిల్‌ను రీసైక్లింగ్ చేసే యూనిట్ ప్రారంభించాం. ‘వన్ ఉమన్- వన్ ఆంత్రప్రెన్యూర్’ కింద దరఖాస్తు చేస్తే అవకాశం లభించింది. దీనిద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 మందికి ఉపాధి కల్పించడం ఆనందంగా ఉంది.

చంద్రబాబు: మైథిలిని స్ఫూర్తిగా తీసుకుని మహిళలంతా రాణించాలి.

ఏపీఐఐసీ దారి చూపింది: టి.అనుదీప్, ఔత్సాహిక పారిశ్రామికవేత్త

బీటెక్ చదివాక వ్యాపారం చేయాలని ఆసక్తి. అప్పట్లో ఏ దారి కనిపించలేదు. ఏపీఐఐసీ వారిని సంప్రదిస్తే, ప్రాజెక్టు గురించి సవివరంగా చెప్పి సహకరించారు. ఈ నెలలో వాటర్ బాటిల్ తయారీ యూనిట్ పెడుతున్నాను.

చంద్రబాబు: ప్లగ్ అండ్ ప్లే విధానంలో షెడ్లు వేయడంతో పాటు అన్ని రకాల యూనిట్ల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తున్నాం. వ్యాపారం చేయాలని సంకల్పంతో అడుగులు వేస్తున్న అనుదీప్‌కి శుభాకాంక్షలు.

‘భాగస్వామ్య’ పండుగకు సిద్ధం

నేడు విశాఖకు సీఎం చంద్రబాబు



విశాఖలోని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో సదస్సు ప్రాంగణ ముఖద్వారంపై లోగో



అతిథులకు సిద్ధం చేస్తున్న హాలు

ఈనాడు-విశాఖపట్నం, వన్‌టౌన్-న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ‘భాగస్వామ్య సదస్సు’ పండుగకు విశాఖ సిద్ధమైంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ), రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఐదో పార్టనర్‌షిప్ సమిట్‌కు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. సాంకేతికత, నమ్మకం, వాణిజ్యం (టెక్నాలజీ, ట్రస్ట్, ట్రేడ్) నినాదంతో నిర్వహించే సదస్సుకు ఏయూ ఇంజినీరింగ్ మైదానం వేదిక కానుంది. ఇక్కడ జర్మన్ హ్యాంగర్లతో 8 భారీ ప్రత్యేక హాళ్లను సిద్ధంచేశారు. దేశ, విదేశాల ప్రతినిధులు సందర్శించే ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలు, నగరంలో కూడళ్లను, బీచ్ రోడ్డును సుందరీకరించారు. విశాఖలో రూ.42 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రముఖ హోటళ్లలో అతిథుల కోసం 1,200 గదులతోపాటు, 800 కార్లను సిద్ధం చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా లోగో: సీఐఐ భాగస్వామ్య సదస్సు-2025 లోగో.. పోటీ తత్వాన్ని వేగవంతం చేయడం, ప్రపంచీకరణ, సమ్మిళితం, స్థిరత్వం, నమ్మకం అనే ఇతివృత్తాల్ని సూచిస్తోంది. భాగస్వామ్యాలు వ్యూహాత్మకంగా ఎలా నడిపిస్తాయి? ఆర్థికాభివృద్ధిని ఎలా పెంపొందిస్తాయో? భారతదేశానికి సంపన్న భవిష్యత్‌ను ఎలా నిర్మిస్తుందో అర్థమయ్యేలా లోగోకు రూపకల్పన చేశారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ అవకాశాలకు ప్రాధాన్యమిచ్చారు. ఆకర్షణీయ పెట్టుబడి అవకాశాలు, సెమీకండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేధ), పునరుత్పాదక శక్తి, వేగవంతమైన అనుమతులు, వనరులను తెలిపేలా ఏడు చిత్రాలను పొందుపరిచారు. సాంకేతిక పరిజ్ఞానం శక్తిమంతమైనదని సూచించేలా ఆరెంజ్, ఆకుపచ్చ(భారతీయ జెండా) ప్రతిబింబించే రంగులున్నాయి. మధ్యలో తిరుగుతున్న గ్లోబ్ దర్శనమిస్తోంది.

ప్రతినిధులకు సీఎం విందు: నేటి రాత్రికి సీఎం చంద్రబాబు విశాఖ చేరుకుంటారు. పోర్టు అతిథిగృహంలో బసచేస్తారు. 13న నోవోటెల్ హోటల్లో జరిగే పారిశ్రామికవేత్తల సమావేశం, సదస్సు ఏర్పాట్లపై సమీక్షల్లో పాల్గొంటారు. అదేరోజు రాత్రి రాడిసన్‌బ్లూ హోటల్లో నిర్వహించనున్న మెగా డిన్నర్‌కు హాజరవుతారు. సదస్సును ప్రారంభించేందుకు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ 14న ఉదయం 9 గంటలకు ప్రత్యేక విమానంలో దిల్లీ నుంచి విశాఖ రానున్నారు. అదేరోజు ఉదయం గవర్నర్ అబ్దుల్ నజీర్ వస్తారు.

33 మంది విదేశీ మంత్రులు: సదస్సు సెషన్లలో కీలక ఉపన్యాసాలిచ్చేందుకు 47 మంది స్పీకర్లు దేశ, విదేశాల నుంచి తరలివస్తున్నారు. వీరంతా 13కల్లా విశాఖ చేరుకుంటారు. మరో 47 మంది రాయబారులు, 33 మంది విదేశీ మంత్రులొస్తున్నారు. తూర్పు, ఈశాన్య ఆసియాతో పాటు అరబ్ దేశాల నుంచి భారీ సంఖ్యలో పారిశ్రామికవేత్తల బృందాలు రానున్నాయి.

◆ సదస్సు జరిగే తేదీలు	: నవంబరు 14, 15
◆ ఒప్పందాలు చేసుకునే రంగాలు	: 11
◆ పాల్గొననున్న దేశాలు	: 45
◆ ఒప్పందాలు	: 410
◆ పెట్టుబడులు	: రూ.9.76 లక్షల కోట్లు
◆ ఉద్యోగ అవకాశాలు	: 7.48 లక్షలపైగా
◆ ఇప్పటి వరకు అయిన రిజిస్ట్రేషన్లు	: సుమారు 2 వేలు

దుబ్బిగానిపల్లి, మురుగుమ్మిలకు జాతీయ జల అవార్డులు

18న ప్రదానం చేయనున్న రాష్ట్రపతి

ఈనాడు, దిల్లీ: కేంద్ర జల్‌శక్తి శాఖ ప్రకటించిన 6వ జాతీయ జల అవార్డులు-2024లో ఏపీలోని అన్నమయ్య జిల్లా దుబ్బిగానిపల్లి, ప్రకాశం జిల్లా మురుగుమ్మి.. ఉత్తమ గ్రామ పంచాయతీల విభాగంలో తొలి 2 స్థానాలనూ సొంతం చేసుకున్నాయి. నీటి సంరక్షణకు అద్భుతంగా పనిచేసిన వ్యక్తులకు కేటాయించిన అవార్డుకు రాష్ట్రానికి చెందిన పొదిలి రాజశేఖర్‌రాజు ఎంపికయ్యారు. ఈనెల 18న దిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజేతలకు అవార్డులు ప్రదానం చేయనున్నారు. ఉత్తమ రాష్ట్రం, జిల్లా, పట్టణ స్థానిక సంస్థలు, సంస్థలు, నీటి వినియోగ సంఘాలు, పౌర సంఘాలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, కళాశాలలు, పరిశ్రమలు, వ్యక్తిగత విభాగంలో 46 అవార్డులు ప్రకటించగా రాష్ట్రానికి 3 దక్కాయి. జల్ సంజయ్ జన్ భాగీదారి కార్యక్రమం అమలులో ప్రోత్సాహకర పనితీరును కనబరిచిన రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ విభాగంలో జాతీయ స్థాయిలో 4వ ర్యాంకు సాధించి రూ.2 కోట్ల నగదు బహుమతిని దక్కించుకుంది. జిల్లాల విభాగంలో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు.. దక్షిణ జోన్‌లో 12వ ర్యాంకు సాధించి రూ.25 లక్షల బహుమతి గెలుచుకొంది.

హాయ్‌ల్యాండ్‌కు తరలింపు నిర్ణయంపై రికార్డుల్లేవు

- ఏపీపీఎస్సీ తరఫున హైకోర్టుకు నివేదించిన ఏజీ
- కమిషన్ అధికారుల తీరుపై ధర్మాసనం ఆగ్రహం
- సుమోటోగా కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

ఈనాడు, అమరావతి: గ్రూప్-1 పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనాన్ని మంగళగిరి సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్‌లో నిర్వహించాలని ఎవరు నిర్ణయం తీసుకున్నారో చెప్పేందుకు ఏపీపీఎస్సీ వద్ద రికార్డులు లేవని ఏపీపీఎస్సీ తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. 2021 డిసెంబర్ 5న జవాబుపత్రాలను హాయ్‌ల్యాండ్‌కు తీసుకెళ్లి.. 2022 ఫిబ్రవరి 26న తిరిగి ఏపీపీఎస్సీ కార్యాలయానికి తీసుకొచ్చారని చెప్పారు. సొమ్ము చెల్లించేందుకు జారీ చేసిన చెక్కుల జిరాక్స్‌లు ఉన్నాయని, ఎందుకోసం ఆ సొమ్ము చెల్లించారనే వివరాలు లేవని వివరించారు. ఏపీపీఎస్సీ కార్యాలయంతోపాటు మరో రెండు ప్రభుత్వ కళాశాలల్లో 2022 మార్చి నుంచి మే వరకు మూల్యాంకనం నిర్వహించారని, అందుకోసం అదనంగా ఓఎంఆర్ షీట్లు, బార్‌కోడ్లు, కంట్రోల్ బండిల్స్ ముద్రించారని తెలిపారు. కోర్టు లేవనెత్తిన సందేహాలకు స్పష్టత ఇస్తూ.. అదనపు కార్యదర్శి అఫిడవిట్ వేయడంపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. కార్యదర్శి ఎందుకు ప్రమాణ పత్రం వేయలేదని ప్రశ్నించింది. స్వీయ ప్రమాణపత్రంతో అదనపు అఫిడవిట్ వేయాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది. ఏపీపీఎస్సీ అధికారులు ఇకనైనా పారదర్శకంగా వ్యవహరించాలని.. ఏదైనా తప్పు జరిగితే సుమోటోగా కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ ఉత్తర్వులిచ్చింది. గ్రూప్-1 ప్రధాన పరీక్ష జవాబుపత్రాల మాన్యువల్ మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న కారణంతో పరీక్షను రద్దు చేసి, తాజాగా నిర్వహించాలని హైకోర్టు సింగిల్ జడ్జి 2024లో తీర్పిచ్చారు. దీన్ని సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లపై హైకోర్టు ధర్మాసనం విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. ఆరుగురు మావోయిస్టుల మృతి

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దులోని బీజాపుర్ జిల్లా నేషనల్ పార్క్ అడవుల్లో మంగళవారం ఉదయం నుంచి భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. జిల్లా ఎస్పీ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. నేషనల్ పార్క్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నారని నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో బీజాపుర్, దంతెవాడ జిల్లాల నుంచి డీఆర్‌జీ, ఎస్టీఎఫ్(స్టేట్ టాస్క్‌ఫోర్స్) బృందాలు సంయుక్తంగా అక్కడి అడవుల్లో ఆపరేషన్ చేపట్టాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఇరువర్గాల నడుమ భారీగా కాల్పులు కొనసాగాయి. బలగాలు.. ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఆటోమేటిక్ ఆయుధాలు, ఇన్సాస్, స్టెన్‌గన్‌లు, 303 రైఫిల్స్, ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి. అడవుల్లో దాక్కున్న, పరారైన మావోయిస్టుల కోసం అదనపు బలగాలను పంపించామని ఐజీ సుందర్‌రాజ్ పేర్కొన్నారు. బలగాలు వెనక్కి వచ్చిన తరువాత పూర్తి సమాచారం వెల్లడిస్తామన్నారు. ఈ ఎన్‌కౌంటర్లో మద్దేడు ఏరియా కమిటీ ఇన్‌ఛార్జి బుచ్చన్నతోపాటు మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు కమాండర్ పాపారావు భార్య ఊర్మిళ మృతి చెందినట్లు తెలుస్తోంది.

వసుంధర

vasundhara@eenadu.in

అయిదు నిమిషాలే చేస్తా!

ఈరోజెప్పుడో... ఆ బ్యాగులో పక్కన పెడతాం. అది రోజూ కళ్లముందు కనిపిస్తోంది సర్దాలి సర్దాలి అనుకుంటాం. కానీ చేయం. మంచం నిండా మడత పెట్టాల్సిన దుస్తులే. వారాంతంలో చేద్దామనుకుంటాం. పోస్ట్ గడిపెట్టేసుంటాం కానీ వాటిపై వెళ్లాలనిపించదు. రేపటికల్లా ఆఫీసు పనొకటి పూర్తిచేయాలి. వాలా ఉంది. గడువు తరుముకొస్తుంది... కానీ మనసు మాత్రం చేయనని మారాం చేస్తుంది. ఒకటా, రెండా చెప్పుకోవాలంటే జాబితాకి బోలెడు కనిపిస్తుంటాయి కదూ! అన్నీ తప్పక చేయాల్సినవే. అలసట, అనాసక్తి, తీరిక లేకుండా పనిచేయడం... ఇలా ఎన్నో కారణాలు వాయిదా వేసేలా ప్రోత్సహిస్తుంటాయి. కానీ తరవాత ఎదురయ్యే తిప్పలూ తక్కువేమీ కాదు. వాటినుంచి తప్పించుకోవాలంటే 'అయిదు నిమిషాల' సూత్రాన్ని పాటించమంటారు నిపుణులు.



అంటే ఏమీలేదు... ఇలా అదేపనిగా వాయిదా వేస్తున్న పనులు ఉంటాయి కదా! వాటిని 'ఈ పనిని అయిదు నిమిషాలే చేస్తా, ఒక నిమిషం ఎక్కువా కాదు, తక్కువా కాదు' అని మొదలుపెట్టండి. కావాలంటే అలారం కూడా పెట్టుకోవచ్చు. అయిదు నిమిషాలు పూర్తవగానే ఆపేయొచ్చు కూడా. నిజానికి 'అయిదు నిమిషాలే' చాలా తక్కువ సమయమే ఏం పర్లేదు' అనుకుంటాం కదా! ఆనందంగా మొదలుపెడతాం. ఈక్రమంలో మొదలులో ఆనందాన్ని, పనిని పూర్తిచేయాలని ప్రేరేపించే డోపమైన్, సెరటోనిన్ వంటి హార్మోన్లు విడుదలవుతాయి. దీంతో చక్కగా ప్రారంభించిన పనిని పూర్తిచేస్తాం. కూడా పనిని పట్టుకోవడమే కష్టం. ఆ బద్ధకాన్ని, అనాసక్తిని ఈ సూత్రం అధిగమించేలా చేస్తుంది. లేదా ఆపేసినా కూడా కష్టంగా ఉంటే విరామం తీసుకోండి. తరవాత తిరిగి ఈ అయిదు నిమిషాల సూత్రాన్ని పాటించేయండి. మొత్తానికి పట్టుకోవడానికే ఆలోచిస్తున్న పనిని కదిలించగలిగే శక్తినిస్తుంది ఈ సూత్రం. బాగుంది కదూ... ఈసారి ప్రయత్నించి చూడండి.



చాలావరకూ అమ్మాయిలు ఎవరో ఒకరు చెప్పిన కెరియర్‌లోకి వెళ్తుంటారు. అలాకాకుండా మీకేం కావాలో మీరే ఆలోచించుకోండి. మీకు నచ్చిన మార్గంలో నడవడానికి ప్రయత్నించండి. అలాగే ఎవరో వచ్చి అవకాశాలు చూపిస్తారనీ వేచి చూడొద్దు. మీరే ఎదురెళ్లి వాటి కోసం వెతకండి. అవసరమైతే నేర్చుకోండి. సవాళ్లను స్వీకరించండి. అలా మీదైన మార్గాన్ని నిర్మించుకోండి. ఎందుకంటే మీకు అనువైన కెరియర్ ఏదో నిర్ణయించగలిగేది మీరే... వేరెవరో కాదు.

- అంజలి సుద్, సీఈఓ, టూబి

బంగారం - వెండి

11న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,27,530	1,16,150	1,58,511
విజయవాడ	1,24,780	1,15,790	1,59,600
ప్రొద్దుటూరు	1,24,300	1,14,360	1,57,600
రాజమహేంద్రవరం	1,25,840	1,15,350	1,70,000
విశాఖపట్నం	1,25,820	1,15,750	1,58,000
తమిళనాడు	-----	1,17,000	1,70,000

కార్తిక... కూత కేక!

బెహ్రెయిన్‌లో ఇటీవల జరిగిన ఆసియా యూత్ కబడ్డీ పోటీల్లో భారత బాలికల జట్టు పసిడి పతకం సాధించింది. ఇందులో అద్వితీయ ప్రదర్శనతో అదరగొట్టింది వైస్ కెప్టెన్ కార్తిక. తానుండే కన్నగినగర్‌కి ఉన్న చెడ్డ పేరుని పోగొడతానంటోంది.

చెన్నైలోని పలు ప్రాంతాల్లోని మురికివాడల్ని ఖాళీ చేయించి... వాళ్లకోసం కన్నగినగర్ పేరుతో పెద్ద కాలనీని ఏర్పాటుచేసింది ప్రభుత్వం. నగర శివారులోని ఈ ప్రాంతంలో వేల కుటుంబాలు నివసిస్తున్నాయి. అధిక శాతం కూలీలు. కొందరు పారిశుద్ధ్య కార్మికులుగానూ ఉన్నారు. కార్తిక కుటుంబం ఉండేది ఇక్కడే. తండ్రి రమేష్ సెంట్రింగ్ పని చేస్తుండగా... తల్లి శరణ్య ఆటో నడుపుతారు. చదువుతోపాటు క్రీడలపైనా మక్కువ చూపేది కార్తిక. చిన్నప్పుడే కబడ్డీపై ఆసక్తి పెంచుకుంది. ఆరో తరగతి నుంచే పోటీల్లో పాల్గొని కన్నగినగర్ మహోన్నత పాఠశాలకు గుర్తింపు తెచ్చింది కార్తిక. ఉదయం అయిదింటికే నిద్ర లేచి తన తండ్రి పాత షూస్ వేసుకుని దగ్గర్లోని ఇసుక మైదానంలో ప్రాక్టీస్ చేస్తూ వచ్చింది. కూతురి ఆసక్తి గమనించిన తల్లిదండ్రులు కష్టమైనా సరే, ఓ క్లబ్‌లో శిక్షణకు చేర్పించారు. కోచ్‌ల మార్గనిర్దేశంలో రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లడమే కాదు, అక్కడా ఉత్తమ ప్రతిభ కనబరిచింది. భారత యువ జట్టులో చోటు సంపాదించి, రాణిస్తూ వచ్చింది.




కార్తిక

రూ.25 లక్షల బహుమతి

జాతీయస్థాయి పాఠశాల క్రీడలు, ఖేలో ఇండియా, కబడ్డీ ఫెడరేషన్ నేషనల్స్... పోటీల్లో తమిళనాడుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఎనిమిది పతకాలు గెలిచింది. తమిళనాడు యువ జట్టుకు కెప్టెన్‌గా పని చేసింది. ఆసియా యూత్ కబడ్డీ ఫైనల్లో భారత మహిళల జట్టు ఇరాన్‌ను 75- 21 పాయింట్లతో చిత్తు చేసింది. ఈ పోటీల్లో వైస్ కెప్టెన్‌గా వ్యూహరచనలోనే కాదు, క్రీడాకారిణిగా రాణించి జట్టు గెలుపులో ముఖ్యపాత్ర పోషించిన కార్తికకు ముఖ్యమంత్రి స్టాలిన్ రూ.25 లక్షలు అందించారు. కన్నగినగర్ మహోన్నత పాఠశాలలో పన్నెండో తరగతి చదువుతోంది కార్తిక. పదకొండో తరగతి చదువుతోన్న ఈమె చెల్లెలు కావ్య కూడా కబడ్డీలో రాణిస్తోంది. కన్నగినగర్ అంటేనే నేరాలు, డ్రగ్స్ ఎక్కువనే అభిప్రాయం ఉంది. తన విజయం ద్వారా ఈ అభిప్రాయాన్ని కార్తిక మార్చిందనే చెప్పాలి. 'మా ప్రాంతంలో నివసించే వాళ్లంతా కష్టజీవులు. కొద్దిమంది కారణంగా కన్నగినగర్‌కు వచ్చిన చెడ్డ పేరుని చెరిపేయాలనుకుంటున్నా' అంటోంది కార్తిక.

– ఆశీర్వాదం రావినూతల, చెన్నై



మర్చిపోతారు... జాగ్రత్త!

పిల్లల చదువులన్నా... ఆయనకి కాస్త నలత చేసినా ఇల్లాలికి కంగారే! చిన్నది మర్చిపోయినా ఆందోళనే! అన్నీ ఆలోచిస్తూ... తదేకంగా పని చేస్తూ పోతే ఇలాగే ఉంటుంది మరి. ఇవే కాదు... అల్జీమర్స్ సహా ఇంకా చాలా సమస్యలు వస్తాయి అంటున్నారు న్యూరాలజిస్టులు. బుర్ర సరిగా ఉండాలంటే రోజువారీగా కొన్ని మార్పులూ కావాలంటున్నారు. అవేంటంటే...

అంత చిన్నదానికేనా?

మల్టీ టాస్కింగ్ పేరుతో అన్ని పనులూ మీదేసుకుని చేసుకుంటూ పోతే ఒత్తిడి కాక మరేంటి? దీంతో ఏ చిన్నది అనుకున్నట్టుగా సాగకపోయినా తిరిగి కంగారు. అనవసర ఆందోళన. కొన్నిసార్లు కోపమూ ముంచుకొస్తుంటుంది. ఇదీ మెదడు ఆరోగ్యానికి మంచిది కాదు. ఏదైనా అనుకున్నట్టుగా జరగనప్పుడు కోపం, ఆందోళన మామూలే. కానీ అలా కంగారు పడుతుంటే పరిష్కారం దొరికేదెలా? అందుకే దీర్ఘశ్వాసలు తీసుకునో, అలా పక్కకు వెళ్లో ముందు కాస్త స్థిమితపడండి. ఆ తరవాత సమస్య పూర్వాపరాలు ఆలోచిస్తే పరిష్కారం దొరుకుతుంది. మెదడు మీద భారం తగ్గి, ఆరోగ్యంగానూ ఉంటుంది.



నిద్రపోండి



పిల్లల్ని సమయానికి పడుకోమంటాం. మిగతావారి ఆరోగ్యం గురించీ ఆలోచిస్తాం. మన విషయానికొచ్చేసరికే అశ్రద్ధ చేస్తాం. ఈ పనుంది, రేపటికోసం... అంటూ పనులు చేసుకుంటూ పోతాం. ఈక్రమంలో దూరమయ్యేది నిద్రే. ఇది విశ్రాంతి కోసమే కాదు... జ్ఞాపకాలు పదిలంగా ఉండాలన్నా, శరీరంలోని మలినాలు బయటికి పోవాలన్నా నిద్ర కావాల్సిందే. అది తగ్గితేనే యాంగ్జైటీ, మతిమరుపు వగైరాలన్నీ దరిచేరేది. కాబట్టి, కచ్చితంగా 7 గంటల నిద్ర తప్పనిసరి చేసుకోండి. నిద్రపట్టకపోతే అది వచ్చేలా సరైన చర్యలు తీసుకోండి కానీ... దాన్ని మాత్రం త్యాగం చేయొద్దు.

హెల్మెట్ వాడతారా?



కొద్ది దూరమే... జుట్టు పాడవుతుంది అంటూ చాలామంది అమ్మాయిలు హెల్మెట్ వాడరు. కానీ చిన్న ప్రమాదం చాలు... డిమెన్షియా లాంటి పెద్ద సమస్య రావడానికి. కాబట్టి, ఎంత కొద్దిదూరమైనా హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోండి.

ఏం తింటున్నారు?



గంటలకొద్దీ అదేపనిగా కూర్చోవడం సిగరెట్ తాగడానికి సమానమేనట. అందరూ తిన్నాక తినడం, వృథా అవుతుందని పొట్టలో వేసుకోవడం, గంటలకొద్దీ ఏమీ తినకుండా ఉండటం... అన్నీ శరీరంతోపాటు మెదడుకీ చేటు చేసేవే. కాబట్టి, ఏం తింటున్నాం, ఎంత తింటున్నాం, ఏ వేళలో తింటున్నారన్నదీ చూసుకోవాలి.

కాస్త కదలండి



పిల్లలు స్కూలుకీ, ఆయన ఆఫీసుకీ వెళ్లాక ఇల్లు ఖాళీ. బోర్ కొడుతుంది. కాబట్టి, టీవీ పెట్టి దాని ముందు కూర్చొని పనులు చేస్తుంటారు కొందరు గృహిణులు. ఉద్యోగినులు మాత్రం తక్కువా? ఒక్కసారి కుర్చీలో కూర్చున్నారంటే లేవరు. దీనివల్ల మెదడుకి రక్తం, ఆక్సిజన్ సరఫరా తగ్గుతుంది. కాబట్టి, ప్రతి గంటకోసారి స్ట్రెచింగ్, కొద్దిపాటి నడక, చిన్న విరామాలు తప్పనిసరి. అప్పుడే బుర్ర కూడా ఉత్సాహంగా పనిచేస్తుంది.

అన్నీ తెలిసినా గుర్తుండట్లేదంటారా? అలవాటు అయ్యేవరకూ టైమర్ పెట్టుకోండి. సంబంధిత యాప్‌లు వాడినా సరే. ఏమాత్రం చిరాగ్గా ఉన్నా పని పక్కన పెట్టేయండి. దీర్ఘశ్వాసలు తీసుకోవడం, కాసేపలా పక్కకు వెళ్లి నడవడం వంటివి చేయండి. 7–9 గంటల నిద్ర తప్పనిసరి చేసుకోండి. దాని కోసం ఫోన్ పక్కన పడేయడం, తక్కువ వెలుతురులో నిద్రపోవడం అలవాటు చేసుకోండి. దేన్నైనా మానేయాలి అంటేనే మనసు దానివైపు మరింత బలంగా లాగుతుంది. కాబట్టి, వారానికో 'చీట్ మీల్' పెట్టుకుంటే సరి. ఒకవేళ ఎక్కువగా తింటే తగ్గట్టుగా వ్యాయామం చేయాలన్న నియమమూ పెట్టుకుంటే... ఏ అనారోగ్యకరమైన ఆహారమూ మనల్ని బందీ చేయదు. ఆలోచించాలే కానీ... ఇంకా ఎన్నో ఉపాయాలు! ప్రయత్నించండి మరి!

ప్రెగ్నెంట్ అని చెప్పాలా?

నేనొక పెద్ద ప్రైవేటు కంపెనీకి మార్కెటింగ్ మేనేజర్‌ని. మాది చిన్న విభాగం కావడంతో చాలా పనుల్లో ప్రత్యక్షంగా భాగం కావాల్సి ఉంటుంది. తరచూ ఎగ్జిబిషన్లలో మావి పెద్ద స్టాల్స్‌ని ఏర్పాటుచేస్తుంటాం. దీనికోసం శారీరకంగా శ్రమించాలి. నేను ప్రెగ్నెంట్ (మూడు వారాలు) అని తెలిసింది. ఈ సమయంలో శారీరకంగా కష్టపడటం మంచిదికాదనిపిస్తోంది. ఈ విషయాన్ని ఆఫీసులో హెచ్‌ఆర్‌కు చెబుతానంటే, అప్పుడే వద్దని వారిస్తున్నారు ఇంట్లో. నేనేం చేస్తే మంచిది?

– ఓ సోదరి



డియర్ వసుంధర

కవితా గూడపాటి, ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

ఇలాంటప్పుడు ఏ మహిళైనా ఆందోళన చెందుతారు. కష్టమైన పని, టీమ్ కల్చర్, గర్భధారణ ప్రారంభ దశ... ఈ మూడింటినీ సమన్వయం చేయడం ఎవరికైనా కష్టం. ఈ సమయంలో మీ ఆరోగ్యం, గౌరవం రెండూ కాపాడుకునేలా ఇలా చేయండి.... ముందుగా మీరు డాక్టర్‌ని సంప్రదించండి. మీ వృత్తిలో ఉన్న శారీరక శ్రమ(బరువులు ఎత్తడం, నిచ్చెన ఎక్కడం)ని వివరించండి. రంగుల వాసనల్లాంటివి అక్కడ పీల్చాల్సి ఉంటే ఆ విషయమూ చెప్పండి. ఏవి చేయకూడదో తెలుసుకోండి. అవసరమైతే, గర్భధారణను ప్రస్తావించకుండా తాత్కాలికంగా భారమైన పని చేయకూడదని చెబుతూ చిన్న మెడికల్ నోట్ తీసుకోండి. ప్రెగ్నెన్సీ అంశాన్ని గోప్యంగా ఉంచి, ఆరోగ్య కారణం చూపండి. గర్భం గురించి ఇంకా చెప్పకూడదనుకుంటే... 'డాక్టర్ సూచనల ప్రకారం కొద్ది వారాలపాటు భారమైన పనులు లేదా పెయింట్ వాసనలు ఉన్న ప్రాంతాల్లో ఉండకూడదు. నేను ప్రణాళిక, సమన్వయ పనులు చూస్తాను' అని వివరించండి. ఇలా చెబితే గోప్యత, భద్రత రెండూ ఉంటాయి. ఒకవేళ ప్రమాదం ఉందని డాక్టర్ చెబితే... హెచ్‌ఆర్‌కు స్పష్టంగా చెప్పండి. 'ఆరోగ్య సమస్యలు రాకుండా సమర్థవంతంగా పనిచేయాలని ఉంది. కొంతకాలం పనిలో చిన్న మార్పులు చేయొచ్చా?' అని అడగండి. మీకు తగిన సాయం చేయాల్సిన బాధ్యత సంస్థకు ఉంది. మాట్లాడిన తర్వాత చిన్న రికార్డు నోట్‌చేసి ఉంచండి. ఏదైనా చర్చ తర్వాత చిన్న ఈమెయిల్ పంపండి. తర్వాత ఎలాంటి సందేహాలు వచ్చినా అది మీకు రక్షణగా ఉంటుంది. ఇలా చేస్తే మీరు సురక్షితంగా, ప్రొఫెషనల్‌గా, గౌరవంగా ఉద్యోగంలో కొనసాగవచ్చు.

స్నాక్టివిటీ చేస్తున్నారా?

ఆరోగ్యంగా జీవించాలంటే వారంలో 150 నిమిషాల వ్యాయామం తప్పనిసరి. అంటే అయిదు రోజులు... రోజుకు 30 నిమిషాలు. కానీ, 'గజిబిజి జీవితాల్లో టైమెక్కడ?' అంటూ వ్యాయామాన్ని వాయిదా వేసేవాళ్లే చాలామంది. ముఖ్యంగా మహిళలు. ఇలాంటి వాళ్ల కోసం వచ్చిందే స్నాక్టివిటీ!

రోజులో ఒకేసారి వ్యాయామానికి ఎక్కువ సమయం కేటాయించలేనివాళ్లు, వీలున్నప్పుడల్లా 2-5 నిమిషాల వ్యవధిలో వ్యాయామం చేయడమే స్నాక్టివిటీ. మాట్లాడుతూ నడవడం, బ్రేక్‌లో దూరంగా నడచి కాఫీ తాగడం, మెట్లు ఉపయోగించడం, కారుని గమ్యానికి 100మీటర్ల దూరంలో ఆపి నడవడం, బస్, మెట్రోల్లో ప్రయాణిస్తున్నప్పుడు కాసేపు నిల్చోవడం, వంట సమయంలో వేచిచూస్తున్నప్పుడు గుంజీలు తీయడం, టీవీ చూస్తూ కాళ్లూ, చేతుల్ని పైకి ఎత్తడం... ఇవన్నీ స్నాక్టివిటీలో భాగమే. అసలే కదలకుండా ఉండేకంటే కాసేపైనా వ్యాయామం చేయడం మేలని అధ్యయనాలూ చెబుతున్నాయి. వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాల ఆరోగ్య సమస్యలతో బాధపడేవాళ్లు... స్నాక్టివిటీద్వారా కొంతమేరైనా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.



ప్రణాళిక అవసరం లేదు..

స్నాక్టివిటీకి ప్రణాళిక, ప్రత్యేక దుస్తులు, వస్తువులు అవసరం లేదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఏదో ఒక రూపంలో చేయొచ్చు. పనులమీద వేరే ఊళ్లు వెళ్లినా వీటిని చేయొచ్చు. పిల్లలతో గడిపే సమయాన్ని ఆడుతూ స్నాక్టివిటీ కింద మార్చుకోవచ్చు.

వేళలు ఉండాలా?

ఉదయంపూట నడక, లంచ్‌కు ముందు స్క్వాట్స్, కాఫీ తర్వాత మెట్లు ఎక్కడం, బ్రేక్ సమయంలో పుషప్స్, సాయంత్రం ఏదైనా ఆట... ఇలా సమయం కేటాయించుకోవచ్చు కూడా. కూర్చొని పనిచేసేవాళ్లు గంటకోసారి లేచి వీటిని చేసేలా చూసుకోవాలి. ఉన్నంతలో మంచి ఫలితాలు రావాలంటే 2-5 నిమిషాలు చొప్పున రోజులో నాలుగైదు సార్లు చేయాలి.

మేలెంత?

వ్యాయామం మొదలుపెట్టినప్పుడు కణాలు ఉత్తేజితమవుతాయి. ఆ ప్రభావం పూర్తిస్థాయి వ్యాయామానికి సమానంగా ఉంటుంది. తేలికపాటి వ్యాయామం తర్వాత ఉత్సాహంగా ఉంటారని ఓ అధ్యయనం చెబుతోంది. ప్రతి అదనపు కదలికా శక్తిని ఖర్చు చేసేదే... ఫలితంగా జీవక్రియ పెరుగుతుంది. వ్యాయామ సమయంలో గుండె రక్తాన్ని ఎక్కువగా పంపు చేయాలి. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. ఊపిరితిత్తులూ అదనంగా పనిచేయాలి. మెట్లు ఎక్కడం, తేలికపాటి బరువులెత్తడం, గుంజీలూ, పుషప్‌లతో కండరాలు దృఢమవుతాయి.

నిస్సహాయుల కోసమే ఈ 'సహాయత'

పక్షవాతంతో కదల్లేని స్థితిలో ఉండి... కాలకృత్యాలన్నీ మంచం మీదే జరిగే వాళ్లను చూసి 'అయ్యో పాపం' అంటూ బాధపడతాం. శ్రుతీ బాబు బాధపడి ఊరుకోలేదు. తన చదువు ఇలాంటి నిస్సహాయులకి ఉపయోగపడాలి అనుకున్నారు. అందుకామె ఏం చేశారంటే...

'ఇలా బతికే బదులు... చనిపోతేనే బాగుణ్ణు' పక్షవాతం బారిన పడిన ఓ వృద్ధుడిని చూసి బంధువుల మాటలివి. అంతలోనే ఆయన మంచమ్మీదే మూత్రం పోసుకున్నారు. దాన్ని చూసి... ఆయన ఇద్దరు కూతుళ్లు అసహ్యించుకున్నారట. దూరం నుంచి ఈ ఘటనను గమనిస్తూనే ఉన్నారు శ్రుతి. ఆరోజు ఆయన కళ్లలో బాధ, అపరాధ భావం ఇప్పటికీ నాకు గుర్తే అంటారామె. ఆ ఘటనే ఆమె ఆవిష్కరణకు కారణమట. 'వీళ్లే కాదు వయసు మళ్లిన, ప్రమాదాల బారిన పడిన వాళ్లంతా... కదల్లేని పరిస్థితుల్లో ఎవరో ఒకరి మీద ఆధారపడాల్సిందే. చేసే వారుంటే పర్వాలేదు. కానీ, అలా లేనివారికి ఎంత ఇబ్బంది. తిట్లు, చీదరింపులతో అనుక్షణం చస్తూ బతుకుతారు. అలాంటి వారందరి బాధనూ దూరం చేయాలనుకున్నా. సహాయం లేకుండా కాలకృత్యాలు తీర్చుకునేలా ఓ వీల్‌ఛైర్ తయారుచేయాలనుకున్నా' అనే శ్రుతి పుట్టిపెరిగిందంతా తమిళనాడులోని కోయంబత్తూరు. బయో మెడికల్ ఇంజినీర్ ఈమె.



శ్రుతి

ఆ టెక్నిక్‌తో...

'ఇప్పటికే పక్షవాతం, కదల్లేని సమస్యలతో బాధపడుతున్న వాళ్లకు ఆధునిక సాంకేతికతతో చాలానే వీల్‌ఛైర్లు అందుబాటులోకి వచ్చాయి. కానీ అవన్నీ చాలా ఖర్చుతో కూడుకున్నవి. పైగా, వీటిల్లో టాయిలెట్ సౌకర్యం ఉన్నవీ తక్కువే. ఈ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకుని మొదలైంది నా ప్రయాణం. అప్పటికి నేను ఓ వైద్య ఆవిష్కరణపై ఒడిశాలో ఫెలోషిప్ చేస్తున్నా. దాన్ని విడిచిపెట్టి... దీనిపై దృష్టి సారించా. కోయంబత్తూర్‌లోని ఓ చిన్న ల్యాబ్‌లో పరిశోధనలు ప్రారంభించా. నాన్న కె.కె.బాబు కూడా నా ఆశయానికి తోడయ్యారు. ఆయన మెకానికల్ ఇంజినీర్. ఇద్దరం దీని రూపకల్పనలో జపనీస్ టెక్నిక్ ఉపయోగించాలని నిర్ణయించుకున్నాం. మన వాష్‌రూమ్‌ల్లో ఇప్పటికే ఈ సాంకేతికత అందుబాటులో ఉంది. కానీ వీల్‌ఛైర్‌కు ఇలాంటిది వాడలేదు. ఓ నీళ్ల ట్యాంక్, జెట్ స్ప్రే, తీసిపెట్టేలా ఓ కంటైనర్‌ను వీల్‌ఛైర్‌కే అమర్చా. యూరిన్, మోషన్ పాస్ చేశాక బటన్ నొక్కితే చాలు. శుభ్రం అయిపోతుంది. తర్వాత కంటైనర్ తీసేస్తే సరి. 118సార్లు మార్పులూ చేర్పులూ చేసిన తర్వాత మేము అనుకున్న డిజైన్ తయారైంది. నిస్సహాయులకు సహాయం అందించే ఉద్దేశంతో దీన్ని రూపొందించా కాబట్టి దీనికి 'సహాయత' అని పేరు పెట్టా' అంటారు శ్రుతి. ఇప్పటికే 140 దేశాల్లో ఇది అందుబాటులోకి వచ్చింది. దాదాపు 300మంది దీన్ని వినియోగిస్తున్నారు కూడా. కనీస అవసరాల్ని తీర్చుకోలేని స్థితిలో ఉన్న వారికోసం ఆలోచించి... తన చదువును వారి సమస్య పరిష్కారానికి ఉపయోగించిన శ్రుతి ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ!



కేక్... డోనట్... వేఫల్స్ అన్నీ ఇంట్లోనే!

స్మార్ట్ కిచెన్

బయట దొరికే డోనట్... కేక్... వేఫల్స్‌ని చూస్తే తినకుండా మనం ఉండగలమా! తీరా తిందామంటే వాటిలో ఎన్ని ప్రిజర్వేటివ్స్ కలిపారో అనే భయం. వీటినే పిల్లలూ తింటే ఎన్ని అనారోగ్యాలో. వద్దని వాళ్లని ఎంత ఆపినా ఆగుతారా? వాటన్నింటిని దూరం చేసేలా ఇంట్లోనే నచ్చిన రుచులు, ఆకారాల్లో తయారుచేసుకునేలా వచ్చేశాయి ఈ బేకరీ పరికరాలు...



యమ్మీ యమ్మీ డోనట్...




స్కూల్ నుంచి రావడంతోనే 'అమ్మా ఈరోజు స్పెషల్‌గా స్నాక్స్ ఏం చేశావ్' అంటూ మొదలుపెడతారు పిల్లలు. వాళ్లకీ ఎప్పుడూ ఒకే తరహాలో చేసి పెడితే ఏం బావుంటుంది? అందుకే... ఈ 'ఆటోమేటిక్ డోనట్ మేకర్'ని తెచ్చుకుని చూడండి. బేకరీ స్టైల్లో యమ్మీ యమ్మీ మినీ డోనట్స్ ఇంట్లోనే చేసి చిన్నారులకి పెట్టొచ్చు. దీనిలో నాన్‌స్టిక్ బేకింగ్ ట్రే ఉండటం వల్ల పిండి అంటుకుంటుందనే భయం లేదు. బ్యాటర్‌ని కలిపి ట్రేలో వేసి బేకింగ్ సమయాన్ని ఒకసారి సెట్ చేసుకుంటే చాలు. డోనట్స్ తయారైన తర్వాత దానంతటదే ఆఫ్ అయిపోతుంది. మొదటిసారి చేసేవాళ్లకీ సులువుగానే ఉంటుంది.

వేడి వేడి పాన్‌కేక్...



చిన్నారులతో పొద్దున్నే టిఫిన్ తినిపించాలంటే అమ్మలకి పెద్ద పనే కదా. పెట్టింది ఓ పట్టాన తినరు. చపాతీ వద్దు. ఇడ్లీ నాకు ఇష్టం ఉండదు. ఇలాంటి మాటలు రాకుండా వారిని మెప్పించేందుకు వచ్చిందే ఈ 'పాన్‌కేక్ పాన్'. జంతువులు, పువ్వులు, స్మైలీ బొమ్మలతో దొరుకుతుంది. రకరకాల ఆకారాలతో పాన్‌కేకులు చేసి పెట్టారంటే 'నచ్చలేదు' మాటే రాదు. ఫినాలిక్ హ్యాండిల్, అల్యూమినియంతో తయారైన ఈ పాన్ గ్యాస్, ఎలక్ట్రిక్ స్టవ్‌లపైనా కూడా పనిచేస్తుంది. పెనం వేడెక్కిన తర్వాత మిశ్రమాన్ని నచ్చిన ఆకారాల్లో పోసి దోసెను తిరగేసినట్లు తిరగేస్తే సరి పాన్‌కేకు రెడీ అవుతుంది.



క్రంచీ క్రంచీ వేఫల్స్...



క్రిస్పీగా ఉండే వేఫల్స్ ఒక్కొక్కరు ఒక్కోలా తినడానికి ఇష్టపడతారు. కొందరు తేనె, పీనట్ బటర్‌తో లేదా షుగర్ సిరప్‌లో ముంచి తింటే, చాక్లెట్, ఐస్‌క్రీమ్‌ని దానిలో నింపి ఆస్వాదిస్తారు ఇంకొందరు. వేఫల్స్ చిప్స్, క్రిస్పులు(బిస్కెట్ తరహావి) మినీ కోన్స్‌ని తినే వేఫల్స్ ప్రేమికులకోసం వచ్చినదే 'వేఫల్ బౌల్ మేకర్'. నాలుగు అంగుళాల మందం, నాన్‌స్టిక్ గ్రిడ్‌తో తయారయ్యింది ఈ మేకర్. విద్యుత్‌తో పనిచేస్తుంది. ముందుగా సిద్ధం చేసుకున్న పిండిని ఈ బౌల్‌లో వేసి మూతపెట్టాలి. దీనికి ఇండికేటర్ లైట్ ఉండటంవల్ల వేఫల్ బేక్ అవ్వగానే దానంతటదే ఆగిపోతుంది. ఇలా తయారైన వాటిలో మనకు నచ్చిన ఫ్రూట్స్, స్మూతీలు వంటివి సర్వ్ చేసుకుని వాటితో పాటు కప్పుల్ని కూడా తినేయొచ్చన్నమాట. ఈ పరికరాలు మీకూ నచ్చాయా అయితే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ అందుబాటులో ఉన్నాయ్ ఓసారి చూసేయండి.



డ్రగ్స్ కేసులో వైకాపా విద్యార్థి నేత కొండారెడ్డి

- నా దగ్గర కుర్రాళ్లున్నారు.. ఎండీఎంఏ కావాలని అడిగి కొన్నాడు
- విచారణలో వెల్లడించిన నిందితుడు మధుసూదన్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: నిషేధిత మత్తు పదార్థం ఎండీఎంఏ సరఫరా కేసులో బెంగళూరులో అరెస్టయిన మధుసూదన్‌రెడ్డి (మ్యాడీ)తో విశాఖపట్నం వైకాపా విద్యార్థి విభాగం నేత కొండారెడ్డికి ఉన్న సంబంధాలు బయటపడ్డాయి. ఆదివారం రాత్రి విజయవాడ పోలీసులు మ్యాడీని అదుపులోకి తీసుకుని విజయవాడకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వైకాపా నాయకుడితో ఉన్న సంబంధాల గురించి అతను వెల్లడించాడు. బెంగళూరులో ఎండీఎంఏ కొనుగోలు చేసి విశాఖ తీసుకెళ్తుండగా శ్రీవాత్సవ్, హవీలాలు విజయవాడలో పట్టుబడ్డారు. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన విజయవాడ పోలీసులు ఇప్పటి వరకు పలువురు విశాఖవాసులను అరెస్టు చేశారు. నాలుగు నెలలుగా తప్పించుకు తిరుగుతున్న మధుసూదన్‌రెడ్డిని ఇటీవల బెంగళూరులో అరెస్టు చేశారు. విచారణలో అతను కీలక విషయాలను చెప్పాడు.




కొండారెడ్డి

ఏయూ విద్యార్థి రాజకీయాల్లో ఎదిగి..

ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థి రాజకీయాల్లో చక్రం తిప్పుతున్న కొండారెడ్డి తక్కువ సమయంలోనే వైకాపాలో కీలక నేతగా ఎదిగాడు. అతను మ్యాడీకి పలుసార్లు కాల్స్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. 'నాకు కొండారెడ్డి ఒకసారి ఫోన్ చేశాడు. నేను విశాఖలో రాజకీయంగా ఎదుగుతున్నా. నా వద్ద చాలా మంది కుర్రాళ్లున్నారు. వారికి (డ్రగ్స్) కావాలని అడిగాడు. కొండారెడ్డితో పాటు విశాఖకు చెందిన లోహిత్‌ఆదిత్య కూడా పలుసార్లు ఫోన్లు చేశారు. డ్రగ్స్ కావాల్సి వచ్చినప్పుడల్లా శ్రీవాత్సవ్ నన్ను కాంటాక్ట్ చేసేవాడు. బెంగళూరు వచ్చినప్పుడు తీసుకెళ్లి, విశాఖపట్నంలో కొండారెడ్డి, లోహిత్‌ఆదిత్యలకు అందజేసేవాడు. తమకు అందినట్లు మళ్లీ కొండారెడ్డి ఫోన్ చేసి చెప్పేవాడు' అని మ్యాడీ విచారణలో చెప్పాడు. ఎండీఎంఏ తనతోపాటు తిరిగే పలువురు విద్యార్థులకు అలవాటు చేశాడని తేలింది. విజయవాడలోని మాచవరం స్టేషన్‌లో నమోదైన ఈ కేసులో కొండారెడ్డిని నిందితుడిగా చేర్చే అవకాశం ఉందని తెలిసింది.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్-2026 రిజిస్ట్రేషన్ తుది గడువు 28

ఈనాడు, హైదరాబాద్: జాతీయ ర్యాంకింగ్ (ఎన్ఐఆర్ఎఫ్)-2026లో పాల్గొనేందుకు ఆయా కళాశాలలు, వర్సిటీలు ఈ నెల 10 నుంచి 28వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ ఆయా విద్యాసంస్థలకు ఈ మెయిల్ ద్వారా సమాచారం అందజేసింది. మొత్తం 17 విభాగాల్లో ర్యాంకులు ఇస్తుండగా... ఏయే కేటగిరీల్లో పాల్గొనాలనుకుంటున్నారో ముందుగానే నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. 2026 ర్యాంకింగ్స్‌ను వచ్చే జులై నుంచి సెప్టెంబరు మధ్యలో విడుదల చేస్తారు.



విజువల్ మాలిక్యులర్ డైనమిక్స్ సాంకేతికతతో గుర్తించిన వైరస్ పొరలు

హెచ్ఐవీ ఉపరకాల గుర్తింపు

ఐఐఎస్సీ కీలక అధ్యయనం

ఈనాడు, బెంగళూరు: శరీరంలోని రోగ నిరోధక శక్తిని ఎదుర్కొని చూపుతూ హెచ్ఐవీ నియంత్రణలో.. ఉపరకాల వైవిధ్యత సవాలుగా నిలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ జాడలు, ఆయా వ్యక్తుల జన్యు నిర్మాణానుసారంగా ఈ రకాలు రూపాంతరం చెందుతోంది. ఈ వైవిధ్యాన్ని గుర్తించడంలో ఎదురయ్యే సంక్లిష్టత, టీకా, ఔషధాల తయారీలోనూ సవాళ్లు విసురుతోంది. దీనికి పరిష్కారం కోసం బెంగళూరులోని భారతీయ విజ్ఞాన సంస్థ(ఐఐఎస్సీ) కంప్యుటేషన్ బయో కెమిస్ట్రీ శాస్త్రవేత్తలు కీలక అధ్యయనాన్ని చేపట్టారు. హెచ్ఐవీ వైరస్‌పై ఉండే ఉపరితల గ్లైకాన్(చక్కెర అణువులు) పొర.. రోగ నిరోధక శక్తికి కేంద్రమైన సీడీ4, టీ కణాల నుంచి రక్షణ కల్పిస్తుంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉండే ఈ వైరస్ గ్లైకాన్ పొరలను ఛేదించేందుకు యాంటీబాడీస్ (బీఎన్ఏబీఎస్) తెలిపే.. టీకాలు తయారు చేసేలా వైవిధ్యత రక్షణగా ఆ గ్లైకాన్లు అన్ని వైరస్‌లను నియంత్రించలేకపోతున్నాయి. విజువల్ మాలిక్యులర్ డైనమిక్స్ సిమ్యులేషన్ ద్వారా అత్యంత ప్రమాదకారిగా పరిగణించే ఆరు రకాల హెచ్ఐవీ వైరస్ రకాలు, వాటి ప్రవర్తనను ఐఐఎస్సీ బృందం మోడలింగ్ చేసింది. ఈ రకాలను వివిధ రంగుల్లో గుర్తించిన ఐఐఎస్సీ బృందం సత్ఫలం అందుకు తగిన యాంటీబాడీలు, టీకాలు, థెరపీలను తయారు చేసే అవకాశాన్ని విస్తృతం చేశారు. ముకుల్ అదిదాదర, యోగేంద్రకుమార్, నరేంద్ర దీక్షిత్, రఘునాథ్ మైటీ తదితర శాస్త్రవేత్తలతో కూడిన బృందం చేపట్టిన అధ్యయనాన్ని హెచ్ఐవీ నియంత్రణలో కీలక మలుపుగా విశ్లేషిస్తున్నారు.

సత్యసాయి శతజయంతి వేడుకలు వైభవంగా నిర్వహిద్దాం

19న ప్రధాని, 22న ఉపరాష్ట్రపతి, 23న రాష్ట్రపతి రాక

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంత్యుత్సవాలను వైభవంగా నిర్వహిద్దామని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం సత్యసాయి శతజయంతి వేడుకలపై ఏర్పాటైన కమిటీ సభ్యులు, అధికారులతో కలిసి మంత్రులు అనగాని, పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి, సత్యకుమార్, సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, ఎమ్మెస్ రాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కృష్ణబాబు, అజయ్ జైన్‌తో సమీక్ష నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. సత్యసాయి కేంద్ర ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్‌తో భేటీ అయ్యారు. వేడుకల వేదిక హిల్‌వ్యూ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ ఉత్సవాలను రాష్ట్ర పండగగా కూటమి ప్రభుత్వం ప్రకటించిందన్నారు.

✦ 19న మహిళా దినోత్సవానికి ప్రధాని మోదీ ఉదయం 9 గంటలకు వచ్చి, 11.15 గంటలకు వెళ్తారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. 22న సత్యసాయి విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, 23న రాష్ట్రపతితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, పలువురు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు వేడుకలో పాల్గొంటారని తెలిపారు.

హైకమాండ్ ఒత్తిడితోనే కల్తీ నెయ్యి కొనుగోలు

(మొదటి పేజీ తరువాయి)

డెయిరీ ట్యాంకర్లు, క్యాన్ల ద్వారా సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరిగిందని మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించగా ధర్మారెడ్డి మిన్నకుండిపోయారు.



ధర్మారెడ్డికి లడ్డూ ఇచ్చేందుకు యత్నిస్తున్న కిరణ్ రాయల్ ★ భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు విపిన్ జైన్, పొమిల్ జైన్

ఎవరెవరికి ప్రమేయం ఉంది?

తితిదేలో నెయ్యి, బియ్యం, జీడిపప్పు, యాలకులు, ఇతర వస్తువుల కొనుగోళ్లు ఎలా జరుగుతాయి? నెయ్యి టెండర్ల ఖరారులో ఎవరెవరికి ప్రమేయం ఉంటుంది? ఆయా ప్లాంట్లను ఎన్ని నెలలకు తనిఖీ చేస్తారు? లోటుపాట్లు మీ దృష్టికొచ్చాయా? ఏఆర్ డెయిరీ తిరుమలకు కిలో నెయ్యి రూ.318.57కే సరఫరా చేస్తామని చెప్పినప్పుడు అనుమానం ఎందుకు రాలేదు? నాణ్యమైన నెయ్యి ఆ ధరకు ఇవ్వలేరు కదా? అని సిట్ అధికారులు ఆయన్ను ప్రశ్నించారు. కొనుగోళ్లకు కమిటీని నియమిస్తామని, ఏడాదికోసారి తనిఖీలు జరుగుతాయని ధర్మారెడ్డి తెలిపారు.

'మిల్క్' పదాన్ని ఎందుకు తొలగించారు?

తితిదేకు నెయ్యి సరఫరా చేయాలంటే జాతీయ డెయిరీలకు రోజూ 4లక్షల లీటర్లు, రాష్ట్రంలోని డెయిరీలకు 2లక్షల లీటర్ల పాలు సేకరించే సామర్థ్యం ఉండాలని కొన్నేళ్ల క్రితమే నిబంధనలు ఉండగా.. మీ హయాంలో 2020 ఫిబ్రవరిలో 'మిల్క్' అనే పదాన్ని ఎందుకు తొలగించారో చెప్పాలన్నారు. భోలేబాబా డెయిరీకి కాంట్రాక్టు కట్టబెట్టేందుకే నిబంధనల్లో ఇష్టారాజ్యంగా మార్పులు చేశారా? అని అడిగారు. ఈ విషయంలో తాను జోక్యం చేసుకోలేదని, కమిటీలే చూసుకున్నాయని ధర్మారెడ్డి చెప్పారు. 2023 నవంబరులో తిరిగి 'మిల్క్' పదాన్ని టెండరు నిబంధనల్లో ఎందుకు చేర్చాల్సి వచ్చిందని, ఎవరెవరికి లబ్ధి చేకూరిందో చెప్పాలని ప్రశ్నించగా తనకు తెలియదని సమాధానం ఇచ్చారు.

భోలేబాబా డైరెక్టర్లు మిమ్మల్ని కలిశారా?

ఐదేళ్లలో భోలేబాబా డెయిరీ తిరుమలకు 68.17 లక్షల కిలోల కల్తీ నెయ్యి పంపించి రూ.251.53 కోట్లు సంపాదించినట్లు తమ విచారణలో తేలిందని డీఐజీ మురళీ రాంబా పేర్కొన్నారు. ఆ సంస్థ తన డెయిరీతో పాటు శ్రీ వైష్ణవి, ఏఆర్ డెయిరీ, మాల్‌గంగా సంస్థ నుంచి తితిదేకు సరఫరా చేసిందన్నారు. భోలేబాబా డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్ లడ్డూను అపవిత్రం చేయడంలో కీలకపాత్ర పోషించారని చెప్పారు. వారిద్దరూ మిమ్మల్ని ఎప్పుడైనా కలిశారా? అని అడగ్గా లేదని ధర్మారెడ్డి తెలిపారు.

వైవీ సుబ్బారెడ్డి పాత్రపైనా ఆరా?

2019-23 మధ్య తితిదే ఛైర్మన్‌గా పనిచేసిన వైవీ సుబ్బారెడ్డికి కల్తీ నెయ్యి వ్యవహారంలో పాత్ర ఉందా? అని ఆరాతీసినట్లు సమాచారం. కొనుగోళ్ల కమిటీలే చూసుకుంటాయని ధర్మారెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా తన హయాంలో చేసిన పలు సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రస్తావించినట్లు సమాచారం.

లడ్డూలు తీసుకోకుండా..

మధ్యాహ్నం భోజనం చేయడానికి ధర్మారెడ్డి బయటకు రాగా మీడియా ఆయనతో మాట్లాడేందుకు ప్రయత్నించింది. కారు ఎక్కిన ఆయనను ఫొటోలు, వీడియోలు తీస్తుండగా తానే కిందకు దిగుతానన్నారు. అదే సమయంలో జనసేన నేత కిరణ్ రాయల్ రెండు తిరుమల లడ్డూలు ఆయనకు ఇచ్చేందుకు యత్నించగా తీసుకోలేదు. రాత్రి 7.15 గంటల సమయంలో ధర్మారెడ్డి విచారణ ముగియగా ఆయన బయటకు వచ్చి మీడియాతో మాట్లాడతారని అనుకున్నారు. విచారణ ముగిసిన చాలాసేపటి తర్వాత ఏమీ మాట్లాడకుండానే వెనుదిరిగారు.

హాజరైన విపిన్ జైన్, పొమిల్ జైన్

కల్తీ నెయ్యి కేసు ఓ కొలిక్కి రావడంతో భోలేబాబా డైరెక్టర్లు విపిన్ జైన్, పొమిల్ జైన్‌కు మరోసారి సిట్ నోటీసులు ఇచ్చింది. ఎవరెవరి నుంచి రసాయనాలు కొన్నారు? తితిదేలో ఎవరెవరు డబ్బులు డిమాండ్ చేశారు? ఎంత మొత్తం ఎవరికి ముట్టజెప్పారని అడిగినట్టు తెలుస్తోంది. మరో నిందితుడైన అపూర్వ చావ్డా తరఫు న్యాయవాది సిట్ కార్యాలయానికి వచ్చారు. అతను మాత్రం రాలేదని సమాచారం.

✦ ఈ కేసులో ఈ ఏడాది మే 6న నెల్లూరు ఏసీబీ కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. నెలాఖరులోగా మలి ఛార్జ్‌షీట్ సమర్పించే అవకాశం ఉంది.

వైవీ సుబ్బారెడ్డి పీఏ ఖాతాలో రూ.4.69 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కడినుంచి జమయ్యాయి? అంత భారీ మొత్తాలు ఎందుకు వచ్చినట్లు? ఆ సొమ్మును ఏ ఖాతాలకు బదిలీ చేశారనే కోణంలో కీలక వివరాలు రాబట్టిన సిట్.. ఇదంతా కల్తీ నెయ్యి సరఫరాదారుల నుంచి అందిన లంచాల సొమ్మేనని, చిన్న అప్పన్న ఖాతా నుంచి 'అంతిమ లబ్ధిదారుకు' చేరిందని గుర్తించింది. ఎస్‌బీఐ విజయవాడ బ్రాంచ్‌లో బవిరెడ్డి శ్రీదేవి పేరిట చిన్న అప్పన్నకు ఓ ఖాతా ఉంది. అందులోనూ అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు సిట్ తేల్చింది. 2021-24 మధ్య చిన్న అప్పన్న తగరపువలసలో ఒక్కోటి 160 గజాల విస్తీర్ణం కలిగిన 5 ప్లాట్లు, లంకెలపాలెంలో 240 గజాల చొప్పున 8 ప్లాట్లు, రుషికొండలో ఓ ఫ్లాటు కొన్నట్లు గుర్తించింది. ఇందుకు డబ్బు ఎక్కడినుంచి వచ్చిందనేదానిపై సిట్ ఆరాతీస్తోంది. తితిదేకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో సిట్ దర్యాప్తులో తాజాగా ఈ అంశాలన్నీ వెలుగులోకి వచ్చాయి.

నెయ్యి కాని నెయ్యి సరఫరా

నెయ్యి అంటే ఎవరైనా పాలతో తయారుచేస్తారు. కానీ పామాయిల్, పామ్ కర్నెల్ ఆయిల్‌తో ఓ పదార్థాన్ని సిద్ధం చేసి... దానికి కృత్రిమంగా నెయ్యి సువాసన వచ్చేలా చేసేందుకు బీటా-కెరోటిన్ లాంటి రసాయనాలను కలిపితే అది నెయ్యి అవుతుందా? కానే కాదు కదా.. కానీ వైకాపా హయాంలో ఇలా నెయ్యే కానిదాన్ని నెయ్యి పేరిట తితిదేకు సరఫరా చేశారు. ఏకంగా రూ.251.53 కోట్ల విలువైన 68.17 లక్షల కిలోల నకిలీ నెయ్యిని తయారుచేసిన భోలేబాబా డెయిరీ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అందులో రూ.137 కోట్ల విలువైన 37.38 లక్షల కిలోలను వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ ద్వారా తితిదేకు సరఫరా చేసింది. ఈ కల్తీ నెయ్యినే లడ్డూ, ఇతర ప్రసాదాల తయారీలో వినియోగించినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. తద్వారా భక్తులు మనోభావాలు దెబ్బతిన్నాయని వెల్లడైంది.

కల్తీ ఉందని తేలినా కొనసాగింపు

వైవీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు తిరుమలకు సరఫరా అవుతున్న నెయ్యి నమూనాలను నాణ్యత పరీక్షల కోసం మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్‌కు పంపగా ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, వైష్ణవి డెయిరీ, భోలేబాబా డెయిరీలు సరఫరా చేసిన నెయ్యిలో వెజిటబుల్ ఆయిల్స్ కలిసి ఉన్నాయని, అది కల్తీ నెయ్యి అని తేలింది. ఈ విషయాన్ని తితిదే ప్రొక్యూర్‌మెంట్ జీఎం సుబ్రహ్మణ్యం 2022 మేలో సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కల్తీ నెయ్యి వస్తోందని తెలిసినా సుబ్బారెడ్డి ఏ ఒక్క సరఫరాదారుపైనా చర్యలు తీసుకోలేదు. ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, వైష్ణవి డెయిరీలను 2024 వరకూ, భోలేబాబాను 2022 అక్టోబరు వరకూ నెయ్యి సరఫరాదారులుగా కొనసాగించారు. ఈ కొనసాగింపుతోనే ఆ లంచాల బంధం ఎంత గాఢంగా పెనవేసుకుందో స్పష్టమవుతోంది.

> **లంచాల కోసం మహాపాపం**
>
> వైకాపా హయాంలో తిరుమలలో లడ్డూ తిన్నవారు అంతకు ముందున్నట్లు లడ్డూ నాణ్యత, రుచి లేదని, ఎక్కువ రోజులు నిల్వ ఉండట్లేదని ఆవేదన వ్యక్తం చేసేవారు. దానికి కారణమేంటనేది సిట్ తాజా దర్యాప్తులో తేటతెల్లమైపోయింది. తితిదేలోని నాటి పెద్దలే లంచాల కోసం దగ్గరుండి మరీ ఈ కల్తీ నెయ్యి సరఫరా సంస్థలకు గేట్లెత్తినట్లు నిగ్గు తేలింది. అప్పటి తితిదే ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న (ఏ-24) కిలోకు రూ.25 చొప్పున లంచం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేసినట్లు వెల్లడైంది. తర్వాత వారినుంచి పలు విడతలుగా డబ్బు అందుకున్నట్లు తేలింది. లంచాల కోసమే వైకాపా ముఠా ఈ మహాపాపానికి ఒడిగట్టింది.



పీలిస్తే.. రోగాలే..

- తెలుగు రాష్ట్రాల్లో వేగంగా క్షీణిస్తున్న గాలి నాణ్యత
- హైదరాబాద్‌లో ఐదు రోజుల్లో 50% తగ్గుదల
- తిరుపతిలో పది రోజుల్లోనే 150% క్షీణత
- విశాఖలో 'పూర్' లెవల్‌కు..
- ముమ్ముందు మరింత ఆందోళనకరంగా వాయు కాలుష్యం

ఈనాడు, హైదరాబాద్: పడిపోతున్న ఉష్ణోగ్రతలు తెలుగు రాష్ట్రాల్లో వాయు కాలుష్య తీవ్రతను పెంచుతున్నాయి. హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం నగరాల్లో గాలి నాణ్యత వేగంగా పడిపోతోంది. ఈ పరిణామం ముమ్ముందు మరింత ఆందోళనకర స్థాయికి చేరుకోవచ్చని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తోంది. దేశంలోని 254 నగరాలు, పట్టణాల్లోని వాయు కాలుష్యాన్ని నిరంతరం నమోదు చేసేందుకు ఆన్‌లైన్ కేంద్రాలున్నాయి. అక్కడ నమోదయ్యే గాలి నాణ్యత సూచి(ఏక్యూఐ)ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) నిర్ధారించి... ప్రతి 24 గంటలకు ఒకసారి బులెటిన్ రూపంలో విడుదల చేస్తుంది. మంగళవారం సాయంత్రం విడుదలైన బులెటిన్‌లో తెలుగు రాష్ట్రాల్లోని నగరాల్లో వాయు కాలుష్యం గణనీయంగా పెరిగినట్లు వెల్లడైంది.

◆ **తిరుపతి:** నవంబరు 1న 85గా ఉన్న ఏక్యూఐ 11వ తేదీకి 216కి పెరిగింది. ఇక్కడ సంతృప్తికరం నుంచి 'పూర్' స్థితికి వేగంగా చేరింది. ప్రత్యేకంగా వృద్ధులు, పిల్లలు, ఆస్తమా, హృద్రోగులు జాగ్రత్తలు తీసుకోవాలి.

◆ **విశాఖపట్నం:** ఇక్కడ వాయు కాలుష్యం మధ్యస్థంగా ఉన్నా 190 పాయింట్లతో 'పూర్' స్థితికి అతిసమీపంలో ఉంది. సాధారణ ప్రజలకు పెద్దగా ప్రమాదం లేదు. పిల్లలు, వృద్ధులు, రోగులు అప్రమత్తంగా ఉండాలి.

◆ **రాజమహేంద్రవరం:** గాలి నాణ్యత కొద్ది రోజుల వ్యవధిలోనే 'గుడ్' నుంచి 'మధ్యస్థం' స్థాయికి చేరింది. సాధారణ ప్రజలకు పెద్దగా ప్రమాదకరం కాకున్నా... శ్వాసకోశ, హృద్రోగ సమస్యలున్న వారు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.

◆ **విజయవాడ:** 91 పాయింట్లతో సంతృప్తికరంగా కనిపిస్తున్నా మధ్యస్థానికి దగ్గరలో ఉంది. నగరవ్యాప్తంగా గాలి పరిస్థితి బాగానే ఉన్నప్పటికీ, రాజీవ్‌నగర్ ప్రాంతంలో కాలుష్యం కొంచెం ఎక్కువగా ఉంది.

పాయింట్లకు అనుగుణంగా గ్రేడింగ్

వాయుకాలుష్య లెక్కల్లో గాలి నాణ్యత సూచీలో నమోదయ్యే పాయింట్లే కీలకం. పాయింట్ల లెక్కలను బట్టి గాలి నాణ్యతకు గ్రేడింగ్ ఇస్తారు. ఇవీ వివరాలు...

◆ **గుడ్ (0–50):** గాలి నాణ్యత చాలా బాగున్నట్లు. ఆరోగ్యంపై ఎటువంటి ప్రభావం ఉండదు.

◆ **సంతృప్తికరం (51–100):** గాలి నాణ్యత సంతృప్తికరంగా ఉన్నట్లు. పిల్లలు, వృద్ధులు, ఊపిరితిత్తుల సమస్యలుండే వారికి కొంత అసౌకర్యంగా ఉంటుంది.

◆ **మధ్యస్థం (101–200):** ఊపిరితిత్తులు, గుండె సమస్యలు ఉన్నవారికి శ్వాసలో ఇబ్బంది కలుగుతుంది.

◆ **పూర్ (201–300):** ఈ వాతావరణంలో చాలామందికి శ్వాస సంబంధిత అసౌకర్యం కలుగుతుంది. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్న వారికి మరింత ఇబ్బందికరం.

◆ **వెరీ పూర్ (301–400):** గాలి నాణ్యత అధ్వానంగా ఉన్నట్లు. దీర్ఘకాలం ఇలాంటి వాతావరణం కొనసాగితే శ్వాస సంబంధిత వ్యాధులొచ్చే ప్రమాదం ఎక్కువ.

◆ **సివియర్ (400+):** ఈ గాలి అత్యంత ప్రమాదకరం.

> హైదరాబాద్‌లో నవంబరు 5న 68గా ఉన్న గాలి నాణ్యత సూచీ 11వ తేదీకి 102 పాయింట్లకు చేరుకుంది. జూపార్క్(164), ఇక్రిశాట్(142), ఐడీఏ పాశమైలారం(136)లలో కాలుష్యం ఎక్కువగా నమోదవుతోంది. 'ఊపిరితిత్తుల్లో సమస్యలు ఉన్నవారికీ, ఆస్తమా, హృద్రోగ బాధితులకు అసౌకర్యం కలగవచ్చు. పారిశ్రామిక ప్రాంతాల్లో ఉన్నవారు జాగ్రత్తలు పాటించాలి. దుమ్ము, పొగ ఉండే ప్రాంతాల్లో ఎక్కువసేపు ఉండొద్దని' వైద్యులు సూచిస్తున్నారు.

> **చాలా జాగ్రత్తలు తీసుకోవాలి**
>
> 
>
> వాతావరణం బాగా చల్లగా ఉంటే ఇంట్లోనే ఉండాలి. ఎండ వచ్చాకే బయటకు వెళ్లడం మేలు. అవసరమైతే మంచి మాస్క్ పెట్టుకుని వెళ్లాలి. ఆస్తమా, సీవోపీడీ వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్నవారు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇన్‌హేలర్‌ను వాడేవారు క్రమం తప్పకుండా వినియోగించాలి. పొగతాగేవారు ఆ అలవాటును మానుకోవాలి. చలి వాతావరణంలో ఊపిరితిత్తుల రక్షణ వ్యవస్థ బలహీనంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గినప్పుడు గాలిలోని ధూళికణాలు ఐదారడుగుల ఎత్తులోనే ఉంటాయి. గాలిని పీల్చుకున్నప్పుడు అవి లోపలికి వెళ్లి ఊపిరితిత్తులను దెబ్బతీస్తాయి. కొన్నిసార్లు న్యుమోనియాకు దారితీసే ప్రమాదముంది. దీర్ఘకాలిక ఊపిరితిత్తుల సమస్యలున్నవారు ఏడాదికోసారి ఇన్‌ఫ్లూయెంజా టీకాను, ఐదేళ్లకోసారి న్యుమోకాకల్ టీకాను వేయించుకోవాలి.
>
> **- డాక్టర్ జీకే పరంజ్యోతి,**
> **సీనియర్ ప్రొఫెసర్ పల్మనరీ మెడిసిన్ విభాగం, నిమ్స్**

సీఎం పర్యటనల్లో హెలిప్యాడ్ ఏర్పాట్లలో నిర్లక్ష్యం

- ప్రకాశం, గుంటూరు ఆర్అండ్‌బీ ఎస్ఈలకు తాఖీదులు

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు పర్యటనల నేపథ్యంలో హెలిప్యాడ్ నిర్మాణం, అక్కడి ఏర్పాట్లలో నిర్లక్ష్యం చూపారంటూ ప్రకాశం, గుంటూరు జిల్లాల ఆర్ అండ్‌బీ ఎస్ఈలకు, ఈఈలకు ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) తాఖీదులు ఇచ్చారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గంలోని పెద్ద ఇర్లపాడు పంచాయతీ జి.లింగన్నపాలెంలో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవానికి సీఎం మంగళవారం హాజరయ్యారు. దీని కోసం హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. అయితే సోమవారం మధ్యాహ్నం ట్రయల్‌లో భాగంగా అధికారులు చాపర్‌ను హెలిప్యాడ్‌లో దించే సమయంలో పెద్దఎత్తున దుమ్ము లేచింది. అక్కడేమీ కనిపించని పరిస్థితి నెలకొంది. హెలిప్యాడ్ చుట్టూ దుమ్ములేవకుండా నీటితో తడపాల్సి ఉండగా, అదేమీ చేయలేదని గుర్తించారు. దీంతో ఒంగోలు ఎస్ఈ రవినాయక్, కనిగిరి ఈఈ సమర్పనరావులకు ఈఎన్‌సీ రామచంద్ర తాఖీదులు జారీచేశారు. మరోవైపు గుంటూరులోని లాంఫాంలో ఈ నెల 7న ఎన్‌జీ రంగా 125వ జయంత్యుత్సవాల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. దీని కోసం అక్కడ హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. ట్రయల్‌లో భాగంగా ఆరోజు మధ్యాహ్నం అక్కడ చాపర్‌ను దించగా, అది కొంత కుంగింది. దీంతో హెలిప్యాడ్ నిర్మించడంలో విఫలమయ్యారంటూ గుంటూరు ఆర్అండ్‌బీ ఎస్ఈ, ఈఈలకూ ఈఎన్‌సీ తాఖీదులు జారీచేశారు.

ఇకపై కాంక్రీట్‌తోనే నిర్మించండి..

ఈ ఘటనల నేపథ్యంలో ఇకపై సీఎం పర్యటనలకు సిద్ధం చేసే హెలిప్యాడ్‌లను కాంక్రీట్‌తోనే నిర్మించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రస్తుతం వెట్‌మిక్స్‌పై సిమెంట్ స్లరీ వేస్తున్నారు. దీనివల్ల కొన్నిచోట్ల ఇబ్బందులు వస్తున్నాయి. అందుకే అన్నిచోట్ల ఒకే విధంగా కాంక్రీట్‌తోనే నిర్మాణం ఉండేలా చూడాలని ఆదేశించారు. అయితే కొన్నిసార్లు సీఎం పర్యటన ముందు రోజు రాత్రి ఖరారవుతుండటంతో ఆగమేఘాలపై పనులు చేయడంతో ఇబ్బందులు వస్తున్నాయని ఇంజినీర్లు చెబుతున్నారు.

నిరసనలు తెలిపే అర్హత వైకాపాకు లేదు

ఏపీ సీడాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి ధ్వజం

ఈనాడు, అమరావతి: అసత్యాలతో ప్రజల్ని మభ్యపెడుతున్న వైకాపాకు నిరసనలు చేసే అర్హత లేదని, పీపీపీ విధానంపై ఆ పార్టీ చేస్తున్న సంతకాల సేకరణ నాటకాన్ని ప్రజలు అడ్డుకోవాలని ఏపీ సీడాప్ ఛైర్మన్ జి.దీపక్‌రెడ్డి కోరారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. "పేద ప్రజలకు, వైద్య విద్యార్థులకు అనుకూలమైన పీపీపీ విధానాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొస్తుంటే, వైకాపా తప్పుడు ప్రచారం చేస్తోంది. కొత్త విధానంతో సుమారు 2 వేల వరకు సీట్లు, 1,500 వరకు పడకలు పెరుగుతాయి. పేదోడికి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుతుంది. జగన్ ప్రారంభించిన ఐదు వైద్య కళాశాలలను ఎన్ఎంసీ తనిఖీచేసి అవి వైద్య కళాశాలల్లా లేవని సీట్లు కుదించింది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం 2014-19లో వైద్య రంగంలో రాష్ట్రం నాలుగో స్థానంలో ఉంటే, 2019-24 మధ్య వైకాపా పాలనలో పదో స్థానానికి పడిపోయింది" అని దీపక్‌రెడ్డి గుర్తుచేశారు.

పరకామణి కేసు విషయాలన్నీ నాటి ఈవో ధర్మారెడ్డికి తెలుసు

- చోరీ కేసు నమోదు తప్ప నాకు మరేమీ తెలీదు
- సీఐడీ దర్యాప్తులో అప్పటి తితిదే ఎస్టేట్ అధికారి మల్లికార్జునరావు
- సీఐడీ దర్యాప్తులో వెలుగుచూస్తున్న ఆసక్తికర విషయాలు

ఈనాడు డిజిటల్, తిరుపతి; న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): పరకామణి చోరీ, లోక్‌అదాలత్‌లో రాజీ లాంటి విషయాలన్నీ అప్పటి ఈవో ధర్మారెడ్డికి తెలుసని.. కేసు నమోదు తప్ప మరే వివరాలూ తనకు తెలియవని అప్పటి తితిదే ఎస్టేట్ అధికారి మల్లికార్జునరావు సీఐడీ దర్యాప్తు బృందానికి వెల్లడించినట్లు సమాచారం. కనీసం కేసు పంచనామా చేసినట్లూ తనకు తెలియదని చెప్పినట్లు తెలిసింది. హైకోర్టు ఆదేశాల మేరకు తిరుమల పరకామణి చోరీ కేసును సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ ఆధ్వర్యంలోని బృందం ఆరు రోజులుగా దర్యాప్తు చేస్తోంది. రోజురోజుకూ ఆసక్తికర విషయాలు వెలుగుచూస్తున్నాయి. గత ప్రభుత్వంలో రెవెన్యూ శాఖలో పనిచేసే మల్లికార్జునరావు (నాటి చిత్తూరు ఆర్డీవో)ను తితిదేలోకి డిప్యుటేషన్‌పై తీసుకుని ఎస్టేట్ అధికారిగా నియమించారు. పరకామణి డిప్యూటీ ఈవో పోస్టు ఖాళీగా ఉండడంతో అదనపు బాధ్యతలూ అప్పగించారు. ఆ సమయంలోనే పరకామణిలో చోరీ జరగడంతో సీఐడీ ఆయన్ను మంగళవారం విచారణకు పిలిచింది. ఎస్టేట్ అధికారిగా ఎప్పుడు బాధ్యతలు తీసుకున్నారు? పరకామణిలో ఎలాంటి విధులు నిర్వహించారు? చోరీ జరిగినప్పుడు నిందితుడి వద్ద ఎన్ని డాలర్లు గుర్తించారు? వాటిని పంచనామా చేశారా? ఎవరికి అప్పగించారు? అని ప్రశ్నించగా.. పంచనామా విషయం తనకు తెలియదని, చోరీ జరిగిందని తెలిశాక నిందితుడిని వీజీవోకి అప్పగించామని, తర్వాత కేసు నమోదు తప్ప మిగిలిన విషయాలు తనకు తెలియవని చెప్పినట్లు సమాచారం. లోక్‌అదాలత్‌లో కేసు రాజీ అయిన విషయమైనా తెలుసా అన్న ప్రశ్నకు.. ఆ విషయం తరువాత తెలిసిందని చెప్పారు. పరకామణి చోరీ కేసును అప్పటి ఈవో ధర్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారా అని ప్రశ్నించగా, ఆయనకు అన్ని విషయాలూ తెలుసని అన్నట్లు సమాచారం.

సీసీటీవీ ఫుటేజీలు ఎలా మాయమయ్యాయి?

పరకామణి చోరీ విచారణలో భాగంగా.. దొంగతనం జరిగిన రోజు పరకామణిలో పనిచేసిన ఆర్ఎస్సై సుబ్బరాజు, సీసీటీవీ కెమెరా ఇన్‌ఛార్జి చంద్ర, పరకామణి గార్డు రామచంద్రలను సీఐడీ బృందం వేర్వేరుగా విచారించింది. నిందితుడిని గుర్తించగానే ఎన్ని డాలర్లు దొరికాయి? పంచనామా చేశారా? అని వారిని అడగ్గా.. డాలర్ల విషయాన్ని గుర్తించకుండా నిందితుడిని ఏవీఎస్వో సతీష్‌కుమార్‌కు అప్పగించినట్లు తెలిపారు. అప్పటివరకూ ఉన్న సీసీటీవీ ఫుటేజీలు ఎలా అదృశ్యమయ్యాయని ఆరా తీయగా తమకు తెలియదని చెప్పినట్లు సమాచారం. అసలు చోరీ ఎన్ని గంటలకు జరిగింది? ఎంత సమయంలోగా ఏవీఎస్వోకు అప్పగించారని ప్రశ్నించారు. రాజీ విషయం మీ దృష్టికొచ్చిందా అని అడగ్గా.. తమకు తెలియదని వారు బదులిచ్చినట్లు తెలిసింది.

కల్తీ నెయ్యి కేసులో వైవీ సుబ్బారెడ్డికి నోటీసులు

విచారణకు హాజరుకావాలన్న సిట్

ఈనాడు, తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో ఈ నెల 13న విచారణకు హాజరుకావాలని తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మెయిల్ ద్వారా నోటీసులు పంపింది. 13 నుంచి 15 వరకు లఖ్‌నవూలో జరగనున్న పార్లమెంట్ ఫైనాన్స్ స్టాండింగ్ కమిటీ సమావేశానికి వెళుతున్నందున తాను రాలేనని సుబ్బారెడ్డి సమాధానమిచ్చారు. వారం రోజుల తర్వాత హైదరాబాద్‌లోని నివాసానికి చేరుకుంటానని, ఆ తర్వాత విచారణకు హాజరవుతానని ఆయన బదులిచ్చారు. ఇదే కేసులో ఇప్పటికే సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్న అప్పన్నను సిట్ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అతని కస్టడీ పిటిషన్‌పై నెల్లూరు ఏసీబీ కోర్టులో మంగళవారం వాదనలు జరిగాయి. ఈ నెల 14న న్యాయమూర్తి తీర్పు ఇవ్వనున్నారు. ప్రీమియర్ అగ్రిఫుడ్స్ సంస్థకు కాంట్రాక్టు ఇప్పించేందుకు ఆయన రూ.50 లక్షలు తీసుకున్నారని ఇప్పటికే దర్యాప్తులో తేలింది.

ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరించిన లోకేశ్

ఈనాడు, అమరావతి: సమస్యలు ఓపిగ్గా వింటూ, నేనున్నానంటూ.. బాధితులకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆయన మంగళవారం 72వ ప్రజా దర్బార్ నిర్వహించారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి..

✦ పోలవరం ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం, పూడిపల్లి గ్రామస్థులు కోరారు. దేవీపట్నంలో పునరావాస కాలనీ త్వరగా పూర్తి చేయాలని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం అర్హులందరికీ పునరావాసం కల్పించాలని లోకేశ్‌ను కోరారు.

✦ పలు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన ఒంగోలుకు చెందిన మైత్రి ప్లాంటేషన్ అండ్ హార్టికల్చర్ రియల్టర్స్ సంస్థపై చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలని కర్నూలు జిల్లా పెరవలికి చెందిన రంగస్వామి అర్జీ ఇచ్చారు.

✦ 250 మంది మాజీ సైనికుల కుటుంబాలకు ఉచితంగా లేదా, నామమాత్రపు ధరతో 10 ఎకరాల స్థలాన్ని ఇవ్వాలని కోరుతూ కడపకు చెందిన జై జవాన్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ ప్రతినిధులు వినతి ఇచ్చారు.

✦ ఏడాది క్రితం మధుమేహం, ఇతర సమస్యలతో కుడికాలు తొలగించారని. . ఆర్థికంగా ఆదుకోవాలని గుంటూరు జిల్లా గార్లపాడుకు చెందిన నిడుబ్రోలు అంజలి కోరారు.

✦ పుట్టుకతో బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న తన 14 ఏళ్ల బిడ్డకు రూ.15 వేల పింఛను ఇప్పించాలని పల్నాడు జిల్లా గోనుగుంటకు చెందిన ఏసురత్నం అర్జీ ఇచ్చారు.


దివ్యాంగుడికి స్కూటీ అందజేత

మండపేట నియోజకవర్గం చెన్నూరుకు చెందిన దివ్యాంగుడు మెర్ల వెంకటేశ్వరరావుకు మంత్రి లోకేశ్ మూడు చక్రాల స్కూటీ అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనను అభినందించడానికి గత నెలలో వెంకటేశ్వరరావు ఆటోలో పాలకొల్లు వెళ్లి లోకేశ్‌ను కలిశారు. ఆ విషయం తెలుసుకున్న మంత్రి తన సొంత నిధులతో వెంకటేశ్వరరావుకు స్కూటీ అందజేశారు.

జీవవైవిధ్య బోర్డులకు రూ.41 లక్షలు

ఈనాడు, దిల్లీ: పేటెంట్ ఆధారిత ప్రయోజన పంపిణీ కింద జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ దేశంలోని 5 రాష్ట్రాల జీవవైవిధ్య బోర్డులకు రూ.41.24 లక్షలు విడుదల చేసింది. ఇందులో అత్యధికంగా ఏపీ బోర్డుకు రూ.20.66 లక్షలు దక్కాయి. తమిళనాడు బోర్డుకు రూ.16.79 లక్షలు, ఒడిశాకు రూ.2.09 లక్షలు, యూపీకి రూ.91 వేలు, మధ్యప్రదేశ్‌కు రూ.79 వేలు మాత్రమే అందాయి. మేధోసంపత్తి హక్కుల ద్వారా ఈ నిధులు లభించాయి.

విస్తృత తనిఖీలు.. వాహనాల బారులు!



తనిఖీల వల్ల అలిపిరి టోల్‌గేట్ వద్ద బారులుతీరిన వాహనాలు

ఈనాడు, తిరుపతి: దిల్లీలో పేలుడు నేపథ్యంలో తిరుమల, తిరుపతిలో భద్రతను కట్టుదిట్టం చేశారు. శ్రీవారి దర్శనార్థం నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తుండటంతో తనిఖీలు పెంచారు. అలిపిరిలోని టోల్‌గేట్ వద్ద తిరుమలకు వెళ్లే వాహనాలను క్షుణ్నంగా తనిఖీ చేశాకే అనుమతించారు. దీంతో మంగళవారం ఉదయం వాహనాలు బారులు తీరాయి. తగిన పత్రాలు లేని వాహనాలను వెనక్కి పంపుతున్నారు. నడక మార్గంలో, బస్టాండు, రైల్వే స్టేషన్లలోనూ ప్రత్యేక సాయుధ దళాలు తనిఖీలు చేపట్టాయి.

11 గంటలు ప్రయాణించిన కారు

• పేలుడుకు ముందు పలు ప్రాంతాల్లో సంచారం

దిల్లీ: దేశ రాజధానిలో సోమవారం పేలుడుకు కారణమైన ఐ20 కారు.. అంతకుముందు 11 గంటలపాటు పలు ప్రాంతాల్లో ప్రయాణించినట్లు తేలింది. అది హరియాణాలోని ఫరీదాబాద్ నుంచి దిల్లీకి ప్రయాణించింది. టోల్‌ప్లాజాలు, సీసీ టీవీ కెమెరాల నుంచి సేకరించిన ఆధారాలతో దర్యాప్తు బృందాలు ఈ నిర్ధారణకు వచ్చాయి.

■ సోమవారం ఉదయం 7.30 గంటల సమయంలో కారు తొలుత ఫరీదాబాద్‌లోని ఆసియన్ ఆసుపత్రి బయట కనిపించింది.

■ ఉదయం 8.13 గంటలకు బదర్‌పూర్ టోల్ ప్లాజాను దాటి దిల్లీలోకి ప్రవేశించింది. అక్కడ ముఖానికి మాస్క్ ధరించిన వ్యక్తి టోల్‌ప్లాజా సిబ్బంది నుంచి రసీదు అందుకుంటున్నట్లు కనిపించింది.

■ 8.20 గంటలకు ఓఖ్లా పారిశ్రామిక ప్రాంతంలోని ఓ పెట్రోలు బంకువద్ద సీసీ టీవీ కెమెరాల్లో కనిపించింది. ఆ తర్వాత పెట్రోలు బంకు కాలుష్య ధ్రువీకరణ పత్రం తీసుకున్నట్లు కెమెరాల్లో నమోదైంది.

■ సాయంత్రం 3.19 గంటలకు ఎర్రకోట కాంప్లెక్స్‌లోని పార్కింగ్ ప్రాంతానికి వచ్చింది. సునెహ్రీ మసీదు పార్కింగ్ ప్రాంతంలో ఉమర్ సుమారు మూడుగంటల పాటు నిరీక్షించాడు. ఫరీదాబాద్ ఘటనలో అరెస్టులు సంబంధించిన వార్తల్ని ఇంటర్నెట్‌లో శోధించాడు.

■ 6.22 గంటలకు పార్కింగ్ ప్రాంతాన్ని వీడి కారు బయటకు వచ్చింది. ఎర్రకోటవైపు మళ్లింది. 6.52 గంటలకు కారు పేలింది. ఈ మధ్యలో కారు ఎక్కడెక్కడ తిరిగిందనే దానిపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు.



ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో సోమవారం సంభవించిన పేలుడు తీవ్రతకు శిథిలాలుగా మారిన వాహనాలు

డీఎన్ఏ నమూనాల సేకరణ

పేలుడు స్థలంలో కనుగొన్న శరీర భాగాలు ఉమర్‌వేనా అనే కోణంలో విచారిస్తున్న అధికారులు.. అతడి తల్లిని పుల్వామాలోని ఆసుపత్రికి తీసుకెళ్లి డీఎన్ఏ నమూనాలు సేకరించారు. అంతేకాకుండా ఉమర్ సోదరులు జహూర్, ఆషిక్ నబీ విచారణకు హాజరయ్యారు. అధికారులు వారిని కొన్ని గంటలు ప్రశ్నించారు. ఉమర్ తండ్రినీ కొన్నిసార్లు విచారిస్తున్నారు. 'పేలుడుకు ముందు శుక్రవారం ఉమర్ తన తల్లికి ఫోన్ చేసి 'లైబ్రరీలో పని పుస్తకాల్లో ఉన్నాను, నాకు కాల్ చేయొద్దు' అని చెప్పి ఫోన్ స్విచాఫ్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ తరువాత ఆయనతో ఎలాంటి సంప్రదింపులు జరగలేదని చెప్పారు.

■ ఫరీదాబాద్‌లోని వైద్య కళాశాలలో ఉమర్‌తో కలిసి పని చేస్తున్న పలువురు డాక్టర్లను దర్యాప్తు అధికారులు ప్రశ్నిస్తున్నారు.

చదివింది వైద్యం.. అనుసరించింది ఉగ్రవాదం!

• ఉమర్ నబీ.. పుల్వామా వాసి

శ్రీనగర్: దిల్లీలో కారు బాంబు పేలుడుకు పాల్పడ్డాడని భావిస్తున్న ఉమర్ నబీ.. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లా కోయిల్ గ్రామానికి చెందినవాడు. ఉమర్ తల్లి షమీమా బేగం, తండ్రి జీహెచ్ నబీ భట్. భట్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేసి దశాబ్దం క్రితమే పదవీ విరమణ చేశారు. ఉమర్ 1989 ఫిబ్రవరిలో జన్మించాడు. శ్రీనగర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, ఎండీ (మెడిసిన్) పూర్తి చేసిన తర్వాత కొన్నేళ్లు జీఎంసీ అనంతనాగ్‌లో సీనియర్ రెసిడెంట్‌గా పని చేశాడు. తరువాత ఫరీదాబాద్‌లోని అల్‌ఫలాహ్ మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించాడు.

■ ఉగ్ర కుట్రలో అతడు పాల్గొన్నాడంటే నమ్మలేకపోతున్నామని ఉమర్ వదిన ముజామిల్ తెలిపారు. అతడు చిన్నప్పటి నుంచి ఎవరితో కలవకుండా అంతర్ముఖుడిగా ఉండేవాడని, అతడికి ఎక్కువ మంది స్నేహితులూ లేరని వెల్లడించారు. 2 నెలల కింద ఉమర్ ఇంటికి వచ్చి వెళ్లాడని వెల్లడించారు.

దిల్లీ పేలుడు కుట్రదారులను వదిలిపెట్టం

భూటాన్ పర్యటనలో ప్రధాని మోదీ వెల్లడి

థింపూ: దిల్లీలోని ఎర్రకోట వద్ద బాంబు దాడి కుట్రదారులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని భారత ప్రధాని మోదీ హెచ్చరించారు. దర్యాప్తు సంస్థలు ఈ ఘటనపై దర్యాప్తును ముమ్మరం చేశాయని, దాడికి కారణాలను అధికారులు త్వరలో వెల్లడిస్తారని తెలిపారు. పేలుడులో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భూటాన్ మాజీ రాజు జిగ్మే సింగ్యే వాంగ్‌చుక్ 70వ జయంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు భారత ప్రధాని మోదీ మంగళవారం థింపూ చేరుకున్నారు. అక్కడ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'చాలా బరువెక్కిన హృదయంతో ఈ రోజు నేను ఇక్కడికి వచ్చాను. సోమవారం సాయంత్రం దిల్లీలో జరిగిన భయానక ఘటన ప్రతి భారతీయుడిని విషాదంలో ముంచేసింది. బాధిత కుటుంబాల దుఃఖాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నాను. దేశం మొత్తం ఈ కష్ట సమయంలో వారికి అండగా ఉంది. అమాయకుల ప్రాణాలు తీసిన వారందరికీ తగిన శిక్ష తప్పదు' అని స్పష్టం చేశారు. శతాబ్దాలుగా భారత్‌కు భూటాన్‌తో దృఢమైన, సుదీర్ఘమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక బంధాలు ఉన్నాయని ప్రధాని మోదీ తెలిపారు.



భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ వాంగ్‌చుక్‌తో కలిసి పునత్సంగ్చు-2 ప్రాజెక్టును ప్రారంభించిన మోదీ

గుండెలు పిండేసే దృశ్యాలు

• ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రివద్ద మృతుల బంధువుల రోదన

• తమవారు మరణించారో.. గాయపడ్డారో తెలుసుకునేందుకు వచ్చి ఆవేదన



పేలుడు ఘటనలో ఆప్తుల్ని కోల్పోయి దిల్లీలోని మౌలానా ఆజాద్ వైద్య కళాశాల మార్చురీ వద్ద రోదిస్తున్న ఓ వ్యక్తి

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ (ఎల్ఎన్‌జేపీ) ఆసుపత్రి వద్ద మంగళవారం గుండెలు పిండేసే దృశ్యాలు కనిపించాయి. సోమవారం కారు బాంబు పేలుడులో మరణించిన, గాయపడిన వారి బంధువుల రోదనలతో ఆ ప్రాంతం మిన్నంటింది. భద్రతా సిబ్బంది వారిని గేట్లవద్ద ఆపేయడంతో వారు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. తమవారు మరణించారా.. గాయపడ్డారా తెలుసుకోవడానికి వారు నానా పాట్లు పడ్డారు. భద్రతా కారణాలతో శవాగారం గేటును పోలీసులు మూసివేశారు. కేవలం అనుమతి ఉన్న వారినే అనుమతించారు. అక్కడ తమ వారి గురించి ఆసుపత్రి సిబ్బందిని బాధితుల బంధువులు ఆరా తీయడం కనిపించింది. అంబులెన్సులు లోపలికి రావడం, పోవడంతో వారు ఆందోళనతో కన్నీరు మున్నీరయ్యారు.

భీతావహం..

ఆసుపత్రివద్ద రాత్రి భీతావహ దృశ్యాలు కనిపించాయని ఓ ఉద్యోగి తెలిపారు. 'గుర్తించలేని స్థితిలో మృతదేహాలు వచ్చాయి. కొంత మందివి మాంసం ముద్దలుగా వచ్చాయి. చాలా మంది అంతర్గత అవయవాలు చిందరవందరగా ఉన్నాయి. అవి ఎవరివని చెప్పడం అసాధ్యం' అని ఆయన వివరించారు.

■ ఉదయం నుంచి అధికారులు శ్రమించి.. మృత దేహాలను గుర్తించి బంధువులకు అప్పగించారు.

■ బాంబు పేలుడులో గాయపడ్డ నోమాన్ కుటుంబం రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యులు ఒకరినొకరు ఓదార్చుకుంటూ కనిపించారు. ఆయన మృత దేహాన్ని గుర్తించేందుకు వారు ఎంతో కష్టపడాల్సి వచ్చింది. శరీర భాగాలను వస్త్రంతో చుట్టి అంబులెన్సులో పంపారు.

■ మరో మృత దేహం అంబులెన్సులో వెళ్తుండగా.. కుటుంబ సభ్యులు ఇ-రిక్షాలో అనుసరించారు.

ఆసుపత్రి వద్ద భద్రత

మృతదేహాలను సోమవారం రాత్రి తరలించిన ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రివద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కాజువాలిటీ, అత్యవసర విభాగాలను మూసివేశారు. ఎవరినీ అనుమతించలేదు.

■ ప్రమాదం ఆసుపత్రి కావడంతో మంగళవారం ఉదయమే పెద్ద సంఖ్యలో రోగులు వచ్చారు. ఆసుపత్రికి చెందిన పలు గేట్లను మూసివేసిన భద్రతా సిబ్బంది.. ఇతర బ్లాక్‌లకు వెళ్లాలని రోగులకు సూచించారు. నాలుగో నంబరు గేటువద్ద ఉన్న రోగి మాట్లాడుతూ.. దూరంగా ఉన్న గేటుద్వారా వెళ్లాలని అధికారులు సూచించారని తెలిపారు.

కోర్టు సమీపంలో ఆత్మాహుతి దాడి

• పాకిస్థాన్‌లో 12 మంది మృతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో మంగళవారం ఆత్మాహుతి దాడి చోటుచేసుకుంది. ఈ ఘటనలో 12 మంది మృతిచెందగా.. మరో 36 మంది గాయపడ్డారు. ఇస్లామాబాద్ జిల్లా కోర్టు సమీపంలో పార్క్ చేసిన కారులో మధ్యాహ్నం 12.39 గంటలకు పేలుడు సంభవించినట్లు అధికారులు పేర్కొన్నారు. కారులో గ్యాస్ సిలిండర్‌ను అమర్చి పేల్చివేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. పేలుడు చాలా తీవ్రంగా ఉండటంతో పలు వాహనాలు దెబ్బతిన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మృతులు, క్షతగాత్రుల్లో ఎక్కువ మంది న్యాయవాదులు, కోర్టులో పనిచేస్తున్న సిబ్బంది ఉన్నట్లు వెల్లడించారు. ఘటనా స్థలాన్ని హోంమంత్రి మోసిన్ నఖ్వీ సందర్శించారు. నిందితుడు తొలుత కోర్టు ప్రాంగణంలో దాడి చేయాలని భావించినా.. తర్వాత ప్రణాళిక మార్చుకుని ఉండొచ్చన్నారు. అఫ్గానిస్థాన్ తన ఉగ్రవాదాన్ని ఆపాలని, లేదంటే దీనికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కాగా ఈ దాడికి సంబంధించి బాధ్యత వహిస్తూ ఏ ఉగ్ర సంస్థ ప్రకటన చేయలేదు. అయితే దీనికి కారణం తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్(టీటీపీ)అని అనుమానిస్తున్నారు.

ఐఈడీ పేలి 16 మంది భద్రతా సిబ్బందికి గాయాలు

పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులో ఐఈడీ పేలి 16 మంది భద్రతా సిబ్బంది గాయపడ్డారు. వారి వాహనశ్రేణిని లక్ష్యంగా చేసుకుని ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలో సోమవారం ఈ దాడి జరిగినట్లు అధికారులు తెలిపారు.

జైషే మహిళా విభాగంలో డాక్టర్ షాహీన్

ఫరీదాబాద్ ఉగ్రకుట్రలో భాగస్వామి

ఫరీదాబాద్, దిల్లీ: ఫరీదాబాద్ ఉగ్ర కుట్రలో భాగస్వామి అయిన డాక్టర్ షాహీన్ వెనుక ఏకంగా జైషే మొహమ్మద్ నెట్‌వర్క్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆ సంస్థ మహిళా విభాగంలో ఆమె కీలక పాత్ర పోషిస్తోంది. 35 ఏళ్ల వయసుండే ఆమెను అరెస్టు చేసిన పోలీసు అధికారులు కీలక విషయాలు రాబట్టినట్లు తెలుస్తోంది. భారత్ ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో జైషే చీఫ్ మసూద్ అజార్ కుటుంబం ఛిన్నాభిన్నమైంది. ఆ ఉగ్ర సంస్థకు చెందిన ప్రధాన కేంద్రం కూడా ధ్వంసమైంది. ఈ క్రమంలో జైషే మహిళా బ్రిగేడ్‌ల ఏర్పాటుకు ఆన్‌లైన్ కోర్సులు ప్రారంభించినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ జమాత్ ఉల్ మొమినాత్ విభాగానికి మసూద్ సోదరి సాదియా అజార్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ విభాగంలో షాహీన్‌కు కీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. పాక్‌లోని ఉగ్రవాదుల నుంచి అందుతున్న ఆదేశాలతో భారత్‌లో మహిళా విభాగాలు స్థాపించి, వారి నియామకాలు చేపట్టడం వంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి.

లఖ్‌నవూ నివాసి

ఫరీదాబాద్ ఆపరేషన్ నేపథ్యంలో ముగ్గురు వైద్యులు- అదీల్ అహ్మద్, ముజమ్మిల్ షకీల్, షాహీన్‌లను అధికారులు అరెస్టు చేశారు. షాహీన్ లఖ్‌నవూలోని లాల్‌బాగ్ నివాసి. ముజమ్మిల్‌తో షాహీన్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆయుధాలను నిల్వ చేసేందుకు అనుమానితులు ఉపయోగించిన కారు మహిళా డాక్టర్ పేరు మీదే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పేలుడు పదార్థాల స్వాధీనం నేపథ్యంలో ఫరీదాబాద్‌లో ముమ్మరంగా సోదాలు చేపట్టారు.



లఖ్‌నవూలో మంగళవారం షాహీన్ ఇంటి వద్ద పోలీసులు, మీడియా సిబ్బంది

మరో వైద్యురాలి అరెస్టు

ఉగ్రవాద నెట్‌వర్క్‌తో సంబంధాలున్న ఆరోపణలపై ఉత్తర్‌ప్రదేశ్‌లో మరో మహిళా డాక్టర్‌ను అధికారులు అరెస్టు చేశారు. సహారన్‌పుర్‌కు చెందిన డాక్టర్ పర్వేజ్ అన్సారీ ఇంటిపై దాడులు చేసిన పోలీసులు ఆమెను కస్టడీలోకి తీసుకున్నారు. ఫరీదాబాద్ ఉగ్రకుట్రలోని డాక్టర్ అదీల్‌తో ఈమెకు సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. కశ్మీర్‌లోని ప్రైవేటు పాఠశాలల్లో బాలికలకు ఉగ్రవాద భావజాలం నూరిపోస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

పేదలకు ఆశారేఖగా మారిన మిత్రమండలి

ఝార్ఖండ్‌లోని హజారీబాగ్‌కు చెందిన 17 మంది విద్యార్థులు ఓ మిత్రమండలిగా ఏర్పడి నిస్సహాయులకు సేవలను అందిస్తున్నారు. ముఖ్యంగా దేశంలో కనుమరుగవుతున్న బిర్హోర్ తెగ ప్రజలను వీరు ఆదుకొంటున్నారు. మారుమూల గ్రామాలకు తరలివెళ్లి అక్కడి పిల్లలకు చదువు చెబుతూ, స్థానికులకు అవసరమైన వస్తువులను అందజేస్తున్నారు. "చలికాలంలో వీరికి వెచ్చని దుప్పట్లు, సరైన దుస్తులు కూడా ఉండవు. మేము సామాజిక మాధ్యమాల ద్వారా నగర ప్రజల నుంచి వాటిని సేకరించి వీరికి చేరవేస్తున్నాం. మా పిలుపునకు ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. కొన్ని రోజుల్లోనే 500కు పైగా ఉన్ని దుస్తులు సేకరించాం. వాటిని చంపానగర్‌లో నివసిస్తున్న బిర్హోర్ కుటుంబాలకు అందజేశాం" అని ఓ విద్యార్థి తెలిపారు. బిహార్, యూపీ రాష్ట్రాల నుంచి కూడా దాతలు స్పందిస్తున్నట్లు చెప్పారు.



అవకాశమున్న తమలాంటి యువత అందరూ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపడితే సమాజంలో కష్టాలు తొలగిపోతాయని ఈ విద్యార్థులు అంటున్నారు.

ప్రసవమైన 8 గంటల్లో ఓటేసిన బాలింత

బిహార్‌లో మంగళవారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల రెండోవిడత పోలింగులో ప్రసవమైన 8 గంటల్లో పోలింగు కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకొన్న ఓ బాలింత ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటారు. బెలాగంజ్ శాసనసభ నియోజకవర్గంలోని కురిస రాయ్ గ్రామానికి చెందిన సునీల్ మాంఝీ భార్య సోనీ కుమారి(25)కి సోమవారం రాత్రి 11 గంటలకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవమైంది. మంగళవారం ఉదయం పోలింగు ప్రారంభం కాగానే ఓ చేతికి సెలైను, మరో చేతిలో బిడ్డతో అంబులెన్సులో వచ్చిన సోనీని చూసి ఓటర్లు విస్తుపోయారు. ఆ సమయంలో జనం భారీగా ఉన్నా, అందరూ పక్కకు తప్పుకొని ఆమెకు అవకాశం ఇచ్చారు. ఓటు వేశాక సోనీ మీడియాతో మాట్లాడుతూ.. "మనం వేసే ఓటు మన పిల్లల భవిష్యత్తును ఉజ్వలంగా మారుస్తుంది. ప్రజాస్వామ్యంలో ఓటు వేయకుండా మంచి వ్యవస్థను ఆశించలేం" అన్నారు. అనంతరం ఆమెను తిరిగి ఆసుపత్రికి తరలించారు.



భారత్‌పై సుంకాలు తగ్గించనున్నాం

• ప్రధాని మోదీతో అద్భుతమైన అనుబంధం

• కీలక వ్యాఖ్యలు చేసిన ట్రంప్



న్యూయార్క్: భారత్‌పై సుంకాలు తగ్గించనున్నామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీతో తమకు అద్భుతమైన అనుబంధం ఉందని ఆయన పునరుద్ఘాటించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ ప్రధాన ఆర్థిక, వ్యూహాత్మక భద్రతా భాగస్వామి అని వెల్లడించారు. భారత్‌కు అమెరికా రాయబారిగా సెర్జియో గోర్ సోమవారం శ్వేతసౌధంలో ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడారు. ప్రధాని మోదీతో అద్భుతమైన సంబంధం ఉందని, రాయబారిగా సెర్జియో గోర్ ఇరు దేశాల మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి, అమెరికా పరిశ్రమలు, సాంకేతిక రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించడానికి, అమెరికన్ ఎనర్జీ ఎగుమతులను పెంచడానికి, భద్రతా సహకారాన్ని విస్తరించడానికి కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. 'మేం భారత్‌తో ఒక ఒప్పందం చేసుకుంటున్నాం. ఇది మునుపటి దానికంటే భిన్నమైంది. ప్రస్తుతం వారు మమ్మల్ని ఎక్కువగా ఇష్టపడటం లేదు. కానీ త్వరలో మళ్లీ ఇష్టపడతారు. మేం న్యాయమైన ఒప్పందం సాధించబోతున్నాం' అని ట్రంప్ అన్నారు. భారత్‌పై మొదట 25 శాతం సుంకాలు విధించిన అమెరికా, తర్వాత 50 శాతానికి పెంచింది.


బుకర్ ప్రైజ్ విజేతగా డేవిడ్ సలై

లండన్: కెనడియన్-హంగరియన్-బ్రిటిష్ రచయిత డేవిడ్ సలై ప్రతిష్ఠాత్మక బుకర్ ప్రైజ్ గెలుపొందారు. ఆయన రచించిన 'ఫ్లెష్' నవలకుగానూ ఈ అవార్డు దక్కింది. భారత రచయిత్రి కిరణ్ దేశాయ్ నవల 'ది లోన్లీనెస్ ఆఫ్ సోనియా అండ్ సన్నీ' నవలను వెనక్కినెట్టి ఈ పోటీలో ఆయన విజయం సాధించారు. 51 ఏళ్ల డేవిడ్ సలై తుదిపోరులో ఐదుగురు పోటీదారులను అధిగమించారు. సోమవారం అర్ధరాత్రి లండన్‌లో జరిగిన వేడుకలో డేవిడ్ రూ.50,000 పౌండ్లను, జ్ఞాపికను అందుకున్నారు. గతేడాది బుకర్ ప్రైజ్ విజేత సమంత హార్వీ వీటిని అందజేశారు. సుదీర్ఘంగా సాగే ఒక సాధారణ వ్యక్తి కథే 'ఫ్లెష్'. మొత్తం 153 నవలలు ఈ అవార్డు కోసం పోటీ పడగా ఐరిష్ రచయిత రాడీ డోయల్, సారా జెస్సికా పార్కర్‌లతో కూడిన న్యాయనిర్ణేతలు డేవిడ్ రాసిన 'ఫ్లెష్'ను ఎంపిక చేశారు. ఇందుకోసం వారు ఐదుగంటలు సమావేశమయ్యారు. అనంతరం ఏకగ్రీవంగా దీన్ని ఎంపిక చేశారు. 'వీలైనంత తక్కువ పదాలతో రాసిన ఈ ఉత్కంఠభరితమైన, ఆకర్షణీయమైన పుస్తకం.. మనిషి జీవితాన్ని ఆశ్చర్యకరంగా, హృదయాన్ని కదిలించే చిత్రంగా చూపిస్తుంది' అంటూ న్యాయనిర్ణేతలు ప్రశంసలు కురిపించారు.



కిరణ్ దేశాయ్ రచనకు ప్రశంసలు

'ది ఇన్‌హెరిటెన్స్ ఆఫ్ లాస్' నవలకుగానూ 2006లో బుకర్ ప్రైజ్ అందుకున్న కిరణ్ దేశాయ్ ఈసారి గెలుచుకునే అవకాశాన్ని కోల్పోయారు. అయితే ఆమె రాసిన 667 పేజీల 'ది లోన్లీనెస్ ఆఫ్ సోనియా అండ్ సన్నీ' నవలపై న్యాయనిర్ణేతలు ప్రశంసలు కురిపించారు. వర్గం, జాతి, ఆధునిక గుర్తింపు వంటి అంశాలను భారత్, అమెరికా నేపథ్యాల్లో లోతుగా చూపించిన శక్తిమంతమైన రచనగా అభివర్ణించారు. కాగా.. ఈ పోటీకి 'ఫ్లాష్‌లైట్' (అమెరికన్-కొరియన్ రచయిత్రి సుసాన్ చోయ్), 'ఆడిషన్' (అమెరికన్-జపాన్ రచయిత్రి కేటీ కితామురా), 'ది రెస్ట్ ఆఫ్ అవర్ లైవ్స్'(బ్రిటిష్-అమెరికన్ రచయిత బెంజమిన్ మార్కోవిట్స్), 'ది ల్యాండ్ ఇన్ వింటర్'(ఆంగ్ల నవల రచయిత ఆండ్రూ మిల్లర్) ఎంపికయ్యాయి.



ముగింపు దశకు షట్‌డౌన్!

వాషింగ్టన్: అమెరికా చరిత్రలో అత్యధిక కాలం కొనసాగిన ఆర్థిక 'షట్‌డౌన్' ముగింపు దశకు చేరుకుంది. దేశ ప్రజలకు సబ్సిడీపై చవకైన వైద్య సేవలు అందించే విషయంపై అమెరికా పార్లమెంటులో డెమోక్రాట్లకు, రిపబ్లికన్లకు మధ్య కొనసాగిన ప్రతిష్టంభన షట్‌డౌన్ రూపుదాల్చి ఆర్థిక సేవలకు అంతరాయం కలిగించిన విషయం విదితమే. అక్టోబరు 1న ప్రారంభమైన ఈ షట్‌డౌన్ 41 రోజులు పూర్తి చేసుకుంది. ఇంతకాలం కొనసాగడం దేశ చరిత్రలో ఇదే ప్రథమం. అమెరికా ఎగువసభ అయిన సెనెట్ సోమవారం రాత్రి నిధుల వినియోగానికి సంబంధించిన తీర్మానంపై ఓటు వేసింది. దీనికి రిపబ్లికన్లతో పాటు, కొందరు డెమోక్రాట్లు కూడా మద్దతు పలికారు. అయితే లక్షలాది మంది అమెరికన్లకు చవకైన ఆరోగ్య బీమా సేవలు అందించే అఫర్డబుల్ కేర్ చట్టం సబ్సిడీ పొడిగించాలని డెమోక్రాట్లు డిమాండ్ చేశారు. దీనిపై వారికి ఎలాంటి హామీ లభించలేదు. ప్రతినిధుల సభలో ఈ బిల్లుకు బుధవారం ఆమోదం లభించవచ్చని తెలుస్తోంది. దీంతో సుదీర్ఘ షట్‌డౌన్ ముగిసే అవకాశాలు కనిపిస్తున్నాయి.



సంపద సృష్టి మార్గాలు

సంపదను సృష్టించేందుకు ఉన్న అనేక మార్గాల్లో ఉత్తమమైన కొన్ని...

✦ ఎక్కువ చదవటం అలవాటు చేసుకోవాలి. ✦ ఇండెక్స్ ఫండ్లలో దీర్ఘకాలం మదుపు చేయాలి.


✦ మీ నైపుణ్యాల మెరుగుదలకు ఖర్చు పెట్టాలి. ✦ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. ✦ అనుభవ సాధనకు డబ్బు వెచ్చించాలి.

✦ తరచూ ఇళ్లు మారకుండా ఒకే ఇంట్లో ఎక్కువ కాలం నివసించాలి.

– కెన్నీ, ఆర్థిక సలహాదారు

నిఠారీ హత్యల కేసులో కోలీ నిర్దోషి

• సుప్రీంకోర్టు సంచలన తీర్పు



దిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నిఠారీ హత్యల కేసులో ప్రధాన ముద్దాయి సురేంద్ర కోలీని నిర్దోషిగా ప్రకటిస్తూ సుప్రీంకోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. అత్యంత దారుణమైన ఈ సామూహిక హత్యలకు అసలు కారకుడెవరన్నది సుదీర్ఘ విచారణ తర్వాతా నిర్ధారించలేకపోవడం విచారకరమని వ్యాఖ్యానించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన ధర్మాసనం కోలీ సమర్పించిన క్యూరేటివ్ పిటిషన్‌ను అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు నిర్ణయంతో కోలీ విడుదలకు మార్గమేర్పడింది. మిగిలిన నిఠారీ హత్య కేసుల్లో గతంలోనే సురేంద్ర కోలీని కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. నోయిడాలోని నిఠారీ ప్రాంతంలో మోనిందర్ సింగ్ పంధేర్ అనే వ్యాపారి ఇంటి వెనుక ఉన్న మురుగు కాలువలో 2006 డిసెంబరు 29న 8 మంది పిల్లల అస్థిపంజరాలు లభించడంతో నిఠారీ హత్యలు వెలుగులోకి వచ్చాయి. ఆ సమయంలో పంధేర్ ఇంట్లో సురేంద్ర కోలీ పని మనిషిగా ఉన్నాడు. 'మరే కేసులోనూ అతణ్ని నిర్బంధించాల్సిన అవసరం లేకుంటే వెంటనే విడుదల చేయవచ్చు' అని ధర్మాసనం పేర్కొంది.

ట్రైబ్యునళ్ల చట్టం చెల్లుబాటుపై తీర్పును రిజర్వు చేసిన సుప్రీం

దిల్లీ: ట్రైబ్యునళ్ల సంస్కరణల (హేతుబద్ధీకరణ, సర్వీసు నిబంధనల) చట్టం-2021.. రాజ్యాంగబద్ధమైనదా.. కాదా అన్న అంశంలో దాఖలైన పిటిషన్లపై తీర్పును సుప్రీంకోర్టు రిజర్వు చేసింది. మంగళవారం ఈ పిటిషన్లపై వాదనలు విన్న అనంతరం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఫిల్మ్ సర్టిఫికేషన్ అప్పిలేట్ ట్రైబ్యునల్‌తో సహా కొన్ని అప్పిలేట్ ట్రైబ్యునళ్లు ఈ చట్టం ద్వారా రద్దయ్యాయి. వీటితోపాటు పలు ట్రైబ్యునళ్ల జుడీషియల్, ఇతర సభ్యుల నియామక నిబంధనల్లో పలు సవరణలు జరిగాయి. పార్లమెంటు ఈ చట్టాన్ని సుదీర్ఘ కాలావధి అనంతరం రూపొందించిందని, చట్టాన్ని కొనసాగనివ్వాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి వాదించారు. ఈ చట్ట నిబంధనలు న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యానికి, అధికార వికేంద్రీకరణ సూత్రానికి విఘాతం కలిగిస్తున్నాయని వ్యాజ్యం దాఖలు చేసిన పిటిషనర్లు పేర్కొన్నారు.

పార్టీల పిటిషన్లపై విడివిడిగా సమాధానం ఇవ్వాలి: సుప్రీం

దిల్లీ: తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(సర్)పై డీఎంకే, సీపీఎం, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్‌లు దాఖలు చేసిన వ్యాజ్యాలకు విడివిడిగా సమాధానం చెప్పాలని ఎన్నికల సంఘాన్ని (ఈసీ) మంగళవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ పిటిషన్లపై రెండు వారాల్లోగా స్పందించాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం సూచించింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో సర్ కసరత్తుపై దాఖలైన వ్యాజ్యాలేవైనా ఉంటే వాటిని పక్కనబెట్టాలని మద్రాస్, కలకత్తా హైకోర్టుల్ని ఆదేశించింది. డీఎంకే తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. సర్ కసరత్తును తొందరపాటుతో చేస్తున్నారని, ఇందుకు సంబంధించి నిర్దేశిత పద్ధతులను పాటించడం లేదని, ఓటర్ల నుంచి భిన్నమైన పత్రాలు కోరుతున్నారని కోర్టుకు ఆయన తెలియజేశారు. 'ఈ సంవత్సరం సాధారణం కన్నా భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించింది. భారీ వర్షాలవల్ల తలెత్తే పరిస్థితుల్ని ఎదుర్కోవడం కోసం సామాన్య పౌరులు సంసిద్ధమవుతున్నారు. ఓటరు జాబితా సవరణలో పాల్గొనే బీఎల్‌వోలు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు రెవెన్యూశాఖకు చెందిన అధికారులు వరద సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంటుంది కాబట్టి ఓటరు జాబితా సవరణకు ఇది సమయం కాదు' అని సిబల్ పేర్కొన్నారు.

ఐఏఎస్ అధికారిణికి గృహహింస

• అక్రమంగా నిర్బంధించి తుపాకీ గురిపెట్టారని ఫిర్యాదు

• భర్త సామాజిక న్యాయం, సాధికారత విభాగం డైరెక్టరు




జైపుర్: ఐఏఎస్ అధికారి అయిన తన భర్త వేధింపులతో గృహహింసకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ.. రాజస్థాన్ ఐఏఎస్ అధికారిణి భారతీ దీక్షిత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఆమె భర్త అయిన సామాజిక న్యాయం, సాధికారత విభాగం డైరెక్టరు ఆశిష్ మోదీపై జైపుర్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రాజస్థాన్ ప్రభుత్వ ఆర్థికశాఖలో జాయింట్ సెక్రటరీగా భారతీ దీక్షిత్ విధులు నిర్వర్తిస్తున్నారు. తామిద్దరం 2014 బ్యాచ్‌కు చెందిన రాజస్థాన్ కేడర్ ఐఏఎస్ అధికారులమని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే ఏడాది తమ వివాహమైనప్పటి నుంచీ ఆశిష్ మోదీ తరచూ మద్యం తాగి.. తనను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నట్లు తెలిపారు. పాప పుట్టాక వేధింపులు మరింత పెరిగాయని, అత్తింటివారి నుంచి తన ప్రాణాలకు హాని కూడా ఉందని భారతి ఫిర్యాదులో వెల్లడించారు. పలువురు నేరస్థులతోనూ ఆశిష్‌కు సంబంధాలున్నాయన్నారు. గత నెల ఓ స్నేహితుడితో కలిసి తనను ప్రభుత్వ వాహనంలో తరలించి, కొన్ని గంటలపాటు నిర్బంధంలో ఉంచారని ఫిర్యాదు చేశారు. విడాకులకు అంగీకరించకపోతే తనను, తన కుటుంబాన్ని చంపేస్తామని తుపాకీ గురిపెట్టి బెదిరించారని భారతి ఆరోపించారు. ఆశిష్‌ను వివరణ కోరగా ఫిర్యాదుపై వ్యాఖ్యానించడానికి ఆయన నిరాకరించారు.

సాధన మొదలైంది..


జడేజా గంభీర్

కోల్‌కతా: దక్షిణాఫ్రికాతో టెస్టు పోరుకు టీమ్‌ఇండియా సిద్ధమవుతోంది. శుక్రవారం తొలి టెస్టు ఆరంభం కానున్న నేపథ్యంలో మంగళవారం ఈడెన్ గార్డెన్స్‌లో గిల్ బృందం ప్రాక్టీస్ చేసింది. గిల్ దాదాపు గంటన్నర సేపు నెట్స్‌లో గడిపాడు. తన టెక్నిక్‌కు పదును పెట్టుకున్నాడు. సుందర్, జడేజా, బుమ్రా, నితీశ్‌కుమార్ రెడ్డిలను అతడు ఎదుర్కొన్నాడు. అంతకుముందు ప్రధాన కోచ్ గంభీర్, సహాయ కోచ్ సితాంశు కోటక్ గిల్‌తో చాలా సేపు మాట్లాడుతూ కనిపించారు. గిల్ సహచరులతో కలిసి స్లిప్‌లో క్యాచ్‌లు కూడా ప్రాక్టీస్ చేశాడు. సాయి సుదర్శన్, యశస్వి జైస్వాల్ కూడా నెట్స్‌లో చాలా సేపు ఉన్నారు. దక్షిణాఫ్రికాతో రెండు అనధికార టెస్టుల్లో 84 పరుగులే చేసిన నేపథ్యంలో అందరి దృష్టి సుదర్శన్‌పైనే ఉంది. మూడో నంబర్ బ్యాటర్‌గా టీమ్ మేనేజ్‌మెంట్ మద్దతు అతడికి కొనసాగుతోంది. అతడితో పాటు భారత్-ఎకు ఆడిన కేఎల్ రాహుల్, కుల్‌దీప్, సిరాజ్‌లు ఈ ప్రాక్టీస్ సెషన్‌కు హాజరు కాలేదు. బౌలర్లలో బుమ్రా మరీ ఎక్కువసేపేమీ బౌలింగ్ చేయలేదు. రెండు స్టంపులకు 15 నిమిషాల పాటు బంతులేశాడు. గంభీర్, బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అతణ్ని పర్యవేక్షించారు.


శ్రేయస్

అప్పుడు

శ్రేయస్ ఆక్సిజన్ స్థాయి 50

ముంబయి: ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా తీవ్రంగా గాయపడి ప్రమాదకర స్థితికి వెళ్లిన భారత స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ కోలుకుంటున్నాడు. ఇటీవలే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడు. అయితే ఈ వన్డే వైస్ కెప్టెన్ దక్షిణాఫ్రికాతో ఈనెల 30న ఆరంభమయ్యే 3 వన్డేల సిరీస్‌లో ఆడడం కష్టంగానే కనిపిస్తోంది. గాయమైన రోజు శ్రేయస్ ప్రమాదకర స్థితిని ఎదుర్కొన్నాడని, అతడి ఆక్సిజన్ స్థాయి 50కి పడిపోయిందని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. "ఆస్ట్రేలియాతో మూడో వన్డేలో ఫీల్డింగ్ చేసే సమయంలో అంతర్గత గాయం కావడంతో శ్రేయస్ విలవిల్లాడాడు. ఊహించిన దానికంటే అతడికి తీవ్ర గాయమైంది. డ్రెస్సింగ్ రూమ్‌లో 10 నిమిషాల పాటు అతడు సరిగా నిలబడలేకపోయాడు. కొద్దిసేపటి తర్వాత అతడు సాధారణ స్థితికి చేరాడు. ఒక సమయంలో అతడి ఆక్సిజన్ స్థాయి 50కి పడిపోయింది. వెంటనే వైద్యం అందడం.. రక్తస్రావాన్ని ఆపడం వల్ల ప్రమాదం తప్పింది" అని అతడు చెప్పాడు. శ్రేయస్ పూర్తిగా కోలుకోవడానికి ఇంకొంత సమయం పడుతుంది. శ్రేయస్ విషయంలో తొందరపడకూడదని సెలక్షన్ కమిటీ కూడా భావిస్తోంది. అతడు దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ఆడటం అనుమానమే.

లంకపై భారత్ గెలుపు

దిల్లీ: తొలి మహిళల అంధుల టీ20 ప్రపంచకప్‌లో భారత్ శుభారంభం చేసింది. మంగళవారం తొలి మ్యాచ్‌లో 10 వికెట్ల తేడాతో లంకను చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన లంక 13.3 ఓవర్లలో 41 పరుగులకే ఆలౌటైంది. భారత ఫీల్డర్లు చురుగ్గా కదిలి ఏడుగురు బ్యాటర్లను రనౌట్ చేశారు. దీపిక, గంగ, జమున తలా వికెట్ పడగొట్టారు. స్వల్ప లక్ష్యాన్ని భారత్ 3 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా అందుకుంది. దీపిక (26 నాటౌట్; 14 బంతుల్లో 4×4), అనేఖ్య దేవి (15 నాటౌట్; 6 బంతుల్లో 3×4) జట్టుకు ఘన విజయాన్ని అందించారు. కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ ఈ టోర్నీని ప్రారంభించారు.

హ్యామర్ త్రోయర్ మంజు బాలపై అయిదేళ్ల నిషేధం

దిల్లీ: డోప్ పరీక్షల్లో దొరికిపోయిన హ్యామర్ త్రోయర్ మంజు బాలపై నాడా డోపింగ్ నిరోధక క్రమశిక్షణ సంఘం అయిదేళ్ల నిషేధం విధించింది. మంజు 2014 ఆసియా క్రీడల్లో కాంస్య పతకం గెలిచింది. నిరుడు నిర్వహించిన పరీక్షల్లో ఆమె నిషిద్ధ ఉత్ప్రేరకాలు వాడినట్లు తేలింది. మరో అథ్లెట్ మోహన్ సైనీపై నాలుగేళ్ల నిషేధం విధించారు. బాక్సర్ సుమిత్‌పై రెండేళ్ల నిషేధం పడగా.. కనోయిస్ట్ నితిన్ వర్మ, బాస్కెట్‌బాల్ ప్లేయర్ శివేంద్ర వరుసగా నాలుగు, ఆరేళ్ల నిషేధానికి గురయ్యారు.

ఛాంపియన్

ఆసియా ఆర్చరీ


ధీరజ్

సెమీస్‌లో ధీరజ్, దీపిక


దీపిక కుమారి

ఢాకా: ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో రికర్వ్‌లో భారత ఆర్చర్లు అదరగొట్టారు. అయిదుగురు సెమీస్‌కు దూసుకెళ్లారు. ధీరజ్ బొమ్మదేవర, రాహుల్, దీపిక కుమారి, సంగీత, అంకిత బాకత్ ముందంజ వేశారు. పురుషుల విభాగంలో ధీరజ్.. సదికోవ్ (ఉజ్బెకిస్థాన్)ను ఓడించాడు. నాలుగు సెట్లలో స్కోరు 5-5గా సమమైంది. షూటాఫ్‌లోనూ ఇద్దరూ చెరో 10 పాయింట్లు సాధించారు. కానీ మధ్య వృత్తానికి దగ్గరగా బాణాన్ని సంధించిన ధీరజ్ విజయం సాధించాడు. సెమీస్‌లో జాంగ్ (కొరియా)తో ధీరజ్ తలపడనున్నాడు. రాహుల్ 6-2తో లిన్ సియాంగ్ (చైనీస్ తైపీ)పై నెగ్గి సెమీస్ చేరాడు. యశ్‌దీప్ 4-6తో రభీబ్ (యూఏఈ) చేతిలో ఓడాడు. మహిళల రికర్వ్‌లో దీపిక 7-3తో ప్రపంచకప్ స్వర్ణ పతక విజేత లీ గయూన్ (కొరియా)ను కంగుతినిపించింది. అంకిత 6-4తో జాంగ్ (కొరియా)ను ఓడించింది. సెమీస్‌లో అంకితతో దీపిక పోటీ పడనుంది. సంగీత 7-1తో సుయెన్ (కొరియా)పై గెలిచింది. కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో వెన్నం జ్యోతి సురేఖ, ప్రీతిక సెమీఫైనల్లో అడుగుపెట్టారు. క్వార్టర్స్‌లో జ్యోతి 147-145తో యోయూన్ (కొరియా)ను ఓడించింది. ప్రీతిక 148-146తో మరో భారత ఆర్చర్ చికిత తానిపర్తిపై గెలిచింది. పురుషుల కాంపౌండ్ టీమ్ విభాగంలో భారత్‌కు ఓ పతకం ఖాయమైంది. సెమీస్‌లో అభిషేక్ వర్మ, సాహిల్ జాదవ్, ప్రథమేశ్‌లతో కూడిన భారత బృందం.. థాయ్‌లాండ్‌ను ఓడించింది. మొదట 235-235తో స్కోర్లు సమమైనా.. టైబ్రేక్‌లో భారత్ పైచేయి సాధించింది.

ప్రపంచ షూటింగ్

ఇషా జంటకు రజతం

ఐశ్వరీ ప్రతాప్‌కు కూడా


ఇషా సింగ్, సామ్రాట్

కైరో: ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల జోరు కొనసాగుతోంది. హైదరాబాదీ అమ్మాయి ఇషా సింగ్ మరో పతకాన్ని కైవసం చేసుకుంది. మహిళల 10 మీటర్ల పిస్టల్‌లో రజతం గెలిచిన జట్టులో సభ్యురాలైన ఇషా.. 10 మీటర్ల పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ రజతం సొంతం చేసుకుంది. ఇషా, సామ్రాట్ రాణాలతో కూడిన భారత జట్టు ఫైనల్లో 10-16తో కివాన్‌గ్జున్-క్రైయ్ హు (చైనా) జోడీ చేతిలో ఓడింది. సామ్రాట్‌కు ఈ ఛాంపియన్‌షిప్‌లో ఇది మూడో పతకం. ఇంతకుముందు 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో అతడు స్వర్ణాలు సాధించాడు. మరోవైపు పురుషుల 50 మీటర్ల 3 పొజిషన్స్‌లో ఐశ్వరీ ప్రతాప్‌సింగ్ తోమర్ రజతంతో మెరిశాడు. తుది పోరులో అతడు 466.9 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఫైనల్ చేరే క్రమంలో క్వాలిఫయింగ్‌లో ఐశ్వరీ ప్రతాప్ 597 పాయింట్లు స్కోరు చేసి ప్రపంచ రికార్డును సమం చేశాడు. క్వాలిఫికేషన్లో 592 పాయింట్లు సాధించి ఆఖరి పోరుకు చేరిన మరో భారత షూటర్ నీరజ్ కుమార్ (432.6) అయిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఈ పోటీల్లో యుకున్ లూ (చైనా, 467.1) స్వర్ణం, రొమైన్ అఫ్రెర్ (ఫ్రాన్స్, 454.8) కాంస్యం కైవసం చేసుకున్నారు.


హరికృష్ణ

చెస్ ప్రపంచకప్

అర్జున్, హరి గేమ్‌లు డ్రా

పంజిమ్: చెస్ ప్రపంచకప్ నాలుగో రౌండ్లో అర్జున్ ఇరిగేశి, పెంటేల హరికృష్ణ తమ గేమ్‌లను డ్రా చేసుకున్నారు. తొలి గేమ్‌లో పీటర్ లెకో (హంగేరి)తో అర్జున్ పాయింట్ పంచుకోగా.. నీల్స్ గ్రాండిలిస్ (స్వీడన్)తో గేమ్‌ను హరి డ్రాగా ముగించాడు. ప్రజ్ఞానంద, ప్రణవ్, కార్తీక్ వెంకటరామన్ గేమ్‌లు సైతం డ్రానే అయ్యాయి. డానియల్ దబోవ్ (ఫిన్లాండ్)తో ప్రజ్ఞానంద, నొదిర్‌బెక్ (ఉజ్బెకిస్థాన్)తో ప్రణవ్, క్వాంగ్ లీమ్ (వియత్నాం)తో కార్తీక్ డ్రా చేసుకున్నారు. రెండో గేమ్‌లో భారత ఆటగాళ్లు గెలిస్తే తర్వాతి రౌండ్‌కు అర్హత సాధిస్తారు. ఒకవేళ డ్రా అయితే టైబ్రేక్ ఆడాల్సి ఉంటుంది.


గిల్

గిర్రున తిరగొద్దు!

అబుదాబిలో

ఐపీఎల్ వేలం!



దిల్లీ: ఈ ఏడాది ఐపీఎల్ వేలాన్ని అబుదాబిలో నిర్వహించనున్నట్లు ఓ బీసీసీఐ అధికారి మంగళవారం చెప్పాడు. విదేశాల్లో వేలం నిర్వహించడం వరుసగా ఇది మూడో ఏడాది. 2023లో దుబాయ్‌లో, 2024లో జెడ్డాలో వేలం వేశారు. ఈసారి వేలం డిసెంబరు 15 లేదా 16వ తేదీన ఉండొచ్చు.

అందుకు వాళ్లు ఒప్పుకున్నారు: రాజస్థాన్ రాయల్స్ నుంచి కెప్టెన్ సంజు శాంసన్ వీడటం ఖాయం! అతడిని చెన్నై సూపర్ కింగ్స్‌కు బదిలీ చేసేందుకు రాజస్థాన్ ఫ్రాంఛైజీ అంగీకరించిందని సమాచారం. బదులుగా ఆ జట్టు ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, సామ్ కరన్‌లను పొందనుంది. ఫ్రాంఛైజీ మారేందుకు ఆటగాళ్లు కూడా తమ సమ్మతి తెలిపారు! ఒకట్రెండు రోజుల్లో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. రెండు ఫ్రాంఛైజీల మధ్య ఒప్పందాన్ని బీసీసీఐ ఆమోదించాలి. సామ్ కరన్ జట్టు మార్పుపై ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు నుంచి నిరభ్యంతర పత్రం వచ్చిన తర్వాత ఫ్రాంఛైజీలు బీసీసీఐకి తమ నిర్ణయాన్ని తెలుపుతాయని ఐపీఎల్ వర్గాలు తెలిపాయి.

ఈనాడు క్రీడావిభాగం

భారత్‌లో టెస్టులంటే వెంటనే గుర్తొచ్చేది స్పిన్ బౌలింగే. బంతి గిర్రున తిరిగే పిచ్‌లను సిద్ధం చేయడం.. ఎలాంటి మేటి ప్రత్యర్థినైనా తిప్పేయడం, అలవోకగా విజయాలను అందుకోవడం.. సిరీస్‌లు నెగ్గడం! చాలా ఏళ్ల పాటు టీమ్ఇండియా చేసింది ఇదే. వికెట్ల కోసం స్పిన్నర్లు పోటీపడడంతో చాలా మ్యాచ్‌లు ఏకపక్షమే. కానీ ఇప్పుడు కథ మారుతోంది. దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్ ఆరంభం కానున్న నేపథ్యంలో భారత జట్టు మేనేజ్‌మెంట్ గిరగిరా పిచ్‌ల కోసం పట్టుపట్టట్లేదు. మరి ఎందుకీ మార్పు?

ఆ పరాభవంతో..: సొంతగడ్డపై విపరీతంగా తిరిగే పిచ్‌లను ఇష్టపడే టీమ్‌ఇండియాకు నిరుడు న్యూజిలాండ్‌తో సిరీస్ శరాఘాతమే అయింది. తన స్పిన్ వలలో తానే చిక్కుకుని గిలగిల్లాడింది. స్వదేశంలో ఒక్క టెస్టు ఓడిపోవడమే ఎక్కువనుకుంటే.. ఆ సిరీస్‌లో ఏకంగా 0-3తో వైట్‌వాష్‌కు గురైంది. కివీస్ స్పిన్నర్లను ఎదుర్కోవడంలో భారత బ్యాటర్లు ఇబ్బందిపడగా.. అదే సమయంలో ఆ జట్టు బ్యాటర్లపై మన స్పిన్నర్ల మాయాజాలం పనిచేయలేదు. శాంట్నర్ (ఒక మ్యాచ్‌లో 13 వికెట్లు), అజాజ్ పటేల్ (3 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు)లు టీమ్‌ఇండియాను తమ స్పిన్‌తో ఉక్కిరిబిక్కిరి చేశారు. ఆ సిరీస్ ఓటమి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో ఇండియా ఫైనల్ అవకాశాలను దెబ్బతీసింది. ఆ నేపథ్యంలో పిచ్‌ల విషయంలో భారత్ ఆలోచన తీరు మారిపోయింది. ఇప్పుడు గిర్రున తిరిగే పిచ్‌లు కావాలని అడగకపోవడంలో ఆశ్చర్యం లేదు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ సమతూకం ఉన్న పిచ్‌లను కోరుకుంటున్నాడు. స్వదేశంలో ఎప్పుడూ అధికంగా స్పిన్‌కు సహకరించే పిచ్‌లపై ఆడితే జట్టు విదేశాల్లో ఇబ్బంది పడుతుందన్నది అతడి ఉద్దేశం. ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌ను కూడా అలాంటి పిచ్‌లపై ఆడలేదు. ఆ సిరీస్‌ను భారత్ 2-0తో గెలుచుకున్న సంగతి తెలిసిందే. దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు ఓ మోస్తరుగా స్పిన్‌కు అనుకూలించే పిచ్‌లను తయారు చేసే అవకాశముంది. టీమ్ఇండియా టర్నింగ్ పిచ్ కావాలని కోరలేదని బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు, మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ చెప్పాడు. తొలి టెస్టు శుక్రవారం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో ఆరంభం కానున్న సంగతి తెలిసిందే. ఇక్కడ పిచ్‌పై అక్కడక్కడ కాస్త పచ్చిక ఉంది. మ్యాచ్ సమయానికి పెద్దగా మారకపోవచ్చు. గంభీర్, బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మంగళవారం పిచ్‌ను పరిశీలించారు. "స్పోర్టింగ్ పిచ్‌ను సిద్ధం చేశాం. బ్యాటర్లతోపాటు బౌలర్లకూ సహకారం లభిస్తుంది" అని ఈడెన్ క్యురేటర్ సుజన్ ముఖర్జీ చెప్పాడు. సాధారణంగా ఇక్కడ పిచ్ తొలి గంటలో పేసర్లకు కాస్త అనుకూలిస్తుంది. ఆ తర్వాత బ్యాటర్ల పని తేలికవుతుంది. మ్యాచ్ సాగుతున్నకొద్దీ స్పిన్నర్లు ప్రభావం చూపిస్తారు. ఒకవేళ భారత్ స్పిన్‌కు విపరీతంగా సహకరించే పిచ్‌లను తయారు చేసినా.. పరిస్థితులను సొమ్ము చేసుకునే వనరులు తమకు ఉన్నాయనే ధీమాతో దక్షిణాఫ్రికా ఉంది. ఇటీవల పాకిస్థాన్ పర్యటనలో రెండు టెస్టుల సిరీస్‌ను దక్షిణాఫ్రికా 1-1తో డ్రాగా ముగించింది. ఆ సిరీస్‌లో ఆ జట్టు స్పిన్నర్లు హార్మర్ (13), ముత్తుసామి (11), కేశవ్ మహరాజ్ (9)లు 33 వికెట్లు పడగొట్టడం విశేషం.

దక్షిణాఫ్రికాతో సిరీస్ కీలకం


సిరాజ్

కోల్‌కతా: ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) నేపథ్యంలో డిఫెండింగ్ ఛాంపియన్ దక్షిణాఫ్రికాతో సిరీస్ భారత్‌కు ఎంతో కీలకమని భారత స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ అన్నాడు. శుక్రవారం సఫారీ జట్టుతో రెండు టెస్టుల సిరీస్ ఆరంభం కానున్న నేపథ్యంలో అతడిలా పేర్కొన్నాడు. "డబ్ల్యూటీసీ చక్రంలో దక్షిణాఫ్రికాతో ఆడే రెండు టెస్టుల సిరీస్ కీలకం. ఆ జట్టు ఇటీవలే పాకిస్థాన్‌తో సిరీస్‌ను 1-1తో డ్రా చేసుకుంది. అయితే సిరీస్‌పై మేం విశ్వాసంతో ఉన్నాం. మా జట్టు ఫామ్‌లో ఉంది. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో రాణించాం. స్వదేశంలో వెస్టిండీస్‌పై పైచేయి సాధించాం. దక్షిణాఫ్రికాపై సత్తా చాటుతామని భావిస్తున్నా. వ్యక్తిగతంగా నేనూ లయలో ఉన్నా. బలమైన జట్లతో ఆడడం వల్ల ఏ అంశాలను మెరుగుపరుచుకోవాలో తెలుస్తుంది. సఫారీ జట్టుతో సిరీస్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా" అని సిరాజ్ అన్నాడు. ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల పోరులో పేసర్ సిరాజ్ 23 వికెట్లు పడగొట్టాడు. విండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌లోనూ అతడు పది వికెట్లు తీశాడు.

రెండు అంచెల టెస్టు విధానం లేనట్లే!

దుబాయ్: చాలాకాలంగా చర్చల్లో ఉన్న రెండంచెల ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) విధానం కార్యరూపం దాల్చే అవకాశం కనిపించట్లేదు. దానికి బదులుగా ఐసీసీలోని మొత్తం 12 శాశ్వత సభ్య దేశాలకు వచ్చే డబ్ల్యూటీసీ (2027 నుంచి)లో ఆడే అవకాశం కల్పించాలని భావిస్తోంది. ప్రస్తుతం 9 శాశ్వత సభ్య దేశాలు మాత్రమే డబ్ల్యూటీసీలో ఆడుతున్నాయి. జింబాబ్వే, అఫ్గానిస్థాన్, ఐర్లాండ్ ఈ ఛాంపియన్‌షిప్‌లో భాగం కాలేదు. ఐసీసీ సమావేశంలో రెండంచెల విధానానికి సభ్య దేశాల నుంచి పెద్దగా మద్దతు లభించలేదు. "రెండంచెల విధానంపై చర్చ జరిగింది. కానీ ఈ నమూనాపై కొన్ని సభ్య దేశాలు సంతృప్తి చెందలేదు. 12 జట్ల విధానాన్ని ప్రయత్నించాలని అభిప్రాయపడ్డాయి" అని ఐసీసీ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా పాకిస్థాన్, శ్రీలంక, వెస్టిండీస్, బంగ్లాదేశ్‌ల నుంచి వ్యతిరేకత వ్యక్తమైనట్లు తెలుస్తోంది. కొత్త విధానం అమలులోకి వస్తే ఈ జట్లు టయర్ 2లో ఆడాల్సివచ్చేది. ఇంగ్లాండ్ కూడా ఈ విధానానికి సానుకూలంగా లేదని సమాచారం.

హైదరాబాద్‌కు మూడు పాయింట్లు

రాజస్థాన్‌తో మ్యాచ్ డ్రా


ఈనాడు, హైదరాబాద్: రాజస్థాన్‌తో హైదరాబాద్ రంజీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన హైదరాబాద్‌కు మూడు పాయింట్లు లభించాయి. ఓవర్‌నైట్ స్కోరు 198/7తో చివరిదైన నాలుగో రోజు మంగళవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్.. 244/9 వద్ద డిక్లేర్ చేసింది. రోహిత్ రాయుడు (42) రాణించాడు. 342 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్.. ఆట ఆఖరికి 3 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. సల్మాన్ ఖాన్ (79) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. సచిన్ యాదవ్ (44), లొమ్రార్ (40) రాణించారు. మొదటి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 364 పరుగులు చేయగా.. రాజస్థాన్ 269 పరుగులకు ఆలౌటైంది.

దిల్లీపై జమ్ముకశ్మీర్ విజయం

దిల్లీ: జమ్ముకశ్మీర్ అదరగొట్టింది. రంజీ ట్రోఫీ చరిత్రలో తొలిసారి దిల్లీపై విజయం సాధించింది. నాలుగో రోజు మంగళవారం జమ్ముకశ్మీర్ 7 వికెట్ల తేడాతో నెగ్గింది. 179 పరుగుల ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 55/2తో ఆఖరి రోజు ఇన్నింగ్స్ కొనసాగించిన ఆ జట్టు మరో వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. కమ్రాన్ ఇక్బాల్ (133 నాటౌట్) అజేయ శతకంతో జమ్ముకశ్మీర్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. మొదటి ఇన్నింగ్స్ దిల్లీ 211, జమ్ముకశ్మీర్ 310 పరుగులు చేశాయి. రెండో ఇన్నింగ్స్‌లో దిల్లీ 277 పరుగులకు ఆలౌటైంది. ఈ విజయంతో జమ్ముకశ్మీర్‌కు 6 పాయింట్లు లభించాయి.

తొలి వన్డేలో శ్రీలంకపై పాక్ విజయం

రావల్పిండి: శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో పాకిస్థాన్ శుభారంభం చేసింది. సల్మాన్ ఆఘా (105 నాటౌట్) శతకం బాదడంతో మంగళవారం తొలి మ్యాచ్‌లో పాక్ 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆఘాతో పాటు తలాత్ (62), నవాజ్ (36) రాణించడంతో మొదట పాకిస్థాన్ 5 వికెట్ల నష్టానికి 299 పరుగులు చేసింది. హసరంగ మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో శ్రీలంక 9 వికెట్లకు 293 పరుగులే చేయగలిగింది. హసరంగ (59) టాప్ స్కోరర్. సమరవిక్రమ (39), కమిల్ మిషార (38), అసలంక (32) రాణించారు. రవూఫ్ 4 వికెట్లు పడగొట్టగా.. నసీమ్ షా, అష్రాఫ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.


రొనాల్డో

వచ్చే ప్రపంచకప్పే చివరిది

రియాద్: వచ్చే ఏడాది జరిగే ఫుట్‌బాల్ ప్రపంచకప్పే తన కెరీర్‌లో చివరిదని పోర్చుగల్ సూపర్‌స్టార్ క్రిస్టియానో రొనాల్డో అన్నాడు. "వచ్చే ప్రపంచకప్ నాటికి 41 ఏళ్లు వస్తాయి. కచ్చితంగా అదే చివరి కప్పు. ప్రస్తుతం ఫామ్‌లో ఉన్నా. గోల్స్ సాధిస్తున్నా. సుదీర్ఘ కాలం ఆటలో కొనసాగుతున్నా. ఎన్నో రికార్డులు సాధించా. ఇందుకు గర్వంగా ఉంది. నా కెరీర్ త్వరలోనే ముగియచ్చు. ఒకటి రెండేళ్లు మాత్రమే కొనసాగే అవకాశం ఉంది" అని రొనాల్డో చెప్పాడు. 2026 ఫుట్‌బాల్ ప్రపంచకప్ రొనాల్డోకు కెరీర్‌లో ఆరోది. అర్జెంటీనా స్టార్ లియొనెల్ మెస్సికి కూడా ఆరో కప్పే. ఈ టోర్నీలో అర్జెంటీనా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో దిగుతోంది.

అతికకు మూడో స్థానం


అతిక

అబుదాబి: సీవోటీఎఫ్‌ఏ యూఏఈ కార్టింగ్ సిరీస్‌లో భారత బాలిక అతిక మీర్ సత్తా చాటింది. జోరు కొనసాగిస్తూ ఈ ఛాంపియన్‌షిప్‌లో ఆమె మూడో స్థానంలో నిలిచింది. అంతకుముందు క్వాలిఫయింగ్‌లో రాణించి పోల్ పొజిషన్‌నూ చేజిక్కించుకుంది. యూఏఈ కార్టింగ్ సిరీస్‌లో మినీ క్లాస్‌లో పోల్ పొజిషన్ సాధించిన తొలి మహిళా రేసర్‌గా ఘనత సాధించింది. ఇటీవల ఆర్ఎంసీ ఛాంపియన్‌షిప్‌లో ఆమె విజేతగా నిలిచింది. 10 ఏళ్ల అతికకు ఫార్ములావన్ అకాడమీ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. "యూఏఈ కార్టింగ్ సిరీస్‌లో మూడో స్థానంలో నిలవడం, క్వాలిఫయింగ్‌లో పోల్ పొజిషన్ సాధించడం చాలా సంతోషంగా ఉంది. వేగం పరంగా ఎంతో మెరుగయ్యా. రాబోయే సిరీస్‌లలో రాణించేందుకు ప్రయత్నిస్తా" అని అతిక చెప్పింది.

పంకజ్‌కు షాక్


పంకజ్

దోహా: భారత స్టార్ పంకజ్ అద్వానీకి షాక్. ప్రపంచ స్నూకర్ ఛాంపియన్‌షిప్‌లో రెండో రౌండ్లో డెంగ్ హోహుయ్ (చైనా) 4-1తో పంకజ్‌ను ఓడించాడు. మరోవైపు పెద్దగా అంచనాలు లేని హుస్సేన్ ఖాన్ ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. హుస్సేన్ 4-3తో హసాన్ కెర్డ్ (ఆస్ట్రేలియా)పై నెగ్గాడు. మహిళల విభాగంలో కీర్తన పాండియన్ ప్రిక్వార్టర్స్ చేరింది. గ్రూప్-బి చివరి మ్యాచ్‌లో ఆమె 2-1తో సో మాన్ యాన్ (హాంకాంగ్)పై విజయం సాధించి గ్రూప్‌లో అగ్రస్థానం సాధించింది.

అల్కరాస్ విజయం


అల్కరాస్

ట్యూరిన్ (ఇటలీ): యానిక్ సినర్ (ఇటలీ)కు ఇటీవలే నంబర్‌వన్ ర్యాంకును కోల్పోయిన స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాస్ ఆ ర్యాంకును తిరిగి దక్కించుకునే దిశగా అడుగులు వేస్తున్నాడు. ఏటీపీ ఫైనల్స్ టోర్నీలో గ్రూప్‌లో వరుసగా రెండో విజయం సాధించిన అతడు.. మరో మ్యాచ్ గెలిస్తే ఈ ఏడాదిని నంబర్‌వన్‌గా ముగించనున్నాడు. మంగళవారం అల్కరాస్ 6-7 (2-7), 7-5, 6-3తో ఫ్రిట్జ్ (అమెరికా)ను ఓడించాడు. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్ యానిక్ సినర్ (ఇటలీ) శుభారంభం చేశాడు. తొలి రౌండ్లో అతడు 7-5, 6-1తో ఫెలిక్స్ అలియాసిమ్ (కెనడా)ను ఓడించాడు. ఇతర మ్యాచ్‌ల్లో జ్వెరెవ్ (జర్మనీ) 6-3, 7-6 (8-6)తో షెల్టన్ (అమెరికా)పై, టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 6-3, 6-5తో ముసెటి (ఇటలీ)పై నెగ్గారు.

మైనారిటీల సాధికారతకు నిరంతరం పనిచేస్తా

- మైనారిటీ సంక్షేమ దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు





మౌలానా అబుల్ కలామ్ అజాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి ఫరూఖ్ తదితరులు ● మైనారిటీ సంక్షేమ దినోత్సవానికి హాజరైన ప్రజలు

ఈనాడు, అమరావతి: మైనారిటీల సాధికారత కోసం నిరంతరం పనిచేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 'నేనెప్పుడూ మీ మనిషినే. మీ హక్కుల కోసం పోరాడతా. మీ గౌరవాన్ని కాపాడతా. మీ సంక్షేమం కోసం పాటుపడతా. శాశ్వతంగా మీ వాడిగా ఉంటా' అని భరోసానిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి మసీదుకూ నెలకు రూ.5వేలను త్వరలో అందిస్తామని ప్రకటించారు. అర్హత కలిగిన ఇమామ్‌లందరినీ 2026 మార్చి నాటికి ప్రభుత్వ [illegible] నియమిస్తామని పేర్కొన్నారు. నూర్‌బాషా కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు కేటాయించి వారి అభివృద్ధికి కృషిచేస్తామని తెలిపారు. ఇమామ్, మౌజంలకు పెండింగ్‌లో ఉన్న 10 నెలల గౌరవవేతనాన్ని బుధవారమే విడుదల చేస్తామని వెల్లడించారు. విజయవాడలో మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'సమైక్యాంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని పెట్టి ప్రోత్సహించాం. రాష్ట్ర విభజన తర్వాత కర్నూలులో మళ్లీ ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పాం. 2025-26 ఏడాదికి మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి రూ.5,433 కోట్ల బడ్జెట్ కేటాయించాం. పేదలు ఇబ్బంది పడకూడదని సూపర్‌సిక్స్ పథకాలను అమలుచేశాం. తల్లికి వందనం పథకం కింద ఎక్కువగా లబ్ధి పొందుతున్నది ముస్లిం మహిళలే. దీనికి గర్వపడుతున్నా. మైనారిటీ పిల్లలు బాగా చదివితే గ్లోబల్ లీడర్లుగా తయారుచేస్తా. 2014-19 మధ్య మైనారిటీ రెసిడెన్షియల్ నిర్మాణానికి అప్పటి తెదేపా ప్రభుత్వం నిధులు కేటాయించినా వైకాపా ప్రభుత్వం కట్టకుండా పక్కన పెట్టేసింది. వాటిని పూర్తిచేస్తా. కొత్తగా మైనారిటీ బాలికలకు విశాఖలో ఒకటి, రాయలసీమలో రెండు గురుకులాలు (ఇంటర్మీడియట్) ఏర్పాటుచేసి ఉచితంగా చదువుకునే అవకాశం కల్పిస్తాం' అని పేర్కొన్నారు.

ఉర్దూ ఘర్-షాదీఖానా పూర్తికి చర్యలు

'కేంద్ర ప్రాయోజిత పథకాలను తిరిగి గాడిన పెడతాం. వీటికి 2019-24 మధ్య వైకాపా ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వలేదు. అసంపూర్తిగా ఉన్న ఉర్దూ ఘర్-షాదీఖానాలకు రూ.60 కోట్లు, వాణిజ్య సముదాయాలకు రూ.95 కోట్లు, చర్చిలు, మసీదులు, శ్మశానవాటికలకు మరో రూ.45 కోట్లు త్వరలో విడుదల చేసి పూర్తిచేస్తాం. కడపలో హజ్ భవనాన్ని పూర్తిచేస్తాం. విజయవాడలో కొత్తది నిర్మిస్తాం. హజ్‌యాత్రకు విజయవాడ నుంచే వెళ్లేలా ఎంబార్కేషన్ పాయింట్ తీసుకొచ్చాం' అని తెలిపారు.

> **నేను జాగ్రత్తగా డ్రైవ్ చేసే వ్యక్తిని**
>
> ఆర్థిక ఇబ్బందులున్నాయి. అయినా భయం లేదు. నేను చాలా జాగ్రత్తగా డ్రైవ్ చేసే వ్యక్తిని. సురక్షితంగా ఒడ్డుకు తీసుకెళ్తా. సూపర్‌సిక్స్‌ను సూపర్‌హిట్ చేశాం. అభివృద్ధినీ సూపర్‌హిట్ చేసిన ఘనత కూటమిదే. వైకాపా ప్రభుత్వం రాష్ట్ర బ్రాండ్‌ను దెబ్బతీసింది. ఇప్పుడు పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని నెలకొల్పాం. ఇప్పటికే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. విశాఖ సదస్సులో ఇంకో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రాబోతున్నాయి
>
> – ముఖ్యమంత్రి చంద్రబాబు

ముస్లింల ఆధ్వర్యంలోనే వక్ఫ్ ఆస్తులు

'ఉమ్మీద్ పోర్టల్‌లో వక్ఫ్ ఆస్తుల నమోదుకు గడువు పొడిగించేందుకు కేంద్రానికి లేఖ రాస్తా. నోటిఫైడ్ వక్ఫ్ ఆస్తులు, కొత్తగా నిర్మించిన మసీదులు, ఈద్గాలను వక్ఫ్ ఆస్తులుగా గుర్తిస్తాం. ముస్లింల ఆధ్వర్యంలోనే వక్ఫ్ ఆస్తులు కొనసాగుతాయి. వాటిని డిజిటలైజేషన్ చేస్తాం. కబ్జా చేసేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాం' అని తెలిపారు. 'ఆంగ్లం నేర్చుకోవడం సంతోషమే. కానీ ఉర్దూను మరిచిపోకూడదు. రెండోభాష కింద దాన్ని నేర్చుకోవాలి. మాతృభాషను మరిచిపోతే మనల్ని మనం మరిచినట్టే. భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్యం కోసం పోరాడారు. 1951లో ఐఐటీని స్థాపించారు. యూజీసీని తెచ్చి విద్యకు ప్రాధాన్యమిచ్చారు' అని సీఎం కొనియాడారు.

ఉర్దూ అభివృద్ధికి కృషిచేసిన వారికి అవార్డులు

అనంతరం ఉర్దూ భాషాభివృద్ధికి కృషిచేసిన 139 మందికి సీఎం చంద్రబాబు చేతులమీదుగా అవార్డులు ప్రదానం చేశారు. మౌలానా అజాద్ జాతీయ అవార్డుకు వైకాపా ప్రభుత్వం రూ.1.50 లక్షలు అందించగా, కూటమి ప్రభుత్వం దాన్ని రూ.2.50 లక్షలకు పెంచిందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ అవార్డును వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన షేక్ సయ్యద్ బాషాకు అందించారు. డాక్టర్ అబ్దుల్ హక్ అవార్డుకు ఇచ్చే ప్రోత్సాహకాన్ని రూ.లక్ష నుంచి రూ.1.25 లక్షలకు పెంచామన్నారు. నంద్యాల జిల్లాకు చెందిన మహమ్మద్ అంజాద్ బాషా సిద్దిఖీకి ఈ అవార్డు ప్రదానం చేశారు. రైజింగ్ స్పోర్ట్స్ పర్సన్ విభాగంలో నలుగురికి రూ.లక్ష చొప్పున నగదు పురస్కారం అందించారు. జీవన సాఫల్య పురస్కారాన్ని సయ్యద్ నజీర్ అహ్మద్‌కు అందించారు. ఈ అవార్డుకు రాష్ట్రవ్యాప్తంగా 8 మందిని ఎంపికచేశారు. వైఎస్సార్ కడప జిల్లా నుంచి ఎస్.అన్వర్ హుస్సేన్, పి.మహమ్మద్ మునీమ్, కర్నూలుకు చెందిన సయ్యద్ ఖాద్మీ రసూల్, ఎన్.సలీమ్ బాషా, ఎ.నసీర్ హుస్సేన్, అన్నమయ్య జిల్లా వాల్మీకిపురానికి చెందిన సయ్యద్ రియాజ్, విజయవాడకు చెందిన ఎండీ ఇర్ఫాన్ పాషా ఈ అవార్డును అందుకున్నారు. ఉత్తమ ఉర్దూ అధ్యాపకులుగా ఐదుగురు, ఉత్తమ ఉపాధ్యాయులుగా 66 మంది, ఉత్తమ విద్యార్థులుగా 58 మందికి అవార్డులు అందించారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫరూక్ షిబ్లీ రాసిన పాటను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. కార్యక్రమంలో మైనారిటీశాఖ సలహాదారు షరీఫ్, ఎమ్మెల్యేలు షాజహాన్, నజీర్ అహ్మద్, నూర్‌బాషా కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా, మైనారిటీ ఆర్థిక సహకార సంస్థ ఛైర్మన్ ముస్తాక్ అహ్మద్, హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా, ముస్లిం మత పెద్ద ముఫ్తీ ఫారూక్, క్రైస్తవ మత పెద్ద జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

> **మేం నిధులిచ్చినా జగన్ పూర్తిచేయలేదు**
>
> మైనారిటీల అభివృద్ధి కార్యక్రమాలకు 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వం నిధులిచ్చి పనులు చేపట్టినా... జగన్ అధికారంలోకి వచ్చి వాటిని పక్కన పెట్టారు. ఒక్క పని కూడా చేయలేదు. సొంత జిల్లాలో హజ్ భవనాన్నీ పట్టించుకోలేదు. షాదీఖానాలు, మసీదులను నిర్లక్ష్యం చేశారు. వీటన్నింటినీ పూర్తిచేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది.
>
> – ఫరూక్, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి

ఆర్‌కేవీవై, పీడీఎంసీ పథకాల కింద
రూ.695 కోట్లు ఇవ్వండి

- కేంద్ర మంత్రిని కోరిన సీఎం చంద్రబాబు
- సీఎం ఆహ్వానం మేరకు ఉండవల్లిలోని ఆయన నివాసానికి శివరాజ్‌సింగ్ చౌహాన్



కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ఈనాడు, అమరావతి: ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (పీఎంఆర్‌కేవీవై), పీడీఎంసీ పథకాల కింద 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాలకు కలిపి రాష్ట్రానికి రూ.695 కోట్లు ఇవ్వాలని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. వాటర్‌షెడ్ మహోత్సవంలో పాల్గొనేందుకు గుంటూరు వచ్చిన చౌహాన్.. చంద్రబాబు ఆహ్వానం మేరకు మంగళవారం ఉండవల్లిలోని ఆయన నివాసానికి వెళ్లారు. కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి ఎదురెళ్లి స్వాగతం పలికారు. వారిద్దరూ సుమారు గంటసేపు సమావేశమయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం పరిస్థితులు, మైనర్ ఇరిగేషన్ వంటి అంశాలపై చర్చ జరిగింది. మొంథా తుపాను వల్ల జరిగిన నష్టాన్ని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. మైనర్ ఇరిగేషన్ కింద సాగు చేసే రైతుల సంక్షేమానికి కేంద్రం సహకరించాలని సీఎం కోరారు. తోతాపురి మామిడి రైతులకు మార్కెట్ జోక్యం కింద ఇచ్చిన మద్దతు ధరలో కేంద్ర ప్రభుత్వ వాటా కింద ఇవ్వాల్సిన రూ.100 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఒకేసారి 3 లక్షల గృహ ప్రవేశాలు

అన్నమయ్య జిల్లా నుంచి వర్చువల్‌గా
నేడు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి, కడప: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసింది. ఒకేసారి ఈ ఇళ్లలో గృహప్రవేశాలకు సన్నాహాలు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా బుధవారం ఈ 3 లక్షల ఇళ్లలో గృహ ప్రవేశాలు జరగనున్నాయి. అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం దేవగుడిపల్లి గ్రామంలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేస్తారు. అక్కడి నుంచే రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణం పూర్తయిన ఇళ్లను వర్చువల్‌గా ప్రారంభిస్తారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో అందరికీ ఇళ్లు పథకంలో రాష్ట్రంలో సొంతిల్లు లేని పేదలకు ఇళ్లు ఇస్తామని కూటమి పార్టీలు హామీ ఇచ్చాయి. ఈ హామీ అమల్లో భాగంగా తాజా గృహప్రవేశాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన- బీఎల్సీ కింద 2,28,034 ఇళ్లు, పీఎంఏవై గ్రామీణ్ కింద 65,292 ఇళ్లు, పీఎంఏవై జన్మన్ పథకం కింద 6,866.. మొత్తం 3,00,192 ఇళ్ల నిర్మాణం పూర్తవడంతో ఆయా లబ్ధిదారులు బుధవారం గృహప్రవేశం చేయనున్నారు.

సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: అందరి ఏకాభిప్రాయంతో దేశంలో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాల్సిన సమయం వచ్చేసిందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. తిరుమల లడ్డూ కేసు తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన 'ఎక్స్' వేదికగా మంగళవారం స్పందించారు. 'సనాతన ధర్మం అత్యంత పురాతనమైంది. ఎప్పటికీ నవీకరణ పొందే నాగరికతల్లో ఒకటి. హిందువుల విశ్వాసాలను గౌరవించడం, రక్షించడం అనేది ఎలాంటి చర్చకూ తావు లేని అంశంగా ఉండాలి. లౌకిక విధానం అందరికీ వర్తించాలి. హిందూ సమాజానికి తితిదే ఓ తీర్థక్షేత్రం మాత్రమే కాదు. పవిత్రమైన ఆధ్యాత్మిక ప్రయాణం. తిరుపతి లడ్డూ మా అందరి విశ్వాసం. సనాతన భావోద్వేగాలను బలహీనపరిచే యత్నాలు ప్రపంచవ్యాప్తంగా భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసేవిగా పరిగణించాలి. గతంలో తితిదే బోర్డు పాలనా వైఫల్యాలు భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఈ పరిణామం ప్రస్తుత పాలకవర్గానికి పాఠం కావాలి. భక్తుల విశ్వాసాన్ని తిరిగి పొందేందుకు పాలకవర్గ సభ్యులే కాదు, అధికారులు, గుత్తేదారులు, విక్రేతలు అంతా పాటుపడాలి. తితిదేలో పూర్తి పారదర్శకత తీసుకురావాలి. ప్రతి సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలి. సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు ఒక అడుగు అయినప్పటికీ ధర్మాన్ని కాపాడటానికి అంతా సామూహిక బాధ్యత తీసుకోవాలి. దేశంలో ప్రతి ఆలయాన్నీ భక్తులు, సమాజమే నిర్వహించుకునే రోజు ఉంటుందని నా నమ్మకం. అది మన బాధ్యత' అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

మదనపల్లెలో కిడ్నీల మాయలోళ్లు

- గోప్యంగా శస్త్రచికిత్సల వ్యవహారం
- మహిళ మృతితో వెలుగులోకి నిర్వాకం



మధ్యవర్తులు పద్మ, సత్య



మదనపల్లెలోని గ్లోబల్ ఆసుపత్రి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కిడ్నీ రాకెట్ బయట పడింది. విశాఖపట్నానికి చెందిన సూరిబాబు భార్య యమున(29) కిడ్నీని గోవాకు చెందిన రంజన్‌నాయక్‌కు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఇందులో విశాఖపట్నం వాసులు పద్మ, సత్య మధ్యవర్తులుగా వ్యవహరించారు. ఇందుకు యమునకు రూ.8 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదిర్చారు. ఈ నేపథ్యంలో మదనపల్లెలోని గ్లోబల్ ఆసుపత్రిలో కిడ్నీ సేకరించి గోవాలో ఉన్న వ్యక్తికి పంపించేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ నెల 9న శస్త్రచికిత్స చేస్తుండగా మూర్ఛ రావడంతో యమున మృతి చెందింది. ఈ విషయాన్ని విశాఖపట్నంలో ఉన్న ఆమె భర్త సూరిబాబుకు చెప్పడంతో ఆయన బయలుదేరి తిరుపతికి చేరుకున్నారు. అయితే అప్పటికే మదనపల్లె నుంచి మృతదేహాన్ని అంబులెన్స్‌లో రహస్య ప్రాంతానికి తరలించారు. మరోవైపు, మంగళవారం తిరుపతికి చేరుకున్న సూరిబాబును మధ్యవర్తులైన సత్య, పద్మ కలిసి జరిగిన విషయాన్ని చెప్పారు. ఆయన తన భార్య మృతదేహాన్ని చూపించాలని పట్టుబట్టారు. దీంతో ముగ్గురి మధ్య గొడవ జరిగింది. సూరిబాబు తిరుపతి నుంచే 112కు ఫిర్యాదు చేశారు. తిరుపతి తూర్పు పోలీసులు అక్కడకు వచ్చి ముగ్గురినీ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. తర్వాత వారిని మదనపల్లెకు తీసుకెళ్లి అక్కడి రెండో పట్టణ పోలీసులకు అప్పగించారు. విచారించిన స్థానిక పోలీసులు మదనపల్లెలోని గ్లోబల్ ఆసుపత్రిలో ఘటన జరిగినట్లు తేల్చారు. ఆ ఆసుపత్రిలోని పలువురు సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు.

పోలీసుల అదుపులో డయాలసిస్ కేంద్రం బాధ్యుడు

గ్లోబల్ ఆసుపత్రి నిర్వాహకురాలు డాక్టర్ శాశ్వతి మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి డయాలసిస్ కేంద్రంలో వైద్యురాలిగా పనిచేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రం బాధ్యుడు బాలరంగడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే గ్లోబల్ ఆసుపత్రికి విశాఖకు చెందిన మధ్యవర్తులతో ఎలా పరిచయం ఏర్పడింది? ఎన్ని రోజులుగా ఈ దందా కొనసాగుతోంది? అనే దానిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. గ్లోబల్ ఆసుపత్రి నిర్వాహకురాలు శాశ్వతి అన్నమయ్య జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ఆంజనేయులు కోడలు కావడం గమనార్హం. ఇందులో ఆయన ప్రమేయంపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. రెండో పట్టణ సీఐ రాజారెడ్డి మాట్లాడుతూ కేసు పూర్తి స్థాయిలో విచారణ చేసి వివరాలు వెల్లడిస్తామన్నారు.

పర్యాటక ప్రదేశంగానే రుషికొండ ఉండాలి

- అభిప్రాయ సేకరణలో అత్యధికుల వెల్లడి
- 13న విశాఖలో మంత్రుల ఉపసంఘం భేటీ

ఈనాడు, అమరావతి: విశాఖలో రుషికొండపై నిరుపయోగంగా ఉన్న భవనాలతోపాటు కొండ కింద తొమ్మిది ఎకరాల ఖాళీ స్థలాన్ని పర్యాటకంగానే వినియోగిస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని పర్యాటకాభివృద్ధి సంస్థ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో అత్యధికులు వ్యక్తం చేశారు. హోటల్-రిసార్ట్, వెడ్డింగ్ డెస్టినేషన్, మైస్, భారీ కన్వెన్షన్ సెంటర్, ఇతరత్రా నిర్వహణకు ఉపయోగించాలని సూచించారు. ఇదే విషయాన్ని ఈ నెల 13న విశాఖపట్నంలో నిర్వహించే మంత్రుల ఉప సంఘం సమావేశం దృష్టికి అధికారులు తీసుకెళ్లనున్నారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఈ మేరకు నివేదిక రూపొందించింది. మంత్రుల సూచనలపై మార్పులు, చేర్పులు చేసి నెలాఖరులో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

- వైకాపా ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ కోసం రుషికొండపై రూ.452 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి అత్యంత విలాసవంతంగా నిర్మించిన భవనాలతో పాటు అదే కొండ కింద ఉన్న భూమి వినియోగంపైనా కూటమి ప్రభుత్వం ఆదేశాలపై రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ పలు ప్రఖ్యాత పర్యాటక సంస్థల ప్రతినిధులు, నిపుణుల అభిప్రాయాలు తెలుసుకుంది. ప్రజల నుంచి మెయిల్ ద్వారా అభిప్రాయాలు సేకరించింది.

జూదం నిర్వాహకుడిగా ఏఎస్సై!

టాస్క్‌ఫోర్స్ దాడుల్లో చిక్కిన పోలీసులు

గుంటూరు స్పెషల్ క్రైం, న్యూస్‌టుడే: అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా విధులు నిర్వర్తించాల్సిన పోలీసు అధికారే జూదం నిర్వాహకుడిగా మారారు. గుంటూరు జిల్లా పెదకాకాని పోలీస్‌స్టేషన్ ఏఎస్సైతో పాటు పలువురు పోలీసులు జూదం ఆడుతూ వారం రోజుల కిందట ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది. ఈ విషయాన్ని పోలీసుశాఖ గోప్యంగా ఉంచింది. మూడేళ్ల నుంచి ఈ ఏఎస్సై సొంత మండలం(పెదకాకాని)లోని పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఆయన తన ఇంట్లోనే జూదం ఆడిస్తుంటే స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అప్పటి సీఐ దృష్టికి తీసుకెళ్లారు. అప్పుడు సీఐ హెచ్చరించడంతో ఆయన వెనక్కి తగ్గారు. అయితే, కొన్ని నెలల నుంచి మళ్లీ జూదం ఆడించడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో తక్కెళ్లపాడు జాతీయ రహదారి పక్కన ఉన్న హోటల్‌లో జూదం ఆడిస్తుండగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ అధికారులు ఏఎస్సైతో పాటు కొంతమంది పోలీసులను పట్టుకున్నట్లు సమాచారం.

సమస్యలు వింటూ.. నేనున్నానంటూ..

- బాధితుల్లో ధైర్యం నింపిన మంత్రి లోకేశ్
- ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ





ప్రజా దర్బార్‌లో దివ్యాంగుడు, వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: సమస్యలు ఓపిగ్గా వింటూ, నేనున్నానంటూ.. బాధితులకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆయన మంగళవారం 72వ ప్రజాదర్బార్ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, తెదేపా నాయకులు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీలన్నీ పరిశీలిస్తానని, సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు వినతుల స్వీకరణతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులతో మాట్లాడారు. లోకేశ్ కార్యాలయం నుంచి వెళ్లిన తర్వాత పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వినతులు స్వీకరించారు.

హత్య కేసు బనాయించి కేతిరెడ్డి వేధించారు

- తెదేపా సానుభూతిపరుడిననే కక్షతో వైకాపా హయాంలో అప్పటి ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తనపై అక్రమంగా హత్య కేసు బనాయించి, ఇబ్బందులు పెట్టారని సత్యసాయి జిల్లా శిరిగారిపల్లెకు చెందిన కె.రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా ఆదుకోవాలని మంత్రి లోకేశ్‌ను కోరారు.
- వంశపారంపర్యంగా వచ్చిన 4.86 ఎకరాలను వైకాపా నాయకులు ఆక్రమించారని వైఎస్సార్ కడప జిల్లా నల్లచెరువుపల్లెకు చెందిన కస్తూరి రామన్న అర్జీ ఇచ్చారు.
- వైకాపా హయాంలో తొలగించిన దివ్యాంగ పింఛను పునరుద్ధరించి, ఆదుకోవాలని విజయవాడకు చెందిన షేక్ గుల్జార్ కోరారు.
- గత ప్రభుత్వంలో రద్దు చేసిన టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అప్పగించాలని చిలకలూరిపేటకు చెందిన తిరుపతమ్మ కోరారు.

మరిన్ని వివరాలు https://epaper.eenadu.netలో

అమరావతిలో దసపల్లా హోటల్‌కు భూమిపూజ

వర్చువల్‌గా పాల్గొన్న సీఎం చంద్రబాబు



హోటల్ నమూనా

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిలో దసపల్లా 4 స్టార్ హోటల్‌కు మంగళవారం జరిగిన భూమి పూజలో సీఎం చంద్రబాబు వర్చువల్‌గా పాల్గొన్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ హాజరై ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి, గుంటూరు జాయింట్ డైరెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, దసపల్లా హోటల్స్ ఛైర్మన్ మండవ రాఘవేంద్రరావులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. రూ.200 కోట్లతో నిర్మిస్తున్న హోటల్ ద్వారా 400 మందికి ఉపాధి కల్పిస్తామన్నారు.



అప్పటి పరిశ్రమలశాఖ కార్యదర్శి నిర్ణయాలతో
ఏపీఐఐసీకి రూ.43 కోట్ల నష్టం

- ఎమ్మార్ వ్యవహారంలో హైకోర్టులో సీబీఐ వాదన
- కందుల విశ్వేశ్వరరావు పిటిషన్‌ను కొట్టివేయాలని వినతి

ఈనాడు, హైదరాబాద్: ఎమ్మార్ ప్రాజెక్టుకు సంబంధించి అప్పటి పరిశ్రమలశాఖ కార్యదర్శి కందుల విశ్వేశ్వరరావు తీసుకున్న నిర్ణయాల వల్ల ఏపీఐఐసీకి తీవ్ర నష్టం వాటిల్లిందని హైకోర్టుకు సీబీఐ నివేదించింది. క్విడ్ ప్రో కోలో భాగంగా ఎమ్మార్ కంపెనీకి అక్రమ లబ్ధి చేకూర్చి... తక్కువ ధరకే ప్లాటు పొందారని తెలిపింది. ఎమ్మార్ ప్రాజెక్టులో కుట్ర వల్ల ఏపీఐఐసీ రూ.43.50 కోట్లు నష్టపోగా, నిందితులు అక్రమంగా రూ.167.29 కోట్లు లబ్ధి పొందారంది. ఎమ్మార్ వ్యవహారంలో సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ 12వ నిందితుడు, అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కందుల విశ్వేశ్వరరావు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. సీబీఐ ప్రత్యేక న్యాయవాది టి.సృజన్‌కుమార్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... 2004లో వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మార్ ప్రాపర్టీస్ పీజేఎస్‌సీ (దుబాయ్)కు చెందిన ప్రాజెక్టును పునఃసమీక్షించాలని నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా ఎమ్మార్‌కు కేటాయించే భూమి ధరను ఎకరాకు రూ.29 లక్షల నుంచి రూ.40 లక్షలకు పెంచాలని ఏపీఐఐసీ ప్రతిపాదించిందని తెలిపారు. ఈ ప్రతిపాదనను ఎలాంటి సహేతుక కారణం వెల్లడించకుండానే పరిశ్రమల శాఖ కార్యదర్శి హోదాలో విశ్వేశ్వరరావు తిరస్కరించారని, దాంతో ఏపీఐఐసీకి నష్టం కలిగిందన్నారు. 235 ఎకరాల్లోని గోల్ఫ్ కోర్సు ప్రాజెక్టు లీజు మొత్తాన్ని మొదట 33 ఏళ్లకు వార్షిక స్థూల ఆదాయంలో 2 శాతం, ఆ తర్వాత మరో 33 ఏళ్లకు 3 శాతం పెంచాలన్న ప్రతిపాదనను తిరస్కరించారన్నారు. ఈ వ్యవహారం మంత్రి దృష్టికి వెళ్లకుండా విశ్వేశ్వరరావు ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. హోటల్‌లో ఏపీఐఐసీ వాటా 49 నుంచి 26 శాతానికి పడిపోయేలా నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఎమ్మార్ హిల్స్ టౌన్‌షిప్‌లో ప్లాట్లు, ప్లాట్లను ఏపీఐఐసీ అనుమతి లేకుండానే ఎమ్మార్ కంపెనీ, ఎంజీఎఫ్‌లు ఒప్పందం కుదుర్చుకుని విక్రయించుకున్నాయని తెలిపారు. చదరపు గజం రూ.5 వేల చొప్పున అమ్మినట్లు రికార్డుల్లో చూపి... రూ.40 వేల నుంచి 50 వేల దాకా అదనంగా వసూలు చేశారన్నారు. ప్లాట్లు, విల్లాల విక్రయానికి ప్రత్యేకంగా ఒక ఏజెన్సీ ఏర్పాటు చేసుకుని... 4 శాతం కమీషన్ చెల్లించారని పేర్కొన్నారు. ఎమ్మార్ కంపెనీకి అనుకూలంగా నిర్ణయం తీసుకున్నందుకు ప్రతిఫలంగా మార్కెట్ ధర కన్నా తక్కువకే పిటిషనర్ ప్లాటు పొందారన్నారు. కుట్రలో అతని పాత్ర ఉందని తెలిపారు. అభియోగాలను నమోదు చేశామని, పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. పిటిషనర్ వాదనల నిమిత్తం విచారణను న్యాయమూర్తి 17వ తేదీకి వాయిదా వేశారు.

అక్షరయోధుడికి కన్నీటి వీడ్కోలు

ఘట్‌కేసర్‌లో అందెశ్రీ అంత్యక్రియలు పూర్తి



అందెశ్రీ పాడె మోస్తున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్- ఘట్‌కేసర్, లాలాపేట, న్యూస్‌టుడే: అక్షర యోధుడు, సహజ కవి అందెశ్రీ(64) అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య ముగిశాయి. అధికార లాంఛనాలతో ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో మంగళవారం ఆయన కుమారుడు దత్తు... అంతిమ కార్యక్రమాలను పూర్తిచేశారు. పోలీసులు గాలిలోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపి 'గార్డ్ ఆఫ్ ఆనర్' సమర్పించారు. ఘట్‌కేసర్ నుంచి ఖననం చేసే ప్రదేశం వరకు సీఎం రేవంత్‌రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్నారు. అనంతరం పాడె మోసి... అందెశ్రీపై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. అందెశ్రీ కుటుంబసభ్యులను ఓదార్చారు. అంతకుముందు వేల సంఖ్యలో తరలివచ్చిన ఉద్యమకారులు, సాహితీవేత్తలు, అభిమానులు ఉద్యమ గీతాలు, డప్పు దరువుల మధ్య అక్షరయోధుడికి ఘన నివాళి అర్పించారు. అరుణోదయ బృందంతో విమలక్క ఉద్యమ గీతాలు ఆలపించారు.

పాఠ్యపుస్తకాల్లో 'జయ జయహే తెలంగాణ': అంతిమ సంస్కారాలు పూర్తయ్యాక రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... "ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో అందెశ్రీ గొప్ప పాత్ర పోషించారు. ఆయన రాసిన 'జయ జయహే తెలంగాణ.. జననీ జయకేతనం' గీతాన్ని పాఠ్యపుస్తకాల్లో ప్రథమ అంశంగా చేరుస్తాం" అని చెప్పారు.

జూబ్లీహిల్స్ మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ వైపే

ఈనాడు, హైదరాబాద్: నెలరోజులుగా ఉత్కంఠ రేపిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ పూర్తవడంతో ఫలితంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అధికార పార్టీ కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతున్నా.. గెలుపు అవకాశాలపై ప్రతిపక్షం కూడా విశ్లేషణ చేస్తోంది. ఎగ్జిట్‌పోల్స్ 3 నుంచి 7 శాతం ఓట్ల వ్యత్యాసాన్ని కాంగ్రెస్, భారాసల మధ్య చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫలితాలు ఎలా అయినా మారొచ్చని రాజకీయ పరిశీలకుల అంచనా. భారాస పక్షాన మాగంటి సునీత పోటీ చేయగా.. కాంగ్రెస్ నుంచి నవీన్‌యాదవ్, భాజపా నుంచి దీపక్‌రెడ్డి బరిలో ఉన్నారు. 48.47 శాతం పోలింగ్ నమోదైంది. ఫలితాలు ఈనెల 14న వెలువడనున్నాయి.

EENADU Vol: 52, Issue: 92 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao



ప్రారంభ ధర
₹7 89 900~
ఇప్పుడు షోరూమ్‌లో ఉంది.

ఉత్తేజకరమైన అనుభవం కోసం స్కాన్ చేయండి.



కనెక్టెడ్ కార్ నావిగేషన్ కాక్‌పిట్ (ccNC)^ మరియు కంట్రోలర్ - OTAతో డ్యూయల్ 62.5 cm (12.3" + 12.3") కర్వ్డ్ పనోరమిక్ డిస్‌ప్లే
టెర్రాజో-టెక్స్చర్డ్ క్రాష్‌ప్యాడ్ ఫినిషింగ్‌తో డ్యూయల్ టోన్ డార్క్ నేవీ & డోవ్ గ్రే ఇంటీరియర్ థీమ్



డార్క్ క్రోమ్ రేడియేటర్ గ్రిల్
క్వాడ్ బీమ్ LED హెడ్‌ల్యాంప్స్



విశాలమైన క్యాబిన్ - పెద్ద హెడ్ రూమ్, షోల్డర్ రూమ్ మరియు నీ రూమ్

New



ఫ్రంట్ రో వెంటిలేటెడ్ సీట్స్

New



సరౌండ్ వ్యూ మానిటర్ (SVM)

New



బోస్ ప్రీమియం సౌండ్
8 స్పీకర్ సిస్టమ్

New



Hyundai స్మార్ట్‌సెన్స్ -
లెవెల్ 2 ADAS (16 లక్షణాలు)

6 AT ఇన్ 1.5 l డీజిల్ New

ఇంజిన్ ఎంపికలు
కప్పా 1.2 l MPi పెట్రోల్
కప్పా 1.0 l టర్బో GDi పెట్రోల్
U2 1.5 l CRDi డీజిల్

ట్రాన్స్‌మిషన్ ఎంపికలు
MT l AT l DCT

సూపర్ స్ట్రాంగ్ బాడీ స్ట్రక్చర్
33 స్టాండర్డ్ సేఫ్టీ ఫీచర్స్
65 కంటే ఎక్కువ అడ్వాన్స్‌డ్ సేఫ్టీ ఫీచర్స్

HYUNDAI

To enquire give a missed call at **9555295868**

my Hyundai app | Hyundai Click to Buy | 3 Year Unlimited Kilometer Warranty | Upto 7 Years Extended Warranty## | Upto 5 Years Shield of Trust Running Repair Package** | Upto 5 Years Shield of Trust Super Maintenance Package** | 10 Year Road Side Assistance (RSA)** | Shield of Trust Bodycare Body Maintenance Package** | Bluelink 3 Years free Bluelink subscription | Accelerated by^ NVIDIA ^31.24 cm (12.3") ccNC navigation system is accelerated by NVIDIA


For Information Contact: Toll Free: 1800114645 **Vijayawada: Kusalava Hyundai,** Labbipet, Ph: 9985374311, Autonagar, Ph: 7997966434 **Sai Swarna Hyundai,** Ramavarappadu Ring Road, Ph: 9581151234 **Lucky Hyundai,** Enikepadu Ph: 7799994789 **Bhimavaram: Kusalava Hyundai,** Ph: 9866175390 **Guntur: Kusalava Hyundai,** Ph: 9866672302 **Nellore: Kun Hyundai,** Ph: 9849549222 **Ongole: Sri Chakra Hyundai,** Ph: 9949096708

*Terms & Conditions apply. ~Ex-showroom price mentioned is for HX 2 MT (Kappa 1.2 l MPi Petrol) variant. Creative shown is for representation purpose only. Features & specifications shown may vary or not be a part of standard fitment & are subject to change without prior notice. Hyundai Motor India Limited reserves the right to change specifications, colour, equipment and schemes at any time without prior notice. Images shown are for creative representation. The black shade on glasses is due to lighting effect. Size, colour may vary due to lighting and positioning effects. Bluelink functionality is dependent on adequate power supply and uninterrupted network connectivity. The Bluelink system is designed in such a way that it makes vehicle theft difficult if its circuit and battery connection is uninterrupted. Hyundai SmartSense, the Advanced Driver Assistance System is not a substitute for safe and attentive driving. Its effectiveness depends on various factors. Availability of Hyundai SmartSense Features may differ by variants. ##Upto 7 years extended warranty is applicable for all variants. It is applicable for upto 7 years or 1 40 000 kms whichsoever is earlier. *For detailed terms & conditions of warranty refer owner's manual. **For detailed terms & conditions of extended warranty & Shield of Trust/Super/Bodycare kindly visit Hyundai India website, https://www.hyundai.co.in/. Extended warranty, RSA and Shield of Trust Packages are on payable basis. For more details, consult the nearest Hyundai authorized dealer. Hyundai urges you to follow traffic rules-these are meant to keep you safe on roads.
INNOCEAN-056/22 TEL

ప్రపంచమొక గణితవ్యూహం!

ఇటలీ గణితజ్ఞుడు లియోనార్డో ఫిబోనాకీ 13వ శతాబ్దంలో ఒక సరదా లెక్క వేశాడు. ఒక జంట కుందేళ్లు ప్రతి నెలా మరో జంటకు జన్మనిస్తే, సంవత్సరం చివరికి ఎన్ని జంటలవుతాయి? ఆ లెక్క ఇలా వచ్చింది - 1, 1, 2, 3, 5, 8, 13, 21, 34. ఈ క్రమాన్ని మాటల్లో చెప్పాలంటే- ప్రతి కొత్త సంఖ్య దాని ముందు రెండు సంఖ్యల మొత్తంతో సమానమవుతుంది. ఇదే ఫిబోనాకీ శ్రేణిగా ప్రాచుర్యం పొందింది. ఇది కేవలం కుందేళ్ల లెక్క మాత్రమే కాదు, ప్రకృతి పెరుగుదల సూత్రం కూడా. ఉదాహరణకు- చెట్టు కొమ్మల పెరుగుదలనే తీసుకుందాం. ఇందులోని ఫిబోనాకీ శ్రేణి చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఒక కాండం నుంచి ఒక్క కొమ్మ పుట్టుకొస్తుంది. తర్వాత ఆ కొమ్మ రెండు అవుతుంది. అనంతరం ఆ రెండు కొమ్మలు మూడు అవుతాయి. ఆ తర్వాత ఐదు, ఎనిమిది, పదమూడు.. ఇలా ఒక చెట్టు, తన కొమ్మలను ఉద్భవింపజేసే క్రమము ఫిబోనాకీ అంకెల శ్రేణిని పాటిస్తుంది. దీంతో ప్రతి కొత్త కొమ్మకూ తగినంత స్థలం లభిస్తుంది. తద్వారా చెట్టు సమతులంగా విస్తరిస్తుంది. అంటే ప్రకృతి ఎక్కడా గందరగోళంగా పెరగదన్నమాట. దానికి తనదైన లెక్క ఉంది. ఫిబోనాకీ శ్రేణిని ప్రకృతి పాటించటాన్ని బట్టి చూస్తే కొమ్మల్లో 'సర్దుకుపోదాం రండి' అనే భావన కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. మన శరీర డీఎన్ఏ అణువు పొడవు 34, వెడల్పు 21 యూనిట్లు. ఇవి కూడా ఫిబోనాకీ సంఖ్యలే కావటం గమనార్హం.


లియోనార్డో ఫిబోనాకీ



స్వర్ణ కోణం సమతుల్యత

ఫిబోనాకీ శ్రేణిలోని వరుస రెండు అంకెలను వృత్త కోణంలోకి మార్చితే, చిన్న అంకె విలువ 137.5° అవుతుంది. దీన్నే స్వర్ణ కోణం (గోల్డెన్ యాంగిల్) అంటారు. ప్రకృతిలో దీనికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ప్రతి చెట్టు కొత్త ఆకు, పాత ఆకుతో ఈ నిర్దిష్ట కోణంలోనే ఏర్పడుతుంటుంది. దీంతో ఆకుల అమరిక సర్పిలాకారం పొందుతుంది. ఈ విధానంలో ఆకులు ఒకదానిపై మరొకటి పడవు. ప్రతి ఆకుకి సూర్యకాంతి సమానంగా అందుతుంది. ఇది కిరణజన్య సంయోగక్రియ జరుపుకోవడానికి ప్రకృతి చేసిన సైన్స్ డిజైన్! ప్రతి ఆకుకీ, విత్తనానికీ పెరగటానికి సమాన హక్కు ఉందని ప్రకృతి ఇలా చెబుతోందన్నమాట. ఒక్క ఆకుల్లోనే కాదు, చాలావాటిల్లో స్వర్ణ కోణం, సర్పిలాకారం కనిపిస్తుంది. ఇది స్థిరత్వాన్నీ, బలాన్నీ కలిగిస్తుంది.

గవ్వల ఆకృతి: గవ్వల ఆకారం స్వర్ణ కోణంతోనే తిరుగుతూ, పెరుగుతూ వస్తుంది. అంతేకాదు, దాని ప్రతి మెలిక, దాని ముందున్న దాని కన్నా 1.618 రెట్లు పెద్దది. దీంతో అవి బలంగా, స్థిరంగా ఉంటాయి.

విత్తనాలు: పొద్దు తిరుగుడు పువ్వులో విత్తనాల అమరిక ఫిబోనాకీ అంకెలను, స్వర్ణ కోణాన్ని పాటించి సర్పిలాకారంగా పెరుగుతాయి. దీని వల్ల అందులోని ఒక్క విత్తనమూ మరొకదాని మీదికి రాకుండా, సమానంగా పెరుగుతాయి.



చక్రవాతాలు: ఇటీవలి మొంథా తుపాను ఉపగ్రహ చిత్రాలు గమనించే ఉంటారు. చక్రవాతాలన్నీ సర్పిలాకారం రూపంలోనే ఉంటాయి. వాయు పీడనాన్ని ఈ ఆకృతి సమతులంగా ఉంచుతుంది. దీంతో చక్రవాతం బలంగా నిలుస్తుంది.


గెలాక్సీలు: మన పాలపుంత నక్షత్ర మండలం (గెలాక్సీ) సైతం సర్పిలాకార ఆకృతిలోనే తిరుగుతుంది. ప్రతి సర్పిలాకార నిష్పత్తి, భుజాల మధ్య కోణం ఫిబోనాకీ స్వర్ణ నియమాన్నే పాటిస్తాయి.

- అంటే, చిన్న గవ్వ నుంచి విశ్వ గెలాక్సీ వరకూ ప్రకృతి ఒకే అంకెల లయను పాటిస్తోందన్నమాట.

స్వర్ణ నిష్పత్తి సౌందర్యం

ఫిబోనాకీ సంఖ్యల్లో వరుసగా ఉన్న రెండు అంకెలను తీసుకుని.. వెనుక ఉన్న అంకెను ముందు అంకెతో భాగిస్తే, భాగఫలము విలువ క్రమ క్రమంగా ఒక స్థిరమైన విలువకు సమీపానికి చేరుతుంది. ఆ విలువే 1.618. దీన్నే స్వర్ణ నిష్పత్తి (గోల్డెన్ రేషియో) అంటారు. ప్రకృతిలో అందానికి ఈ నిష్పత్తే మూల కారకం. మన కళ్లకు ఏదైనా ఆకారం సమతులంగా, అందంగా అనిపించాలంటే అది కచ్చితంగా స్వర్ణ నిష్పత్తిలో ఉండాల్సిందే. కావాలంటే కొన్ని ఉదాహరణలు చూడండి.

లియోనార్డో డావించీ మోనాలీసా: ప్రముఖ చిత్రకారుడు డావించీ తన ప్రసిద్ధ చిత్రమైన మోనాలీసాలో స్వర్ణ నిష్పత్తినే వాడుకున్నాడు. మోనాలీసా ముఖం, కళ్ల మధ్య దూరం, ముక్కు పొడవు.. అన్నీ ఇదే నిష్పత్తిలో ఉంటాయి. అందుకే ఆమె చిరునవ్వు మనందరి మనసును హత్తుకుంటుంది. ఇది గణితంతో పుట్టిన కళ.



తాజ్‌మహల్ రాతిలో దాగిన లెక్క: ప్రపంచ వింతల్లో ఒకటైన తాజ్‌మహల్ మనసును కట్టిపడేసే సౌందర్యంతో ఓలలాడుతుంటుంది. ఎందుకంటే దాని ఎత్తు, వెడల్పు, గుమ్మటం వ్యాసం అన్నీ స్వర్ణ నిష్పత్తిలోనే ఉన్నాయి. ఈ సమతుల్యత మూలంగానే అది మన కళ్లకు సొంపుగా, అత్యంత అందంగా కనిపిస్తుంది. ఇక్కడ శిల్పి రాయిని కాదు, గణితాన్ని చెక్కాడు.

భారత రాజమహళ్లు, కోటలు, దేవాలయాలు: భారత శిల్పకళా సంప్రదాయంలోనూ స్వర్ణ నిష్పత్తి కనిపిస్తుంది. గోల్కొండ కోట గేట్లు, మైసూరు ప్యాలెస్ జాలీలు, రాజమహల్ గుమ్మటాలు అన్నీ ఈ నిష్పత్తిలోనే ఉండి ఇప్పటి తరాన్నీ ఆకట్టుకుంటున్నాయి. శిల్పులు గణిత సూత్రాలను మాటల్లో చెప్పకపోయినా, తమ చేతులతో ఆ సంఖ్య ద్వారా కట్టడాలకు జీవం పోశారు.


మనిషి శరీరంలోనూ: అంతెందుకు మనిషి శరీరం కూడా గణిత సమతుల్యతలోనే ఉంది. తల నుండి నాభి వరకు గల పొడవుకు, నాభి నుండి పాదాల వరకు గల పొడవుకు మధ్య నిష్పత్తి = 1.618. అలాగే మోచేయి నుంచి మణికట్టు, అక్కడి నుంచి వేళ్ల చివరి వరకూ ఉండే పొడవుల నిష్పత్తి = 1.618. ఇలా శరీరంలో ప్రతి భాగం స్వర్ణ నిష్పత్తిని పాటిస్తుంది. ఈ అంకెలు కొద్దిగా అటుఇటైనా రూపం ఇంపుగా ఉండదన్నమాట. అందం కోసం జరిగే ప్లాస్టిక్ సర్జరీలలోనూ ఈ అంకెల నిష్పత్తి కీలకం. ప్రకృతి మనిషి రూపాన్నీ గణిత లయలోనే తీర్చిదిద్దింది.

పువ్వుల రేకుల్లో లెక్కల అందం

పువ్వులు రంగురంగులతో ఎంతో అందంగా ఉంటాయి కదా. వీటి రేకుల సంఖ్య కూడా యాదృచ్ఛికం కాదు. ప్రకృతి లెక్కలు కచ్చితంగా ఉంటాయి. లిల్లీ, గులాబీ, కమలం, మల్లె, సూర్యముఖి వంటి పువ్వుల రేకలను మీరు గనుక లెక్కిస్తే- ఫిబోనాకీ శ్రేణిలోని ఏదో ఒక అంకెగానే ఉంటుంది. పువ్వుల రెమ్మలు ఇలా పెరగడం వల్ల, వాటి రేకుల మధ్య దూరం సమానంగా ఉండి సూర్యకాంతి సమంగా అందుతుంది. దీంతో పువ్వు సంపూర్ణంగా వికసిస్తుంది. పువ్వుల అందాన్ని ప్రకృతి కేవలం కళతో కాదు, గణిత సమతుల్యతతో సృష్టించింది మరి.

నిత్యజీవనంలోనూ

ఫిబోనాకీ విధానంతో ప్రకృతి ఒక్కటే లబ్ధి పొందుతుందని అనుకుంటున్నారేమో. నిత్యజీవితంలో ప్రయోజనాల కోసం మనం కూడా ఈ అంకెల మాయను నేర్చుకొని వాడటం మొదలుపెట్టాం. దీన్నే కంప్యూటర్ల పరిభాషలో ఆప్టిమైజేషన్‌గా పేర్కొంటారు. ఒక చెట్టు ఎన్ని ఆకులను పెంచితే సూర్యకాంతి అన్ని ఆకులకు సమానంగా అందుతుందో, ఒక తేనెటీగ ఎంత దూరం ఎగిరితే తక్కువ శ్రమతో ఎక్కువ మకరందాన్ని సేకరించగలదో.. వంటి



ప్రకృతి నేర్పిన లెక్కలను ఆచరించి తక్కువ వనరులతో ఎక్కువ ఫలితం పొందడమే ఆప్టిమైజేషన్ అని చెప్పుకోవచ్చు. గూగుల్ మ్యాప్ తక్కువ సమయంలో ప్రయాణించటానికి తోడ్పడే దారిని చూపించడం, సెర్చ్ ఇంజన్ క్షణాల్లో సరైన సమాధానం ఇవ్వడం, మొబైల్ బ్యాటరీ ఎక్కువ కాలం వచ్చేటట్లు చేయడం.. ఇలాంటివన్నీ ఆప్టిమైజేషన్ ఫలితాలే. మరోవిధంగా చెప్పాలంటే- ఎక్కువ సమాచారాన్ని అతి తక్కువ స్థలంలో అమర్చి, వేగంగా సరైన సమాధానాలు ఇవ్వటానికి కంప్యూటర్ ఆల్గోరిథమ్స్ ఈ లెక్కలను వాడుకుంటాయన్నమాట.

- వ్యవసాయంలోనూ రైతు మొక్కలు నాటేటప్పుడు వరుసల మధ్య ఫిబోనాకీ లయలో ఉంచితే, ప్రతి మొక్కకూ సూర్యకాంతి సమానంగా అందుతుంది. ఫలితంగా పంట దిగుబడి పెరుగుతుంది.

రైతు గణితం నేర్చుకోకపోయినా కూడా ప్రకృతే ఈ పాఠం నేర్పింది.

గణితం అంటే లెక్క కాదు, అదో జీవ లయ. 'నేను అందంగా కనిపించడానికి కారణం శిల్పకళ కాదు, గణిత సమతుల్యత' అని ప్రకృతి మనకు చెబుతోంది. గణితం పుస్తకాల్లోని అంకెల్లో కాదు, పువ్వులో ఉంది, ఆకులో ఉంది, గెలాక్సీలో ఉంది. అంతెందుకు, ఎందెందు వెతికినా అందులో అంకెల మాయ ఉంటుంది. ఓసారి ప్రకృతిని నిశితంగా గమనించండి. మీకు గణితం మీద భయం పోతుంది, క్రమక్రమంగా ఆసక్తి మొదలవుతుంది. ప్రకృతి నుండి గెలాక్సీ వరకూ గణితమే జీవ సదృశంగా కనిపిస్తుంది.

- డా. మొహమ్మద్ నయీమ్
అసోసియేట్ ప్రొఫెసర్, భౌతిక శాస్త్ర విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అద్దంకి

వన్‌ప్లస్ నయా ఫోన్



వన్‌ప్లస్ సంస్థ భారీ బ్యాటరీ సామర్థ్యం, సూపర్ ఫాస్ట్ ఛార్జింగ్, అత్యధిక కూలింగ్, వాటర్ రెసిస్టెన్స్‌తో ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ తీసుకొస్తోంది. నవంబరు 13న ఆవిష్కరించనున్న దీని పేరు వన్‌ప్లస్ 15. క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ జెన్ 5 చిప్, ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఆక్సీజన్‌ఓఎస్ 16తో పనిచేస్తుంది. కీలక ఫీచర్లు ఇవీ..

- 165హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 1,800 నిట్స్ గరిష్ఠ ప్రకాశంతో కూడిన 6.78 అంగుళాల 1.5కే ఎల్‌టీపీఓ ఎమోలెడ్ తెర.
- 3200హెచ్‌జడ్ టచ్ సాంప్లింగ్ రేట్.
- 7,300ఎంఏహెచ్ బ్యాటరీ.. 120డబ్ల్యూ సూపర్‌వూక్ వైర్డ్, 50డబ్ల్యూ ఎయిర్‌వూక్ వైర్‌లెస్ ఛార్జింగ్. నాలుగేళ్ల తర్వాతా 80 % బ్యాటరీ సామర్థ్యం కలిగుంటుందని కంపెనీ చెబుతోంది.
- దుమ్ము, నీటిని తట్టుకోవటంలో ఐపీ66, ఐపీ68, ఐపీ69, పీఐ69కే సర్టిఫికెట్లు. మీటరున్నర లోతు నీటిలో 30 నిమిషాలు మునిగినా లోపలికి నీరు వెళ్లదు.
- 3డీ వేపర్ ఛాంబర్‌తో కూడిన 360 డిగ్రీ క్రయో-వెలాసిటీ కూలింగ్ వ్యవస్థ.

ఆండ్రాయిడ్ పరికరాల్లో భద్రతా లోపాలు



ఆండ్రాయిడ్ 13, 14, 15, 16 వర్షన్ల ఫోన్లలో తీవ్ర భద్రత లోపాలున్నాయని ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్) హెచ్చరించింది. అటాకర్లు వీటిని ఉపయోగించుకొని పరికరాల మీద పట్టు సాధించొచ్చని, ఏకపక్ష కోడ్‌ను జొప్పించొచ్చని పేర్కొంది. రహస్య, ఆర్థిక సమాచారాన్ని కొల్లగొట్టే ప్రమాదముందని, క్లౌడ్ ఖాతాలనూ యాక్సెస్ చేయొచ్చని వివరించింది. ముఖ్యంగా తాజా సెక్యూరిటీ ప్యాచెస్ అందని పరికరాలకు ఈ ముప్పు ఎక్కువని తెలిపింది. ఒక్క ఫోన్లకే కాదు, ఆండ్రాయిడ్ స్మార్ట్ టీవీలు, ఐఓటీ పరికరాలకూ ప్రమాదం పొంచి ఉందని చెబుతోంది.

ఇలా జాగ్రత్తగా

- థర్డ్ పార్టీ, తెలియని సోర్సుల నుంచి యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవద్దు.
- పరికరం, యాప్స్ ఆటోమేటిక్‌గా అప్‌డేట్ అయ్యేలా చూసుకోవాలి.
- తీవ్రమైన ప్రమాదాలను గుర్తించటానికి గూగుల్ ప్లే ప్రొటెక్ట్‌ను వాడుకోవాలి.
- ఎస్ఎంఎస్ లేదా ఈమెయిళ్లకు అందే అనుమానిత లింకులు, అటాచ్‌మెంట్ల మీద క్లిక్ చేయొద్దు.

గ్రాక్‌తో వీడియో సృష్టి



ఇమేజ్‌లను వీడియో క్లిప్‌లుగా మలచుకోవాలని అనుకుంటున్నారా? అయితే ఎక్స్‌ఏఐ రూపొందించిన గ్రాక్ ఏఐ చాట్‌బాట్ సాయం తీసుకోవచ్చు. ఇప్పటికే రైటింగ్ అసిస్టెంట్, ఇమేజ్ జనరేషన్, తక్షణ డేటా యాక్సెస్ వంటి ఫీచర్లతో అలరిస్తున్న దీనికి తాజాగా ఇమేజ్‌లను వీడియోలుగా మలిచే సామర్థ్యం అబ్బింది. దీన్ని ఇలాన్ మస్క్ తన ఎక్స్ వేదికలో ప్రకటించారు. ఇమేజ్‌ను వీడియోగా ఎలా మలచుకోవాలో ప్రదర్శించారు కూడా. "add a boyfriend and they transition into muppets." అనే ప్రాంప్ట్‌తో పొట్టి వీడియో క్లిప్‌ను సృష్టించి, పోస్ట్ చేశారు. గ్రాక్ ఇంటర్ఫేస్‌లో ఏ ఇమేజ్ మీదైనా కాసేపు అలాగే అదిమి పట్టటం ద్వారా ఈ టూల్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు. చిటికెలో అది వీడియో క్లిప్‌గా మారుతుంది. కావాలంటే దాన్ని టెక్స్ట్ ప్రాంప్ట్‌ల ద్వారా ఇష్టమైనట్టుగా తీర్చిదిద్దుకోవచ్చు.

ఓపెన్ సోర్స్ టూల్స్‌తో గ్రాఫిక్ డిజైన్

గ్రాఫిక్ డిజైన్, వీడియో ఎడిటింగ్, వెబ్ డెవలప్‌మెంట్ వంటి పనులకు అడోబ్ క్రియేటివ్ క్లౌడ్ పెట్టింది పేరు. ఇందులో బోలెడన్ని టూల్స్ ఉంటాయి. అయితే దీని ధరలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. కానీ అవే పనులు చేసిపెట్టే ఉచిత, ఓపెన్ సోర్స్ టూల్స్ ఎన్నో అందుబాటులో ఉన్నాయి. అలాంటి కొన్ని ఉచిత ప్రత్యామ్నాయాలు ఇవిగో..

లింక్‌స్కేప్

ఇదో ప్రొఫెషనల్ క్వాలిటీ వెక్టర్ గ్రాఫిక్ సాఫ్ట్‌వేర్. అడోబ్ ఇలస్ట్రేటర్‌కు బదులుగా వాడుకోవచ్చు. విండోస్, మ్యాక్ ఓఎస్, లైనక్స్ మీద పనిచేస్తుంది. ఇలస్ట్రేషన్లు, ఐకన్స్, లోగోస్, డయాగ్రామ్స్, మ్యాప్స్, వెబ్ గ్రాఫిక్స్ వంటివి సృష్టించుకోవటానికి ప్రపంచవ్యాప్తంగా నిపుణులు, హాబీయిస్టులు దీన్ని ఉపయోగించుకుంటున్నారు. ప్యాత్స్, గ్రేడియెంట్స్, టెక్స్ట్ టూల్స్‌తో పూర్తిస్థాయిలో వెక్టర్లను ఎడిటింగ్ చేసుకోవచ్చు. సబ్‌స్క్రిప్షన్ లేకుండా ఎస్‌వీజీ, సీఎస్ఎస్3 సేవలు పొందొచ్చు.

కేడెన్‌లైవ్

శక్తిమంతమైన వీడియో ఎడిటర్. అడోబ్ ప్రీమియర్ ప్రొ మాదిరిగా వాడుకోవచ్చు. మల్టీట్రాక్ టైమ్‌లైన్స్, కలర్ గ్రేడింగ్, ప్రాక్సీ ఎడిటింగ్, స్మూత్ ప్లేబ్యాక్ వంటి వాటితో ఆడియో, వీడియో క్లిప్స్‌ను తేలికగా కట్, ట్రిమ్, అరేంజ్ చేసుకోవచ్చు. ప్రాజెక్టులను రకరకాల ఫార్మాట్లలోకి ఎక్స్‌పోర్ట్ చేసుకునే వీలు కూడా ఉంది. పాత కంప్యూటర్ల మీద మంచి నైపుణ్యంతో పనులు చేసుకోవటానికి ప్రాక్సీ ఎడిటింగ్ టూల్ మంచి అవకాశం.



పెన్‌పాట్

ఇది ఓపెన్ సోర్స్ డిజైన్ సాఫ్ట్‌వేర్. డిజైనర్లు, డెవలపర్లను అనుసంధానం చేసే ఇందులో ప్రొటోటైపింగ్, యూఐ డిజైన్, కోడ్ వంటివన్నీ ఒకేచోట ఉంటాయి. వీటితో తేలికగా డిజైన్ చేసుకోవచ్చు. ఇన్‌స్పెక్ట్ ల్యాబ్ నుంచి డిజైన్లను సిద్ధంగా ఉన్న కోడ్‌లోకి మార్చగలదు. ఫ్లెక్స్ లేఅవుట్, గ్రిడ్ లేఅవుట్ వంటి ఫీచర్లు డిజైనర్లకు ఎంతగానో ఉపయోగపడతాయి.

రాథెరపీ

ఇది ఉచిత, ఓపెన్‌సోర్స్ ఫొటో ఎడిటింగ్ ప్రోగ్రామ్. డిజిటల్ కెమెరాలు తీసే రా ఇమేజ్‌లను బాగా ఎడిటింగ్ చేస్తుంది. అందంగా తీర్చిదిద్దుతుంది. ఎక్స్‌పోజర్, కలర్, నీడల వంటి వాటిని సవరించుకోవచ్చు. ఆయా అంశాలను హైలైట్ చేసుకోవచ్చు. ఒకరకంగా దీన్ని అడోబ్ లైట్‌రూమ్‌కు ప్రత్యామ్నాయంగా వాడుకోవచ్చు.

ఐఫోన్లలో లిక్విడ్ గ్లాస్ ఫీచర్ వద్దా?

ఐఫోన్లకు ఐఓఎస్ 26తో పరిచయమైన లిక్విడ్ గ్లాస్ డిజైన్ మీద కొందరు పెదవి విరుస్తున్నారు. ఇది వద్దనుకునేవారికి యాక్సెసిబిలిటీ సెటింగ్స్ ద్వారా ట్రాన్స్‌పరెన్సీని పూర్తిగా డిసేబుల్ చేయటం ఒక్కటే మార్గం. ఇప్పుడిలాంటి ఇబ్బందేమీ ఉండదు. తాజా ఐఓఎస్ 26.1 అప్‌డేట్‌తో ట్రాన్స్‌పరెన్సీని కావాల్సిన విధంగా మార్చుకునే సదుపాయం వచ్చింది. ఇందుకోసం ప్రత్యేకంగా సెటింగ్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీనిలోని మిడిల్ గ్రౌండ్ ఆప్షన్‌తో మరింత రీడబుల్, తక్కువ రిఫ్లెక్టివ్ అప్పీరెన్స్ కలిగుండేలా సవరించుకునే వీలుండటం విశేషం. ఈ ఫీచర్‌ను వాడుకోవాలంటే ముందుగా ఐఫోన్‌ను ఐఓఎస్ 26.1కు అప్‌డేట్ చేసుకోవాలి. తర్వాత సెటింగ్స్ ద్వారా డిస్‌ప్లే అండ్ బ్రైట్‌నెస్‌లోకి వెళ్తే లిక్విడ్ గ్లాస్ ఫీచర్ కనిపిస్తుంది. ఇందులో క్లియర్, టింటెడ్ అని రెండు ఆప్షన్లుంటాయి. క్లియర్‌ను ఎంచుకుంటే పూర్తిస్థాయి గ్లాస్ మాదిరి విజువల్ స్టైల్ అలాగే ఉంటుంది. అదే టింటెడ్‌ను ఎంచుకుంటే ట్రాన్స్‌పరెన్సీ తగ్గుతుంది. దీంతో టెక్స్ట్, ఐకన్లు స్పష్టంగా కనిపిస్తాయి. ముఖ్యంగా ప్రకాశవంతమైన వెలుగులో వాటిని బాగా చూడొచ్చు. ఈ రెండు ఆప్షన్ల ప్రివ్యూలు అప్పటికప్పుడే ప్రత్యక్షమవుతాయి. ఏది ఎలా ఉందో పోల్చి చూసుకొని, ఇష్టమైనది సెట్ చేసుకుంటే సరి.



టెలిగ్రామ్ ఛానెల్స్‌లోనూ వాయిస్ ఛాట్


టెలిగ్రామ్‌లో గ్రూప్స్‌కే పరిమితమైన వాయిస్ చాట్ 2.0 ఇప్పుడు ఛానెల్స్‌కూ అందుబాటులోకి వచ్చింది. అపరిమిత భాగస్వాములు వాయిస్ చాట్ చర్చలు కొనసాగించటానికిది తోడ్పడుతుంది. చర్చలను రికార్డు కూడా చేసుకోవచ్చు. ఈ అప్‌డేట్‌తో హ్యాండ్‌ను రెయిజ్ చేయటం, వాయిస్ చాట్‌కు టైటిల్ పెట్టుకోవటం.. వినేవారు, మాట్లాడేవారి కోసం ఇన్వైట్ లింక్స్ వంటి ఫీచర్లూ అందుబాటులోకి వచ్చాయి. సెలెబ్రిటీలు తమ వ్యక్తిగత ఖాతాలకు బదులు వారి ప్రత్యేక పబ్లిక్ ఛానెల్ పేరుతోనూ వాయిస్ చాట్‌లో పాల్గొనొచ్చు. ఏదైనా గ్రూప్ లేదా ఛానెల్ ప్రొఫైల్ ఓపెన్ చేసి నిలువు లేదా అడ్డం మూడు చుక్కల మీద తాకి స్టార్ట్ వాయిస్ చాట్‌ను ఎంచుకుంటే చాలు వాయిస్ చాట్ మొదలవుతుంది.

చాట్‌జీపీటీ గో ఉచితంగా

ఓపెన్‌ఏఐ సంస్థ మనదేశంలో ప్రత్యేకంగా, ఏడాది పాటు చాట్‌జీపీటీ గో ఉచిత సబ్‌స్క్రిప్షన్‌ను అందిస్తోంది. దీన్ని ఎలా వాడుకోవాలంటే..

వెబ్ మీద

- ఏ వెబ్ బ్రౌజర్‌నైనా ఓపెన్ చేసి, చాట్‌జీపీటీ వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి.
- కొత్త అకౌంట్‌కు సైన్ అప్ కావాలి. ప్రస్తుత చాట్‌జీపీటీ ఖాతాతోనైనా లాగిన్ కావొచ్చు.
- తెర మీద కనిపించే 'అప్‌గ్రేడ్ ఫర్ ఫ్రీ' మీద క్లిక్ చేయాలి. లేదా ప్రొఫైల్ ట్యాబ్‌లో అప్‌గ్రేడ్ ప్లాన్ మీద క్లిక్ చేసి గో ఆప్షన్ ఎంచుకోవాలి. తర్వాత అప్‌గ్రేడ్ టు గో మీద క్లిక్ చేయాలి.
- అప్పుడు పేమెంట్ పేజీ ఓపెన్ అవుతుంది. వివరాలు ఎంటర్ చేసి సబ్‌స్క్రైబ్ మీద క్లిక్ చేయాలి.



యాప్‌లో

- పరికరంలో చాట్‌జీపీటీ యాప్ ఓపెన్ చేయాలి.
- చాట్‌జీపీటీ ఖాతాకు సైన్ అప్ లేదా లాగిన్ కావాలి.
- తెర మీద కనిపించే ట్రై గో మీద క్లిక్ చేయాలి. లేదా పైన ఎడమ వైపున ఉండే మెనూ గుర్తు ద్వారా ప్రొఫైల్ ఇమేజ్ మీద క్లిక్ చేసి, అప్‌గ్రేడ్ టు గో ఫర్ ఫ్రీ ఎంచుకోవాలి.
- సబ్‌స్క్రిప్షన్ పేజీలో అప్‌గ్రేడ్ టు గో మీద తాకాలి.
- ఇష్టమైన పేమెంట్ పద్ధతిని ఎంచుకొని, అవసరమైన వివరాలు ఎంటర్ చేయాలి. అనంతరం కింద బటన్‌ను ఎడమ నుంచి కుడికి స్వైప్ చేసి, ధ్రువీకరించుకోవాలి.

ఇవీ ప్రయోజనాలు

- ఓపెన్‌ఏఐ అధునాతన జీపీటీ-5 మోడల్‌కు మరిన్ని ఎక్కువ ప్రాంప్ట్‌లను ఇవ్వచ్చు, జవాబులు పొందొచ్చు.
- అధికంగా ఇమేజ్‌లను జనరేట్ చేసుకోవచ్చు. రకరకాల ఫైళ్లను విశ్లేషించుకోవచ్చు.
- లోతైన డేటా విశ్లేషణ, సమస్యల పరిష్కారం కోసం పైథాన్ ఆధారిత అధునాతన టూల్స్ అందుబాటులో ఉంటాయి.
- చాట్ హిస్టరీ రిటెన్షన్‌ను విస్తరించటం వల్ల మరిన్ని సందర్భ, వ్యక్తిగత ఇంటరాక్షన్స్‌కు వీలవుతుంది.
- ప్రీమియం చాట్‌జీపీటీ ఫీచర్లను తక్కువ నెలవారీ చందాతోనే పొందొచ్చు.

ఇవీ పరిమితులు

- ఈ ఉచిత ప్లాన్‌లో ఏపీఐని వాడుకోలేం. దీన్ని ఉపయోగించుకుంటే నిర్ణీత ఏపీఐ రుసుములు కట్టాల్సి ఉంటుంది.
- జీపీటీ-4ఓ, జీపీటీ-4 మోడళ్లు అందుబాటులో ఉండవు.
- ప్లస్, దీనికి మించిన సబ్‌స్క్రిప్షన్లకే థర్డ్ పార్టీ కనెక్టర్ యాక్సెస్ ఉంటుంది.
- ప్లస్, ప్రొ సభ్యులైతేనే సోరా వీడియో జనరేషన్ వాడుకోగలరు.
- జీపీటీ-5 థింకింగ్ మోడల్ దానంతటదే రన్ అవుతుంది. మాన్యువల్‌గా సరిచేయటం కుదరదు.

ఆండ్రాయిడ్‌లోనూ కామెట్!

పర్‌ప్లెక్సిటీ యూజర్లు త్వరలోనే ఆండ్రాయిడ్ పరికరాల్లో కామెట్ ఏఐ బ్రౌజర్‌ను యాక్సెస్ చేయొచ్చు. ఆండ్రాయిడ్ వర్షన్‌ను పరీక్షించటానికి ఇప్పటికే ఎంపిక చేసిన యూజర్లకు ఆహ్వానాలు అందటం మొదలైంది. మొదట్లో కామెట్ బ్రౌజర్ కేవలం విండోస్, మ్యాక్ వాడేవారికే.. అదీ ఆహ్వానం లభించినవారికే అందుబాటులో ఉండేది. అనంతరం అందరికీ విస్తరించారు. ఇప్పుడు ఆండ్రాయిడ్ పరికరాలకూ అందుబాటులోకి రానుండటంతో మరింత ఎక్కువ మంది వాడుకోవటానికి వీలవుతుంది. మీరూ ఈ కామెట్ బ్రౌజర్‌ను పరీక్షించే తొలి ఆండ్రాయిడ్ యూజర్లు కావాలనుకుంటున్నారా? అయితే గూగుల్ ప్లే స్టోర్ లేదా కామెట్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి నమోదు చేసుకోవచ్చు. అయితే పర్‌ప్లెక్సిటీ చందా తీసుకున్నవారికి, కామెట్ బ్రౌజర్‌ను తరచూ వాడేవారికి మాత్రమే ఆహ్వానాలకు ప్రాధాన్యం లభించొచ్చు. సంప్రదాయ బ్రౌజర్ల మాదిరిగా కామెట్‌లో ట్యాబ్స్‌తో కూడిన ఇంటర్ఫేస్ ఉండదు. ఆయా వెబ్‌పేజీల గురించి యూజర్లు నేరుగా ప్రశ్నలు వేసి, అవసరమైన సమాచారాన్ని పొందొచ్చు. ఇలా విశిష్టమైన జనరేటివ్ ఏఐ అనుభూతిని పొందొచ్చు. పర్‌ప్లెక్సిటీ గతవారం తమ ఏఐ బ్రౌజర్ ఏజెంట్ అయిన కామెట్ అసిస్టెంట్‌ను సమూలంగా మెరుగుదిద్దింది కూడా. దీంతో వేర్వేరు ట్యాబ్స్‌తో పని చేయటం, ఉద్యోగాన్వేషణలో సాయం చేయటం, మంచి ట్రావెల్ ఆఫర్లను గుర్తించటం వంటి కొత్త ఫీచర్లు, సామర్థ్యాలు అబ్బాయి. ఈ ఏఐ అసిస్టెంట్ గత వర్షన్ కన్నా 23 % మెరుగైన నైపుణ్యం కనబరుస్తోందని కంపెనీ చెబుతోంది.


జోహో నోట్‌బుక్‌కు మరిన్ని ఏఐ సామర్థ్యాలు

జోహో నోట్‌బుక్ శక్తిమంతమైన ఏఐ టూల్స్‌తో ముస్తాబైంది. నోట్ టేకింగ్, కొలాబరేషన్, కంటెంట్ ఆర్గనైజేషన్ వంటి పనులకు తోడ్పడే వీటిని విద్యార్థులకు ఉచితంగానే అందుబాటులో ఉంచటం విశేషం. ఇందుకోసం విద్యార్థులు తమ విద్యా సంబంధ ఈమెయిల్ ఐడీలతో లాగిన్ కావాల్సి ఉంటుంది. జోహో సొంత జియా ఇంజిన్ కింద పొందుపరచిన ఈ కొత్త టూల్స్ వివరాలేంటో చూద్దామా.

ఇంటెలిజెంట్ క్యూఅండ్ఏ అసిస్టెంట్: ఇది అంశాల వారీగా పర్సనల్ నోట్స్ శోధించగలదు. జవాబులను జనరేట్ చేయగలదు.

మీటింగ్ నోట్స్: సమావేశంలో మాట్లాడిన అంశాలను వక్తల వారీగా టెక్స్ట్ రూపంలోకి మార్చగలదు. సారాంశాన్ని గుదిగుచ్చగలదు.

మైండ్ మ్యాప్ జనరేషన్: పెద్ద డాక్యుమెంట్లను విజువల్ మ్యాప్స్‌గా మారుస్తుంది. సంక్లిష్ట సమాచారాన్ని తేలికగా విశదీకరిస్తుంది.



స్మార్ట్ నోట్ క్రియేషన్, రైటింగ్ ఎన్‌హాన్స్‌మెంట్: ఇది ఆటోమేటిగ్గా ఫార్మాట్ చేయగలదు. టేబుల్స్, టెంప్లేట్స్ సృష్టిగలదు. వ్యాకరణ దోషాలు సవరిస్తుంది, ధ్వనిని మెరుగుపరుస్తుంది.

మల్టీలింగ్వల్ వాయిస్ సెర్చ్, ట్రాన్స్‌లేషన్: ఇది హిందీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మరాఠీ, పంజాబీ, ఒరియా, సంస్కృతంతో పాటు 80కి పైగా భాషల మాటలను శోధించగలదు. అవసరమైతే తర్జుమా చేస్తుంది.

జోహో యాప్స్‌తో సమ్మిళితం: సీఆర్ఎం, ప్రాజెక్ట్స్, మెయిల్ వంటి జోహో యాప్స్‌తో ఇంటిగ్రేట్ అవుతుంది. ఇలా పనులు తేలికగా చేసుకోవటానికి, డేటా ఆదాకు తోడ్పడుతుంది.



18% తగ్గిన ఓఎన్‌జీసీ లాభం

ప్రభుత్వరంగ ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్), సెప్టెంబరు త్రైమాసికంలో రూ.9,848 కోట్ల నికరలాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.11,984 కోట్ల కంటే ఇది 18% తక్కువ. బ్యారెల్ ముడిచమురు ధర 78.33 డాలర్ల (సుమారు రూ.6,893) నుంచి 67.34 డాలర్ల (సుమారు రూ.5,926)కు తగ్గడమే ఇందుకు కారణమని సంస్థ పేర్కొంది. సంప్రదాయ బావుల నుంచి వెలికితీసిన సహజవాయువు ధర మిలియన్ బ్రిటిష్ థర్మల్ యూనిట్ (ఎంఎంబీటీయూ)కు 3.8% పెరిగి 6.75 డాలర్ల (సుమారు రూ.594)కు చేరింది. కొత్త బావుల నుంచి వెలికితీసిన సహజవాయువు ధర మాత్రం ఎంఎంబీటీయూకు 9.42 డాలర్ల (సుమారు రూ.829) నుంచి 8.36 డాలర్ల (సుమారు రూ.736)కు తగ్గింది.

200 మంది శాస్త్రవేత్తలను నియమిస్తాం

సాయి లైఫ్‌సైన్సెస్

ఈనాడు, హైదరాబాద్: కాంట్రాక్టు పరిశోధన, అభివృద్ధి, ఉత్పత్తి సేవల సంస్థ సాయి లైఫ్‌సైన్సెస్ లిమిటెడ్, కొత్తగా 200 మంది శాస్త్రవేత్తలను నియమించనున్నట్లు ప్రకటించింది. డిస్కవరీ, సీఎంసీ సేవల విభాగంలో ఉన్న డిమాండ్‌కు తగ్గట్లుగా శాస్త్రవేత్తల నియామకాలు చేపడుతున్నట్లు వెల్లడించింది. ప్రాసెస్ ఆర్అండ్‌డీ, అనలెటికల్ ఆర్అండ్‌డీ, ప్రాసెస్ ఇంజినీరింగ్, బయాలజీ, డీఎంపీకే విభాగాలకు శాస్త్రవేత్తలను ఎంపిక చేయనున్నట్లు వివరించింది. శాస్త్రవేత్తల నియామకాలతో తమ కార్యకలాపాల విస్తరణకు వీలు కలుగుతుందని సాయి లైఫ్‌సైన్సెస్ సీఎఫ్ఓ శివ చిట్టూర్ తెలిపారు. ఈ సంస్థలో ప్రస్తుతం 3,400 మందికి పైగా నిపుణులున్నారు.

గ్రాన్యూల్స్ లైఫ్ ప్లాంటుకు యూఎస్‌ఎఫ్‌డీఏ ఆమోదం

హైదరాబాద్: హైదరాబాద్‌లో కొత్తగా నెలకొల్పిన గ్రాన్యూల్స్ లైఫ్‌సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫినిష్డ్ డోసేజ్ ప్లాంటుకు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్‌ఎఫ్‌డీఏ నుంచి అనుమతి లభించిందని, మాతృసంస్థ గ్రాన్యూల్స్ ఇండియా తెలిపింది. షుగర్ వ్యాధి చికిత్సకు వినియోగించే మెట్‌ఫార్మిన్ హెచ్‌సీఎల్ తయారీని శామీర్‌పేటలోని ఈ ప్లాంటులో చేపడతారు. ఇందుకోసం యూఎస్‌ఎఫ్‌డీఏ ఈ ఏడాది జులై 28 నుంచి ఆగస్టు 1 వరకు ముందస్తు తనిఖీలు నిర్వహించింది. ఏడాదికి 1000 కోట్ల ట్యాబ్లెట్లు తయారు చేసే సామర్థ్యం ఈ ప్లాంటుకు ఉంది. ఇక్కడ తయారు చేసే ట్యాబ్లెట్లను త్వరలో అమెరికా విపణికి పంపనున్నారు.

సర్ దొరాబ్జీ టాటా ట్రస్టులోకి నోయల్ టాటా కుమారుడు



ముంబయి: సర్ దొరాబ్జీ టాటా ట్రస్టులోకి, టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా కుమారుడు నెవిల్ (32)ను ట్రస్టీగా తీసుకుంటున్నట్లు సంస్థ మంగళవారం ప్రకటించింది. మూడేళ్ల పాటు ఈ నియామకం అమల్లో ఉంటుంది. టాటా సన్స్‌లో సర్ దొరాబ్జీ టాటా ట్రస్టుకి 27.98% వాటా ఉంది. టాటా సన్స్‌లో 66% వాటా కలిగిన టాటా ట్రస్ట్‌లో శాశ్వత సభ్యత్వ ఇవ్వక పోవడంతో, మెహ్లి మిస్త్రీ వైదొలగిన కొద్దిరోజుల్లోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. 2016లో ట్రెంట్‌లో చేరిన నెవిల్, టాటా గ్రూప్‌లోని వస్త్ర విక్రయశాలల సంస్థ జుడియోను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. టాటా గ్రూప్ సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించిన భాస్కర్ భట్‌ను కూడా సర్ దొరాబ్జీ టాటా ట్రస్టులో ట్రస్టీగా నియమించారు.

కోడి గుడ్డు

12న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయల్లో)

హైదరాబాద్	590
వరంగల్	592
విజయవాడ	600
తూ/ప గోదావరి	600
విశాఖపట్నం	585
చిత్తూరు	633

చైనాకు భారతీయ ఔషధాలు



- 'వీబీపీ విధానం'లో బిడ్లు దక్కించుకుంటున్న కంపెనీలు
- డాక్టర్ రెడ్డీస్, సిప్లా, నాట్కో, హెటిరో ముందంజ

దేశీయ ఔషధ కంపెనీలు చైనాలో విస్తరిస్తున్నాయి. చైనాలో బల్క్, జనరిక్ ఔషధాల సరఫరా కాంట్రాక్టులు సంపాదించడంతో పాటు షుగర్ వ్యాధిని అదుపు చేయడానికి వినియోగించే డపాగ్లిఫ్లోజిన్ మందు అందించడంలో ముందుంటున్నాయి. చైనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ జారీ చేసిన మందుల సమీకరణ కాంట్రాక్టుల్లో సిప్లా, డాక్టర్ రెడ్డీస్, నాట్కో ఫార్మా, అన్నోరా ఫార్మా, హెటిరో ల్యాబ్స్ పాల్గొని కొన్ని కాంట్రాక్టులు గెలుచుకున్నాయి. ఇండియా-చైనా ఎకనామిక్ అండ్ కల్చరల్ కౌన్సిల్ (ఐసీఈసీ) ఈ విషయాన్ని వెల్లడించింది. డపాగ్లిఫ్లోజిన్ ట్యాబ్లెట్ల సరఫరా కాంట్రాక్టు సంపాదించిన ఏడు ఫార్మా కంపెనీల్లో హెటిరో ల్యాబ్స్, సిప్లా ఉన్నాయి. వాల్యూమ్- బేస్డ్ ప్రొక్యూర్‌మెంట్ (వీబీపీ) బిడ్డింగ్ విధానం ప్రకారం ఈ కంపెనీలకు చైనాలోని కొన్ని ప్రావిన్స్‌లకు ట్యాబ్లెట్లు సరఫరా చేసే కాంట్రాక్టులు దక్కాయి. అక్సొకార్బ్ జెపైన్ ట్యాబ్లెట్ సరఫరా కాంట్రాక్టు అన్నోరా ఫార్మాకు, ఒలాపారిబ్ ట్యాబ్లెట్లు సరఫరా చేసే కాంట్రాక్టు నాట్కో ఫార్మాకు లభించాయి. డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు చైనాలోని అనుబంధ సంస్థ అయిన కున్‌షాన్ రోటమ్‌రెడ్డి ఫార్మాస్యూటికల్ కంపెనీకి 4 మందుల కాంట్రాక్టులు వచ్చాయి. ఐసీఈసీ వివరాల ప్రకారం చైనాలో స్మాల్ మాలిక్యూల్ ఔషధాల విభాగంలో డపాగ్లిఫ్లోజిన్ ట్యాబ్లెట్ అమ్మకాలు 1.14 బిలియన్ డాలర్ల (రూ.10,000 కోట్ల) కంటే అధికంగా ఉన్నాయి.

55 రకాల మందులకు బిడ్డింగ్

యాంటీ-ఇన్ఫెక్టివ్స్, యాంటీ-ట్యూమర్, అలెర్జీ, మరికొన్ని ఇతర వ్యాధుల చికిత్సల్లో వినియోగించే దాదాపు 55 రకాల మందుల సరఫరా కోసం చైనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ గత నెలలో బిడ్డింగ్ ప్రక్రియ చేపట్టింది. దీని కోసం ప్రాథమికంగా 272 కంపెనీలను ఎంపిక చేశారు. భారతీయ ఫార్మా కంపెనీలు 7 రకాల మందుల సరఫరా కాంట్రాక్టులను సొంతం చేసుకోగలిగాయి.

దేశీయ కంపెనీలకు మంచి అవకాశం


చైనాలో మందుల సరఫరా కాంట్రాక్టుల్లోకి భారతీయ కంపెనీలను అనుమతించటం ఎంతో ఆసక్తికర పరిణామమని, దీనివల్ల సమీప భవిష్యత్తులో ఇంకెన్నో అవకాశాలను భారతీయ కంపెనీలు సొంతం చేసుకునే అవకాశం ఉందని ఔషధ వర్గాలు వివరిస్తున్నాయి. ఇప్పటి వరకు చైనా ఔషధ మార్కెట్లో బహుళ జాతి కంపెనీలు, చైనా కంపెనీలు మాత్రమే క్రియాశీలకంగా ఉన్నాయి. బహుళ జాతి కంపెనీలు చైనాలో ఎన్నో ఏళ్లుగా కార్యకలాపాలు సాగిస్తున్నా.. వీబీపీ విధానంలో పాల్గొని, బిడ్లు గెలుచుకున్న దాఖలాలు లేవు. ఎంతో తక్కువ ధరలు 'కోట్' చేసిన కంపెనీలకే ఈ విధానంలో బిడ్లు లభించాయి. అందువల్ల ఈ పద్ధతిలో బహుళ జాతి కంపెనీలు పాల్గొనలేని పరిస్థితి ఉంది. చైనాలో వృద్ధుల జనాభా పెరుగుతోంది. దీనివల్ల చైనా ప్రభుత్వంపై మందుల భారం పెరుగుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వం జనరిక్ ఔషధాల ధరలను తగ్గించే ప్రయత్నం చేస్తోంది. బల్క్ ఔషధాలు, ఏపీఐ (యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రేడియంట్స్) లను బాగా తక్కువ ధరకు అందించడంలో చైనా కంపెనీలు అగ్రగామిగా ఉన్నాయి. ఈ కంపెనీలతో ఇతర దేశాల కంపెనీలు పోటీపడటం అసాధ్యం. పైగా భారతీయ ఫార్మా కంపెనీలు బల్క్ ఔషధాల కోసం చైనా మీద అధికంగా ఆధారపడుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో చైనాలో మందుల సరఫరా బిడ్లు గెలవడం సామాన్య విషయం కాదని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

10 కంపెనీల కార్యకలాపాలు

చైనాలో దాదాపు 10 భారతీయ ఫార్మా కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. కొన్నింటికి అక్కడే యూనిట్లు ఉన్నాయి. త్వరితంగా మందుల రిజిస్ట్రేషన్లు సాధించడమే కాకుండా, తక్కువ సమయంలో మందులు ఉత్పత్తి చేసి మార్కెట్లో విడుదల చేయగలిగితేనే భారతీయ కంపెనీలు చైనాలో మనుగడ సాధించగలుగుతాయి. అదే సమయంలో ఉత్పత్తి వ్యయాలు తగ్గించుకోవడమూ ముఖ్యమే. చైనాతో మనదేశానికి దాదాపు 100 బిలియన్ డాలర్ల (సుమారు రూ.8.80 లక్షల కోట్ల) వర్తక లోటు ఉంది. దీన్ని తగ్గించుకునే యత్నాల్లో భాగంగా మనదేశానికి చెందిన ఫార్మా కంపెనీల నుంచి మందులు కొనుగోలు చేయాలని చైనాను ఎన్నో ఏళ్లుగా భారత ప్రభుత్వం కోరుతున్నా, సాధ్యపడలేదు. ఎట్టకేలకు భారతీయ ఫార్మా కంపెనీలకు చైనా తలుపులు తెరుస్తోందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

కుబేర నగరాల్లో ముంబయి, దిల్లీ

హురున్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ జాబితా



ప్రపంచంలోనే ఎక్కువ మంది బిలియనీర్లు (కుబేరులు) ఉండే అగ్రగామి 10 నగరాల్లో భారత్ నుంచి ముంబయి, దిల్లీ చోటు దక్కించుకున్నాయని హురున్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నివేదిక తెలిపింది. దేశ ఆర్థిక వృద్ధికి ఊతంగా నిలుస్తున్న ఈ నగరాలు, ప్రపంచవ్యాప్త బిలియనీర్ల పటంలోనూ చోటు దక్కించుకోగలిగాయి. సంపద సృష్టి, పెట్టుబడి పారిశ్రామికవేత్తల పరంగా మనదేశ ప్రభావం పెరుగుతోందని ఈ జాబితా రుజువు చేస్తోంది. డిజిటల్ ఇన్నొవేషన్, అంతర్జాతీయ పెట్టుబడులు ఇందుకు సహకరించాయని హురున్ తెలిపింది. కనీసం బిలియన్ డాలర్ల (సుమారు రూ.8800 కోట్ల) సంపద కలిగిన వ్యక్తులు న్యూయార్క్‌లో 119 మంది ఉండటంతో, ఈ జాబితాలో అగ్రస్థానం దక్కింది.

నగరం	బిలియనీర్లు
న్యూయార్క్	119
లండన్	97
ముంబయి	92
బీజింగ్	91
షాంఘై	87
షెంజెన్	84
హాంకాంగ్	65
మాస్కో	59
దిల్లీ	57
శాన్‌ఫ్రాన్సిస్కో	52

వైద్య చికిత్సలకు వీసా ఆన్ అరైవల్?

అమెరికా వంటి దేశాల నుంచి రోగులు చికిత్స నిమిత్తం మనదేశానికి వచ్చాక, వీసా అందించే 'వీసా ఆన్ అరైవల్ (వీఓఏ)' సదుపాయం కల్పించేందుకు పరిశీలిస్తామని కేంద్ర మంత్రి గోయల్ అన్నారు. 'వీఓఏ అనేది మంచి ఆలోచన. చాలా దేశాలకు వీఓఏ ఇస్తున్నాం. ఇ-వీసాలూ అనుమతిస్తున్నాం. అమెరికా, ఐరోపా దేశాలకూ పరిశీలిస్తాం. పలు దేశాల ప్రజలకు ఇలాంటి అనుమతులు ఇవ్వొచ్చని గోయల్ అన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్

అదానీ గ్రూప్ ప్రకటన



దిల్లీ: బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్) రంగంలోకి అడుగుపెడుతున్నట్లు అదానీ గ్రూప్ మంగళవారం ప్రకటించింది. గుజరాత్‌లోని ఖవ్డాలో 1,126 మెగావాట్/3,530 మెగావాట్ అవర్ సామర్థ్యంతో ఏర్పాటు కాబోతున్న ఈ ప్రాజెక్టు 2026 మార్చికి అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టులో 700కు పైగా బీఈఎస్ఎస్ కంటెయినర్లు ఏర్పాటు చేస్తున్నారు. దేశంలో ఒకే చోట ఏర్పాటవుతున్న అతి పెద్ద ఇంధన స్టోరేజీ ప్రాజెక్టు ఇదని, ప్రపంచంలోని అతి పెద్ద ప్రాజెక్టుల్లో ఇదీ ఒకటని సంస్థ వివరించింది. లిథియం అయాన్ బ్యాటరీ టెక్నాలజీ, అత్యాధునిక ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నారు. 2027 మార్చి నాటికి 15 గిగావాట్ అవర్ సామర్థ్యాన్ని, అయిదేళ్లలో 50 గిగావాట్ అవర్ సామర్థ్యానికి చేరుకోవాలన్నది సంస్థ లక్ష్యం.

దేశ ఇంధన రంగంలో సుస్థిరత: సౌర, పవన వ్యవస్థల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును నిల్వ ఉంచి, అవసరమైనప్పుడు వాడుకునేలా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా దేశ ఇంధన రంగానికి సుస్థిరత లభిస్తుందని అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ పేర్కొన్నారు. దీనివల్ల నమ్మకమైన, స్వచ్ఛమైన, అందుబాటు ధరలో విద్యుత్ లభిస్తుందని వెల్లడించారు.

✦ దేశ ఇంధన భద్రత కోసం 24 గంటలు కర్బన ఉద్గారాలు లేని స్వచ్ఛమైన ఇంధనాన్ని అందించడం ఈ ప్రాజెక్టు ఉద్దేశమని కంపెనీ తెలిపింది. సరఫరా వ్యత్యాసం తగ్గించడం, సూర్యుడు అందుబాటులో లేని సమయంలో గ్రిడ్‌పై ఒత్తిడి పడకుండా ఇంధన సామర్థ్యం పెంచడం వంటివి ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని పేర్కొంది.

2031 కల్లా మరిన్ని కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు: 2031 కల్లా తమ గ్రూప్‌లోని ప్రధాన వ్యాపారాలను స్టాక్ మార్కెట్‌లో నమోదు చేయాలని అదానీ ఎంటర్‌ప్రైజెస్ భావిస్తోంది. విమానాశ్రయాలు, లోహాలు, డేటా కేంద్రాలు, రహదారి విభాగాలు ఇందులో ఉన్నాయి. 2027-31 మధ్య వీటిని నమోదు చేయనున్నట్లు సంస్థ పేర్కొంది. వచ్చే దశాబ్దంలో వాటాదార్ల సంపద పెంచడానికి కొత్త విభాగాలు దోహదం చేస్తాయని వెల్లడించింది.

వోల్ట్రాన్‌తో టాటా.ఈవీ భాగస్వామ్యం



ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా 14 మెగా ఈవీ (విద్యుత్ వాహన) ఛార్జింగ్ స్టేషన్లు ప్రారంభించినట్లు టాటా.ఈవీ తెలిపింది. ఇందుకోసం వోల్ట్రాన్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు పేర్కొంది. హైదరాబాద్ - బెంగళూరు, విజయవాడ, తిరుపతి రహదారుల్లో ఇవి అందుబాటులో ఉంటాయని వివరించింది. విద్యుత్ వాహనాల కోసం నమ్మకమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని టాటా మోటార్స్ ప్రయాణికుల వాహన విభాగం ప్రధాన వ్యూహాధికారి బాలాజీ రాజన్ తెలిపారు. వోల్ట్రాన్ సీఈఓ, రాజా శేఖర్ ఉప్పుటూరి మాట్లాడుతూ.. ఛార్జింగ్ స్టేషన్లకు నేరుగా వచ్చి వాహనాలను ఛార్జింగ్ చేసుకోవచ్చని, ఎలాంటి యాప్‌లు, బుకింగ్ అవసరం లేదని తెలిపారు. ఛార్జింగ్ అయ్యాక కార్డు, నగదు, యూపీఐ ద్వారా చెల్లించేందుకు వీలుందన్నారు. ఛార్జింగ్ సమయంలో విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా ఏసీ గదులు, ఆహార కేంద్రాలూ అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ద్విచక్ర వాహనాల్లోకి రావడం లేదు: టాటా మోటార్స్

ద్విచక్ర వాహన తయారీలోకి తాము ప్రవేశించడం లేదని టాటా మోటార్స్ అధికారికంగా స్పష్టత ఇచ్చింది. ఈ సంస్థ ద్విచక్ర వాహన రంగంలోకి ప్రవేశిస్తోందని, దేశంలోనే అత్యంత చౌకగా 125 సీసీ మోటార్‌సైకిల్‌ను రూ.60,000 లోపు ధరకే టాటామోటార్స్ ఆవిష్కరించిందని, ఈ బైక్‌ల మైలేజీ 90 కిలోమీటర్లని.. కొన్ని మోసపూరిత వెబ్‌సైట్లు ప్రకటించిన నేపథ్యంలో సంస్థ ఈ స్పష్టత ఇచ్చింది. తమ సంప్రదాయ ఇంజిన్ వాహనాలు, విద్యుత్తు వాహనాలకు అధికారిక వెబ్‌సైట్లను పరిశీలించాలని టాటా మోటార్స్ 'ఎక్స్ పోస్టు'లో విజ్ఞప్తి చేసింది.

పండగ నియామకాల్లో 17% వృద్ధి

అడెక్కో ఇండియా నివేదిక



గతేడాదితో పోలిస్తే ఈ సారి పండగ సీజన్ (ఆగస్టు-అక్టోబరు) నియామకాలు 17% వృద్ధితో 2.16 లక్షలకు చేరాయని నియామక సొల్యూషన్ల సంస్థ అడెక్కో ఇండియా తెలిపింది. వినియోగదారుల సెంటిమెంటు అధికం కావడం, సంస్థల ఆఫర్ల వల్ల గిరాకీ పెరగడం ఇందుకు కారణమని పేర్కొంది. 2024 పండగ సీజన్‌తో పోలిస్తే గిగ్, తాత్కాలిక ఉద్యోగాల్లో 25% పెరుగుదల ఏర్పడినట్లు వివరించింది. ఈ నియామకాలు రిటెయిల్, ఇ-కామర్స్, బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్ - బీమా - ఆర్థిక సేవలు), లాజిస్టిక్స్, ఆతిథ్య రంగాల్లో ఎక్కువగా జరిగాయని వెల్లడించింది. ఇదే ధోరణి రానున్న పెళ్లిళ్ల సీజన్ నుంచి 2026 మార్చి వరకు కొనసాగనుందని తెలిపింది. అధిక నియామకాలు జరుగుతున్న 5 మెట్రో నగరాల్లో హైదరాబాద్ ఒకటి కాగా.. కొత్తగా ఈ తరహా నియాకాలు అధికంగా జరుగుతున్న నగరాల్లో విజయవాడ నిలిచిందని పేర్కొంది. గత మూడు సంవత్సరాల్లో నియామకాల పరిమాణం, వేతనాలు పెరిగాయని వివరించింది. కోవిడ్-19 తర్వాత తాత్కాలిక నియామకాల్లో అతి బలమైన ఏడాదిగా 2025ను చెప్పుకోవచ్చని వివరించింది. ఫ్రెషర్ల వేతనాల్లో 12-15%, అనుభవజ్ఞుల వేతనాల్లో 18-22% పెరుగుదల చోటుచేసుకుందని తెలిపింది.

ఈక్విటీ పెట్టుబడులు 19% తగ్గాయ్

- వరుసగా మూడో నెల్లోనూ క్షీణత
- రూ.79.88 లక్షల కోట్లకు ఏయూఎం
- మరిన్ని కమొడిటీల్లో ఈటీఎఫ్‌లు



ఈనాడు, హైదరాబాద్: మ్యూచువల్ ఫండ్ల ఈక్విటీ పథకాల్లోకి నికర పెట్టుబడులు అక్టోబరులో దాదాపు 19% తగ్గి, రూ.24,690.33 కోట్లకు పడిపోయాయి. వరుసగా మూడో నెలలో ఈక్విటీ పెట్టుబడులు తగ్గడం గమనార్హం. రిటెయిల్ పెట్టుబడిదారులు ప్రధానంగా మదుపు చేసే క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) నుంచి సెప్టెంబరులో రూ.29,631 కోట్లు రాగా, అక్టోబరులో కొద్దిగా తగ్గి, రూ.29,529 కోట్లకు చేరాయి. భారతీయ మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) మంగళవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం సెప్టెంబరులో ఈక్విటీ పథకాల్లోకి వచ్చిన నికర పెట్టుబడులు రూ.30,421.69 కోట్లు కాగా, ఆగస్టులో రూ.33,430 కోట్లకు చేరాయి.

✦ ఈక్విటీ బెంచ్‌మార్కులలో సర్దుబాట్ల నేపథ్యంలో, అక్టోబరులో నికర పెట్టుబడులు తగ్గాయని యాంఫీ పేర్కొంది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులపై మదుపరులకు ఆసక్తి తగ్గలేదని. . అయితే మార్కెట్ మంచి వృద్ధి సాధించిన నేపథ్యంలో, వారు లాభాలు స్వీకరించడానికి ప్రయత్నిస్తున్నారని యాంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ ఎన్ చలసాని పేర్కొన్నారు. అక్టోబరులో మొత్తం రూ.38,920 కోట్లను మదుపరులు వెనక్కి తీసుకున్నారని, సెప్టెంబరులో ఈ మొత్తం రూ.35,982 కోట్లుగా ఉందని తెలిపారు.

✦ ఈక్విటీ పథకాల్లోకి వచ్చిన మొత్తం పెట్టుబడులు అక్టోబరులో రూ.63,611 కోట్లుగా ఉన్నాయి. ఈక్విటీ పథకాల నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) అక్టోబరు 31 నాటికి రూ.35.16 లక్షల కోట్లకు చేరింది. కొత్త త్రైమాసికం ప్రారంభంతో డెట్ పథకాల్లోకి అక్టోబరులో రూ.1.59 లక్షల కోట్లు వచ్చాయి. డెట్ విభాగంలో సానుకూలత నేపథ్యంలో, మొత్తం మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ ఏయూఎం 5% పెరిగి రూ.79,87,940 కోట్లకు చేరింది.

రూ.లక్ష కోట్లకు పసిడి ఈటీఎఫ్‌లు

బంగారం, వెండి ధరలు పెరుగుతుండటంతో, మదుపరులు ఈ లోహాలపై పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గు చూపిస్తున్నారు. సెప్టెంబరులో గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి రూ.8,363 కోట్లు వచ్చాయి. అక్టోబరులో ఈ మొత్తం రూ.7,743 కోట్లకు తగ్గింది. అయినా బంగారం ఈటీఎఫ్‌ల నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ రూ.1.02 లక్షల కోట్లకు చేరింది. వెండి ఈటీఎఫ్‌ల్లోకి అక్టోబరులో రూ.3,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వీటి ఏయూఎం రూ.42,000 కోట్లను మించింది.

✦ బంగారం, వెండితోపాటు ఇతర కమొడిటీలలో ఈటీఎఫ్‌లను ప్రారంభించేందుకు ఫండ్ సంస్థలు ప్రయత్నిస్తున్నాయని, దీనికి మరో 4 నెలలు పట్టే అవకాశం ఉందన్నారు.

నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.12.92 లక్షల కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఇప్పటి వరకు నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 7% పెరిగి రూ.12.92 లక్షల కోట్లకు చేరాయి. 2024-25 ఇదే సమయానికి ఈ వసూళ్లు రూ.12.08 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి నవంబరు 10 మధ్య రిఫండ్‌ల జారీ 18% తగ్గి రూ.2.42 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు ఏడాది క్రితం రూ.5.08 లక్షల కోట్లు కాగా, ఇప్పుడు రూ.5.37 లక్షల కోట్లకు పెరిగాయి. వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాల (హెచ్‌యూఎఫ్‌ల)తో కూడిన నాన్ కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.6.62 లక్షల కోట్ల నుంచి రూ.7.19 లక్షల కోట్లకు చేరాయి. సెక్యూరిటీల లావాదేవీ పన్ను (ఎస్‌టీటీ) వసూళ్లు రూ.35,923 కోట్ల నుంచి రూ.35,682 కోట్లకు తగ్గాయి. రిఫండ్‌ల సర్దుబాటుకు ముందు స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఏడాది క్రితంతో పోలిస్తే 2.15% పెరిగి రూ.15.35 లక్షల కోట్లకు చేరాయి.

ఆర్థిక మంత్రితో ప్రభుత్వ బ్యాంకుల అధిపతుల సమావేశం నేడు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) రెండో త్రైమాసికం, అర్ధ సంవత్సర ఫలితాల పనితీరుపై సమీక్ష చేయడానికి ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీలు) అధిపతులతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి ఆర్థిక సేవల కార్యదర్శి ఎం.నాగరాజు అధ్యక్షత వహించనున్నారు. దేశానికి పెద్ద, ప్రపంచ స్థాయి బ్యాంకులు అవసరమని, ఈ దిశగా ఆర్‌బీఐ, బ్యాంకులు అడుగులు వేయాలని ఆర్థిక మంత్రి గతవారం సూచించిన విషయం తెలిసిందే. అనంతరం బ్యాంకుల అధిపతులతో తొలిసారిగా ఆమె భేటీ కానున్నారు.

విద్యుత్తు స్కూటర్లు సహా 10 కొత్త మోడళ్లు: యమహా

ముంబయి: విక్రయాలు పెంచుకునేందుకు విద్యుత్తు స్కూటర్లు సహా 10 కొత్త మోడళ్లను 2026 చివరి కల్లా భారత్‌లో విడుదల చేస్తామని జపాన్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ యమహా మోటార్ కో లిమిటెడ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్, యమహా మోటార్ ఇండియా గ్రూప్ ఛైర్మన్ ఇతరు ఒతాని ప్రకటించారు. ఇందులో భాగంగా 4 వాహనాలను సంస్థ మంగళవారం ఆవిష్కరించింది. ఇందులో ఎక్స్ఎస్ఆర్ 155 బైక్ ధర రూ.1,49,990 కాగా, ఎఫ్‌జడ్-రేవ్ ధర రూ.1,17,218 (ఎక్స్ షోరూం, దిల్లీ). మరో రెండు విద్యుత్తు స్కూటర్లు ఏఈరాక్స్ -ఇ, ఈసీ-06 లను ప్రధాన నగరాల్లో ప్రవేశ పెడుతున్నట్లు తెలిపింది. వీటి ధరలను 2026 ప్రారంభంలో వెల్లడిస్తామని పేర్కొంది.

కార్పొరేట్ ప్రయాణికుల భోజనాల కోసం మేక్‌మైట్రిప్, స్విగ్గీ జట్టు

ముంబయి: కార్పొరేట్ ప్రయాణికుల భోజన వ్యయాల ప్రక్రియను సరళీకరించేందుకు మేక్‌మైట్రిప్‌కు చెందిన కార్పొరేట్ బుకింగ్ ప్లాట్‌ఫాం మైబిజ్, స్విగ్గీ జట్టు కట్టాయి. ఈ భాగస్వామ్యం కింద 'స్విగ్గీ ఫర్ వర్క్' ద్వారా స్విగ్గీ యాప్‌లో కార్పొరేట్ ప్రయాణికులు భోజనాన్ని ఆర్డరు చేసుకోవచ్చు. 'మైబిజ్ కార్పొరేట్ వాలెట్'తో నేరుగా చెల్లింపులు చేయొచ్చని ఆ సంస్థలు ప్రకటించాయి. అన్ని లావాదేవీలూ కంపెనీల వ్యయ వ్యవస్థల్లో ఆటోమేటిక్‌గా కనిపించడం వల్ల, ఫైనాన్స్ టీమ్‌లకు రియల్ టైంలో తనిఖీ చేసుకోవడానికి వీలుంటుంది. ఉద్యోగులు తమ కార్పొరేట్ ఐడీ నుంచి వన్ టైం అథరైజేషన్ పొందడం ద్వారా ఈ సేవలను వినియోగించుకోవచ్చు.

సెన్సెక్స్ ▲ 336	నిఫ్టీ ▲ 121
83871	25695

నష్టాల నుంచి లాభాల్లోకి

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.803 కోట్లు | **డీఐఐ కొనుగోళ్లు: రూ.2,188 కోట్లు**

సేవలు, టెలికాం షేర్లు రాణించడంతో ఆరంభ నష్టాల నుంచి కోలుకున్న సూచీలు, లాభాల్లో ముగిశాయి. అమెరికా- భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం కుదరొచ్చన్న అంచనాలు సానుకూల ప్రభావం చూపాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 23 పైసలు పెరిగి 88.50 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.33% లాభంతో 64.27 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో షాంఘై మినహా మిగతావి లాభాల్లో ముగియగా, ఐరోపా షేర్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ మంగళవారం రూ.74,000 కోట్లు పెరిగి రూ.468.94 లక్షల కోట్లు (5.29 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 136 పాయింట్ల (క్రితం ముగింపు 83,535.35) లాభంతో 83,671.52 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. వెంటనే నష్టాల్లోకి జారుకున్న సూచీ, ఇంట్రాడేలో 83,124.03 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడింది. అనంతరం కోలుకుని లాభాల్లోకి వచ్చిన సెన్సెక్స్, 83,936.47 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది. చివరకు 335.97 పాయింట్ల లాభంతో 83,871.32 వద్ద ముగిసింది. నిఫ్టీ 120.60 పాయింట్లు పెరిగి 25,694.95 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,449.25- 25,715.80 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెప్టెంబరు త్రైమాసికంలో నష్టం తగ్గడంతో వొడాఫోన్ ఐడియా షేరు 7.68% లాభపడి రూ.10.24 వద్ద ముగిసింది.

✦ కంపెనీ ఎండీ, సీఈఓ వరుణ్ బెర్రీ రాజీనామా చేయడంతో బ్రిటానియా ఇండస్ట్రీస్ షేరు 3.02% నష్టపోయి రూ.5,947 దగ్గర స్థిరపడింది.

✦ మారిషస్‌కు చెందిన పెట్టుబడిదారు కంపెనీ షేర్లను కొనుగోలు చేయడంతో వరుసగా మూడో రోజు ఏ-1 లిమిటెడ్ షేర్లు దూసుకెళ్లాయి. మంగళవారం 5% పెరిగి రూ.1824.95 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకి, అక్కడే ముగిశాయి. కంపెనీ మార్కెట్ విలువ రూ.2098.69 కోట్లుగా నమోదైంది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 24 లాభపడ్డాయి. బీఈఎల్ 2.52%, ఎం అండ్ ఎం 2.40%, అదానీ పోర్ట్స్ 2.11%, హెచ్‌సీఎల్ టెక్ 1.89%, ఎటర్నల్ 1.44%, సన్‌ఫార్మా 1.09%, ఇన్ఫోసిస్ 1.06%, భారతీ ఎయిర్‌టెల్ 1.06% రాణించాయి. బజాజ్ ఫైనాన్స్ 7.38%, బజాజ్ ఫిన్‌సర్వ్ 6.26%, టాటా మోటార్స్ 0.75% నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. సేవలు 1.65%, టెలికాం 1.59%, ఫోకస్డ్ ఐటీ 1.21%, టెక్ 1.12%, యంత్ర పరికరాలు 1.19%, ఐటీ 1.07%, వాహన 1% పెరిగాయి. బీఎస్ఈలో 1898 షేర్లు లాభపడగా, 2294 స్క్రిప్‌లు నష్టపోయాయి. 181 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

✦ ఎన్‌విడియాలో 5.83 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.51,000 కోట్ల) విలువైన షేర్లను విక్రయించినట్లు జపాన్‌కు చెందిన సాఫ్ట్ బ్యాంక్ గ్రూప్ మంగళవారం ప్రకటించింది.



ఐపీఓ సమాచారం

✦ పైన్ ల్యాబ్స్ ఐపీఓ ముగిసేసరికి 2.46 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 9,78,93,739 షేర్లను ఆఫర్ చేయగా, 24,09,38,767 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ విభాగంలో 4 రెట్లు, రిటెయిల్ మదుపర్ల నుంచి 1.22 రెట్లు, ఎన్ఐఐల నుంచి 30% స్పందన లభించింది.

✦ ఫిజిక్స్‌వాలా ఐపీఓ మొదటి రోజు 7% స్పందనే లభించింది. ఇష్యూలో 18,62,04,143 షేర్లను జారీ చేయనుండగా, 1,31,22,682 షేర్లకు బిడ్లు వచ్చాయి.

✦ ఎమ్వీ ఫోటోవోల్టాయిక్ పవర్ ఐపీఓ మొదటి రోజు 9% స్పందన దక్కింది. ఇష్యూలో భాగంగా 7,74,27,183 షేర్లను ఆఫర్ చేయగా, 67,10,802 షేర్లకు బిడ్లు నమోదయ్యాయి.

జులై - సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
టాటా పవర్	1245	1093	15769	15247
బజాజ్ ఫిన్‌సర్వ్	2244	2087	37403	33704
టొరెంట్ పవర్	742	496	7954	7301
ఎంక్యూర్ ఫార్మా	251	202	2270	2002
హిందుస్థాన్ కాపర్	186	102	729	550
రిలయన్స్ పవర్	87	(352)	2067	1963
కామధేను	19	16	191	190
శ్రీలోటస్ డెవలపర్స్	46	50	189	125
సిర్మా ఎస్‌జీఎస్	66	40	1146	833
డెంటా వాటర్	19	11	74	48
జేబీ ఫార్మా	208	175	1085	1001
హెచ్‌టీ మీడియా	(4.34)	(6.33)	452	424
బలరాంపూర్ చిని	54	67	1671	1298
పీటీసీ ఇండియా	222	163	5585	5134
థర్మాక్స్	119	198	2474	2616
పీసీ జువెలర్స్	210	179	895	549
బికాజీ ఫుడ్స్	78	68	830	721

ఈనాడు సినిమా


ప్రభాస్

తొలి అడుగు పడిన రోజునే...

'ది రాజాసాబ్' ప్రయాణాన్ని మంగళవారంతో ముగించారు కథానాయకుడు ప్రభాస్. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రమిది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. భారీ హంగులతో, పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాతో సుదీర్ఘకాలంగా ప్రయాణం చేస్తూ వచ్చిన ప్రభాస్‌పై సన్నివేశాల చిత్రీకరణ మంగళవారంతో ముగిసింది. ఈ రోజుకి ఓ ప్రత్యేకత కూడా ఉంది. సరిగ్గా 23 ఏళ్ల కిందట ఇదే రోజునే ప్రభాస్ తొలి చిత్రం 'ఈశ్వర్' ప్రేక్షకుల ముందుకొచ్చింది. మైలు రాయిలాంటి ఈ ప్రయాణాన్ని పురస్కరించుకుని చిత్ర బృందం ప్రత్యేకమైన పోస్టర్‌ని విడుదల చేసింది. అందులో ప్రభాస్ కలర్‌ఫుల్‌గా తనదైన జోష్‌తో కనిపిస్తున్నారు. ఈ సినిమా సంగీత ప్రచార కార్యక్రమాలు త్వరలోనే షురూ కానున్నాయి. ఈ నెల నుంచే పాటల్ని ఒక్కొక్కటిగా విడుదల చేయనున్నారని సమాచారం.

'సౌండ్స్ ఆఫ్ కుంభ్'కు గ్రామీ నామినేషన్

సిద్ధాంత్ భాటియా నిర్మించిన 'సౌండ్స్ ఆఫ్ కుంభ' గీతం ఉత్తమ గ్లోబల్ మ్యూజిక్ ఆల్బమ్ విభాగంలో 68వ గ్రామీ పురస్కారాలకు నామినేట్ అయింది. ఈ ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవం మహాకుంభ గొప్పతనాన్ని, తత్వశాస్త్రాన్ని అర్థం చేసుకునేలా రూపొందింది. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ ప్రోత్సాహంతో ఈ 'సౌండ్స్ ఆఫ్ కుంభ' ఆల్బమ్‌ను నెట్‌వర్క్ 18, హిస్టరీ టీవీ 18 భాగస్వామ్యంతో రూపొందించి.. యూనివర్సల్ మ్యూజిక్ ఇండియా ద్వారా ప్రపంచవ్యాప్తంగా పంపిణీ చేశారు. ఈ ప్రాజెక్ట్‌లో 50మందికి పైగా అంతర్జాతీయ, భారతీయ కళాకారులు, ఏడుగురు నిర్మాతలు ఉన్నారు. ఈ ప్రాజెక్ట్‌కి జిమ్ 'కిమో' వెస్ట్, మది దాస్, రాన్ కోర్బ్, చారు సూరి, రాఘవ్ మెహతా, దేవరాజ్ సన్యాల్ సహకరించారు. ఈ సందర్భంగా నిర్మాత సిద్ధాంత్ భాటియా మాట్లాడుతూ "గ్రామీ నామినేషన్ మహాకుంభ శాంతి, ఐక్యత సందేశానికి గుర్తింపు"అని అన్నారు. 68వ వార్షిక గ్రామీ అవార్డుల వేడుక ఫిబ్రవరి 1న లాస్ ఏంజెలెస్‌లోని క్రిప్టో డాట్ కామ్ అరీనాలో జరగనుంది.

ఏడాదంతా.. రష్మికదే జోరంతా


రష్మిక

2025 రష్మిక సినీ ప్రయాణంలో ఓ స్వర్ణ ఏడాదిలా గుర్తుండిపోనుంది. ఈ సంవత్సరం ఐదు విభిన్న చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో మెరుపులు మెరిపించింది. 'రష్మిక గ్లామర్ పాత్రలకే పరిమితమవుతోంద'ని తరచూ వినిపించే విమర్శల్ని పటాపంచలు చేస్తూ వైవిధ్య భరితమైన నటనా ప్రాధాన్య పాత్రలతో మెప్పించింది. స్క్రిప్టుల ఎంపికలో తన వైవిధ్యాన్ని బలంగా చాటి చెప్పింది. 'పుష్ప 2' విజయంతో గతేడాదిని ఘనంగా ముగించిన ఆమె.. ఈ ఏడాది ఆరంభంలో 'ఛావా'లో మరాఠా రాణి ఏసుబాయిగా రాజసం ఒలికించి.. అందర్నీ మెప్పించింది. దాదాపు రూ.100కోట్ల పైచిలుకు బడ్జెట్‌తో నిర్మితమైన ఈ సినిమా దాదాపు రూ.800కోట్ల వసూళ్లు కొల్లగొట్టడం విశేషం. ఆ తర్వాత సల్మాన్ ఖాన్ 'సికందర్'లో సాయిశ్రీ రాజ్‌కోట్ అనే గ్లామర్ యువతిగా.. ధనుష్‌తో 'కుబేర'లో సమీరా అనే అమాయకత్వం నిండిన అమ్మాయిగా వైవిధ్యభరిత నటనతో కట్టిపడేసింది. వీటిలో 'సికందర్' మంచి ఆరంభ వసూళ్లు దక్కించుకోగా.. 'కుబేర'తో ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. ఇక దీపావళి బరిలో 'థామా' చిత్రంతో భేతాళ యువతిగా ఓవైపు అందర్నీ భయపెడుతూనే.. మరోవైపు యాక్షన్‌తోనూ ఆశ్చర్యపరిచింది. ఇప్పుడీ జోరును 'ది గర్ల్‌ఫ్రెండ్'తోనూ కొనసాగిస్తోంది రష్మిక. ఇది ఆమెకి తొలి నాయికా ప్రాధాన్య చిత్రం. ఒక బ్రేకప్ తర్వాత అబ్బాయి నుంచి ఎదురయ్యే బ్లాక్‌మెయిలింగ్‌ను భూమిక అనే అమ్మాయి ఎలా తట్టుకుని నిలబడిందనేది ఈ చిత్ర ప్రధానాంశం. పాత్రను రష్మిక చాలా పరిణతితో చేసి చూపించింది. ముఖ్యంగా పతాక ఘట్టాల్లో ఆమె నటన.. పలికిన సంభాషణలు ప్రతిఒక్కరి మదిపై చెరగని ముద్ర వేశాయి. అంతేకాదు రష్మికకు వ్యక్తిగతంగానూ ఈ 2025 ప్రత్యేకంగా గుర్తుండిపోనుంది. ఇటీవలే విజయ్ దేవరకొండతో ఆమె నిశ్చితార్థం జరిగింది. కానీ అధికారికంగా ప్రకటించలేదు. కొత్త ఏడాది ఆరంభంలో వీళ్ల పెళ్లి పీటలెక్కేందుకు సిద్ధమవుతున్నారు. రష్మిక ప్రస్తుతం 'మైసా' అనే యాక్షన్ చిత్రంలో నటిస్తోంది.

విలన్‌ను కనిపెట్టలేరు


అనిల్ విశ్వనాథ్, నరేశ్, కామాక్షి, శ్రీనివాసా చిట్టూరి

"చాలా విభిన్న కోణాలున్న కథతో రూపొందిన సినిమా '12ఎ రైల్వే కాలనీ'. నేనిప్పటి వరకు చాలా జానర్స్ చేశాను కానీ, ఇలాంటి థ్రిల్లర్ ఎప్పుడూ చేయలేదు" అన్నారు అల్లరి నరేశ్. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని నాని కాసరగడ్డ తెరకెక్కించారు. శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. పవన్ కుమార్ సమర్పణలో అనిల్ విశ్వనాథ్ షో రన్నర్‌గా వ్యవహరించారు. ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానున్న నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా అల్లరి నరేశ్ మాట్లాడుతూ.. "నా కెరీర్‌లో సస్పెన్స్ థ్రిల్లర్ చేయడం ఇదే తొలిసారి. దీంట్లో విలన్ ఎవరన్నది చివరి వరకు ప్రేక్షకులు కనిపెట్టలేరు. ఇది ఆద్యంతం థ్రిల్ చేస్తుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస చిట్టూరి, కామాక్షి, భీమ్స్ సిసిరోలియో తదితరులు పాల్గొన్నారు.

సందేశంతో... 'పిఠాపురంలో'


రాజేంద్రప్రసాద్, భట్టి విక్రమార్క, పృథ్వీ, మహేశ్‌చంద్ర

"ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి నియోజకవర్గం పేరుతో సినిమా తీశాం. తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆ సినిమా టైటిల్‌ని ఆవిష్కరించడం ఆనందంగా ఉంది" అన్నారు మహేశ్‌చంద్ర. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పిఠాపురంలో'. అలా మొదలైంది... అనేది ఉపశీర్షిక. డా.రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన ముఖ్యపాత్రలు పోషించారు. దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేశ్‌పటేల్, ఎఫ్.ఎం.మురళి (గోదారి కిట్టయ్య) నిర్మాతలు. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని ఇటీవల హైదరాబాద్‌లో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. నటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "'ఆ నలుగురు', 'మీ శ్రేయోభిలాషి', 'ఓనమాలు' తరహాలో సందేశాన్ని అందిస్తూనే యువతరాన్ని ఆకట్టుకునే అంశాలున్న సినిమా ఇది" అన్నారు.


భాగ్యశ్రీ బోర్సే

తొలి సినిమాతోనే ఇటు ప్రేక్షకులనూ - అటు పరిశ్రమనూ ప్రత్యేకంగా ఆకర్షించిన అందం... భాగ్యశ్రీ బోర్సే. తొలి చిత్రం 'మిస్టర్ బచ్చన్', ఆ తర్వాత చేసిన 'కింగ్‌డమ్'తో అచ్చమైన కమర్షియల్ సినిమాల కథానాయిక అనిపించుకున్న భాగ్యశ్రీ.... ఇదే నెలలోనే రెండు సినిమాలతో సందడి చేయనుంది. అందులో ఒక చిత్రం... 'కాంత'. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటించారు. రానా దగ్గుబాటి కీలక పాత్ర పోషించారు. ఆ ఇద్దరూ ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్‌తో కలిసి నిర్మించారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకుడు. ఈ చిత్రం ఈ నెల 14న తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా భాగ్యశ్రీ బోర్సే మంగళవారం విలేకర్లతో ముచ్చటించారు.

ఆ రోజులు స్వర్ణయుగం ఎందుకో అర్థమైంది

'కాంత' కథను విన్నప్పుడు మీ మనసులో కలిగిన ఆలోచనలేమిటి?

దక్షిణాది నుంచి నేను విన్న మొట్ట మొదటి స్క్రిప్ట్ ఇదే. కానీ అంతా సిద్ధం అనుకున్నాక ఈ ప్రాజెక్ట్ కాస్త ఆలస్యమైంది. ఆ క్రమంలోనే 'మిస్టర్ బచ్చన్', 'కింగ్‌డమ్' సినిమాల్లో నటించే అవకాశం వచ్చింది. సాంకేతికంగా మాత్రం 'కాంత'నే నా తొలి దక్షిణాది సినిమా. ఈ సినిమాలో కుమారి పాత్ర చేయడం ఓ పెద్ద సవాల్.

కుమారి పాత్రలో నటిస్తున్నప్పుడు ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి?

1950 - 60ల నేపథ్యంలో సాగే కథ ఇది. కుమారి పాత్రని పండించాలంటే కళ్లతోనే భావాలు పలికించాలి. దాంతో చెన్నై వెళ్లి పాత్ర గురించి మరిన్ని విషయాలు తెలుసుకున్నాక... అలనాటి కథానాయికలు సావిత్రి, శ్రీదేవి సినిమాలతోపాటు, ఇంకా ఎన్నో వీడియోలు చూశా. ఆ స్ఫూర్తితో నాదైన శైలిలో కుమారి పాత్రకి సరికొత్తగా ప్రాణం పోసే ప్రయత్నం చేశా. సంభాషణల కోసమే ఆరు నెలలు కష్టపడ్డాను. అంత క్లిష్టమైన సంభాషణలు అవి. నాటి సినిమాల్లో సంభాషణలకీ, ఇప్పటికీ చాలా తేడాలు కనిపిస్తాయి. అందుకే వాటి కోసం చాలా శ్రద్ధ తీసుకోవల్సి వచ్చింది.

దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటితో కలిసి నటిస్తున్నప్పుడు వాళ్లు ఏమైనా సలహాలు ఇచ్చేవారా? వాళ్ల నుంచి మీరేం నేర్చుకున్నారు?

ఈ సినిమా పక్కా అయినప్పటి నుంచి మేమంతా ఒకరితో ఒకరు మాట్లాడుతూనే ఉన్నాం. ఈ ప్రయాణంలో మేమంతా మంచి స్నేహితులమయ్యాం. దాంతో సెట్‌లోనూ అదే వాతావరణం కనిపించేది. రానా దగ్గుబాటికి సినిమాపై ఉన్న తపనని చూసి ఆశ్చర్యపోయా. ఒక పాత్ర గురించి ఎంతగా ఆలోచించాలో దుల్కర్‌ని చూసి నేర్చుకున్నా.

1950, 60ల కాలాన్ని సినీ స్వర్ణయుగం అంటుంటారు. ఆ రోజుల్లోని కథానాయికగా నటించాక... నేటి కథానాయికగా మీ జీవితాన్ని పోల్చుకుంటే ఏమనిపిస్తోంది?

ఈమధ్యే సీనియర్ కథానాయిక ఖుష్బూని కలిశా. అక్కడే నృత్య దర్శకురాలు బృంద కూడా ఉన్నారు. వాళ్లిద్దరూ మంచి స్నేహితులు. ఆ రోజుల్లో అనుభవాల్ని, సోషల్ మీడియా లేని ఆ కాలంలో జీవితం ఎంత వైవిధ్యంగా ఉండేదో చెబుతుంటే ఎంతో ఆసక్తికరంగా అనిపించింది. స్వర్ణయుగం అని ఎందుకంటారో అర్థమైంది. నా అంతరాత్మ అప్పటి కాలానికి దగ్గరగా ఉంటుంది కాబట్టి అప్పుడు కథానాయిక అయ్యుంటే ఇంకా ప్రభావం చూపించేదాన్నేమో (నవ్వుతూ). కానీ దేవుడు ఈ కాలం కథానాయికని చేశాడు.

నాలుగు తరాల కథగా 'వైభవం'


దుష్యంత్, నాగార్జున, ఆషికా రంగనాథ్

"గత జన్మల నేపథ్యంలో సాగే చిత్రాలంటే నాకెంతో ఇష్టం" అన్నారు కథానాయకుడు నాగార్జున. ఇప్పుడా తరహా నేపథ్యంతో నాలుగు తరాల కథగా 'గత వైభవం' సినిమా రూపొందిందన్నారు. ఆషికా రంగనాథ్, ఎస్ఎస్ దుష్యంత్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని సింపుల్ సుని తెరకెక్కించారు. దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. ఇది ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ద్వారా ఈ నెల 14న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. నాగార్జున ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఈ సినిమా గురించి ఆషిక నాకు ఎప్పట్నుంచో చెబుతోంది. మా నాన్న నటించిన 'మూగ మనసులు' చిత్రంతో నాకు గత జన్మల కాన్సెప్ట్‌పై ఆసక్తి పెరిగింది. ఆ ఇష్టంతోనే నేను 'జానకి రాముడు'లో నటించా. ఈ రెండూ సూపర్ హిట్ అయ్యాయి. ఈ సినిమా నాలుగు తరాల కథగా సాగుతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య రెడ్డి, దీపక్, సింపుల్ సుని, విలియం డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

'రాబందు' ఎవరు?


ప్రీతినిగమ్

ప్రీతినిగమ్, రామ్, భానుప్రసాద్, సురేశ్‌రాజ్, బ్రహ్మానందం రెడ్డి ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకుడు. పులిజాల సురేశ్ నిర్మాత. ఈ సినిమా ట్రైలర్‌ని ఇటీవల తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విడుదల చేశారు. అనంతరం చిత్ర బృందం వేడుకని నిర్వహించింది. దర్శకుడు సముద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కథలో రాబందు ఎవరన్నది ఆసక్తికరం, కథని నమ్మి చేసిన ఓ మంచి ప్రయత్నం ఈ సినిమా అన్నారు నిర్మాత.

సమాజానికి చెప్పాల్సిన కథతో...


శ్రీధర్, హరిప్రసాద్, బాబీ, సంజీవ్, విక్రాంత్, చాందిని, సందీప్ రాజ్, శైలేశ్

"సున్నితమైన అంశాన్ని స్పృశిస్తూ... అందరికీ నచ్చే వినోదంతో సినిమాని తీసినట్టు 'సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ చాటుతోంది. ఇలాంటి మంచి సినిమాలకు విజయం దక్కాలి" అన్నారు దర్శకుడు బాబీ. ఆయనతోపాటు, దర్శకులు శైలేశ్ కొలను, సందీప్ రాజ్, బి.వి.ఎస్.రవి, నిర్మాతలు లగడపాటి శ్రీధర్, అప్పిరెడ్డి ముఖ్య అతిథులుగా ఇటీవల హైదరాబాద్‌లో 'సంతాన ప్రాప్తిరస్తు' విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన చిత్రమిది. మధుర శ్రీధర్‌రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. వేడుకని ఉద్దేశించి బాబీ మాట్లాడుతూ 'విక్రాంత్, చాందినీ ఎంతో తపన కలిగిన నటులు. ఈ చిత్రంతో వాళ్లిద్దరికీ మంచి విజయం దక్కాలని కోరుకుంటున్నా" అన్నారు. నేటి సమాజానికి చెప్పాల్సిన కథతోనే ఈ చిత్రం రూపొందిందన్నారు చాందినీ చౌదరి. అందరికీ కనెక్ట్ అయ్యే కథతో రూపొందిన ఈ సినిమాలో, హాస్యంపై పట్టున్న నటులతో కలిసి తెరను పంచుకోవడం గొప్ప అనుభవం అన్నారు కథానాయకుడు విక్రాంత్. ఈ కార్యక్రమంలో నిర్మాత శింగనమల కల్యాణ్, గీత రచయిత కాసర్ల శ్యామ్, సంగీత దర్శకుడు అజయ్ అరసాడ, రచయితలు కల్యాణ్ రాఘవ్, షేక్ దావూద్, బాలవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


పల్లెటూరి సూరి కథ


ఆద్య, నాగార్జున

జీవిత సత్యాలున్న కథని... వాస్తవికతకి పెద్దపీట వేస్తూ తెరకెక్కించిన సినిమానే మా 'రోలుగుంట సూరి' అన్నారు సౌమ్య చాందిని. ఆమె నిర్మాణంలో నాగార్జున పల్లా కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రమే 'రోలుగుంట సూరి'. ఆద్యారెడ్డి, భావన నీలప్ కథానాయికలు. అనిల్‌కుమార్ పల్లా దర్శకుడు. ఈ నెల 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. పల్లెటూరిలో పుట్టి పెరిగిన ఒక సూరి కథ ఇదని, ఇదే బృందంతో మరో సినిమా చేయబోతున్నానని చెప్పారు కథానాయకుడు.

మా నాన్న క్షేమంగానే ఉన్నారు

● ధర్మేంద్ర ఆరోగ్యంపై కుమార్తె ఈశా దేవోల్ స్పందన



ప్రముఖ సీనియర్ నటుడు ధర్మేంద్ర ముంబయి బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగానే.. మంగళవారం ఆయన మృతి చెందారంటూ సామాజిక మాధ్యమాల వేదికగా వార్తలొచ్చాయి. వీటన్నింటినీ ఖండిస్తూ ఆయన కుమార్తె ఈషా దేవోల్ ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. "మీడియా అతిగా ఆందోళన చెందుతూ తప్పుడు వార్తలను వ్యాప్తి చేస్తున్నట్లు కనిపిస్తోంది. మా తండ్రి క్షేమంగానే ఉన్నారు, కోలుకుంటున్నారు. మా కుటుంబానికి ప్రైవసీని ఇవ్వమని ప్రతి ఒక్కరినీ అభ్యర్థిస్తున్నాము. నాన్న త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన వారందరికీ కృతజ్ఞతలు"అని పేర్కొంది. ధర్మేంద్ర భార్య, నటి హేమా మాలిని కూడా ఎక్స్‌లో స్పందిస్తూ.. "జరుగుతున్నది క్షమించరానిది! చికిత్సకు స్పందిస్తూ కోలుకుంటున్న వ్యక్తి గురించి బాధ్యతాయుతమైన మీడియా ఇలాంటి వార్తలను ఎలా రాయగలదు? ఇది పూర్తిగా బాధ్యతారాహిత్యంతో కూడుకున్నది. దయచేసి మా కుటుంబ గోప్యతకి తగిన గౌరవం ఇవ్వండి"అని అసహనం వ్యక్తం చేశారు. ధర్మేంద్ర కుమారుడు, నటుడు సన్నీ దేవోల్ ప్రతినిధి మీడియాతో మాట్లాడుతూ.."ధర్మేంద్ర కోలుకుంటున్నారు ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. చికిత్సకు స్పందిస్తున్నారు. ఆయన ఆరోగ్యం గురించి తప్పుడు వార్తలను వ్యాప్తి చేయవద్దు. ఆయన త్వరగా కోలుకోవాలని అందరూ ప్రార్థించండి"అని తెలిపారు. మాలిని, సన్నీ, బాబీ దేవోల్‌తో సహా మొత్తం కుటుంబం ప్రస్తుతం ఆసుపత్రిలో ఉంది. సల్మాన్ ఖాన్, షారుక్ ఖాన్ సహా పలువురు నటులు వారి కుటుంబాన్ని పరామర్శించారు. ధర్మేంద్ర చనిపోయారనే వార్తలు రాగానే పలువురు ప్రముఖ సినీ, రాజకీయ ప్రముఖులు సామాజిక మాధ్యమాల ద్వారా సంతాపం ప్రకటించి, ఆ తర్వాత ఆ పోస్టులను తొలగించారు.

ఇకపై అలాంటి చిత్రాలు చేయను!


అను ఇమ్మాన్యుయేల్

"అవకాశాల కోసం ఆరాటపడే తత్వం నాది కాదం"టోంది నటి అను ఇమ్మాన్యుయేల్. కెరీర్ ఆరంభంలో చేసినట్లుగా ఇకపై రొటీన్ కమర్షియల్ చిత్రాలు చేయకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. ఆమె ఇటీవలే రష్మికతో కలిసి 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటించింది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించింది అను ఇమ్మాన్యుయేల్.

- "హాలీవుడ్ సినిమాల్లో హీరో, హీరోయిన్, విలన్.. ఇలా విభజన ఏమీ ఉండదు. ప్రతి ఒక్కరూ కథను ముందుకు నడిపే విధంగా పాత్రల్ని సిద్ధం చేస్తారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం కోసం దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అలాంటి ప్రయత్నమే చేశారు. అన్ని పాత్రలకు న్యాయం చేసేలా సినిమాని రూపొందించారు. ఈ చిత్రాన్ని నేను థియేటర్స్‌లో చూశా. కొన్ని సీన్స్‌కు అబ్బాయిలు కూడా చప్పట్లు కొట్టడం ఆనందంగా అనిపించింది".
- "అమ్మాయిల గురించి ఒక మంచి విషయం చెప్పే చిత్రమిది. అందుకే దీంట్లో నాది చిన్న పాత్రైనా తప్పకుండా నటించాలని నిర్ణయించుకున్నా. ఇలాంటి సినిమాలు మనసుకి సంతృప్తినిస్తాయి. ఏదైనా కొత్తగా నేర్చుకోవచ్చనే ఆలోచనతో దీన్ని చేశాను. ఇప్పుడీ చిత్రానికి అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటం ఆనందంగా ఉంది. సాధారణంగా కమర్షియల్ సినిమాల్లో ఓవర్ యాక్షన్ చేయిస్తారు. దుర్గ పాత్ర పోషించేటప్పుడు చాలా సహజంగా టోన్ డౌన్ చేసి నటించా. రాహుల్ ఇచ్చిన సలహాతోనే ఇది చేయగలిగా. అందుకే ఈ పాత్ర తెరపై మరింత సహజంగా కనిపించింది. ఈ చిత్రంలో చూపించినట్లు మహిళలకు సమాజం ఎన్నో కట్టుబాట్లు పెడుతుంటుంది. ఎలా మాట్లాడాలి.. ఎలాంటి దుస్తులు ధరించాలి.. ఎప్పుడు పెళ్లి చేసుకోవాలి.. పిల్లల్ని ఎప్పుడు కనాలి.. ఇలా ఎన్నో షరతులుంటాయి. మగవాళ్లకు ఉద్యోగం, సంపాదన తప్ప మరే షరతులు ఉండవు".
- "నా సినీ ప్రయాణం పట్ల అసంతృప్తిగానే ఉన్నా. కానీ, నటిగా ఓ సంతృప్తి ఉంది. పవన్ కల్యాణ్, అల్లు అర్జున్, నాని, నాగచైతన్య, కార్తి, శివ కార్తికేయన్ లాంటి పెద్ద స్టార్స్‌తో కలిసి నటించాను. అయితే నా కెరీర్‌లో కొన్ని సినిమాలు చేసి ఉండకూడదని ఇప్పుడు అనిపిస్తోంది. కొన్ని కమర్షియల్ చిత్రాల్లో నటించడం వల్ల నటిగా నాకు ఎలాంటి సంతృప్తి లభించదు. నాలుగు డ్యాన్స్ స్టెప్పులు వేసి.. కొన్ని డైలాగ్స్ చెప్పిస్తారంతే. అందుకే ఇకపై అలాంటి సినిమాలు చేయకూడదనుకున్నా. ప్రస్తుతం నేను కొన్ని కథలు వింటున్నా. ఓ సినిమా ఓకే అయింది. త్వరలో నిర్మాణ సంస్థ ఆ వివరాల్ని వెల్లడిస్తుంది".

కొత్త పరిస్థితుల్లో నెగ్గుకురావాలంటే..! — లైఫ్‌స్కిల్స్

విద్యార్థిగా ఉన్నప్పుడు లేదా ఉద్యోగిగా చేరినప్పుడు కొత్త విషయాలను నేర్చుకునే క్రమంలో ఎన్నో అవరోధాలు ఎదురవుతుంటాయి. పరిచయం లేని పరిసరాలు, వాతావరణంలో నెగ్గుకురావాల్సి ఉంటుంది. అలాంటి సందర్భాల్లో కంగారు పడకూడదు. భిన్న పరిస్థితులకు అనుకూలంగా ఒదిగిపోయే, ఇమిడి పోయే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి. అలా చేస్తే ఎలాంటి మార్పులు ఎదురైనా భయపడరు. క్లిష్టమైన పనులు చేయడానికి సరికొత్త మార్గాలను అన్వేషిస్తారు. ఎప్పటికప్పుడు తమను తాము మార్చుకోగలిగితే అందే ప్రయోజనాలు, పాటించాల్సిన పద్ధతుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

కరెంట్ అఫైర్స్ — మాదిరి ప్రశ్నలు



■ 2025 సెప్టెంబరు 15 నుంచి 19 వరకు అంతర్జాతీయ ఎలక్ట్రోటెక్నికల్ కమిషన్ (ఐఈసీ) 89వ జనరల్ మీటింగ్‌ను ఎక్కడ నిర్వహించారు?
జ: న్యూదిల్లీలోని భారత్ మండపం (ఐఈసీ జనరల్ మీటింగ్‌కు ఆతిథ్యం ఇవ్వడం ఇది భారత్‌కు నాలుగో సారి. గతంలో 1960, 1997, 2013లలో కూడా దీనిని భారత్‌లో నిర్వహించారు.)

■ 2025 దులీప్ ట్రోఫీ టైటిల్ విజేతగా ఏ జట్టు నిలిచింది?
జ: సెంట్రల్ జోన్

■ ప్రపంచంలోనే మొదటిసారి పూర్తిగా మహిళలతో కూడిన త్రి-సేవల ప్రదక్షిణ సెయిలింగ్ యాత్ర 'సముద్ర ప్రదక్షిణ' ను ముంబయిలోని గేట్ వే ఆఫ్ ఇండియా వద్ద ఎవరు ప్రారంభించారు? (10 మంది మహిళా అధికారుల నేతృత్వంలో జరిగే ఈ యాత్ర తొమ్మిది నెలల పాటు భారత ఆర్మీ సెయిలింగ్ నౌక ఐఏఎస్‌వీ త్రివేణిలో ప్రపంచాన్ని చుట్టి రావడమే లక్ష్యంగా పెట్టుకుంది.)
జ: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

మరింత సమాచారం

పోలికలకు.. సమానత్వానికి!



జనరల్ స్టడీస్ — అరిథ్‌మెటిక్

వంట రుచిగా ఉండాలంటే అవసరమైన పదార్థాలను తగుపాళ్లలో వేయాలి. భాగస్వామ్య వ్యాపారంలో వాటాల ప్రకారం లాభనష్టాలను న్యాయంగా పంచుకోవాలి. ఇలాంటి సందర్భాల్లోనే ఒక రాశి కంటే మరో రాశి ఎన్ని రెట్లు ఉండాలో తెలిపే నిష్పత్తి అవసరమవుతుంది. కిలోమీటర్ల దూరాన్ని మ్యాపుపై చూపించాలంటే సెంటీమీటర్ల కొలతను వాడాలి. ఆదాయంలో ఖర్చు చేసిన సొమ్ము భాగాన్ని లేదా శాతాన్ని సరిగా లెక్కగట్టి, జాగ్రత్తలు తీసుకుంటే ఆర్థిక నిర్వహణ బాగుంటుంది. ఆ విధంగా వాస్తవ విలువలకు సమానమైన విలువలను అనుపాతం తెలియజేస్తుంది. వీటిపై తరచూ పోటీ పరీక్షల్లో ప్రశ్నలు వస్తున్నాయి. వాటికి సమాధానాలను వేగంగా, కచ్చితంగా గుర్తించాలంటే భిన్నాలను సరళీకరించడం, వివిధ భిన్నాలను కలపడం, అనుపాత నియమాలను అర్థం చేసుకొని, అనువర్తింపజేయడం నేర్చుకోవాలి.

నిష్పత్తి - అనుపాతం

నిష్పత్తి: ఒక ప్రమాణం ఉన్న పదాల పోలిక.

a : b

★ a : b ని $\frac{a}{b}$ గా రాయవచ్చు.

★ a : b నిష్పత్తిని ఏదైనా ఒక సంఖ్యతో గుణించినా లేదా భాగించినా వచ్చే నిష్పత్తిలో మార్పు ఉండదు.

★ a : b నిష్పత్తి నుంచి ఏదైనా సంఖ్యను తీసివేసినా, కలిపినా వచ్చే నిష్పత్తి మారుతుంది.

నోట్: a : b విలోమ నిష్పత్తి $\frac{1}{a} : \frac{1}{b}$ = b : a

a : b : c విలోమ నిష్పత్తి $\frac{1}{a} : \frac{1}{b} : \frac{1}{c}$ = bc : ca : ab

★ a : b, c : d ల బహుళ నిష్పత్తి = ac : bd

a : b
↓c : d↓
ac : bd → బహుళ నిష్పత్తి



అనుపాతం: రెండు నిష్పత్తుల సమానత్వాన్ని 'అనుపాతం' అంటారు.

a : b = c : d

నోట్: i) a, b, c, d లు అనుపాతంలో ఉంటే ad = bc

ii) a, b, c లు అనుపాతంలో ఉంటే $ac = b^2$

iii) a, b ల అనుపాత మధ్యమం = $\sqrt{ab}$

అనుపాతం రెండు రకాలు:

1) అనులోమానుపాతం:

x లో పెరుగుదల ⇒ y లో పెరుగుదల

x లో తగ్గుదల ⇒ y లో తగ్గుదల

$x \alpha y \Rightarrow x = ky \Rightarrow \frac{x}{y} = k \therefore \frac{x_1}{x_2} = \frac{y_1}{y_2}$

2) విలోమానుపాతం:

x లో పెరుగుదల ⇒ y లో తగ్గుదల

x లో తగ్గుదల ⇒ y లో పెరుగుదల

$x \alpha \frac{1}{y} \Rightarrow x = k\frac{1}{y} \Rightarrow xy = k$

$\therefore x_1y_1 = x_2y_2$

మాదిరి ప్రశ్నలు

1. A : B = 1 : 3, B : C = 4 : 5 అయితే A : B : C విలువ?

1) 15 : 12 : 4 2) 4 : 12 : 15
3) 15 : 4 : 12 4) 12 : 4 : 15

వివరణ: 1వ పద్ధతి: A : B = 1 : 3, B : C = 4 : 5

$\frac{1}{3} \rightleftarrows \frac{4}{5}$ (అడ్డ గుణకారం)



A : B : C = 4 : 12 : 15

2వ పద్ధతి: A : B = (1 : 3) × 4 ⇒ 4 : 12

B : C = (4 : 5) × 3 ⇒ 12 : 15

A : B : C
4 : 12 : 15



3వ పద్ధతి: A : B : C
↓1 : 3 : 3↓
4 : 4 : 5
4 : 12 : 15

జ: 2

2. 3A = 5B = 6C అయితే A : B : C విలువ ఎంత?

1) 10 : 6 : 5 2) 6 : 5 : 10
3) 5 : 6 : 10 4) 10 : 5 : 6

వివరణ: 1వ పద్ధతి: 3A = 5B = 6C (3, 5, 6 ల క.సా.గు = 30)

A : B : C
10 : 6 : 5

2వ పద్ధతి: 3A = 5B = 6C (B, C, A)

A : B : C
30 : 18 : 15
10 : 6 : 5

జ: 1

3. రూ.510 ను A, B, C లకు పంచాలి. A వాటా B వాటాలో $\frac{2}{3}$వ వంతు. B వాటా C వాటాలో $\frac{1}{4}$వ వంతు అయితే B వాటా ఎంత?

1) 30 2) 14 3) 90 4) 60

వివరణ: మొత్తం సొమ్ము = రూ.510



A : B B : C
2 : 3 1 : 4

$\frac{2}{3} \rightleftarrows \frac{1}{4}$

A : B : C = 2 : 3 : 12

మొత్తం వాటాలు 17 → 510

3 → ? 90

జ: 3

4. 9, 12, 15 ల చతుర్థ అనుపాతం ఎంత?

1) 20 2) 16 3) 14 4) 12

వివరణ: 9, 12, 15, x అనుపాతంలో ఉన్నాయి.

9 × x = 15 × 12 ∵ ad = bc

$x = \frac{15 \times 12}{9} = 20$



చతుర్థ అనుపాతం = 20

జ: 1

5. మూడు బస్సుల వేగాలు 3 : 7 : 5. అయితే అవి గమ్యస్థానాలను చేరడానికి పట్టే కాలాల నిష్పత్తి?

1) 35 : 15 : 21 2) 21 : 15 : 35
3) 35 : 21 : 15 4) 15 : 21 : 35

వివరణ: దూరాలు సమానమైనప్పుడు కాలం, వేగం విలోమ నిష్పత్తిలో ఉంటాయి.

ⓓ = ts

s → 3 : 7 : 5

t → 35 : 15 : 21



నోట్: a : b : c ల విలోమ నిష్పత్తి bc : ac : ab

జ: 1

6. 60 లీ. మిశ్రమంలో పాలు, నీళ్ల నిష్పత్తి 2 : 1. ఈ నిష్పత్తి 1 : 2 కావడానికి ఇంకా కలపాల్సిన నీళ్లు (లీ.లలో)?

1) 40 2) 60 3) 50 4) 20

వివరణ: కలిపేది నీళ్లు కాబట్టి పాలు సమానం.

పాలు : నీళ్లు

ముందుగా ⇒ (2 : 1) × 1 = 2 : 1

తర్వాత ⇒ (1 : 2) × 2 ⇒ 2 : 4

మొత్తం (2 + 1) 3 → 60

కలిపే నీళ్లు 3 → ? 60

జ: 2

7. ఒక సంచిలో రూ.50, రూ.20, రూ.10, రూ.5 నోట్లు 1 : 2 : 3 : 4 నిష్పత్తిలో ఉన్నాయి. ఆ సంచిలో మొత్తం రూ.1540 ఉంటే రూ.10 నోట్ల సంఖ్య?

1) 33 2) 35 3) 43 4) 31

వివరణ:

రూ.50	రూ.20	రూ.10	రూ.5
1	2	3	4
50 +	40 +	30 +	20

మొత్తం ⇒ 140 → 1540

రూ.10 నోట్లు 3 → 33

జ: 1

8. ఒక గ్యారేజీలో కొన్ని ఆటోలు, స్కూటర్లు ఉన్నాయి. వాటి మొత్తం సంఖ్య 40, చక్రాల సంఖ్య 95 అయితే ఆటోల సంఖ్య ఎంత?

1) 5 2) 10 3) 15 4) 25

వివరణ: ఎలిగేషన్ పద్ధతి ద్వారా

40
ఆటో(3) 120 స్కూటర్లు(2) 80
95
15 25



జ: 3

9. రెండు సంఖ్యల నిష్పత్తి 8 : 5. ప్రతీ సంఖ్యకు 3 కలిపితే వాటి మధ్య నిష్పత్తి 17 : 11. అయితే ఆ రెండు సంఖ్యల మొత్తం ఎంత?

1) 48 2) 30 3) 78 4) 87

వివరణ: A : B

ముందుగా ⇒ 8 : 5 (③)

తర్వాత ⇒ 17 : 11 (⑥)

⇒ 48 : 30 } 3 → 3

⇒ 51 : 33 } 78 → ? 78

జ: 3

10. మూడు సమాన పరిమాణం ఉన్న పాత్రల్లో పాలు, నీళ్ల నిష్పత్తి 1 : 2, 3 : 2, 2 : 1. ఈ మూడు పాత్రలను కలిపేస్తే మిశ్రమంలో పాలు, నీళ్ల నిష్పత్తి?



1) 8 : 7 2) 7 : 8 3) 4 : 5 4) 5 : 4

వివరణ: A పాత్ర (3 భాగాలు)

= (1 : 2) × 5 ⇒ 5 : 10

B పాత్ర (5 భాగాలు)

= (3 : 2) × 3 ⇒ 9 : 6

C పాత్ర (3 భాగాలు)

= (2 : 1) × 5 ⇒ 10 : 5

24 : 21
8 : 7

జ: 1

ప్రాక్టీస్ ప్రశ్నలు

1. $7\frac{1}{5}, 4\frac{1}{5}, 3\frac{6}{7}$ ల అనుపాత చతుర్థ పదం K అయితే $\frac{4K + 1}{4K - 1}$ = ?

1) $\frac{4}{5}$ 2) $\frac{6}{5}$ 3) $\frac{7}{5}$ 4) $\frac{5}{4}$

2. రెండు సంఖ్యలు 5 : 4 నిష్పత్తిలో ఉన్నాయి. 120 మొదటి సంఖ్యలో 40% అయితే రెండో సంఖ్యలో 60% కి సమానమైంది?

1) 124 2) 134 3) 144 4) 156

3. ఒక బాలుడు అతడి నలుగురు మిత్రులకు $\frac{1}{3} : \frac{1}{4} : \frac{1}{5} : \frac{1}{6}$ నిష్పత్తిలో చాక్లెట్లు పంచాడు. ఈ విభజన చేయడానికి ఆ బాలుడి వద్ద ఉండాల్సిన చాక్లెట్ల కనీస సంఖ్య?

1) 60 2) 114
3) 57 4) 54

సమాధానాలు: 1-4; 2-3; 3-3.



రచయిత: పిరాది నరేష్


ఆ గ్రహాల మధ్యలోనే ఆస్టరాయిడ్లు!

అనంత అంతరిక్షంలో కోట్లాది నక్షత్రాలు, గెలాక్సీలు, కృష్ణబిలాలతోపాటు అనేక రకాల ఖగోళ వస్తువులూ ఉంటాయి. ఆది, అంతం లేని ఆ విశ్వం నిరంతరం విస్తరిస్తూనే ఉంటుంది. అందులో పాలపుంత అనే గెలాక్సీలో చిన్న విభాగం సౌర కుటుంబం. దానిలో భాగమైన భూమి గురించి అర్థం చేసుకోవాలంటే విశ్వం వివరాలు తెలియాలి. గ్రహాలు, ఉపగ్రహాలు, తోకచుక్కలపై అవగాహన పెంచుకోవాలి. సౌర మండల వ్యవస్థ, బిగ్‌బ్యాంగ్ సిద్ధాంతం, గ్రహగమనాలు, వాటి ప్రత్యేకతలను అధ్యయనం చేయాలి. ఈ పరిజ్ఞానం భూమిపై జీవం పుట్టుకకు మూల కారణాలను అవగతం చేసుకోడానికీ సాయపడుతుంది.



మన విశ్వం

1. జియోగ్రఫీ అనే పదాన్ని మొదట ఉపయోగించిన శాస్త్రవేత్త?


ఏరాటోస్తనీస్

1) ఏరాటోస్తనీస్
2) లాప్లేస్
3) మౌల్టన్, చాంబర్లీన్ 4) రాస్‌గన్

2. విశ్వ అధ్యయన శాస్త్రాన్ని ఏమని పిలుస్తారు?
1) కాస్మాలజీ 2) ఆస్ట్రానమీ
3) ఆస్ట్రాలజీ 4) ఏదీకాదు

3. అత్యధిక సాంద్రత గల గ్రహం ఏది?
1) శుక్రుడు 2) భూమి
3) శని 4) అంగారకుడు

4. మన సౌర కుటుంబంలో భూమికి దగ్గరగా ఉన్న నక్షత్రం?
1) ప్రాక్సిమా సెంచురీ 2) సూర్యుడు
3) ఎప్సిలాన్ అరిగ 4) సిరియాస్


5. సౌర వ్యవస్థలో గ్రహాల పరిమాణంలో భూమి స్థానం?



1) 3
2) 6
3) 5 4) 4

6. భ్రమణం కంటే పరిభ్రమణం తక్కువగా ఉండే గ్రహం?
1) బుధుడు 2) అంగారకుడు
3) శుక్రుడు 4) వరుణుడు

7. నికోలస్ కోపర్నికస్ 16వ శతాబ్దానికి చెందిన ఏ శాస్త్రజ్ఞుడు?



1) ఖగోళ శాస్త్రజ్ఞుడు
2) గణిత శాస్త్రజ్ఞుడు
3) నౌకా శాస్త్రజ్ఞుడు
4) తత్వ శాస్త్రజ్ఞుడు

8. సౌరమండల వ్యవస్థలో భూమి ఒక ....
1) గ్రహం 2) ఉపగ్రహం 3) నక్షత్రం 4) లఘుగ్రహం

9. ఐసోహెల్స్ దేని సమాన రేఖలు?
1) సూర్యుడి ఎండ 2) వాన
3) పుష్పించే కాలం 4) మేఘాలు

10. భూమి సాంద్రత ఎంత?
1) 5.10 gc 2) 5.30 g/cc
3) 5.52 g/cc 4) 3.94 g/cc

11. బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం దేని గురించి చెప్పింది?



1) విశ్వం - ఎలా ఏర్పడింది
2) నక్షత్రాలు
3) తోకచుక్కలు
4) గ్రహణాలు

12. సూర్యుడి లోపల మండుతున్న ఇంధనం?
1) బొగ్గు 2) యురేనియం
3) ఆమ్లజని 4) ఉదజని

13. ఆకాశంలో నీలిరంగుకు కారణం?
1) కాంతి పరావర్తనం 2) కాంతి వక్రీభవనం
3) కాంతి వివర్తనం 4) కాంతి పరిక్షేపణం

14. సూర్యుడిలో శక్తికి మూలాధారం?



1) స్ప్లాలేషన్
2) రేడియోధార్మిక విచ్ఛిన్నం
3) న్యూక్లియర్ విచ్ఛిత్తి
4) న్యూక్లియర్ సంలీనం

15. సూర్యుడిలో తక్కువ ఉష్ణోగ్రత, తక్కువ కాంతి కలిగిన ప్రాంతాలను ఏమంటారు?
1) సన్‌స్పాట్స్ 2) ప్లాజర్స్
3) సూర్యాంకాలు 4) కరోనా

16. 'జియోగ్రఫీ' అనే పదం ఏ భాషాపదం?
1) లాటిన్ 2) ఫ్రెంచ్
3) గ్రీకు 4) అరబిక్

17. భూమి సూర్యుడికి ఎన్ని మైళ్ల దూరంలో ఉంది?
1) 8 కోట్లు 2) 9 కోట్ల 30 వేలు
3) 10 కోట్లు 4) 10 కోట్ల 30 వేలు

18. సూర్యుడి నుంచి దూరాన్ని బట్టి చూస్తే భూమి క్రమ సంఖ్య ఏది?
1) 2 2) 4 3) 5 4) 3

19. ప్రకాశించే శక్తితోపాటు ఉష్ణశక్తిని ఇచ్చే స్వభావం ఉండేవి?




1) నక్షత్రాలు
2) గ్రహాలు
3) ఉపగ్రహాలు
4) లఘుగ్రహాలు

20. అక్షాంశ రేఖాంశాల ఉపయోగాలను గురించి తెలిపే శాస్త్రం?
1) ప్రాంతీయ భూగోళశాస్త్రం
2) రాజకీయ భూగోళశాస్త్రం
3) ఆర్థిక భూగోళశాస్త్రం
4) గణిత భూగోళశాస్త్రం

వరల్డ్ జాగ్రఫీ

21. తూర్పు నుంచి పడమరకు, భూమికి వ్యతిరేకంగా తిరిగే గ్రహాలు?
1) శుక్రుడు, వరుణుడు 2) శుక్రుడు, బుధుడు
3) శుక్రుడు, బృహస్పతి 4) ఏదీకాదు

22. "God of Heaven" అని ఏ గ్రహాన్ని పిలుస్తారు?



1) ఇంద్రుడు
2) గురుడు
3) శుక్రుడు 4) వరుణుడు

23. చుట్టూ వలయాలు కలిగి ఉన్న గ్రహాలు?
1) శని, యురేనస్ 2) బుధుడు, శుక్రుడు
3) అంగారకుడు, బృహస్పతి
4) పైవన్నీ

24. అత్యంత తక్కువ కాలంలో తన చుట్టూ తాను తిరిగే గ్రహం?
1) భూమి 2) బృహస్పతి
3) శుక్రుడు 4) యురేనస్

25. సౌరకుటుంబంలో పరిమాణం రీత్యా గ్రహాల ఆరోహణ క్రమం?
1) బుధుడు, నెప్ట్యూన్, శుక్రుడు, అంగారకుడు
2) శని, నెప్ట్యూన్, యురేనస్, భూమి
3) నెప్ట్యూన్, బుధుడు, భూమి, అంగారకుడు
4) నెప్ట్యూన్, బుధుడు, అంగారకుడు, భూమి

26. సూర్యుడిలో అతి కాంతివంతమైన పొర (లు)?
1) క్రోమోస్ఫియర్ 2) ఫోటోస్ఫియర్
3) కరోనా 4) 2, 3

27. సూర్యుడిలో ప్రధాన వాయువు అయిన హైడ్రోజన్ వాటా ఎంత?
1) 55% 2) 25% 3) 71% 4) 90%

28. చంద్రకాంతి భూమిని చేరేందుకు పట్టేకాలం ఎంత?



1) 8 నిమిషాలు
2) 1.3 సెకన్లు 3) 8 సెకన్లు
4) 1.4 నిమిషాలు

29. సూర్యుడి కాంతి భూమిని చేరడానికి పట్టేకాలం ఎంత?
1) 8 నిమిషాలు 2) 1.3 సెకన్లు
3) 8 సెకన్లు 4) 9 నిమిషాలు

30. ఆస్టరాయిడ్లు ఏ గ్రహాల మధ్య ఉంటాయి?
1) కుజుడు, బృహస్పతి గ్రహాల మధ్య
2) బృహస్పతి, శని గ్రహాల మధ్య
3) అంగారకుడు, భూమి గ్రహాల మధ్య
4) శని, యురేనస్ గ్రహాల మధ్య

31. హేలీ తోకచుక్క 1986లో కనబడింది. ఇది తిరిగి మనకు ఏ సంవత్సరంలో కనిపించే అవకాశం ఉంది?



1) 2003
2) 2010
3) 2062 4) 2072

32. కిందివాటిలో సరికాని జత?
1) 'రెడ్' ప్లానెట్ - అంగారకుడు
2) 'రింగ్‌డ్' ప్లానెట్ - వరుణుడు
3) 'బ్లూ' ప్లానెట్ - భూమి
4) అతిపెద్ద ప్లానెట్ - గురుడు

33. ఉపగ్రహం లేని గ్రహాలు ఏవి?
1) శుక్రుడు, బుధుడు 2) ప్లూటో, భూమి
3) శుక్రుడు, యురేనస్ 4) బుధుడు, నెప్ట్యూన్

34. కిందివాటిని జతపరచండి.

పరికల్పనలు	పరికల్పన కర్త
ఎ) ద్వినక్షత్ర పరికల్పన సిద్ధాంతం	1) జార్జ్ లైమిత్రి
బి) బిగ్‌బ్యాంగ్ సిద్ధాంతం	2) లిటన్‌టన్
సి) నిహారిక పరికల్పన సిద్ధాంతం	3) టి.సి.చాంబర్లీన్
డి) గ్రహాల పరికల్పన సిద్ధాంతం	4) లాప్లేస్


1) ఎ-2, బి-1, సి-3, డి-4
2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-3, బి-2, సి-1, డి-4
4) ఎ-2, బి-1, సి-4, డి-3

35. కిందివాటిని జతపరచండి.

జాబితా-1	జాబితా-2
ఎ) వ్యవసాయానికి దేవత	1) యముడు
బి) మరణానికి దేవత	2) వరుణుడు
సి) స్వర్గానికి దేవత	3) శని
డి) సముద్రానికి దేవత	4) ఇంద్రుడు

1) ఎ-3, బి-1, సి-2, డి-4
2) ఎ-3, బి-1, సి-4, డి-2
3) ఎ-2, బి-4, సి-1, డి-3
4) ఎ-2, బి-4, సి-3, డి-1

36. ఉర్సామేజర్, ఉర్సామైనర్ అనేవి?



1) గ్రహశకలాలు 2) ఉల్కలు
3) నక్షత్ర మండలాలు 4) పాలపుంత

37. శిలా నిర్మితాలతో కూడి అత్యధిక సాంద్రత ఉన్న గ్రహాలను ఏమని పిలుస్తారు?
1) భౌమ 2) ప్రపంచ
3) జోలియస్ 4) బాహ్య

38. హైడ్రోజన్ సంబంధిత వాయువులు ద్రవీభవనం చెందగా ఏర్పడే గ్రహాలను ఏ విధంగా పిలుస్తారు?
1) ప్రపంచ 2) టెరస్ట్రియల్
3) జోలియస్ 4) నిమ్నత

39. కాంతి సంవత్సరం దేన్ని సూచిస్తుంది?
1) కాంతి తరంగదైర్ఘ్యం 2) కాంతి పొడవు
3) దూరం 4) కాలానికి ప్రమాణం

40. రోదసీ యాత్రికుడికి బయట ఉన్న రోదసి ఎలా కనిపిస్తుంది?
1) శ్వేతవర్ణం
2) నల్లగా
3) ముదురునీలం రంగు
4) ముదురు ఎరుపు రంగు




రచయిత: సక్కరి జయకర్

సమాధానాలు

1-1, 2-1, 3-2, 4-2, 5-3, 6-3, 7-1, 8-1, 9-1, 10-3, 11-1, 12-4, 13-4, 14-4, 15-1, 16-3, 17-2, 18-4, 19-1, 20-4, 21-1, 22-4, 23-1, 24-2, 25-2, 26-2, 27-3, 28-2, 29-1, 30-1, 31-3, 32-2, 33-1, 34-4, 35-2, 36-3, 37-1, 38-3, 39-3, 40-2.

విశ్లేషణాత్మక తర్కం - పరిమాణాత్మక పోలికలు

పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగం నుంచి విశ్లేషణాత్మక తర్కంలో పరిమాణాత్మక పోలికలు అనే అంశం నుంచి ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ఇందులో రెండు పరిమాణాలను ఇస్తారు. కొన్నిసార్లు ఈ పరిమాణాల మధ్యలో కేంద్రీకరించిన ఉమ్మడి సమాచారం ఉంటుంది. అభ్యర్థి ఆ రెండు పరిమాణాల మధ్య ఉన్న పోలిక ఏంటి అనేది కనుక్కోవాల్సి ఉంటుంది. ఈ రకమైన ప్రశ్నల సాధనకు కొన్నిసార్లు ప్రాథమిక గణిత ప్రక్రియలు ఉపయోగించాల్సి వస్తుంది. పరీక్షలో మంచి మార్కులకు నిరంతర సాధనే తొలిమెట్టు.



నిరంతర సాధనే మార్కులకు సోపానం

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్

మాదిరి ప్రశ్నలు

సూచన (ప్ర. 1 – 10): దిగువ ప్రశ్నలకు మీ సమాధానం..

A లోని పరిమాణం, B లోని పరిమాణం కంటే ఎక్కువగా ఉంటే 1 అని
B లోని పరిమాణం, A లోని పరిమాణం కంటే ఎక్కువగా ఉంటే 2 అని
A, B లోని పరిమాణాలు సమానమైతే 3 అని
సమాధానం నిర్ణయించడానికి తగిన సమాచారం లేకపోతే 4 అని
A లోని పరిమాణం, B లోని పరిమాణం కంటే ఎక్కువగా లేదా సమానం అయితే 5 అని ఎంచుకోండి.

1.

నిలువు వరుస A	నిలువు వరుస B
105% of 200	50% of 400

సాధన: నిలువు వరుస A నుంచి

$\Rightarrow$ 200 లో 105% $= 200\left(\frac{105}{100}\right) = 2(105) = 210$

నిలువు వరుస B నుంచి

$\Rightarrow$ 400 లో 50% $= 400\left(\frac{50}{100}\right) = 4(50) = 200$

కాబట్టి $A > B$

సమాధానం: 1

2.

నిలువు వరుస A		నిలువు వరుస B
2a	a > b > c	b + c

సాధన: $a > b > c \Rightarrow b < a, c < a \Rightarrow b + c < a + a$

$\Rightarrow b + c < 2a \Rightarrow B < A \Rightarrow A > B$

సమాధానం: 1

3.

నిలువు వరుస A	నిలువు వరుస B
35%	$\frac{0.7}{2}$

సాధన: నిలువు వరుస A నుంచి $35\% = \frac{35}{100} = \frac{7}{20}$

$= \frac{7}{2 \times 10} = \frac{\frac{7}{10}}{2} = \frac{0.7}{2}$

కాబట్టి A = B

సమాధానం: 3

4.

నిలువు వరుస A	నిలువు వరుస B
$\frac{999999}{99}$	111

సాధన: నిలువు వరుస A నుంచి

$\frac{999999}{99} = \frac{111111}{11} = 10{,}101$

$10101 > 111 \Rightarrow A > B$

సమాధానం: 1

5.

నిలువు వరుస A	నిలువు వరుస B
భుజం పొడవు 5 సెం.మీ. గల చతురస్రం చుట్టుకొలత	4 సెం.మీ. భుజం గల క్రమ పంచభుజి చుట్టుకొలత

సాధన: నిలువు వరుస A నుంచి భుజం పొడవు 5 సెం.మీ. గల చతురస్రం చుట్టుకొలత = 4 × భుజం పొడవు

= 4 × 5 = 20 సెం.మీ.

నిలువు వరుస B నుంచి భుజం 4 సెం.మీ. గల క్రమ పంచభుజి చుట్టుకొలత = 5 × భుజం పొడవు

= 5 × 4 = 20 సెం.మీ.

కాబట్టి A = B

సమాధానం: 3

6.

నిలువు వరుస A		నిలువు వరుస B
$(m + n)^2$	m > 0, n > 0	$m^2 + n^2$

సాధన: నిలువు వరుస A నుంచి

$(m + n)^2 = (m + n)(m + n)$

$= (m)(m) + (m)(n) + (n)(m) + (n)(n)$

$= m^2 + mn + nm + n^2$

$= m^2 + mn + mn + n^2$

$= m^2 + 2mn + n^2 > m^2 + n^2 \quad (m > 0, n > 0)$

కాబట్టి A > B.

సమాధానం: 1

7.

నిలువు వరుస A		నిలువు వరుస B
x	$\frac{1}{x} > 1$	1

సాధన: $\frac{1}{x} > 1 \Rightarrow = \frac{1}{\frac{1}{x}} < 1 \Rightarrow x < 1$

కాబట్టి A < B.

సమాధానం: 2

8.

నిలువు వరుస A		నిలువు వరుస B
$2y^2$	$y^2 = 49$	7

సాధన: $y^2 = 49 \Rightarrow y = 7$ లేదా $y = -7$

$2y^2 = 2(\pm 7)^2 = 2(49) = 98 \Rightarrow 2y^2 = 98$

$98 > 7 \Rightarrow 2y^2 > 7 \Rightarrow A > B$

సమాధానం: 1

9.

నిలువు వరుస A	నిలువు వరుస B
$\frac{2}{\sqrt{6}}$	$\frac{\sqrt{6}}{3}$

సాధన: నిలువు వరుస A నుంచి

$\frac{2}{\sqrt{6}} = \frac{2}{\sqrt{6}}\left(\frac{\sqrt{6}}{\sqrt{6}}\right) = 2\left(\frac{\sqrt{6}}{6}\right) = \frac{\sqrt{6}}{3} \Rightarrow A = B$

సమాధానం: 3

10.

నిలువు వరుస A	నిలువు వరుస B
m^{10}	m^{20}

సాధన: m సహజ సంఖ్య అయితే $m^{20} > m^{10}$

$0 < m < 1$ అయితే $m^{20} < m^{10}$

$-1 < m < 0$ అయితే $m^{20} < m^{10}$

$m < -1$ అయితే $m^{10} < m^{20}$

A, Bల మధ్య సంబంధం mపై ఆధారపడి ఉంటుంది.

ఇచ్చిన సమాచారం ఆధారంగా సమాధానం కనుక్కోలేం.

సమాధానం: 4



రచయిత
రాజేశ్ మధు,
విషయ నిపుణులు

Word of the Day

828 ***Specious***

Telugu meaning: మోసపూరిత, వంచన

English meaning: The word specious (స్పీషస్) is an adjective that describes something that appears true or valid but is actually false or misleading.


Synonyms: Misleading, Deceptive

Antonyms: Genuine, Authentic

Usage: **1.** The lawyer's argument seemed convincing at first but was ultimately specious and weak.

2. He gave a specious excuse to cover up his lack of preparation.

కరెంట్ అఫైర్స్



ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ (64 ఏళ్లు) 2025, నవంబరు 10న హైదరాబాద్‌లో మరణించారు. అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో... ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో ఉన్న మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో 1961 జులై 18న జన్మించారు.

✦ తాను రాసిన పాటలన్నీ కలిపి 'పాటల పూదోట'గా పుస్తకం రూపంలో వచ్చాక 'అందెశ్రీ' పేరు మారుమోగింది. ఆ తర్వాత 1995లో 'అందెల సందడి' పుస్తకాన్ని హైదరాబాద్ సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవరాయ భాషాంధ్ర నిలయంలో జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డా.సి.నారాయణరెడ్డి ఆవిష్కరించారు.

✦ ఈయన రాసిన 'జయ జయహే తెలంగాణ... జననీ జయ కేతనం...' పాట తెలంగాణకు అధికారిక గీతంగా ఉంది.



భారత ప్రభుత్వం అందించిన లైన్ ఆఫ్ క్రెడిట్ సహకారంతో మాల్దీవుల్లో హనిమాధూ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించారు. దాన్ని ఆ దేశ అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు, భారత పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సంయుక్తంగా ప్రారంభించారు.



ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సామ్రాట్ రాణా స్వర్ణం నెగ్గాడు. 2025, నవంబరు 10న కైరోలో జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో సామ్రాట్ 243.7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. హు కయ్ (చైనా, 243.3) రజతం, భారత షూటర్ వరుణ్ తోమర్ (221.7) కాంస్యం నెగ్గారు.

దిల్లీలోని హెచ్‌సీఎంసీటీ మణిపాల్ హాస్పిటల్ వైద్యులు మరణించిన మహిళ శరీరంలో ఆగిపోయిన రక్తప్రసరణను తిరిగి ప్రారంభించారు. ఆమె అవయవాలను దానం చేసేందుకు వీలుగా దీన్ని చేపట్టినట్లు వారు వెల్లడించారు. ఈ ప్రక్రియ చేపట్టడం ఆసియాలో ఇదే మొదటిసారి.


ఎఫ్ఐహెచ్ మహిళల జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో పాల్గొనే భారత జట్టుకు జ్యోతి సింగ్ సారథ్యం వహించనుంది. నవంబరు 25 నుంచి డిసెంబరు 13 వరకు చిలీలోని శాంటియాగోలో జరగనున్న టోర్నీ కోసం 20 మంది క్రీడాకారులతో భారత జట్టును 2025, నవంబరు 10న ప్రకటించారు. తుషార్ ఖండ్కర్ చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

సలీం అలీ

శాస్త్రవేత్తలు విశేషాలు

ఈయన భారతదేశానికి చెందిన ప్రముఖ పక్షి శాస్త్రవేత్త (ఆర్నిథాలజిస్ట్). సలీంను 'బర్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పిలుస్తారు. భారతదేశమంతటా వివిధ రకాల పక్షుల గురించి క్రమబద్ధంగా సర్వేలు నిర్వహించిన మొదటి వ్యక్తిగా ఈయన పేరొందారు. ప్రకృతి వనరుల అభివృద్ధి, జీవవైవిధ్య సంరక్షణకు ఎంతగానో పాటుపడ్డారు. నవంబరు 12న సలీం జయంతి సందర్భంగా పోటీపరీక్షల నేపథ్యంలో ఆయన జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!



బాల్యం – వృత్తి జీవితం

సలీం అలీ 1896, నవంబరు 12న బొంబాయిలోని ఖేత్వాడిలో జన్మించారు.

- తల్లిదండ్రులు మరణించడంతో మేనమామ అమీరుద్దీన్ తయాబ్జీ వద్ద పెరిగారు. బొంబాయిలోని జెనానా బైబిల్ అండ్ మెడికల్ మిషన్ గర్ల్స్ హైస్కూల్‌లో విద్యను అభ్యసించారు.
- అమీరుద్దీన్ ఆ కాలంలో తుపాకీతో వేటాడే క్రీడ ఆడేవారు. సలీంకు అది నచ్చడంతో ఆయన వద్ద దాన్ని నేర్చుకున్నారు. వేటకు సంబంధించిన పుస్తకాలు చదివేవారు.
- 1930లో వీవర్ పక్షి స్వభావం, లక్షణాలను వివరిస్తూ ఆయన ఒక పరిశోధనా పత్రాన్ని ప్రచురించారు. ఇది ఆయనకు పేరుప్రతిష్ఠలు తెచ్చిపెట్టింది.
- ఆయన తన పరిశోధనలు, సేకరించిన వివరాలతో అనేక పుస్తకాలు రచించారు.
- దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ సమతౌల్య కార్యక్రమాల అమలులో ప్రభుత్వానికి సూచనలు చేశారు.

అవార్డులు – గౌరవాలు

ఆసియాటిక్ సొసైటీ నుంచి 1953లో జాయ్ గోవింద లా గోల్డ్ మెడల్ పొందారు.

✦ అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం (1958), దిల్లీ విశ్వవిద్యాలయం (1973), ఆంధ్ర విశ్వవిద్యాలయం (1978) నుంచి గౌరవ డాక్టరేట్లు పొందారు.

✦ 1969లో ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నేచురల్ రిసోర్సెస్ అందించే జాన్ సి ఫిలిప్స్ స్మారక బహుమతి అందుకున్నారు.

✦ 1976లో జె.పాల్ గెట్టి వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ బహుమతి అందుకున్నారు.


చివరగా

భారతదేశంలో పక్షుల అధ్యయనాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో సలీం ఎంతగానో కృషి చేశారు. పక్షులపై ఆయన చేసిన పరిశోధనలు నేటికీ ఎంతో మందికి మార్గదర్శకంగా, స్ఫూర్తిమంతంగా నిలుస్తాయి. ఆయన జీవితంలో దాదాపు 60ఏళ్లు పూర్తిగా పక్షుల గురించిన పరిశోధనల్లోనే గడిపారు.

సలీం అలీ రాసిన పుస్తకాలు, ఇతర జీవిత విశేషాల గురించి తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్‌స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

గ్రామీణాభివృద్ధి



భారతదేశంలో అనేక గ్రామాలు ఉన్నాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, 2025 నాటికి మన దేశంలో 6.65 లక్షల గ్రామాలు ఉన్నట్లు అంచనా. ఇవి అభివృద్ధి చెందితేనే దేశం ఆర్థికంగా బలపడుతుంది. ఈ కారణంగానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి గ్రామీణాభివృద్ధి కోసం అనేక ప్రయత్నాలు, కార్యక్రమాలు జరిగాయి. అవి నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామీణాభివృద్ధి అనేది వృద్ధికి సంబంధించిన సమగ్ర భావన. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న వివిధ ఏజెన్సీలు, సంస్థలు (పథకాలు), కార్యక్రమాలపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.

గ్రామీణాభివృద్ధి అంటే గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల జీవన పరిస్థితులను, ఆర్థిక శ్రేయస్సును మెరుగుపరచడం. పట్టణాల కంటే ఈ ప్రాంతాల్లో అక్షరాస్యత తక్కువగా ఉండటంతో పేదరికం, నిరుద్యోగం, జనాభా పెరుగుదల, ఆర్థిక అసమానతలు, పౌష్టికాహార లోపం, విద్యా - వైద్య సదుపాయాల కొరత లాంటి సమస్యలు ఎక్కువ. వీటన్నింటినీ అధిగమించి గ్రామీణ ప్రజలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు, వివిధ సంస్థలు అనేక పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి.

గ్రామీణాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన - బల్వంతరాయ్ మెహతా కమిటీ, అశోక్ మెహతా కమిటీ, దంత్‌వాలా కమిటీ, సీహెచ్ హనుమంతరావు కమిటీ, జీవీకే రావు కమిటీ, ఎల్ఎం సింఘ్వీ కమిటీ, పీకే తుంగన్ కమిటీ - సిఫార్సులు సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Assistant Manager (Grade 'A') Jobs

The National Bank for Agriculture and Rural Development (NABARD) has released its official notification for the recruitment of Assistant Manager posts in Grade 'A' across the Rural Development Banking Service (RDBS), Legal Service, and Protocol & Security Service. The total no. of posts is 91. The application fee is Rs.850. Eligible candidates can apply online before 30 November 2025.

Professional Posts

Ordnance Factory Medak (OFMK), a Unit Of Armed Vehicle Nigam Limited, Eddumailaram, Sangareddy, Hyderabad, invites applications for the various posts on a contract basis. The total no. of posts is 17. The last date for offline applications is 28 November 2025.

Sports Quota Posts

The Railway Recruitment Cell (RRC), South Central Railway (SCR) has released the official Sports Quota Notification for 2025-26. The total no. of posts is 61. The examination fee is Rs. 500. Eligible candidates can apply online before November 24, 2025.

Did You Apply..?

Today (November 12) is the last date for the following Jobs.

☛ 600 Senior Technical Assistant posts in RITES Limited. ***Eligibility:*** B.Sc., Diploma (Engineering).

☛ Manager Posts in Railway Vikas Nigam Limited. ***Eligibility:*** Diploma/ Degree.

For more information and other notifications - scan QR code

Bank Exams

English

Antonyms

Directions (Qs. 1 - 10): *In each of the questions given below, a sentence is given with one word printed in bold letters, along with five options to choose from. Choose the appropriate antonym from those options that suits the word given in bold letters.*

1. The speaker's tone during the interview was extremely **cordial**, setting everyone at ease.
A) Friendly B) Warm
C) Hostile D) Pleasant
E) Courteous

2. The director was appalled by the actor's **inept** performance on stage.
A) Skilled B) Awkward
C) Untrained D) Poor
E) Incompetent

3. The event was organized in a very **sporadic** manner, causing confusion among attendees.
A) Irregular B) Disorderly
C) Occasional D) Uneven
E) Continuous

4. Her face lit up with genuine **delight** upon hearing the news.
A) Joy B) Sadness
C) Pleasure D) Excitement
E) Happiness

5. They found the old manuscript in **pristine** condition at the library.
A) Pure B) Clean
C) Unsullied D) Damaged
E) Unspoiled

6. His constant **boasting** made him unpopular among his peers.
A) Bragging B) Modesty
C) Pride D) Arrogance
E) Self-praise

7. The weather remained **stable** throughout the week, much to the delight of tourists.
A) Unchanging B) Calm
C) Variable D) Steady
E) Constant

8. After losing the match, the player was **inconsolable** for hours.
A) Calm B) Upset
C) Sorrowful D) Broken
E) Depressed

9. The patient felt **invigorated** after a long restful sleep.
A) Energized B) Refreshed
C) Lively D) Active
E) Exhausted

10. Her attire was remarkably **flamboyant** at the annual gala.
A) Gaudy B) Showy
C) Colourful D) Dull
E) Flashy

Directions (Qs. 11 - 21): *In each of the questions given below, a word is given in bold letters and five options are presented. Choose the appropriate antonym from those options that suits the word given in bold letters.*

11. **Assuage**
A) Calm B) Soothe
C) Pacify D) Aggravate
E) Ease

12. **Raucous**
A) Loud B) Harsh
C) Boisterous D) Noisy
E) Quiet

13. **Transient**
A) Passing B) Temporary
C) Permanent D) Brief
E) Fleeting

14. **Precipitate**
A) Hasty B) Deliberate C) Rash
D) Sudden E) Abrupt

15. **Inchoate**
A) Finished B) Incomplete
C) Developing D) Unformed
E) Rudimentary

16. **Invidious**
A) Offensive B) Unfair
C) Unjust D) Fair
E) Discriminatory

17. **Fractious**
A) Irritable B) Quarrelsome
C) Cooperative D) Difficult
E) Cantankerous

18. **Lambent**
A) Dark B) Glowing
C) Soft D) Flickering
E) Luminous

19. **Abstruse**
A) Complex B) Difficult
C) Obscure D) Profound
E) Simple

20. **Pellucid**
A) Clear B) Murky
C) Lucid D) Transparent
E) Obvious

21. **Restive**
A) Calm B) Fidgety
C) Uneasy
D) Restless
E) Agitated

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*

చావును దగ్గరి నుంచి చూశాం

- ఆర్తనాదాలు జీవితాంతం గుర్తుంటాయి
- ప్రత్యక్ష సాక్షుల వెల్లడి



ఈటీవీ భారత్: 'రోడ్ల మీద అనేక మంది పడిపోయారు. మరికొందరు రక్తపు మడుగులో ఉన్నారు. ఇంకొందరు ఎటూ కదల్లేకపోతున్నారు. మేము చావును దగ్గరి నుంచి చూశాం'.. ఇవీ ఎర్రకోట పేలుడులో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రి బెడ్ మీద ఉన్న చిరు వ్యాపారి రామ్ ప్రతాప్ మాటలు. ప్రాణాలతో బయటపడిన ఆయన.. సోమవారం నాటి పీడకలను గుర్తు చేసుకున్నారు. బిహార్‌కు చెందిన ఆయన ఎర్రకోట సమీపంలో చిరు వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు. దుకాణం మూసేందుకు సిద్ధమవుతున్న తరుణంలోనే పేలుడు జరిగిందని ఆయన వెల్లడించారు. 'ప్రతి రోజూలాగే వ్యాపారంలో నిమగ్నమయ్యాం. కొంత మంది కస్టమర్లు ఎదురుచూస్తున్నారు. అకస్మాత్తుగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఆ శబ్దంతో నాకు కొద్దిసేపటి వరకూ ఏమీ వినిపించలేదు. గాజు ముక్కలు ఎగిరి మాపై పడ్డాయి. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ ఆవహించింది. అనేక మంది రోడ్డు మీద పడిపోయారు. అక్కడ ఎటు చూసిన రక్తమే కనిపించింది. నా చేతి నుంచీ రక్తం కారింది. నా చేతికి గాయమైందన్న విషయం నాకు అప్పుడుగానీ తెలియలేదు. చావును దగ్గరి నుంచి చూశాం' అని రామ్ ప్రతాప్ వివరించారు.

'ఒక్కసారిగా భారీ మంటలు చెలరేగాయి. దట్టమైన పొగతో ఆ ప్రాంతమంతా నల్లగా మారిపోయింది. ఆ ఘటనతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాను. నా సోదరుడు ఎక్కడ ఉన్నాడో కనుక్కోలేకపోయాను. చాలామంది పేర్లు పెట్టి పిలుస్తున్నారు. కుటుంబ సభ్యుల కోసం వెతుకుతూ ఏడుస్తున్నారు. కొన్ని నిమిషాలపాటు ఎవరు బతికి ఉన్నారో తెలియలేదు' అని రామ్ ప్రతాప్ బంధువు వెల్లడించారు.

'నా ట్యాంకర్‌ను రోడ్డు పక్కన పార్క్ చేశా. పేలుడు జరిగిన ప్రదేశానికి దగ్గరగా వెళ్తున్నా. ఈ సమయంలోనే భారీ శబ్దాలతో పేలుడు సంభవించి నేలమీద పడ్డా. నేను లేచి చూసేసరికి నా చొక్కా మొత్తం రక్తంతో తడిసిపోయింది. రోడ్డు మీద మృత దేహాలు పడిపోయి ఉన్నాయి. నేలపై ఎక్కడ చూసినా మాంసపు ముద్దలు, గాజు ముక్కలు కనిపించాయి. ప్రజలు అటు ఇటూ పరిగెత్తుతూ ఆర్తనాదాలు చేశారు. ఇంకా చాలా మంది షాక్‌తో బిగుసుకుపోయారు. ఆ పేలుడు శబ్దం ఇప్పటికీ నా చెవుల్లో మార్మోగుతూనే ఉంది. నాకు ముగ్గురు కుమార్తెలున్నారు. వారిని మళ్లీ చూస్తానని అనుకోలేదు. ఇప్పటికీ నేను ఎలా బయటపడ్డానో తెలియదు. ఈ ఆర్తనాదాలు, భయాలు జీవితాంతం నాకు గుర్తుంటాయి' అని విజేందర్ యాదవ్ అనే ప్రత్యక్ష సాక్షి తెలిపారు.


దిల్లీ పేలుడు మృతులకు సుప్రీం కోర్టు నివాళి

దిల్లీ: ఎర్రకోటవద్ద బాంబు పేలుడులో మృతి చెందిన వారికి సుప్రీం కోర్టు నివాళులర్పించింది. చట్ట ప్రకారం బాధితులకు న్యాయం చేయడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేసింది. ఇటీవల మృతి చెందిన సీనియర్ న్యాయవాదులు శరత్ ఎస్ జవాలీ, జగదీశ్ చంద్ర గుప్తాలకు నివాళులర్పించేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలో మంగళవారం పూర్తి స్థాయి ధర్మాసనం సమావేశమైంది. ఈ సందర్భంగా దిల్లీ పేలుడు మృతుల అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'దిల్లీ కారు బాంబు పేలుడులో పలువురు ప్రాణాలు కోల్పోవడం మమ్మల్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. సుప్రీం కోర్టు, దేశంలోని మొత్తం న్యాయ వ్యవస్థ తరపున సంతాపం తెలుపుతున్నాం. తమ వారిని కోల్పోయిన వారికి సానుభూతి వ్యక్తం చేస్తున్నాం' అని సీజేఐ పేర్కొన్నారు. తమ ఆలోచనలు, ప్రార్థనలు చనిపోయిన, గాయపడిన వారి వెంటే ఉంటాయని తెలిపారు. 'ఈ నష్టానికి మాటలతో ఇచ్చే సాంత్వన చాలదు. ఈ విషాద సమయంలో దేశం ఒక్కటిగా నిలిచి ఐక్యతను చాటాల్సి ఉంది' అని పేర్కొన్నారు.

మనదంతా ఒకే దేశమని మరచిపోకూడదు

- విద్యార్థులపై దాడి ఘటన కేసులపై సుప్రీంకోర్టు

దిల్లీ: దేశ రాజధానిలో ఎర్ర కోట వద్ద ఇటీవల ఇద్దరు కేరళ విద్యార్థులను లుంగీ ధరించినందుకు స్థానికులు, పోలీసులు గేలి చేసి, హిందీ మాట్లాడాల్సిందిగా నిర్బంధించడంపై సుప్రీంకోర్టు మంగళవారం ఆవేదన వ్యక్తం చేసింది. మనమంతా ఒకే దేశానికి చెందినవారమని మరచిపోకూడదని



ఉద్ఘాటించింది. విద్యార్థులిద్దరూ దిల్లీ విశ్వవిద్యాలయానికి అనుబంధమైన జాకీర్ హుసేన్ దిల్లీ కళాశాలలో ప్రథమ సంవత్సర డిగ్రీ విద్యార్థులు. 2015లో దిల్లీలో ఈశాన్య భారత విద్యార్థులపై జరిగిన దాడులపై దాఖలైన పిటిషన్‌ను విచారిస్తూ సుప్రీంకోర్టు పైవిధంగా వ్యాఖ్యానించింది. నాటి దాడుల్లో అరుణాచల్ విద్యార్థి ఒకరు దిల్లీలో మరణించారు. ఇలాంటి జాతి దుర్విచక్షణ ఘటనలను నివారించడానికి ఒక నిఘా కమిటీని వేయాలని సుప్రీం గతంలోనే కేంద్రాన్ని ఆదేశించింది. సదరు కమిటీని నియమించామని అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్ మంగళవారం కోర్టుకు తెలిపారు. మూడు నెలలకు ఒకసారి సమావేశం కావాల్సిన ఈ నిఘా కమిటీ గడచిన తొమ్మిదేళ్లలో మొత్తం 14 సార్లే సమావేశమైందని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ఈశాన్య భారత విద్యార్థులపై దాడులు ఆగలేదన్నారు. అప్పుడు సుప్రీంకోర్టు దిల్లీలో కేరళ విద్యార్థులు లుంగీ ధరించలేదని ఎగతాళి చేసిన వ్యవహారం గురించి పత్రికల్లో చదివామని నటరాజ్‌కు తెలిపింది. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది.

బోట్స్‌వానా చేరుకున్న రాష్ట్రపతి ముర్ము

లువాండా (అంగోలా): రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, తన అధికారిక ఆఫ్రికా దేశాల పర్యటన ద్వితీయార్థంలో అంగోలా నుంచి బయలుదేరి మంగళవారం బోట్స్‌వానా చేరుకున్నారు. అంగోలాలో నాలుగు రోజుల పర్యటన చివరి రోజు ఆమె ఆ దేశ 50వ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్నారు. పునరుత్పాదక విద్యుత్తు, వన్యప్రాణి సంరక్షణ, నిర్వహణ, బయో ఇంధనాల రంగాల్లో భారత్‌తో సహకారానికి అంగోలా సంసిద్ధత వ్యక్తంచేసిందని రాష్ట్రపతి పర్యటన వివరాలు తెలియజేసిన విదేశాంగ కార్యదర్శి సుధాకర్ దలేలా తెలిపారు. అంగోలా సందర్శించిన మొదటి భారత దేశాధినేతగా రాష్ట్రపతి ముర్ము రికార్డుకెక్కారు.

పాక్ సీమాంతర ఉగ్రవాదంతో ఇబ్బంది పడుతున్నాం

- ఐరాస భద్రతా మండలిలో భారత్



పర్వతనేని హరీశ్

ఐరాస: సరిహద్దు మీదుగా అక్రమంగా రవాణా చేస్తున్న ఆయుధాలను ఉపయోగించి పాక్ నిర్వహిస్తున్న సీమాంతర ఉగ్రవాదంతో తాము తీవ్రంగా ఇబ్బందిపడుతున్నామని ఐక్యరాజ్యసమితిలో భారత్ పేర్కొంది. ఈ హింసకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. సోమవారం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో ఆయుధాలపై జరిగిన చర్చలో భాగంగా భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడారు. "భారత్ దశాబ్దాలుగా ఉగ్రవాద మహమ్మారిని ఎదుర్కొంటోంది. అందువల్ల వివిధ దేశాలకు, ఉగ్రవాద సంస్థలకు అక్రమంగా ఆయుధాలు సరఫరా చేయడం వల్ల కలిగే ప్రమాదాల గురించి తెలుసు' ' అని హరీశ్ పేర్కొన్నారు. దిల్లీలోని ఎర్రకోట ప్రాంతంలో భారీ పేలుడు సంభవించి 12 మంది మృతిచెందిన నేపథ్యంలో ఆయన ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. "మన సరిహద్దు మీదుగా అక్రమ ఆయుధాలను ఉపయోగించి జరుగుతున్న సీమాంతర ఉగ్రవాదంతో భారత్ నష్టపోయింది. ఇప్పుడు అది డ్రోన్ల ద్వారా కూడా కొనసాగుతోంది. ఈ సమూహాలు ఎవరి ఆర్థిక సాయం, మద్దతు లేకుండా తమను తాము నిలబెట్టుకోలేవని ఉగ్రవాదంలో పెరుగుతున్న సాంకేతికత మనకు గుర్తుచేస్తుంది" అని వివరించారు. సంఘర్షణ ప్రాంతాల్లోకి ఆయుధాల సరఫరాను నియంత్రించేందుకు మండలి ఆమోదించిన నిషేధాలు ఒక ముఖ్యమైన సాధనమని, వాటిని అన్ని దేశాలు అమలు చేయాలని హరీశ్ నొక్కి చెప్పారు.

దిల్లీ పేలుడుపై స్పష్టత ఇవ్వాలి

కాంగ్రెస్ డిమాండ్

దిల్లీ: ఎర్రకోటవద్ద కారు బాంబు పేలుడుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ డిమాండు చేసింది. దేశ రాజధానిలో ఇటువంటి ఘటన చోటుచేసుకోవడంతో ప్రజలంతా భయాందోళనలో ఉన్నారని పేర్కొంది. ఘటన జరిగి ఒక రోజు గడిచినా ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని, ఇది ఉగ్ర దాడా.. కాదా చెప్పాలని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధ్యక్షుడు పవన్ ఖేడా కోరారు. ఇటువంటి ఘటనలపై అందిన సమాచారం ఆధారంగా వివరాలు ఇవ్వడం సరికాదని, ఆధారాలతో కచ్చితమైన సమాచారం ఇవ్వాలని డిమాండు చేశారు. భద్రతా కారణాల రీత్యా సమాచారమంతా ఇవ్వలేమనే విషయం తమకు తెలుసని, కానీ అవసరమైనంత మేరకు ఇవ్వాలని కోరారు.

సమగ్ర విచారణ జరపండి: లెఫ్ట్ పార్టీలు

బాంబు పేలుడుపై సమగ్ర విచారణ జరపాలని, దోషులను కఠినంగా శిక్షించాలని లెఫ్ట్ పార్టీలు డిమాండు చేశాయి. ఈ ఘటనను ఖండించాయి. బాధితుల కుటుంబాలకు సానుభూతి తెలిపాయి. దిల్లీ పొరుగున ఉండే ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో పేలుడు పదార్థాలను సేకరించడం చూస్తుంటే ఇది వ్యవస్థీకృత నెట్‌వర్క్ కుట్రగా అనిపిస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో పేర్కొంది. దోషులను చట్టం ముందు నిలబెట్టే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది. ప్రజలు అప్రమత్తంగా, శాంతియుతంగా ఉండాలని పిలుపునిచ్చింది. బాంబు పేలుడు ఘటన తమను షాక్‌కు గురి చేసిందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పేర్కొన్నారు. ప్రభుత్వం.. సమగ్రంగా, పారదర్శకంగా, నిర్ణీత సమయంలో విచారణను పూర్తి చేయాలని సూచించారు.

దిల్లీలో మళ్లీ క్షీణించిన వాయు నాణ్యత

- కఠిన ఆంక్షల్లోకి దేశ రాజధాని

దిల్లీ: దేశరాజధాని దిల్లీలో వాయు నాణ్యత ప్రమాదకర స్థాయికి చేరింది. వాయు నాణ్యత తీవ్రస్థాయికి పడిపోవడంతో కాలుష్య కట్టడి కోసం తక్షణమే కఠిన నిబంధనలు అమలు చేయాలని 'ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ నిర్ణయించింది. ఈ క్రమంలోనే దిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోని గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్-3(జీఆర్‌ఏపీ-3) ఆంక్షలు విధించింది. స్థానికంగా వాయు నాణ్యత సూచి సోమవారం 362గా ఉండగా.. మంగళవారం ఉదయం 7 గంటలకు 425కి పెరిగింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక కాలుష్య స్థాయి అని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) వెల్లడించింది. ఈ నేపథ్యంలో దేశరాజధానిలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో ఐదో తరగతి వరకు ఆన్‌లైన్ విధానంలో విద్యార్థులకు పాఠాలను బోధించాలని దిల్లీ ప్రభుత్వం మంగళవారం డైరెక్టరేట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను ఆదేశించింది. దీనిపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ స్పందిస్తూ.. ఏడాదంతా కాలుష్య నివారణ చర్యలు కొనసాగితే.. జీఆర్‌ఏపీ అవసరం ఉండదని సూచించారు.

బిలియన్ డాలర్లు చెల్లించండి

- బీబీసీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ లేఖ



ఇంటర్నెట్ డెస్క్: అమెరికాలోని క్యాపిటల్ హిల్‌పై దాడి సందర్భంగా 2021లో తన ప్రసంగాన్ని తప్పుడు అర్థం వచ్చేలా మార్చినందుకు గానూ పరిహారంగా బిలియన్ డాలర్లు (సుమారు రూ. 8,800 కోట్లు) చెల్లించాలని బీబీసీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లేఖ రాశారు. సవరణ చేసిన డాక్యుమెంటరీని పూర్తిగా ఉపసంహరించుకోవాలని లేఖలో ట్రంప్ పేర్కొన్నట్లు ఆయన తరపు న్యాయవాది అలెజాండ్రో బ్రిటో తెలిపారు. ఈ వార్తలు ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా వైరల్‌గా మారాయని, ట్రంప్ పరువుకు భంగం కలిగించినందుకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందుకు శుక్రవారం వరకు గడువు ఇస్తున్నట్లు తెలిపారు. ట్రంప్ న్యాయ బృందం నుంచి వచ్చిన లేఖను సమీక్షిస్తున్నట్లు బీబీసీ పేర్కొంది. ఈ అంశంపై ఇప్పటికే బాధ్యత వహిస్తూ బీబీసీకి చెందిన ఉన్నతాధికారులు రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

రూ.317 కోట్ల భారీ సైబర్ మోసం..

- బెంగాల్‌లో పోలీసుల దాడులు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో రూ.317 కోట్ల భారీ ఆన్‌లైన్ రాకెట్ మోసాన్ని ఆ రాష్ట్ర సైబర్ పోలీసుల విభాగం ఛేదించింది. ఈ రాకెట్‌తో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలపై మంగళవారం పవన్ రుయా అనే వ్యాపారవేత్తతో పాటు ఆయన కుటుంబసభ్యులు, సన్నిహితులకు చెందిన పలు నివాసాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సైబర్ మోసంపై బెంగాల్ సహా దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి 1,379కి పైగా ఫిర్యాదులు వచ్చాయి. ఈ నెల 5న సుమోటోగా కేసు నమోదు చేసిన పోలీసులు... దర్యాప్తు చేపట్టడంతో భారీ ఆన్‌లైన్ మోసం గుట్టురట్టయ్యింది. సుమారు 148 నకిలీ కంపెనీలకు చెందిన బ్యాంకు ఖాతాల ద్వారా రూ.317 కోట్లు మళ్లించినట్లు దర్యాప్తులో తేల్చారు. ఈ మొత్తంలో నుంచి దాదాపు రూ.170 కోట్లను క్రిప్టో కరెన్సీలోకి మార్చేసినట్లు గుర్తించారు. ఈ కేసులో పవన్ రుయాతో పాటు ఆయన కుటుంబసభ్యులు, సన్నిహితులు, 11 మందికి సంబంధం ఉన్నట్లు ఆరోపణలు రావడంతో వారి పేర్లను ఎఫ్‌ఐఆర్‌లో చేర్చి తాజాగా వారి పరిసరాల్లో దాడులు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.



కూలిపోతున్న విమానం


నేలకూలిన తుర్కియే సైనిక విమానం

అంకారా: తుర్కియేకు చెందిన ఓ సైనిక రవాణా విమానం గాల్లోనే ప్రమాదానికి గురై.. గింగిరాలు కొడుతూ నేలకూలింది. అజర్‌బైజాన్ నుంచి తుర్కియే వెళ్తుండగా.. మార్గమధ్యంలో జార్జియా భూభాగంపై అది కూలిపోయింది. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. తుర్కియేకు చెందిన సీ-130 సైనిక రవాణా విమానం అజర్‌బైజాన్ నుంచి సిబ్బంది సహా 20 మందితో స్వదేశానికి బయల్దేరింది. మార్గమధ్యంలో.. జార్జియాలోని సిగ్నాఘి ప్రాంతంలో కూలిపోయింది. జార్జియా అంతర్గత వ్యవహారాల శాఖతో పాటు తుర్కియే రక్షణ శాఖ దీన్ని ధ్రువీకరించాయి. ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించాయి. కూలిన సమయంలో విమానంలో సిబ్బందితో సహా 20 మంది ప్రయాణిస్తున్నారు. వారి ఆచూకీ తెలియలేదు. ఇదిలాఉంటే.. ప్రమాదంలో కొందరు మరణించారని తుర్కియే అధ్యక్షుడు ఎర్దోగాన్ సూచనప్రాయంగా తెలియజేశారు.

సుప్రీంలో కొత్త న్యాయమూర్తులకు సన్మానం

దిల్లీ: ఇటీవల నియమితులైన సుప్రీం కోర్టు న్యాయమూర్తులకు అఖిల భారత సీనియర్ న్యాయవాదుల సంఘం మంగళవారం సన్మానం చేసింది. జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ విపుల్ మనూభాయ్ పంచోలీలను సీనియర్ న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి ఆదిశ్ సి అగర్వాల్ సన్మానించారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి, పార్లమెంటు సభ్యులు పి. విల్సన్, వివేక్ టంఖాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్.. మంగళవారం మాజీ అటార్నీ జనరల్ లాల్ నారాయణ్ సిన్హా, కేంద్ర న్యాయ శాఖ మాజీ మంత్రి శాంతి భూషణ్‌ల చిత్ర పటాలను అత్యున్నత న్యాయస్థానం ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ ఇద్దరు న్యాయ ప్రముఖుల్ని మన రాజ్యాంగ దర్పణాలని సీజేఐ కొనియాడారు. లాల్ నారాయణ్ సిన్హా, శాంతి భూషణ్‌లు కేవలం అత్యంత ప్రతిభావంతులైన న్యాయవాదులు మాత్రమే కాదు.. రాజ్యాంగం పట్ల పూర్తి నిబద్ధత కలిగిన పౌరులుగా జీవనం సాగించిన వారని పేర్కొన్నారు.

డయాబెటిక్ హార్ట్ రోగులకు ఆ ఔషధమే సరైంది..



- భారత వైద్యుడి అధ్యయనంలో వెల్లడి

న్యూ ఆర్లీన్స్: గుండె జబ్బులతో ఆసుపత్రులకు వచ్చే మధుమేహం బాధితులకు చికిత్స అందించే విధానంలో సమూల మార్పులకు కారణమయ్యే పరిశోధనను భారత్‌కు చెందిన వైద్యుడు విజయవంతంగా నిర్వహించారు. టక్సెడొ-2 పేరుతో నిర్వహించిన ఈ అధ్యయనం వివరాలను అమెరికన్ హార్ట్ అసోసియేషన్ (ఏహెచ్‌ఏ)కు ఇటీవల సమర్పించారు. ఆ వివరాల ప్రకారం.. ఎవరికైనా గుండెపోటు వచ్చినప్పుడు తీవ్రతను బట్టి వైద్యులు స్టంట్ లేదా యాంజియో ప్లాస్టీ నిర్వహిస్తారు. అయితే చికిత్స తర్వాత మధుమేహంతో బాధపడేవారికి ఆ స్టంట్‌లో రక్తం గడ్డ కట్టడం సహా అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. దీనికి పరిష్కారంగా ప్రపంచవ్యాప్తంగా టికాగ్రిలోర్, ప్రసూగ్రెల్ ఔషధాలను వినియోగిస్తున్నారు. ఈ రెండింటిల్లో ఏది అత్యుత్తమంగా పనిచేస్తుందనే అంశంపై వైద్య సమాజంలో స్పష్టత లేదు. గతంలో ఈ కోణంలో పరిశోధనలు జరిగినా వైరుధ్యమైన ఫలితాలు వెలువడ్డాయి. దీనిని పరిష్కరించేందుకు దిల్లీలోని బాత్రా ఆసుపత్రికి చెందిన కార్డియాలజీ విభాగం ఛైర్మన్ డా. ఉపేంద్ర కౌల్ సమగ్రమైన సర్వే నిర్వహించారు. భారత్‌లోని 66 ఆసుపత్రుల నుంచి 1,800 మంది గుండె శస్త్రచికిత్స చేయించుకున్న వారి వివరాలను నేరుగా సేకరించారు. వారంతా మధుమేహంతో బాధపడుతున్నవారే. వారి ఆరోగ్యస్థితులను విశ్లేషించిన అనంతరం ప్రసూగ్రెల్ ఉత్తమ ఫలితాలను ఇస్తోందని తేల్చారు. ఈ అధ్యయనం తర్వాత పేషెంట్లకు ఏ ఔషధం ఇవ్వాలన్న అంశంలో వైరుధ్యాలు తగ్గుతాయని భావిస్తున్నట్లు కౌల్ తెలిపారు.

ఇజ్రాయెల్‌లో భారతీయ సంస్థానాధీశుని విగ్రహం

నెవాటిమ్(ఇజ్రాయెల్): రెండో ప్రపంచ యుద్ధంలో కొందరు పోలండ్‌కు చెందిన పిల్లల్ని, యూదు బాలల్ని రక్షించేందుకు విశేష కృషిచేసిన మహారాజా దిగ్విజయ్ సింగ్‌జీ రంజిత్‌సింహ్‌జీ విగ్రహాన్ని ఇక్కడి యూదు రైతుల సహకార సంఘమైన "మోషవ్"లో ఆవిష్కరించారు. మహారాజా రంజిత్‌సింహ్‌జీ గుజరాత్‌లో ప్రస్తుతం జామ్‌నగర్‌గా ప్రసిద్ధమైన నవనగర్ సంస్థానాధీశుడు. ప్రపంచ యుద్ధకాలంలో అత్యంత దయాగుణం కనబరిచిన ఆ సంస్థానాధీశుని విగ్రహం స్థాపించడం ద్వారా ఇండియన్ జ్యూయిష్ హెరిటేజ్ సెంటర్, కొచిని జ్యూయిష్ హెరిటేజ్ సెంటర్‌లు ఆయనను మరణానంతరం సత్కరించాయి. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో మహారాజా పోలండ్‌కు చెందిన దాదాపు వేయి మంది పిల్లల్ని, కొందరు యూదు బాలల్ని రక్షించి 1942లో వారి కోసం జామ్‌నగర్ ప్రాంతంలోని బాలాచడి గ్రామం వద్ద ఒక గృహాన్ని కూడా నిర్మించారు. ఆయన విగ్రహాన్ని స్థాపించే కార్యక్రమంలో ఇజ్రాయెల్‌లో భారత రాయబారి జేపీ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జామ్‌నగర్ సంస్థానాధీశుని దయాగుణాన్ని ప్రస్తుతించారు.

అండర్‌పాస్ ప్రమాదాల కట్టడికి

ఆటోడ్రైవర్ కుమార్తె ఆవిష్కరణ



ఈటీవీ భారత్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌కు చెందిన ఆటోడ్రైవరు కుమార్తె తపస్య ఆవిష్కరించిన వినూత్న సాంకేతిక నమూనాతో ఆమెకు భోపాల్‌లో జరగనున్న జాతీయ విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొనే అవకాశం లభించింది. స్థానిక సనాతన్ ధర్మ పాఠశాలలో తపస్య 11వ తరగతి చదువుతోంది. వర్షాకాలంలో అండర్‌పాస్‌ల వద్ద ఉన్న పళంగా వచ్చే వరదలతో నీరు నిలిచిపోయి ప్రమాదాలకు దారితీసే ఘటనలను సునిశితంగా పరిశీలించిన ఈమె దీనికి ఓ పరిష్కారం కనిపెట్టాలని భావించింది. 'అండర్‌పాస్ వాటర్ లెవల్ ఇండికేటర్' పేరుతో తపస్య రూపొందించిన నమూనా రాష్ట్రస్థాయి పోటీల జడ్జీలను ఆకట్టుకొంది. ఫరీదాబాద్ వంటి నగరాల్లో గతంలో జరిగిన అండర్‌పాస్ ప్రమాదాలు తనను కదిలించాయని అంటున్న తపస్య నవంబరు 18 నుంచి 23 వరకు భోపాల్‌లో ఎన్‌సీఈఆర్టీ నిర్వహించే జాతీయ ప్రదర్శనకు సిద్ధమవుతోంది. "నా నమూనాలో అండర్‌పాస్ నీటినిల్వ స్థాయిని సూచించేలా ఆకుపచ్చ, పసుపు, ఎరుపు లైట్లు ఉంటాయి. ట్రాఫిక్ సిగ్నల్స్ మాదిరిగా వాహనదారులు వాటిని అనుసరించవచ్చు" అని ఆమె వివరించింది.

భారత్‌కు ప్రపంచ దేశాల సంఘీభావం

వాషింగ్టన్, బీజింగ్: దేశ రాజధాని దిల్లీలో జరిగిన పేలుడు ఘటనపై ప్రపంచ దేశాలు తీవ్ర విచారం వ్యక్తం చేశాయి. బ్రిటన్, ఇజ్రాయెల్, కెనడా సహా పలు దేశాలు.. దుర్ఘటనలో మృతి చెందినవారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని ప్రకటించాయి. కష్టకాలంలో భారత్‌కు అండగా ఉంటామని హామీ ఇచ్చాయి.

'ఉరి'పై జనవరి 21న సుప్రీం విచారణ

దిల్లీ: మరణశిక్ష విధించిన ఖైదీలను ఉరితీసే పద్ధతిని చట్టం నుంచి తొలగించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై జనవరి 21 నుంచి వాదనలు వింటామని సుప్రీంకోర్టు మంగళవారం ప్రకటించింది. ఉరితీయడం ద్వారా మరణశిక్షను అమలు పరచడానికి బదులు విషపు ఇంజెక్షన్ ఇవ్వడం, తుపాకీతో కాల్చి చంపడం, విద్యుదాఘాతానికి గురిచేయడం, గ్యాస్ ఛాంబర్‌లోకి పంపడం వంటి ప్రత్యామ్నాయ మరణదండన పద్ధతులను పరిశీలించాల్సిందిగా కోరుతూ దాఖలైన వ్యాజ్యాన్ని విచారణకు చేపడుతూ జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడుకున్న ధర్మాసనం ఈ వ్యాఖ్యలుచేసింది. ఈ అంశంపై తదుపరి విచారణను వచ్చే సంవత్సరం జనవరిలో చేపట్టాలని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి కోర్టును అభ్యర్థించారు. దీనిపై న్యాయస్థానం తదుపరి విచారణను జనవరి 21కి వాయిదా వేసింది.

ఏఐ వృద్ధితో వాతావరణంలోకి మరిన్ని కర్బన ఉద్గారాలు

దిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) వృద్ధి వల్ల వాతావరణంలోకి కార్బన్ డైఆక్సైడ్ విడుదల పెరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ రంగంలో ప్రస్తుతమున్న రీతిలోనే వృద్ధి సాగితే అమెరికాలో ఏటా 24 నుంచి 44 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్బన్ డైఆక్సైడ్ అదనంగా వెలువడుతుందని పేర్కొన్నారు. ఇది ఏటా అమెరికా రోడ్లపైకి 50 లక్షల నుంచి కోటి కార్లను కొత్తగా తీసుకురావడం వల్ల ఉత్పన్నమయ్యే ఉద్గారాలతో సమానం. అమెరికాలో ఏఐ వృద్ధి అదే రీతిలో కొనసాగితే ఏటా 731 నుంచి 1,125 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు అవసరమవుతుందని అధ్యయనం పేర్కొంది. ఇది 60 లక్షల నుంచి కోటి మంది అమెరికన్ కుటుంబాలు వినియోగించే నీటితో సమానం. కార్నెల్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. ఏఐ వినియోగం వల్ల పర్యావరణంపై పడే ప్రభావం కారణంగా నెట్-జీరో ఉద్గారాల సాధన మరింత కష్టమవుతుందని వారు పేర్కొన్నారు.

"ఏఐ వల్ల సమాజంలోని ప్రతి రంగం మారిపోతోంది. అయితే ఇది జోరుగా వృద్ధి చెందడం వల్ల ఇంధనం, నీరు, కార్బన్ వంటి రంగాల్లో దీని ప్రభావం పడుతోంది" అని పరిశోధనకు నాయకత్వం వహించిన ఫెంగి యూ తెలిపారు. ఆర్థిక, మార్కెటింగ్, తయారీ రంగాల్లోని వివిధ అంశాలకు సంబంధించిన డేటాను పరిశీలించి.. ఏఐ పరిశ్రమ విస్తరణ తీరును విశ్లేషించారు. ఈ డేటాను విద్యుత్ వ్యవస్థలు, వనరుల వినియోగం, వాతావరణ మార్పులతో పోల్చి చూసి ఈ నిర్ధారణకు వచ్చారు.

లంచాల కేసులో బెంగాల్ మంత్రికి బెయిలు

కోల్‌కతా: లంచం తీసుకుని బోధన, బోధనేతర సిబ్బందిని నియమించిన కేసులో నిందితుడైన పశ్చిమ బెంగాల్ మాజీ విద్యా శాఖ మంత్రి పార్థా చటర్జీకి మంగళవారం ప్రత్యేక సీబీఐ కోర్టు బెయిలు ఇచ్చింది. రకరకాల వ్యాధులతో గడచిన 203 రోజులుగా ఒక ప్రైవేటు ఆస్పత్రిలో ఉన్న పార్థాను బెయిలు బాండుపై విడుదల చేశారు. ఈ కేసు 2016లో బెంగాల్ స్కూలు సర్వీసు కమిషన్ చేపట్టిన నియామకాలకు సంబంధించినది. ఆ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలల్లో 9-10, 11-12 తరగతుల ఉపాధ్యాయ ఉద్యోగాలకు, గ్రూపు సి, డి బోధనేతర సిబ్బంది నియామకాలకు ముడుపులు తీసుకున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపించింది.

పతంజలి ప్రకటనను తప్పుబట్టిన హైకోర్టు

దిల్లీ: ఇతర కంపెనీలు తయారుచేసే చ్యవనప్రాశ బూటకమని.. అత్యధికులు ఈ వాస్తవాన్ని గమనించలేకపోతున్నారంటూ బాబా రామ్‌దేవ్‌కు చెందిన పతంజలి ఆయుర్వేద్ సంస్థ విడుదల చేసిన వాణిజ్య ప్రకటన సరి కాదని దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. సదరు వాణిజ్య ప్రకటనను మూడురోజుల్లో పత్రికలు, టీవీ, వెబ్‌సైట్ల నుంచి తొలగించాలని ఆదేశించింది. పతంజలి చ్యవనప్రాశే అద్భుతమైందని, ఇతర కంపెనీలది బూటకమనడం ఆ కంపెనీలను కించపరచడమేనని పేర్కొంది. దేశంలో అతిపెద్ద చ్యవనప్రాశ ఉత్పత్తిదారైన డాబర్ ఇండియా పిటిషన్‌ను పురస్కరించుకుని దిల్లీ హైకోర్టు పతంజలి వాణిజ్య ప్రకటనపై తాత్కాలిక స్టే ఇచ్చింది. కంపెనీలు తమ ఉత్పత్తుల గురించి గొప్పగా చెప్పుకోవచ్చు కానీ, ఇతరుల ఉత్పత్తులను కించపరచకూడదని న్యాయస్థానం సూచించింది.

పుతిన్ భారత పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు: క్రెమ్లిన్

ఇంటర్నెట్‌డెస్క్: రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ డిసెంబరులో భారత్‌లో పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు సంబంధించి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు క్రెమ్లిన్ వెల్లడించింది. ఈ విషయాన్ని దేశ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తెలిపినట్లు రష్యా మీడియా కథనాలను వెల్లడించింది. పుతిన్ పర్యటన నేపథ్యంలో రెండు దేశాల మధ్య కార్మికుల మార్పిడి ఒప్పందం జరగనున్నట్లు పలు మీడియాల్లో కథనాలు వచ్చిన సంగతి తెలిసిందే. దీని గురించి ప్రశ్నించగా.. కుదుర్చుకోవాలనుకున్న ఒప్పందాల గురించి త్వరలోనే వెల్లడిస్తామన్నారు. 2021 తర్వాత పుతిన్ భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి.

ఝార్ఖండ్‌లో ఏనుగుల దాడి.. ముగ్గురి మృతి

బొకారో: ఝార్ఖండ్‌లో అడవి ఏనుగులు దాడి చేయడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన బొకారో జిల్లా జాగేశ్వర్ విహార్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. మృతులను చర్కు, ప్రకాశ్, నకుల్‌గా గుర్తించారు. పరిహారం కింద మృతుల కుటుంబాలకు రూ.25,000 అందించామని, పోస్టుమార్టం తర్వాత మరో రూ. 3.75లక్షలు అందిస్తామని వెల్లడించారు. వారంతా పనులు ముగించుకుని, ఇంటికి వెళ్తున్న క్రమంలో ఏనుగుల గుంపు దాడి చేసిందని వివరించారు.

ఇజ్రాయెల్‌పై దాడులను నిలిపేసిన హూతీ తిరుగుబాటుదారులు..!

దుబాయ్: గాజాలో అస్థిరమైన కాల్పుల విరమణ కొనసాగుతున్న నేపథ్యంలో యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు.. ఇజ్రాయెల్, ఎర్ర సముద్రంలోని నౌకలపై దాడులను నిలిపేస్తామని సంకేతాలు ఇచ్చారు. ఈ మేరకు హమాస్ కస్సామ్ బ్రిగేడ్స్‌కు హూతీ గ్రూప్ ఆన్‌లైన్‌లో ఓ లేఖ పంపింది. "మేం పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాం. ఇజ్రాయెల్.. గాజాపై దాడులను తిరిగి ప్రారంభిస్తే, జియోనిస్ట్ సంస్థ లోపల మా సైనిక కార్యకలాపాలను మళ్లీ మొదలు పెడతాం. ఎర్ర, అరేబియా సముద్రాలు, ఇజ్రాయెల్ నావిగేషన్‌పై నిషేధాన్ని పునరుద్ధరిస్తాం" అని హూతీ మిలిటరీ చీఫ్ ఆఫ్ మేజర్ జనరల్ యూసుఫ్ హసన్ అల్-మదానీ లేఖలో పేర్కొన్నారు.



లెఫ్టినెంట్ హదర్ గోల్డిన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఇజ్రాయెల్ పౌరులు

11 ఏళ్ల తర్వాత ఇజ్రాయెల్ సైనికుడికి అంత్యక్రియలు

కెఫర్ సబ(ఇజ్రాయెల్): గడిచిన 11 సంవత్సరాలుగా గాజాలో పాలస్తీనియుల ఆధీనంలో ఉన్న ఇజ్రాయెలీ సైనికుడి మృతదేహానికి ఎట్టకేలకు మంగళవారం అంత్యక్రియలు జరిగాయి. ఈ అంత్యక్రియలకు వేలాది మంది యూదులు హాజరై మృతవీరునికి నివాళులర్పించారు. లెఫ్టినెంట్ హదర్ గోల్డిన్ మృతదేహం కోసం ఆయన కుటుంబ సభ్యులు ఏళ్లుగా ప్రపంచ నలుమూలలా ర్యాలీలు నిర్వహించారు. ట్రంప్ మధ్యవర్తిత్వం నేపథ్యంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా గోల్డిన్ మృతదేహాన్ని హమాస్.. ఇజ్రాయెల్‌కు అప్పగించింది. 2014లో ఇజ్రాయెల్ హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన కొన్ని గంటల వ్యవధిలోనే గోల్డిన్ హమాస్ తూటాలకు బలయ్యాడు.

ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై నిషేధం పొడిగింపు

ఈనాడు, అమరావతి: ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై నిషేధాన్ని మరో రెండు నెలల పాటు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే ఏడాది జనవరి 11 వరకు ఇది అమల్లో ఉంటుందని తెలిపింది. గతేడాది ఆగస్టులో ఫ్రీహోల్డ్ భూములపై నిషేధం విధించారు. అప్పటి నుంచి ఏడు దఫాలుగా ఆదేశాలు ఇస్తూ కొనసాగిస్తున్నారు. వైకాపా హయాంలో ఫ్రీహోల్డ్ భూముల వ్యవహారంలో భారీగా అక్రమాలు జరిగాయి. వాటిలోని యథార్థత, చట్టబద్ధతపై విచారణకు ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పటికీ ఎటూ తేలకపోవడంతో నిషేధాన్ని పొడిగిస్తున్నారు. దీంతో అన్ని పత్రాలు సరిగా ఉన్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

స్టాండింగ్ కౌన్సెళ్ల నియామకం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ సంస్థల తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు పలువురు న్యాయవాదులను స్టాండింగ్ కౌన్సెళ్లుగా (ఎస్‌సీ) నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. రామినేని సతీష్‌బాబు-ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్, కె.శ్రీనివాసప్రసాద్-ఏపీ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్, కలమట రుచిబాబు-సమగ్ర శిక్షా అభియాన్, వెలిచెల వీరరామయ్య-ఏపీ ఫైబర్‌నెట్, బొల్లా వెంకటరామారావు-ఏపీ కాలుష్య నియంత్రణ మండలికి స్టాండింగ్ కౌన్సెళ్లుగా నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

జర్మనీలో పారా మెడికల్ ఉద్యోగాల కల్పనకు ఒప్పందం

ఈనాడు, అమరావతి: ఏపీ యువతకు జర్మనీలో పారామెడికల్ ఉద్యోగాలు కల్పించేందుకు యూరస్ కెరీర్ సంస్థతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థ ప్రతినిధి 'హేమంత్', ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ మనోహర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా నియామకాలు, డాక్యుమెంట్ల ధ్రువీకరణ, సురక్షిత విదేశీ ప్రయాణ ఏర్పాట్లను ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ(ఓంక్యాప్), అభ్యర్థులకు కౌన్సెలింగ్, స్క్రీనింగ్‌లను ఏపీఎస్ఎస్‌డీసీ, జర్మన్ భాషా నైపుణ్య శిక్షణ, ప్రొఫెషనల్ రిక్రూట్‌మెంట్, ఆసుపత్రులతో ఇంటర్వ్యూలు, ఉద్యోగ ఒప్పందాలు, వీసా, ట్రావెల్ సపోర్ట్, ఉద్యోగంలో చేరాక సహకారాన్ని యూరస్ కెరీర్ సంస్థ కల్పిస్తుంది.

పశు సంవర్ధకశాఖలో 14 మంది డీడీలకు పోస్టింగ్

ఈనాడు, అమరావతి: పశు సంవర్ధక శాఖలో ఉప సంచాలకులు (డీడీ)గా పదోన్నతి పొందిన 24 మందికి పోస్టింగులిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పోస్టింగ్‌లు తాత్కాలికమని ట్రిబ్యునల్లో పరిణామాలను బట్టి నోటిఫికేషన్లుంటాయని వీరిని అవసరమైతే రివర్ట్ చేయొచ్చని పేర్కొన్నారు. డీడీలుగా పోస్టింగ్ ఉత్తర్వులు వచ్చినప్పటి నుంచి 15 రోజుల్లోగా వారు ఆ పదవుల్లో చేరాలని స్పష్టం చేశారు. చేరకపోతే వారి పేర్లను అర్హుల జాబితా నుంచి తొలగిస్తామని పేర్కొన్నారు.

ప్యాపిలి పాలిటెక్నిక్ కళాశాల పనులకు రూ.2.22 కోట్లు

కర్నూలు జిల్లా ప్యాపిలి మండలంలోని పశు సంవర్ధక శాఖ పాలిటెక్నిక్ కళాశాలలో పనులకు సంబంధించి పెండింగ్ బిల్లుల చెల్లింపునకు రూ.2.22 కోట్లను విడుదల చేసేందుకు ప్రభుత్వం పరిపాలన అనుమతినిచ్చింది. ఈ మేరకు పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.250 కోట్లు ఏ ప్యాలెస్‌లో దాచారో బయటకు తీయాలి

ఈనాడు, అమరావతి: శ్రీవారి లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యిని సరఫరా చేసిన వారిని వైకాపా వెనకేసుకొస్తోందని శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ధ్వజమెత్తారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైవీ సుబ్బారెడ్డి, అతని పీఏ చిన్నఅప్పన్న వారిని శిక్షించాలని, దోపిడీ చేసిన రూ.250 కోట్లు ఏ ప్యాలెస్‌లో దాచారో బయటకు తీయాలని డిమాండ్ చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేందుకు తిరుమలపై జగన్ అప్పట్లో కక్షపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. ఎప్పుడూ అసత్యాలు మాట్లాడే అంబటి రాంబాబు కూడా తిరుమల అన్నప్రసాదం తిని తెలిసిన నిజం మాట్లాడాలన్నారు.

కేంద్ర మంత్రి పెమ్మసాని ఓఎస్‌డీగా ఐఆర్ఎస్ అధికారి కృష్ణమనాయుడు

ఈనాడు, దిల్లీ: కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు గ్రామీణాభివృద్ధిశాఖలో ఓఎస్‌డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ)గా ఆదాయ పన్ను విభాగానికి చెందిన 2015 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి కేతిరెడ్డి కృష్ణమనాయుడు నియమితులయ్యారు. కేంద్ర నియామక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ అనుమతితో ఈ నియామకం చేపట్టినట్లు సిబ్బంది, శిక్షణ వ్యవహారాలశాఖ మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈయన డిప్యూటీ సెక్రటరీ హోదాలో 2027 నవంబరు 20 వరకు, లేదంటే పెమ్మసాని ఈ పదవిలో ఉన్నంత వరకు కొనసాగుతారు.

విశ్వవిద్యాలయాలకు ఏకీకృత చట్టం

- ఆర్జీయూకేటీ కులపతిగా గవర్నర్
- వర్సిటీలకు బోర్డు ఆఫ్ గవర్నర్స్
- తుది దశకు చేరిన కమిటీ ప్రతిపాదనలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలన్నింటికీ కలిపి ఉన్నత విద్యాశాఖ ఒకటే చట్టాన్ని తీసుకురాబోతోంది. ఏకీకృత చట్టం రూపకల్పనకు ఏర్పాటు చేసిన కమిటీ నూతన మార్పులను కొలిక్కి తీసుకువచ్చింది. త్వరలో మరోసారి సమావేశం నిర్వహించిన అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ఏపీ విశ్వవిద్యాలయాల చట్టానికి భారీగా సవరణలు తీసుకురానున్నారు. ఆర్జీయూకేటీ, పద్మావతి మహిళ, జేఎన్‌టీయూలు, క్లస్టర్, ఉర్దూ విశ్వవిద్యాలయాలకు వేర్వేరు చట్టాలున్నాయి. మిగతా సాధారణ విశ్వవిద్యాలయాలకు ఒక చట్టం అమల్లో ఉంది. వీటన్నింటినీ కలిపి ఏపీ విశ్వవిద్యాలయాల చట్టంగా తీసుకురానున్నారు. ఒకే చట్టంలో ఆయా వర్సిటీల ప్రాధాన్యాన్ని గుర్తించేలా అధికారాలు, పరిపాలన నిబంధనలు ఉంటాయి.

రాజీవ్‌గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయానికి ప్రత్యేక చట్టం ఉంది. అన్ని వర్సిటీలకు కులపతిగా గవర్నర్ ఉండగా.. దీనికి కులపతిగా సీఎం ఉండేలా వైకాపా ప్రభుత్వంలో చట్టానికి సవరణ చేశారు. ఈ సవరణ చట్టం అమల్లోకి రాకుండానే గత ఎన్నికల్లో వైకాపా ఓడిపోయింది. దీంతో ప్రభుత్వం ఇన్‌ఛార్జి కులపతిగా ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తిని నియమించింది. గత ప్రభుత్వంలో చట్టానికి సవరణ చేసే వరకు కులపతిని ప్రభుత్వమే నియమించేది. ఆర్జీయూకేటీకి సైతం కులపతిగా గవర్నర్ ఉండేలా చట్టానికి సవరణ తీసుకురానున్నారు. ఈ అంశాన్ని కొత్తగా రూపొందిస్తున్న ఏకీకృత చట్టంలో పెడతారు. ప్రస్తుత ఆర్జీయూకేటీ చట్టం ప్రకారం ఉపకులపతికి ఎక్కువ అధికారాలు లేవు. కులపతికే ఎక్కువ అధికారాలున్నాయి. ఇందులోనూ మార్పు తీసుకువస్తారు.

బోర్డ్ ఆఫ్ గవర్నర్స్..

ప్రస్తుతం విశ్వవిద్యాలయాలకు ఉన్న పాలకవర్గాన్ని ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఈసీ)గా పిలుస్తున్నారు. ఈసీ స్థానంలో విదేశాల్లో ఉండే విధానంలో బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌ను తీసుకువస్తారు. విద్యా సంస్థలను పరిశ్రమలతో అనుసంధానించి, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు దీన్ని అమలు చేస్తారు. బోర్డు ఆఫ్ గవర్నర్స్‌లో పారిశ్రామికవేత్తలను సైతం నియమించుకునే అవకాశం ఉంటుంది. దీంతో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్‌లో మార్పు, నైపుణ్య శిక్షణ, కొత్త కోర్సులు ప్రవేశపెట్టేందుకు ఇది ఉపయోగపడుతుందని ఉన్నత విద్యాశాఖ భావిస్తోంది. ప్రస్తుతం ఈసీలో వీసీ, ప్రిన్సిపల్, ప్రొఫెసర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకుడు, వివిధ రంగాలకు చెందిన ప్రభుత్వం నియమించిన వ్యక్తులు సభ్యులుగా ఉంటున్నారు. సిలబస్‌లో మార్పు, విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెరుగుపర్చడం లాంటి వాటిపై వీటిల్లో చర్చిస్తున్న దాఖలాలు లేవు.

వర్సిటీల పరిధులు తేల్చాలి..

రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుతో విశ్వవిద్యాలయాల పరిధులపై కొంత అస్పష్టత నెలకొంది. గత ప్రభుత్వంలో ఒక వర్సిటీ పరిధిలోని కొన్ని డివిజన్లు వేరే జిల్లాలో కలపడం, రెండు జిల్లాల్లోని ప్రాంతాలతో కొత్త జిల్లా ఏర్పాటు చేశారు. ఏ జిల్లాను ఏ వర్సిటీ పరిధిలోకి తీసుకురావాలనే దానిపై అప్పట్లో స్పష్టత ఇవ్వలేదు.

- అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఉంది. ఈ జిల్లాలో కలిసిన రంపచోడవరం ఆదికవి నన్నయ వర్సిటీలో ఉంది.
- మన్యం జిల్లాలోని పార్వతీపురం ఆంధ్ర వర్సిటీ పరిధిలో ఉండగా.. పాలకొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో ఉంది.
- ప్రకాశం జిల్లాలోని చీరాల డివిజన్‌ను బాపట్ల జిల్లాలో కలిపారు. బాపట్ల డివిజన్ ఆచార్య నాగార్జున వర్సిటీలో ఉండగా.. చీరాల డివిజన్‌లోని మండలాలు ఆంధ్రకేసరి వర్సిటీలో ఉన్నాయి.
- ప్రకాశం జిల్లాలోని కందుకూరు డివిజన్‌ను నెల్లూరు జిల్లాలో కలిపారు. కందుకూరు డివిజన్‌లోని ఐదు మండలాలు ఆంధ్రకేసరిలో ఉన్నాయి. రాయలసీమ జిల్లాలు, నెల్లూరు శ్రీవేంకటేశ్వర రీజియన్ పరిధిలో ఉన్నాయి. ప్రకాశం జిల్లా ఆంధ్ర వర్సిటీ రీజియన్‌లో ఉంది. స్థానిక రిజర్వేషన్‌లోనూ మార్పు ఏర్పడింది. దీనిపైనా ఉన్నత విద్యాశాఖ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి

- పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలకు లోకేశ్ స్పష్టీకరణ



మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో జోనల్ కోఆర్డినేటర్లతో భేటీ అయిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని, ఇన్‌ఛార్జి మంత్రులతో కలిసి వ్యూహరచన చేయాలని తెదేపా ప్రాంతీయ సమన్వయకర్తలకు పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ సూచించారు. ఇన్‌ఛార్జి మంత్రులంతా నెలలో ఒక రోజు జిల్లాల్లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించాలని స్పష్టం చేశారు. మిత్రపక్షాలకు చెందిన మంత్రులు ఇన్‌ఛార్జులుగా ఉన్న జిల్లాల్లో తెదేపా కార్యకర్తలతో సమావేశాలు, సమస్యల పరిష్కార బాధ్యతను పార్టీ ఎంపీ తీసుకోవాలని సూచించారు. లోకేశ్ మంగళవారం తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలసి ప్రాంతీయ సమన్వయకర్తలతో సమావేశమయ్యారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎంత నిబద్ధతతో పనిచేశారో ఇప్పుడు అంతకంటే ఎక్కువ పట్టుదలతో పనిచేసి కార్యకర్తలకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలన్నింటిపై జోనల్ బాధ్యులు ఇచ్చిన నివేదికలను అధిష్ఠానం సమీక్షిస్తుందని తెలిపారు.

మిత్రపక్షాల ఎమ్మెల్యేలున్న చోట మీరే కీలకం

జనసేన, భాజపా ఎమ్మెల్యేలున్న చోట పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో సమన్వయం చాలా కీలకమని, అక్కడ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రాంతీయ సమన్వయకర్తలకు లోకేశ్ సూచించారు. "మీరు ప్రతి నియోజకవర్గానికి వెళ్లి పార్టీ వ్యవహారాలపై సమీక్షించాలి. ఎమ్మెల్యేలు తప్పనిసరిగా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు తీసుకుని పరిష్కరించేలా చూడండి. తెదేపా నాయకులు, కార్యకర్తలపై వైకాపా పాలనలో పెట్టిన అక్రమ కేసుల్ని సమీక్షించి చట్టపరంగా పరిష్కరిద్దాం. పెండింగ్‌లో ఉన్న అన్ని నామినేటెడ్, పార్టీ పదవుల్ని త్వరితగతిన భర్తీ చేస్తాం" అని చెప్పారు. సమావేశంలో ప్రాంతీయ సమన్వయకర్తలు మంతెన సత్యనారాయణ రాజు, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీదా రవిచంద్ర యాదవ్, దామచర్ల సత్య, సుజయకృష్ణ రంగారావు, దీపక్ రెడ్డి, కోవెలమూడి రవీంద్ర, వేపాడ చిరంజీవిరావు, మందలపు రవి, పెళ్లకూరు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

డీఎస్సీ-98 అభ్యర్థులకు ఉద్యోగాలివ్వాలి

మంత్రి లోకేశ్‌కు వినతి

ఈనాడు, అమరావతి: డీఎస్సీ-1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు మినిమం టైం స్కేల్‌తో ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వాలని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్‌కు డీఎస్సీ-98 మిగిలిన అభ్యర్థుల సమాఖ్య అధ్యక్షుడు భైరవకోన శ్రీనివాసరావు వినతిపత్రం ఇచ్చారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంత్రిని కలిశారు. "యువగళం పాదయాత్ర, ప్రజాదర్బార్‌లలో ఇచ్చిన హామీ మేరకు మాకు ఉద్యోగాలు ఇవ్వండి. మొత్తం 1,814 మంది మిగిలి ఉండగా.. ఇందులో 60 ఏళ్లు నిండని వారు 1,500 మందే ఉన్నారు" అని మంత్రికి వివరించారు.

ఏపీలో అతి పెద్ద పీసీబీ తయారీ యూనిట్

ఈనాడు, అమరావతి: దేశంలోని అతి పెద్ద ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు (పీసీబీ) తయారీ యూనిట్ ఏపీ కేంద్రంగా ఏర్పాటు కానుందని మంత్రి లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'తిరుపతి జిల్లాలోని నాయుడుపేటలో సిగ్మా సీజీఎస్ సంస్థ రూ.1,595 కోట్ల పెట్టుబడితో ప్లాంటును ఏర్పాటు చేస్తోంది. దీనిద్వారా 2,170 మందికి ఉద్యోగాలు వస్తాయి. ఈ పెట్టుబడి వల్ల దేశ వార్షిక ఎలక్ట్రానిక్స్ దిగుమతులు 70 బిలియన్ డాలర్లు తగ్గే అవకాశం ఉంది' అని పేర్కొన్నారు.

ఏపీ నైబర్‌హుడ్ వర్క్‌స్పేస్ పాలసీ ఖరారు

- చిన్న సంస్థలపై ఆర్థిక భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వ విధానం

ఈనాడు, అమరావతి: ఏపీ నైబర్‌హుడ్ వర్క్‌స్పేస్ (ఎన్‌డబ్ల్యూఎస్) పాలసీ 2025-30ని ప్రభుత్వం ఖరారు చేసింది. నోటిఫికేషన్ విడుదల చేసినప్పటి నుంచి ఐదేళ్ల పాటు ఈ విధానం అమలులో ఉంటుంది. చిన్న సంస్థలు కార్యకలాపాలు నిర్వహించడానికి అవసరమైన వర్క్‌స్పేస్, మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా వాటిపై ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ పాలసీ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. మారుమూల ప్రాంతాల నుంచి పనిచేసే వారికి, ఫ్రీలాన్సర్లు, ఐటీ అంకుర సంస్థలు కార్యకలాపాలు నిర్వహించడానికి వీలుగా వర్క్‌స్పేస్‌ను కల్పించే సంస్థలను ఈ విధానం ప్రోత్సహిస్తుంది. మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రైవేటు భాగస్వాములను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వర్క్‌స్పేస్‌లు ఏర్పాటు చేసే వారికి ఈ పాలసీ కింద ప్రోత్సాహకాలను నిర్దేశించింది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, గ్రామీణ ప్రాంతాలను అనుసంధానం చేయడం ద్వారా గిగ్ ఎకానమీని ప్రోత్సహించాలన్నది ప్రభుత్వ యోచన.

ఉండాల్సిన వసతులు ఇవి

- కనీసం 1,000 చదరపు అడుగుల విస్తీర్ణం.. కనీసం 10 సీటింగ్ కెపాసిటీతో వర్క్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. అందులో..
- హైస్పీడ్ ఇంటర్నెట్/ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ ఉండాలి.
- సమావేశాలు నిర్వహించడానికి కనీసం 10 సీట్లతో ఏర్పాటు
- వీడియోకాన్ఫరెన్స్ సదుపాయం
- ప్రింటింగ్, స్కానింగ్ సదుపాయం
- మినీ ప్యాంట్రీ
- మహిళలకు ప్రత్యేక విశ్రాంతి గదులు
- అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా వ్యవస్థ, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- సీసీటీవీ కనెక్టివిటీ

ఎన్‌డబ్ల్యూఎస్ డెవలపర్‌కు ఇచ్చే ప్రోత్సాహకాలు

అద్దె ప్రోత్సాహకం: మండల పరిధిలో మొదటగా ఏర్పాటు చేసే ఎన్‌డబ్ల్యూఎస్‌కు 5 ఏళ్ల పాటు అద్దె మినహాయింపు. ప్రభుత్వ భవనాలుంటే.. నామమాత్రపు అద్దెకు కేటాయింపు.

- ప్రైవేటు భవనాల్లో ఏర్పాటు చేసే వాటికి అద్దెలో 50 శాతం రాయితీ..ఏటా గరిష్ఠంగా రూ.6 లక్షలు.

ఇంటీరియర్ డెవలప్‌మెంట్: ఎర్లీబర్డ్ కింద మండల పరిధిలో మొదట ఏర్పాటు చేసిన సంస్థకు పెట్టుబడి వ్యయంలో 60 శాతం రాయితీ.. గరిష్ఠంగా రూ.15 లక్షలు.

- ఆ తర్వాత ఏర్పాటు చేసే వాటికి 50 శాతం రాయితీ.. గరిష్ఠంగా రూ.7.5 లక్షలు.

ఐటీ హార్డ్‌వేర్, ఫెసిలిటీ: మూలధన వ్యయంలో 50 శాతం.. గరిష్ఠంగా రూ.5 లక్షల రాయితీ.

హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్: హైస్పీడ్ బ్రాడ్‌బాండ్ ఏర్పాటు చేసే ఖర్చులో 50 శాతం రాయితీ.. గరిష్ఠంగా ఏడాదికి రూ.లక్ష చొప్పున ఐదేళ్ల పాటు చెల్లింపు.

- వడ్డీ రాయితీ 8 శాతం చొప్పున.. నెలకు రూ.10 వేలు, ఐదేళ్ల పాటు చెల్లింపు.

వీఆర్‌ఏ సంఘాల ఐకాస ఛైర్మన్‌గా నీరుగంటి పెద్దన్న

ఈనాడు, అమరావతి: వీఆర్‌ఏ సంఘాల ఐకాస ఛైర్మన్‌గా నీరుగంటి పెద్దన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.బాలకాశిని ఎన్నుకున్నారు. వైస్ ఛైర్మన్లుగా టి.అంజి, ఎన్.నాగేశ్, మర్రి వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా గణేష్, ఆంజనేయులు, ఈశ్వరయ్య, సురేష్, రాజు, వీరభద్రరావు, బొడ్డు వెంకటరత్నం, వివేకానంద ఎన్నికయ్యారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (59/86) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలోని దాసరి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఐకాసను ఎన్నుకున్నట్లు ప్రతినిధులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ తరహాలో పేస్కేల్ అమలు, నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలని ఐకాస డిమాండ్ చేసింది. ఈ సమావేశానికి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ హాజరయ్యారు.

ఆరు నెలల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పూర్తి

వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: క్యాన్సర్ పీడితులను గుర్తించేందుకు చేపట్టిన ఎన్‌సీడీ 4.0 సర్వేలో ఇప్పటివరకు 39 లక్షల మందికి స్క్రీనింగ్ చేశామని, మిగిలిన వారికి ఆరు నెలల్లో పరీక్షలు పూర్తిచేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇప్పటివరకు జరిగిన సర్వేలో అనుమానిత రొమ్ము క్యాన్సర్ కేసులు 9,936, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు 22,861, నోటి క్యాన్సర్ కేసులు 26,639 గుర్తించామని మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వీరికి మరోసారి పరీక్షలు చేసి, నిర్ధారిత కేసులకు చికిత్స అందిస్తామన్నారు. బోధనాసుపత్రుల్లో క్యాన్సర్ ఓపీ కేసులకు 222 నంబరుతో ప్రత్యేక గది కేటాయించినట్లు చెప్పారు.

కొత్త వాహనాలకు.. వారంలో శాశ్వత రిజిస్ట్రేషన్ నంబరు

- ఎన్‌ఐసీకి రవాణా కమిషనర్ లేఖ

ఈనాడు, అమరావతి: కొత్త వాహనాలను కొనుగోలు చేసిన వారికి శాశ్వత రిజిస్ట్రేషన్ నంబరు వెంటనే కేటాయించకుండా రవాణాశాఖ అధికారులు చేస్తున్న జాప్యానికి చెక్‌పెట్టేలా ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. వారంలో అధికారి శాశ్వత రిజిస్ట్రేషన్ నంబరు కేటాయించకపోతే, ఆటోమేటిక్‌గా ఆ నంబరు కేటాయింపు జరిగిపోయేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పుచేయనున్నారు. నిబంధనల ప్రకారం కొత్త వాహనం కొంటే వాహన డీలరు షోరూమ్‌లోనే తొలుత తాత్కాలిక రిజిస్ట్రేషన్ నంబరు కేటాయిస్తారు. ఆ తర్వాత వాహన్ పోర్టల్‌కు ఈ వివరాలు వెళ్లగానే రెండు, మూడు రోజుల్లో సంబంధిత రవాణాశాఖ అధికారి ఆ వాహనానికి శాశ్వత రిజిస్ట్రేషన్ నంబరు కేటాయించాలి. ఒకవేళ వాహనదారు ఫ్యాన్సీ నంబరు పొందాలనుకుంటే మాత్రం.. నెల రోజుల వరకు తాత్కాలిక రిజిస్ట్రేషన్ నంబరుతో వాహనం నడపొచ్చు. ఫ్యాన్సీ నంబర్లు అవసరంలేని వాహనాలకు వెంటనే శాశ్వత రిజిస్ట్రేషన్ నంబరును కేటాయించాలి. కానీ అనేకచోట్ల నెల నుంచి రెండు నెలలపాటు నంబరు కేటాయించకుండా అక్కడి రవాణాశాఖ అధికారులు జాప్యం చేస్తున్నారు. సంబంధిత వాహన డీలర్ తమను కలిసి, వాహనానికి రూ.500-1,000 చొప్పున ఇస్తేనే నంబరు కేటాయిస్తామంటూ బేరాలు పెడుతున్నారంటూ ఫిర్యాదులు వస్తున్నాయి. జీఎస్టీ తగ్గింపు తర్వాత రాష్ట్రంలో వాహనాల అమ్మకాలు పెరగగా, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో పెద్దఎత్తున వాహనాల విక్రయాలు జరిగాయి. అయితే అనేకచోట్ల ఇప్పటికీ వాటికి శాశ్వత రిజిస్ట్రేషన్ నంబర్లు కేటాయించకుండా రవాణా అధికారులు సతాయిస్తున్నారు. దీంతో వీరికి చెక్‌పెట్టేలా కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా తాజాగా లేఖ రాశారు. సంబంధిత అధికారి వారంలోగా నంబరు కేటాయించకపోతే, ఆటోమేటిక్‌గా శాశ్వత రిజిస్ట్రేషన్ నంబరు వచ్చేలా వాహన్ సాఫ్ట్‌వేర్‌లో వెంటనే మార్పులు చేయాలంటూ.. సాఫ్ట్‌వేర్ నిర్వాహకులైన నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఎన్‌ఐసీ) ఉన్నతాధికారులకు లేఖ పంపారు.

ప్రైవేటు సంస్థల ప్రతిపాదనలకు ఆమోదం

- భూములు, ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: ఐటీ రంగంలో వివిధ సంస్థల పెట్టుబడుల ప్రతిపాదనలను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వాటికి భూముల కేటాయింపు, ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతులిచ్చింది. రాయితీ ధరలపై భూములు కేటాయించే ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.

- విశాఖలో రూ.115 కోట్ల పెట్టుబడితో ఐటీ క్యాంపస్ ఏర్పాటుకు క్వార్క్స్ టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతినిచ్చారు. దీనిద్వారా 2వేల మందికి ఉపాధి వస్తుంది. ఆ సంస్థకు ఏపీ ఐటీ, జీసీసీ పాలసీ 4.0 కింద ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతించింది. ఆ సంస్థకు కాపులుప్పాడ దగ్గర 4 ఎకరాలను. ఎకరా రూ.కోటి చొప్పున కేటాయించింది. మొదటి దశ కార్యకలాపాలను రెండేళ్లలో ప్రారంభించాలని గడువు నిర్దేశించింది.
- కర్నూలు జిల్లా ఓర్వకల్లులో రూ.22,976 కోట్లతో ఇండిచిప్ సెమీకండక్టర్స్ లిమిటెడ్ సంస్థ సిలికాన్ కార్బైడ్ డివైజ్ తయారీ యూనిట్ ఏర్పాటుకు అనుమతిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఆ సంస్థ 1241 మందికి ఉపాధి కల్పిస్తుందని.. ప్రోత్సాహకాలను చెల్లించేందుకు అనుమతించింది. ఆ సంస్థకు 150 ఎకరాలు.. ఎకరా రూ.10 లక్షలకు కేటాయించింది.
- విశాఖలో మధురవాడ దగ్గర రూ.2,200 కోట్లతో ఐటీ పార్కు అభివృద్ధికి విశాఖ రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతించింది. దీనిద్వారా 30వేల మందికి సంస్థ ఉపాధి కల్పించనుంది. ఆ సంస్థకు ప్రోత్సాహకాలు చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతించింది.
- తిరుపతి జిల్లా శ్రీసిటీలో రూ.550 కోట్లతో బీఎల్‌డీసీ మోటార్లు, రాగి ట్యూబ్‌ల తయారీ యూనిట్ ఏర్పాటుకు ఎస్‌సీఐసీ వెంచర్స్ ఎల్ఎల్‌పీ సంస్థకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీనిద్వారా 1,130 మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థ పేర్కొంది.
- ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మధురవాడ ఐటీ హిల్స్‌లో రూ.1,000 కోట్ల పెట్టుబడితో గ్లోబల్ ఇన్నోవేషన్ సిటీ క్యాంపస్ ఏర్పాటుకు 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన 10.29 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. దీనిద్వారా 10వేల మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థ తెలిపింది. ఆ సంస్థకు లీజు వ్యవధిని 99 ఏళ్లకు పెంచేందుకు ప్రభుత్వం అనుమతించింది.

మా తీర్పును అమలు చేయరా?

- డిసెంబర్ 15న కోర్టులో హాజరుకండి
- సీఎస్, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతుల రిజర్వేషన్ విషయంలో ఉమ్మడి హైకోర్టు 2018 డిసెంబర్‌లో ఇచ్చిన తీర్పును అమలు చేయనందుకు తమ ముందు హాజరుకావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్‌ను హైకోర్టు ఆదేశించింది. కోర్టు తీర్పును అమలు చేయకుండా సమయాన్ని సాగదీస్తున్నారని తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. విచారణను డిసెంబర్ 15కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ ఉత్తర్వులిచ్చింది. పదోన్నతుల్లో తమకు అన్యాయం జరుగుతోందని, కోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ సెక్రటేరియట్ బీసీ, ఓసీ ఎంప్లాయీస్ అసోసియేషన్, పలువురు ఉద్యోగులు కోర్టు ధిక్కరణ వ్యాజ్యాలు వేశారు. మంగళవారం జరిగిన విచారణలో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి స్పందిస్తూ.. తెలంగాణ హైకోర్టు ఇదే వ్యవహారంపై ఇటీవల ఇచ్చిన తీర్పును పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, అందుకు కొంత సమయం కావాలని కోరారు. ఈ అభ్యర్థనను తోసిపుచ్చిన ధర్మాసనం అధికారుల హాజరుకు ఆదేశించింది.

బీసీ జనగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

హైకోర్టులో పిల్.. నేడు విచారణ

ఈనాడు, అమరావతి: బీసీ జనగణన చేపట్టిన తర్వాతే రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు హైకోర్టులో పిల్ వేశారు. బీసీ గణన, వర్గీకరణ చేపట్టకుండా స్థానిక ఎన్నికలు నిర్వహించబోతున్నారని, ముందుకెళ్లకుండా ప్రభుత్వాన్ని నిలువరించాలని పిటిషన్‌లో కోరారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, బీసీల విషయంలో ఈ నియమాన్ని పాటించడం లేదని చెప్పారు. 1986 తర్వాత మళ్లీ బీసీ జనగణన నిర్వహించలేదన్నారు. బుధవారం ఈ పిల్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరపనుంది.

పంచాయతీ ఖాతాలకే బాహ్య అభివృద్ధి రుసుములు

ఈనాడు, అమరావతి: భూ వినియోగ మార్పిడికి విధించే బాహ్య అభివృద్ధి రుసుముల్లో (ఈడీసీ) గ్రామ పంచాయతీ వాటా మొత్తాలు నేరుగా వాటి ఖజానా ఖాతాలకే జమ కానున్నాయి. ఈ మేరకు అధికారులు చేసిన ఏర్పాట్లకు ప్రభుత్వ ఆమోదం లభించింది. పట్టణాభివృద్ధి సంస్థల (యూడీఏ) పరిధిలోని గ్రామ పంచాయతీల్లో భూ వినియోగ మార్పిడిపై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ధరల ఆధారంగా ఎకరాకు 4% చొప్పున ఈడీసీ విధించనున్నారు. ఇందులో 15% యూడీఏలకు, మిగతా 85% పంచాయతీలకు చెందేలా ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. మొత్తం ఫీజులు యూడీఏ ఖాతాల్లోకి వెళితే వెనక్కి రావడం కష్టమని భావించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తగిన చర్యలు చేపట్టింది. రుసుముల్లో 85% వాటా నిధులు ట్రెజరీ కార్యాలయాల్లోని పంచాయతీ ఖాతాల్లో జమయ్యేలా డీపీఎంఎస్ (డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం) పోర్టల్‌లో ఏర్పాట్లు చేశారు. దరఖాస్తుదారులు రుసుములు చెల్లించిన వెంటనే యూడీఏ, పంచాయతీల వాటా మొత్తాలు వేర్వేరుగా వాటి ఖాతాల్లోకి వెళ్లనున్నాయి.

పంచాయతీలకు ఏటా రూ.100 కోట్ల ఆదాయం!

నాలా రద్దు చేసి భూ వినియోగ మార్పిడికి బాహ్య అభివృద్ధి రుసుములు విధించాలన్న నిర్ణయంతో పంచాయతీలకు ఏటా రూ.100 కోట్ల ఆదాయం రానుంది. నాలా రుసుములు ఇప్పటివరకు రెవెన్యూ శాఖకు వెళ్లేవి. అనుమతులు సులభతరం చేసే క్రమంలో ప్రభుత్వం 'నాలా' రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈడీసీ విధింపు ద్వారా వచ్చే ఆదాయం పట్టణాభివృద్ధి, పట్టణ స్థానిక సంస్థలకు, పంచాయతీలకే చెందాలని సర్కారు నిర్ణయం తీసుకుంది. దీంతో పంచాయతీలకు కొత్తగా ఆదాయం కలిసొచ్చింది.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా తేజ్ భరత్

ఈనాడు, అమరావతి: విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) కమిషనర్‌గా ఎన్.తేజ్‌భరత్‌ను ప్రభుత్వం మంగళవారం నియమించింది. అక్కడ కమిషనర్‌గా ఉన్న విశ్వనాథన్ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ డైరెక్టర్‌గా బదిలీ కావడంతో ఖాళీ ఏర్పడింది. తేజ్‌భరత్ ప్రస్తుతం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. మెప్మా ఎండీగా ఇంకా ఎవరినీ నియమించలేదు.

జెట్టి కుసుమకుమార్‌కు ఒడిశా కాంగ్రెస్ బాధ్యతలు

ఈనాడు, దిల్లీ: తెలంగాణ కాంగ్రెస్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్ ఒడిశా కాంగ్రెస్ వ్యవహారాల కార్యదర్శిగా నియమితులయ్యారు. గుంటూరుకు చెందిన ఉషానాయుడికి మధ్యప్రదేశ్ బాధ్యతలు అప్పగించారు. వీరు ఆయా రాష్ట్రాల కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిలతో కలిసి పనిచేస్తారు.

విధ్వంసానికి పథకం వేసి.. ఆదేశాలకు ఎదురుచూసి

హైదరాబాద్ కేంద్రంగా ఉగ్రకుట్ర కేసు దర్యాప్తు ముమ్మరం



నిందితుడు మొహియుద్దీన్

ఈనాడు- హైదరాబాద్, రాజేంద్రనగర్, ఖమ్మం నేరవిభాగం- న్యూస్‌టుడే: హైదరాబాద్ కేంద్రంగా బయటపడ్డ ఉగ్రకుట్ర కేసులో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఐసిస్ సానుభూతిపరుడైన రాజేంద్రనగర్‌కు చెందిన వైద్యుడు అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్.. ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన ఆజాద్ సులేమాన్ షేక్, మొహమ్మద్ సుహేల్ సలీంఖాన్ ముగ్గురూ రద్దీ ప్రదేశాల్లో ఉగ్రదాడులకు పథకం వేసినా.. దాన్ని అమలుచేసేందుకు ఆదేశాల కోసం ఎదురుచూసే సమయంలో గుజరాత్ ఏటీఎస్ పోలీసులకు పట్టుబడ్డారు. రైసిన్ విష పదార్థం తయారుచేసినా.. దాన్ని ఎప్పుడు ఏ సమయంలో ఎక్కడ వాడాలో ముగ్గురికీ తెలియదు. సామాజిక మాధ్యమాల ద్వారా సంప్రదించిన ఐసిస్ సభ్యుడు అబూ ఖదీజా ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నట్లు దర్యాప్తులో బయటపడింది. నిందితుడి నేపథ్యం, అతడికున్న సంబంధాలపై గుజరాత్ ఏటీఎస్‌తో పాటు తెలంగాణ సీఐ సెల్ లోతుగా విచారిస్తోంది.

ఖమ్మంలో విద్యాభ్యాసం.. రాజధానిలో మకాం..

ఉగ్రకుట్రకు కీలక సూత్రధారిగా వ్యవహరించిన అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ ఖమ్మంలోని తాత ఇంటివద్ద చదువుకున్నాడు. మొహియుద్దీన్ తల్లి ఆస్రాతఫజుల్‌ను భర్త అబ్దుల్ ఖాదర్ జిలాది వదిలేయడంతో ఆరుగురు సంతానంతో తండ్రి ఇంటికి చేరింది. సంతానంలో పెద్దవాడైన మొహియుద్దీన్‌కు మరో ముగ్గురు సోదరులు, ఇద్దరు సోదరీమణులున్నారు. ఇతను పదో తరగతి వరకూ ఖమ్మంలో, ఇంటర్ వరంగల్‌లో చదివాడు. ఎంసెట్‌లో మంచి ర్యాంకు రాకపోవడంతో ఎంబీబీఎస్‌లో ప్రవేశం లభించలేదు. దీంతో 2007లో ఎంబీబీఎస్ చదివేందుకు చైనా వెళ్లాడు. ఈ క్రమంలోనే మొహియుద్దీన్ కుటుంబం ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చింది. మెహిదీపట్నంలో కొన్నిరోజులు ఉండి.. ఐదేళ్ల క్రితం రాజేంద్రనగర్‌లోని ఫోర్ట్‌వ్యూ కాలనీలో ప్రస్తుత నివాసానికి మారింది. 2013లో చైనా నుంచి వచ్చాక వైద్యుడిగా కొన్ని ఆసుపత్రుల్లో పనిచేశాడు. కరోనా తర్వాత ఉద్యోగం మానేశాడు. అత్తాపూర్‌లో ఒక హోటల్ వ్యాపారంలో భాగస్వామ్యం తీసుకోవడంతో పాటు జ్యూస్ దుకాణం పెట్టాడు. వైద్యానికి సంబంధించి ఆన్‌లైన్ కన్సల్టెన్సీ ప్రారంభించాడు. ఓ యువతితో వివాహం కుదిరినా రద్దయింది. ఈ విషయంలోనే మొహియుద్దీన్ కొంత బాధపడేవాడని తెలుస్తోంది. ఈ క్రమంలోనే సామాజిక మాధ్యమాల ద్వారా అబూ ఖదీజాతో పరిచయం పెంచుకున్నాడు. అతడు చెప్పినట్లు చేస్తూ ఫోర్ట్‌వ్యూ కాలనీలోని నివాసంలోని ఒక గదిలో రైసిన్ విష పదార్థం తయారీ మొదలుపెట్టాడు. వ్యాపారంలో భాగంగా అహ్మదాబాద్ వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పేవాడు. మరోవైపు మొహియుద్దీన్ గదికి తాళం వేయాలని గుజరాత్ ఏటీఎస్ పోలీసులు సూచించినట్లు తెలిసింది.